

'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 342

మంగళవారం 4-3-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



కొడితే కొట్టాలిరా ఆసీస్‌ను...

నేడు చాంపియన్స్ ట్రోఫీ తొలి సెమీఫైనల్. ఆస్ట్రేలియాతో భారత్ 'ఢీ' -16లో



అనోరా... పాంచ్ పటాకా

97వ ఆస్కార్ అవార్డుల ప్రకటన.. దర్శకుడు సీన్ బేకర్‌కు 4 అవార్డులు -16లో



బర్త్ సర్టిఫికెట్టే ఆధారం...

2023 అక్టోబర్ 1న లేదా ఆ తర్వాత పుట్టిన వాళ్లు పాస్‌పోర్టు కోసం జనన ధ్రువీకరణ పత్రంగా బర్త్ సర్టిఫికెట్‌ను మాత్రమే ఇవ్వాలి.

- వివరాలు 14లో ▶



దృష్టి లోపం అడ్డంకి కాదు..

దృష్టి లోపం ఉన్నంత మాత్రాన జ్యుడీషియల్ సర్వీస్‌లో ఉద్యోగావకాశాలను నిరాకరించ కూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

- వివరాలు 6లో ▶

బీజేపీ, పీఆర్‌టీయూకు చెరొకటి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఫలితాల వెల్లడి

- కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల టీచర్స్ఎమ్మెల్సీగా మల్క కొమురయ్య (బీజేపీ).. మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలుపు
- వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి... రెండో ప్రాధాన్యత ఓట్లతో గెలుపు
- కొనసాగుతున్న కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఓట్ల వడబోత
- మంగళవారం మధ్యాహ్నం కౌంటింగ్ మొదలయ్యే అవకాశం
- అధికారుల తీరుపై అభ్యర్థుల మండిపాటు... ఓటేయడంపై ఈసీ అవగాహన కల్పించలేదని విమర్శలు
- చిన్న పొరపాట్లు, కామెంట్లతో ఓట్లపై అనర్హత వేటు
- 50 వేల గ్రాడ్యుయేట్ ఓట్లు చెల్లలేదని ప్రచారం... ఖండించిన ఈసీ





కరీంనగర్‌లో కౌంటింగ్ కేంద్రం వద్ద విజయసంకేతం చూపుతున్న అభ్యర్థి మల్క కొమురయ్య, కేంద్ర మంత్రి బండి సంజయ్. నల్లగొండలో విక్టరీ సింబల్ చూపుతున్న శ్రీపాల్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/నల్లగొండ: రాష్ట్రంలో రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. వీటిలో ఒకటి బీజేపీ కైవసం చేసుకోగా, మరొకటి పీఆర్‌టీయూ సొంతం చేసుకుంది. కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలవగా, వరంగల్-ఖమ్మం-నల్లగొండ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి రెండో ప్రాధాన్యత ఓట్లతో విజయం సాధించారు. కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్ల వడబోత కార్యక్రమం సోమవారం సాయంత్రం మొదలుకాగా, ఇంకా కొనసాగుతూనే ఉంది. ఓట్ల వడబోత పూర్తయ్యాక, కట్టలు కట్టి, మంగళవారం మధ్యాహ్నం తర్వాత కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభిస్తారు.

వరంగల్-ఖమ్మం-నల్లగొండ స్థానంలో....

వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 19 మంది అభ్యర్థులు పోటీ చేశారు. సమీప ప్రత్యర్థి అయిన సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిపై 5,521 ఓట్ల మెజారిటీతో శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించారు. శ్రీపాల్‌రెడ్డికి 13,969 ఓట్లు రాగా, నర్సిరెడ్డికి 8,848 ఓట్లు వచ్చాయి. శ్రీపాల్‌రెడ్డి గెలిచినట్టుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం రాత్రి ప్రకటించారు.

మొదటి నుంచీ ఆధిక్యంలోనే...

పీఆర్‌టీయూ-టీఎస్ బలపరిచిన అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి మొదటి నుంచీ మిగతా 2వ పేజీలో ▶

ఐఆర్‌సీటీసీ, ఐఆర్‌ఎఫ్‌సీకి నవరత్న హోదా

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో మరో రెండు ప్రభుత్వరంగ సంస్థలు నవరత్న హోదా సాధించాయి. ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ), ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ)లకు నవరత్న హోదా కల్పిస్తున్నట్లు కేంద్రం చెప్పింది. దీంతో నవరత్న హోదా పొందిన 25వ కంపెనీగా ఐఆర్‌సీటీసీ, 26వ కంపెనీగా ఐఆర్‌ఎఫ్‌సీ అవతరించాయని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సోమవారం వెల్లడించింది. కంపెనీల ఆర్థిక పనితీరు, నిర్వహణ ఆధారంగా నవరత్న, మహారత్న హోదాలను కేంద్రం ఇస్తుంది.

మా ప్రయోజనాలు కాపాడండి

కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా కేటాయించాలి

- గోదావరిలో తెలంగాణ నికర జలాల వాటా తేల్చాలి
- కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి
- పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, సమ్మక్క సాగర్ ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వండి
- రాష్ట్ర ప్రాజెక్టులకు ఆర్థికసాయం అందజేయాలని విజ్ఞప్తి



ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు జ్ఞాపిక ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా, గోదావరి నదీ జలాలకు సంబంధించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కృష్ణా నదీ పరీవాహకంలో సుమారు 70శాతం తెలంగాణలోనే ఉండగా.. 30 శాతం మాత్రమే ఏపీలో ఉందని వివరించారు. అందువల్ల కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయబద్ధమైన 70శాతం వాటా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గోదావరి నదికి సంబంధించి తెలంగాణ వాటా నికర జలాలు తేల్చిన తర్వాతే.. ఏపీ ప్రాజెక్టులపై నిర్ణయం తీసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు. సోమవారం మిగతా 14వ పేజీలో ▶



Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates				
12 Eggs Retail Rate ₹ 60	Ex Farm Live Bird	100 kg	Dressed with Skin	177 kg
	Retail Live Bird	122 kg	Skin Less	201 kg

Issued in the interest of consumers

పుట్టకముందే ప్రైవేటుపరం!

కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని రైల్వేశాఖ సూత్రప్రాయ నిర్ణయం



- ఫ్యాక్టరీ ఉద్యోగులలో 80 శాతానికి పైగా ప్రైవేటువారే ఉండే చాన్స్
- వచ్చే డిసెంబర్ నాటికి యూనిట్ రెడీ.. తర్వాత ఏడెనిమిది నెలల్లో ఉత్పత్తి ప్రారంభం
- ఐదేళ్లపాటు తయారీ పనిని టెండర్ ద్వారా ప్రైవేటు సంస్థకు అప్పగించాలని రైల్వే యోచన
- కొన్ని కీలక పోస్టులు తప్ప అన్నీ ప్రైవేటు సంస్థ పరిధిలోకి వెళ్లే చాన్స్
- భారీగా రైల్వే శాఖ ఉద్యోగాలు వస్తాయనుకుంటున్న స్థానిక యువతకు షాక్

3లో

ఇలాంటి ఇరకాటం




కలిసి కట్టుగా ఉండాలని అలా కట్టేశాం!



ఆసియా సింహాలకు ప్రసిద్ధి చెందిన గుజరాత్‌లోని గిర్ అభయారణ్యంలో కెమెరా చేతపట్టుకుని ఫొటో తీస్తున్న ప్రధాని మోదీ

6లో



అమ్మకూ పరీక్షే!

పరీక్షల సమయంలో ఎక్కువమంది తల్లిదండ్రులు, ముఖ్యంగా అమ్మలు.. 'పిల్లల సిలబస్ పూర్తవుతుందో లేదో, ఎగ్జామ్స్ ఎలా రాస్తారో, అనుకున్న గ్రేడ్ వస్తుందా.. అనే ఆలోచనలతో సతమతమవుతుంటారు. మానసిక ఒత్తిడికి లోనవుతుంటారు. భావోద్వేగాలకు గురవుతుంటారు. త్వరగా చిరాకు పడటం, టైమ్‌కి తినకపోవడం, ఎవరినీ కలవకపోవడం, పిల్లల్ని కలవనివ్వకపోవడం వంటివి చేస్తుంటారు. కొందరు తల్లులు తమ పిల్లలకన్నా ఎక్కువగా ఆందోళన చెందుతుంటారు. ఇది సరికాదని అమ్మలు కొంత సంయమనంతో వ్యవహరించాలని సూచిస్తున్నారు. సరైన ఆహారం, తగిన విశ్రాంతి తీసుకోవాలని చెబుతున్నారు. - సాక్షి ఎడ్యుకేషన్



తల్లిదండ్రులు కొన్ని గమనించాలి.. మరికొన్ని పాటించాలి..



ప్రొ.జ్యోతిరాజ, సైకాలజిస్ట్, లైఫ్ స్కిల్ ట్రైనర్

ఈ రోజుల్లో తల్లిదండ్రులు తామే పరీక్షలు రాస్తున్నారా అన్నట్టుగా అనిపిస్తుంటుంది వారి మానసిక స్థితి చూస్తుంటే. ముఖ్యంగా తల్లులు తమ ఆందోళనతో పిల్లల్ని ప్రభావితం చేస్తుంటారు. అలాకాకుండా మానసిక స్థితిని అదుపులో పెట్టుకుంటూ, పిల్లల్ని గమనిస్తూ సమయానుకూలంగా జాగ్రత్తలు పాటిస్తే తల్లులు ఎగ్జామ్స్ అనే గండాన్ని దాటొచ్చు.

మీ టీనేజర్ పరీక్షల గురించి ఆందోళన చెందుతూ, ఎక్కువ విచారంగా ఉంటున్నారేమో చూడాలి.

గోళ్లు కొరకడం లాంటివి చేస్తున్నారా? రాత్రంతా మేల్కొని ఉంటున్నారా?.. గమనించాలి.

పిల్లల పక్కన కూర్చొని చదువులో సాయం చేయాలి. అందుకు అవసరమైతే స్కూల్ టీచర్ల సాయం తీసుకోవచ్చు.

ఫోన్, ట్యాబ్, టీవీ స్క్రీన్ల వాడకం.. చదువు నుంచి దృష్టి మరల్చేలా చేస్తుంది. అయితే దీన్ని పూర్తిగా దూరం చేయకుండా, సమయపు హద్దులు పెట్టడం మేలు.

సరైన పోషక ఆహారం ఆందోళన స్థాయిలను తగ్గిస్తుంది. అందుకని పిల్లలకు సమతుల ఆహారం ఇవ్వడంపై దృష్టి పెట్టాలి.

వారి అలసటను నివారించేలా చిన్న విరామం తీసుకోనివ్వాలి.

ఎందుకు ఒత్తిడికి గురవుతారు..?

- ➤ ముందు నుంచీ సిలబస్ ప్రకారం ప్రాక్టీస్ చేయించలేకపోవడం ఒక కారణం. మొదట స్కూల్లో టీచర్లే చూసుకుంటారులే అనే ధీమా ఉంటుంది. పరీక్షల సమయంలో అదికాస్తా సన్నగిల్లుతుంటుంది.
- ➤ పెద్ద పిల్లలైతే సిలబస్ పూర్తి చేయడంలో వెనకబడు తున్నారేమో అనే సందేహం వెంటాడుతుంటుంది.
- ➤ ఫెయిల్ అవుతారేమో, ఇతరుల పిల్లలు ఎక్కువ మార్కులు స్కోర్ చేస్తారేమో అనే ఆందోళనకు గురవుతుంటారు.

విద్యార్థులకు ముంచుకొస్తున్న వార్షిక పరీక్షలు

పిల్లలకన్నా తల్లులకే ఎక్కువ మానసిక ఒత్తిడి

చిన్న తరగతులైనా, బోర్డ్ ఎగ్జామ్స్ అయినా తేడా లేదు

తామే పరీక్షలు రాస్తున్నంతగా హడావుడి

చిరాకు పడుతూ, సరిగ్గా తినకుండా ఉక్కిరిబిక్కిరి

ఇది సరికాదంటున్న నిపుణులు..

అంక్షలు పెట్టకూడదు.. తాము సైతం మంచి ఆహారం, విశ్రాంతి తీసుకోవాలి.. తమకు తామే కొన్ని ప్రమాణాలు చేసుకోవాలి.. వాటిని పాటించాలని సూచన

ఒత్తిడిని ఎలా అధిగమించాలి..

- ➤ తల్లిదండ్రులు పిల్లల విజయాన్ని కోరుకుంటారు. తమ పిల్లలు అందరికన్నా ముందుండాలనే ఆలోచన ఒత్తిడికి గురి చేస్తుంది. అలా ఒత్తిడికి గురవకుండా.. వాస్తవికంగా సాధించగల లక్ష్యాలపై పిల్లలతో కలిసి పనిచేయాలి.
- ➤ మీ ఆందోళన పిల్లల ముందు బయటపడకుండా సానుకూల వైఖరిని చూపాలి. రోజువారీ షెడ్యూల్‌ను రూపొందించుకోవడంలో పిల్లలకు సాయపడాలి.
- ➤ ఒత్తిడి అనేది అందరూ ఎదుర్కొనే సాధారణ సమస్యే. దానిని అధిగమించేందుకు వ్యూహాత్మకంగా పనిచేయడంలోనే అసలైన సవాల్ ఉంటుంది. అది మీ బిడ్డలకు మద్దతునిచ్చే అతి ముఖ్యమైన వనరుగా ఉండాలి. కలిసి భోజనం చేయాలి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి.
- ➤ తల్లిదండ్రులు తమ స్కూల్ రోజుల్లో మార్కుల గురించి తమ తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలను గుర్తుకు తెచ్చుకోవాలి. దీన్ని నివారించాలి.
- ➤ పిల్లలు చదువుకుంటున్నప్పుడు ఒంటరిగా గదిలో వదిలేయ కుండా.. మరో పనిచేస్తూ పిల్లలకు సమీపంలో ఉండాలి.
- ➤ 'ఎక్స్'లో మేరీ కోమ్, సచిన్, రిచర్డ్ బ్రాన్సన్, మార్క్ జుకర్‌బర్గ్.. లాంటి ప్రముఖులను ఫాలో అవ్వాలి. వారంతా కాలేజీ డ్రాపౌట్స్. కానీ నైపుణ్యాలే వారిని ప్రముఖుల జాబితాలో చేర్చాయనే విషయం గమనించాలి. 'పిల్లల్లో ఉండే నైపుణ్యాలను గుర్తించాలి' అనే భావనను పెంపొందించుకోవాలి.

తల్లులు ఇలా ప్రమాణం చేసుకోవాలి..



'పిల్లల పరీక్ష సమయంలో తల్లులు తమకు తాముగా కొన్ని ప్రమాణాలు చేసుకోవాలి.. వాటిని పాటించాలి..' అని అంటున్నారు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, కిడ్స్‌స్టాప్‌ప్రెస్.కామ్ ఫౌండర్ మాన్సి జవేరీ. అవేంటంటే..

- ➤ 'ఇది మీ భవిష్యత్తు.. పరీక్ష ఫలితం పైనే మీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది..' అనే పదాలను పిల్లల ముందు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించను.
- ➤ ఎగ్జామ్స్ ప్రిపరేషన్ సమయంలో నేను, నా పిల్లల స్నేహితులను కలిసినప్పుడు.. 'సిలబస్ పూర్తయ్యిందా? ఇప్పటివరకు ఎన్ని అధ్యాయాలు చదవడం పూర్తి చేశారు?..లాంటి ప్రశ్నలను అడగనే అడగను. ➤ ఎక్కువ గంటలు పుస్తకాల ముందు కూర్చోపెట్టను. ఇతర పిల్లలతో పోల్చి మాట్లాడను.

క్లుప్తంగా...

వైద్య కళాశాలల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన మెడికల్ కాలేజీలు, వాటి అనుబంధ టీచింగ్ హాస్పిటళ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆర్‌అండ్‌బీ, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మెడిసిన్ చదివే విద్యార్థులకు, పేషెంట్లకు ఇబ్బంది కలిగించకూడదని, యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. పనులను విభజించుకొని వర్షాకాలంలోపు ముఖ్యమైన పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

నేడు, రేపు కాంగ్రెస్ సమీక్షలు

హాజరుకానున్న రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమీక్షలకు సిద్ధమవుతోంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన మీనాక్షి నటరాజన్ నేతృత్వంలో ఈ సమీక్షలు జరగనున్నాయి. మంగళవారం మెదక్, మల్కాజిగిరి, బుధవారం కరీంనగర్, ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంటు స్థానాల సమీక్షలు జరుగుతాయి. సంస్థాగతంగా పార్టీ బలోపేతంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ పనితీరు విషయంలో కార్యకర్తల అభిప్రాయాలను మీనాక్షి తీసుకోనున్నారు. ఈ సమావేశాలకు హాజరుకావాలని ఆయా నియోజకవర్గాల పరిధిలోని మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలకు గాంధీ భవన్ వర్గాల ద్వారా ఇప్పటికే సమాచారం అందింది.

మరిన్ని వివరాలు, ఏపీ వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బీజేపీ, పీఆర్‌టీయూకు చెరొకటి

▶ మొదటి పేజీ తరువాయి

ఆధిక్యంలోనే కొనసాగారు. నల్లగొండలోని ఆర్జాలబావిలో ఉన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాముల్లోని స్ట్రాంగ్ రూమ్‌లో కౌంటింగ్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి బ్యాలెట్ బాక్సులను తీసుకొచ్చి కౌంటింగ్ హాలులో 25 టేబుళ్లపై మొదట కట్టలు కట్టే ప్రక్రియ చేపట్టి 11 గంటల వరకు పూర్తి చేశారు. అనంతరం కౌంటింగ్ ప్రారంభించారు. సాయంత్రం 3 గంటల వరకు మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. మొదటి ప్రాధాన్యతలో శ్రీపాల్‌రెడ్డి అత్యధికంగా ఓట్లు సాధించారు. ఆయనకు 6,035 ఓట్లు లభించగా, ద్వితీయస్థానంలో 4,820 ఓట్లతో అలుగుబెల్లి నర్సిరెడ్డి నిలవగా, మూడో స్థానంలో 4,437 ఓట్లు పొంది గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి నిలిచారు. ఆ తర్వాత పూల రవీందర్ 3,115 ఓట్లతో నాలుగో స్థానంలో, బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డి 2,289 ఓట్లు సాధించి ఐదో స్థానంలో నిలిచారు. సుందర్‌రాజ్ యాదవ్ 2,040 ఓట్లతో ఆరో స్థానంలో ఉన్నారు. మిగిలిన అభ్యర్థుల్లో ఒక్కరు మినహా మిగిలిన వారంతా 500 లోపు ఓట్లు వచ్చినవారే ఉన్నారు.

రౌండ్ రౌండ్‌కూ పెరిగిన ఆధిక్యం

ఉపాధ్యాయ నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు ఉండగా, 24,135 ఓట్లు పోలయ్యాయి. అందులో 499 ఓట్లు చెల్లలేదు. 23,641 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. అయితే చెల్లిన ఓట్లలో సగానికి ఒకటి ఎక్కువగా పరిగణన లోకి తీసుకొని 11,821 ఓట్లు గెలుపు కోటాగా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి నిర్ణయించారు. మొదటి ప్రాధాన్యత కోటా ఓట్లు ఎవరికి రాకపోవడంతో రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. అలా 14 మందిని ఎలిమినేషన్ చేసి ఓట్లు లెక్కించడంతో శ్రీపాల్‌రెడ్డికి 6,165 ఓట్లు రాగా, నర్సిరెడ్డికి 4,946 ఓట్లు, హర్షవర్ధన్‌రెడ్డికి 4,596 ఓట్లు, పూల రవీందర్‌కు 3,249 ఓట్లు, సరోత్తంరెడ్డికి 2,394 ఓట్లు వచ్చాయి. ఆ తర్వాత తక్కువగా ఓట్లున్న సుందర్‌రాజును ఎలిమినేట్ చేసి 15వ రౌండ్ ఓట్లు లెక్కించారు. ఇందులో శ్రీపాల్‌రెడ్డి ఓట్లు 6,916కు పెరిగాయి. ఆ తర్వాత బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డిని ఎలిమినేట్ చేసి 16వ రౌండ్‌లో ఓట్లు లెక్కించారు. ఇందులో శ్రీపాల్‌రెడ్డి ఓట్లు 7,673కు చేరుకున్నాయి. ఆ తర్వాత పూల రవీందర్‌ను ఎలిమినేట్ చేసి 17వ



పింగిలి శ్రీపాల్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

రౌండ్ ఓట్లు లెక్కించగా, శ్రీపాల్‌రెడ్డి 9,021 ఓట్లకు చేరుకున్నారు. ఆ తర్వాత మూడో స్థానంలో ఉన్న హర్షవర్ధన్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి ఓట్లు లెక్కించారు. ఇందులో శ్రీపాల్‌రెడ్డికి 11,099 ఓట్లు లభించగా, నర్సిరెడ్డికి 8,448 ఓట్లు లభించాయి. నర్సిరెడ్డికి వచ్చిన మొదటి ప్రాధాన్యత ఓట్లలోని రెండో ప్రాధాన్యత ఓట్లను కూడా లెక్కించి.. శ్రీపాల్‌రెడ్డి గెలిచినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి త్రిపాఠి ప్రకటించారు.

అంతిమంగా ఉపాధ్యాయులు గెలిచారు: పింగిలి

నల్లగొండ: వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరెన్ని కుట్రలు చేసినప్పటికీ అంతిమంగా ఉపాధ్యాయులు గెలిచారని పీఆర్‌టీయూ-టీఎస్ తరఫున గెలిచిన అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. కౌంటింగ్ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయుల తీర్పు అత్యంత విలువైనదని.. వారి ఆత్మగౌరవమే వారిని విజయం దిశగా నడిపించిందన్నారు. విద్యారంగం బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వ విద్య ఉచితంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. శ్రీపాల్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్సీ మోహన్‌రెడ్డి తదితరులు అభినందించారు.

కరీంనగర్‌లో కమల వికాసం

కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాన్ని ముందు నుంచీ ఊహించినట్టు



మల్క కొమరయ్యకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

గానే బీజేపీ కైవసం చేసుకుంది. ఉదయం 8 గంటలకే ఓట్ల లెక్కింపు ప్రారంభమైనా.. అధికారులు జాప్యం చేయడం వల్ల ఓట్ల వడబోత తీవ్ర ఆలస్యమైంది. దీంతో సాయంత్రం 7 గంటలు దాటాక టీచర్ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. రాత్రి 9.30 గంటలకు ఫలితం తేలింది. నియోజకవర్గ పరిధిలో మొత్తం 27,088 ఓట్లకుగాను.. 25,041 ఓట్లు పోల్ అయ్యాయి. అందులో 24,144 ఓట్లు చెల్లుబాటు అయ్యాయి. 897 ఓట్లు చెల్లలేదని అధికారులు ప్రకటించారు. గెలుపు కోటాగా 12,073 ఓట్లను నిర్ధారించారు. మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనే బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు 12,959 ఓట్లు, వంగ మహేందర్‌రెడ్డికి 7,182, అశోక్‌కుమార్‌కు 2,621, కూర రఘోత్తంరెడ్డికి 428 ఓట్లు వచ్చాయి. తొలిరౌండ్‌లోనే బీజేపీ అభ్యర్థి మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే గెలిచారు. రాత్రి 10.20 గంటల సమయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కౌంటింగ్ సెంటర్ వద్దకు వచ్చి కొమురయ్యను అభినందించారు.

అధికారుల లెక్కల్లో గందరగోళం..

టీచర్ ఎమ్మెల్సీకి సంబంధించి మొత్తం పోలైన ఓట్లలో మూడు రకాల గణాంకాలతో అధికారులు గందరగోళానికి తెరతీశారు. పోలింగ్ రోజు రాత్రి 24,895 ఓట్లు పోలయ్యాయని, మరునాడు 24,968 మంది ఓటేశారని, తాజాగా సోమవారం మొత్తంగా 25,041 ఓట్లు పోలయ్యాయని వెల్లడించడంపై అభ్యర్థులు మండిపడుతున్నారు.

కొనసాగుతున్న గ్రాడ్యుయేట్ ఓట్ల వడబోత

కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్ స్థానానికి సంబంధించి కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. గ్రాడ్యుయేట్ నియోజకవర్గపరిధిలో 3.55 లక్షలకు 2,50,106 ఓట్లు పోలయ్యాయి. అందులో ముందుగా లక్ష ఓట్లను వడబోశారు. అందులో 92,000 ఓట్లు చెల్లుబాటు కాగా, 8,000 చెల్లనివిగా అధికారులు ప్రకటించారు. ఇంకా 1.5 లక్షల ఓట్లు వడబోయాల్సి ఉంది. గ్రాడ్యుయేట్ ఓటర్ల బ్యాలెట్లు కట్టలు కట్టే ప్రక్రియ మంగళవారం మధ్యాహ్నం వరకు సాగుతుందని, ఆ తర్వాతే ఓట్ల లెక్కింపు ఉంటుందని పేరు తెలిపేందుకు ఇష్టపడని అధికారి 'సాక్షి'కి తెలిపారు.

భారీగా ఇన్‌వాలీడ్ ఓట్లు.. ఆర్వోపై ఈసీకి ఫిర్యాదు

గ్రాడ్యుయేట్‌కు సంబంధించి భారీగా ఇన్‌వాలీడ్ ఓట్లు నమోదయ్యాయని సమాచారం. దాదాపు 50 వేల ఓట్లు చెల్లకుండా పోయాయని ప్రచారం జరిగినా.. సాయంత్రా



బ్యాలట్ పేపర్లను కట్టలు కడుతున్న కౌంటింగ్ సిబ్బంది

నికి అధికారులు దానిని ఖండించారు. ఓటర్లు చిన్న చిన్న తప్పులతో తమ విలువైన ఓటును చెల్లకుండా చేసుకున్నారు. ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో అంకెలకు ముందు సున్నా రాయడం, ఆ అంకెకు సున్నా చుట్టడం, అంకె వేసినాక సంతకం చేయడం, దానికి ఎదురుగా టిక్ గుర్తు పెట్టడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కామెంట్లు పెట్టడం తదితర తప్పిదాల వల్ల భారీగా ఓట్లు చెల్లకుండా పోయాయని కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి, ఏఐఎఫ్‌బీ అభ్యర్థి, మాజీ మేయర్ రవీందర్ సింగ్‌లు వాపోయారు. అదే సమయంలో తమకు ఓటేసిన వారిలో అంకె ముందు సున్నా పెట్టిన వారి ఓట్లను ఇన్‌వాలీడ్ కాకుండా గుర్తించాలని ఆర్వోకు ఇచ్చిన వినతిపత్రంలో కోరారు. అదే విధంగా రవీందర్‌సింగ్ ఓట్లు లెక్కించే సమయంలో జంబ్లింగ్ విధానం పాటించలేదని ఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. అంతేకాకుండా పలు బూత్‌ల ఓట్ల విషయంలో గోప్యత పాటించకుండా బయటకు వెల్లడించేలా సిబ్బంది వ్యవహరించారని ఆరోపిస్తూ.. ఆర్వో మీద ఈసీకి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తానని రవీందర్‌సింగ్ చెప్పారు. కొత్త ఓటర్లకు ఓటేసే విధానంపై అవగాహన కల్పించడంలో ఎన్నికల కమిషన్ విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వాటికి కూడా ఎల్‌ఆర్‌ఎస్‌కు ఓకే

2020 ఆగస్టు 26కు ముందు 10% ప్లాట్లు రిజిస్టర్డ్ సేల్ డీడ్ చేసి ఉంటే..

సాక్షి, హైదరాబాద్: అనధికార లేఅవుట్లలో 2020 ఆగస్టు 26 కన్నా ముందు 10 శాతం ప్లాట్లను రిజిస్టర్డ్ సేల్‌డీడ్ ద్వారా విక్రయించి ఉంటే, విక్రయించని మిగతా ప్లాట్లను ఎల్‌ఆర్‌ఎస్ కింద క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం సవరణ ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధిత లేఅవుట్ యజమానులు ఎల్‌ఆర్‌ఎస్- 2020 కింద దరఖాస్తు చేసుకోకపోయినా, క్రమబద్ధీకరించుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. కాగా ఈనెల 31 లోపు అక్రమ లే అవుట్లను క్రమబద్ధీకరించుకున్న వారికి, ప్రో-రాటా ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించిన దరఖాస్తుదారులకు 25% డిస్కౌంట్ లభిస్తుందని ప్రభుత్వం తెలిపింది. కాగా ఎల్‌ఆర్ ఎస్-2020 కింద చేసుకున్న దరఖాస్తు తిరస్కరిస్తే., చెల్లించిన మొత్తం నుంచి 10 శాతం ప్రాసెసింగ్ చార్జీ మినహాయించుకొని 90 శాతం ఫీజు రీఫండ్ చేస్తారు.

- ➤ చెరువులు, కుంటలు, ఇతర నీటి వనరులకు 200 మీటర్ల పరిధిలో ఉన్న ప్లాట్లకు సంబంధించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను రెవెన్యూ, నీటిపారుదల శాఖల ద్వారా పరిశీలిస్తారు.
- ➤ నిషేధిత భూములు, చెరువులు, కుంటలకు 200 మీటర్ల పరిధిలో లేని ప్లాట్ల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు ఆటోమేటిక్‌గా ప్రొవిజినల్ ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు సంబంధించి నోటీసు రూపొందించబడుతుంది. దరఖాస్తుదారులు మార్చి 31 లోపు ఫీజు చెల్లిస్తే 25 శాతం రాయితీ పొందొచ్చు.
- ➤ ప్రో-రాటా ఓపెన్ స్పేస్ చార్జీలను భవన అనుమతి సమయంలోనూ చెల్లించే వెసులుబాటు కల్పించారు. అయితే అప్పుడు 25% రాయితీ వర్తించదు.
- ➤ ఎల్‌ఆర్‌ఎస్ 2020 వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుదారుడు 'లాగిన్'అవసరం లేకుండానే దరఖాస్తు స్థితి, ఆమోదం పొందింది లేనిది, ఫీజు వివరాలు, అవసరమైన డాక్యుమెంట్లు, తిరస్కరణ పత్రాలను చెక్ చేసుకోవచ్చు.
- ➤ హెచ్‌ఎండీఏలో కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. సహాయానికి 1800 599 8838 నంబర్‌కు కాల్ చేయొచ్చు.
- ➤ అర్హులైన ప్లాట్ యజమానులు ఈనెల 31 లోపు చెల్లింపులు పూర్తి చేసి 25 శాతం రాయితీ పొందాలి. పూర్తి చెల్లింపులతో కూడిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను హెచ్‌ఎండీఏ 10 రోజుల్లో ప్రాసెస్ చేస్తుంది.

మాకు ఒక ఎమ్మెల్సీ ఇవ్వండి

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన సీపీఐ నేతలు కూనంనేని, చాడ

మహేశ్‌గౌడ్ సానుకూలంగా స్పందించారు: సాంబశివరావు




మహేశ్‌గౌడ్‌ను కలిసిన కూనంనేని, చాడ వెంకట్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరిగే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రధర్మం ప్రకారం తమకు ఒక స్థానం ఇవ్వాలని సీపీఐ నేతలు కాంగ్రెస్ పార్టీని కోరారు. ఈ మేరకు సోమవారం మధ్యాహ్నం కొత్త గూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీనియర్ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు గాంధీభవన్‌కు వచ్చి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను కలిశారు. దాదాపు అరగంట పాటు ఆయనతో సమావేశమైన సీపీఐ నేతలు అసెంబ్లీ ఎన్నికల ముందు, ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలపై చర్చించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమకు ఒక్క సీటు ఇచ్చినా, సర్దుకుపోయామని, ఆ సమయంలోనే తమకు రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఇస్తామని కాంగ్రెస్ మాట ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం వచ్చిన రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక్కటి కూడా ఇవ్వలేదని, అప్పుడు కూడా తాము సర్దుకుపోయామని వివరించారు. ఇప్పుడు ఐదు స్థానాల్లో ఎమ్మెల్సీలుగా అవకాశం వస్తున్నందున తమకు మాట ఇచ్చిన రెండింటిలో కనీసం ఒక్క స్థానంలో అయినా చాన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ సీపీఐ నేతల విన్నపాన్ని పార్టీ దృష్టికి తీసుకెళతానని, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తోపాటు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్టు తెలిసింది. మహేశ్‌గౌడ్‌ను కలిసిన అనంతరం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడుతూ తమ విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌లను కూడా కలిసి ఎమ్మెల్సీగా అవకాశం కోరుతామని చెప్పారు.

గడ్డిమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

తన భూమిని మాజీ సర్పంచ్ అక్రమంగా పట్టా చేసుకున్నాడని మనస్తాపం



ఎల్కతుర్తి: తన భూమిని ఓ మాజీ సర్పంచ్ అక్రమంగా పట్టా చేసుకున్నాడని తీవ్ర మనస్తాపం చెందిన ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. గట్ల నర్సింగాపూర్‌కు చెందిన రాచర్ల బక్కయ్య(85) అనే వృద్ధుడి భూమిని అదే గ్రామానికి చెందిన రాచర్ల సారయ్య అనే మాజీ సర్పంచ్ అక్రమంగా పట్టా చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న బక్కయ్య తిరిగి తన భూమిని తన పేరిట పట్టా చేయాలని సారయ్యను కోరాడు. పెద్దమనుషుల సమక్షంలో బతిమిలాడాడు. అయినప్పటికీ సారయ్య వినలేదు. ఈ క్రమంలో బక్కయ్య గత నెల 17న సారయ్య ఇంటికి వెళ్లగా అతను ఇంట్లో లేకపోవడంతో అతని భార్య పద్మను 'మా భూమిని మాకు పట్టా చేయమని నీవైనా చెప్పు'అని ప్రాధేయపడగా.. సారయ్య భార్య దుర్భాషలాడి చీపురుతో దాడి చేసింది. ఎక్కడికైనా వెళ్లి చావమని తిట్టడంతో మనస్తాపం చెందిన బక్కయ్య అదే రోజు గడ్డిమందు తాగాడు. దీంతో అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందిన వృద్ధుడు ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం పరిస్థితి విషమించి బక్కయ్య మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

బాబు ప్రజా కంటక పాలనకు టీచర్ల చెంపదెబ్బ..

'మాస్టర్' స్ట్రోక్!

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రఘువర్మ ఓటమి

ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థి గాదె శ్రీనివాసులు ఘన విజయం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: సూపర్ సిక్స్ హామీలను ఎగ్గొట్టి.. పది నెలలుగా ప్రజా కంటక పాలనతో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న టీడీపీ, జనసేన కూటమి పార్టీలకు ఏడాదిలోపే చావుదెబ్బ తగిలింది! అధికార మదంతో విర్రవీగుతున్న కూటమి నేతలకు విజ్ఞులైన ఉపాధ్యాయులు బెత్తంతో బడిత పూజ చేశారు! ప్రజాస్వామ్య విలువలను చాటిచెబుతూ.. కూటమి మోసాలను తిప్పికొడుతూ గుణపాఠం లాంటి తీర్పు ఇచ్చారు. పట్టుమని పది నెలల్లోనే టీడీపీ కూటమి సర్కారుపై వెల్లువెత్తుతున్న ప్రజా వ్యతిరేకతకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అద్దం పట్టాయి. సీఎం చంద్రబాబు అనుసరిస్తున్న రెడ్‌బుక్ పాలన, ప్రజా కంటక విధానాలకు ఉపాధ్యాయులు చెంపపెట్టు లాంటి తీర్పు ఇచ్చారు. మొత్తం యంత్రాంగాన్ని మోహరించి అధికార బలాన్ని ప్రయోగించినా కూటమి సర్కారు పాచికలు పారలేదు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పార్టీలు అధికారికంగా తమ అభ్యర్థిగా ప్రకటించిన రఘువర్మ పరాజయం పాలయ్యారు. ప్రతి నియోజకవర్గంలో అధికార పార్టీ తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో బలాన్ని ప్రయోగించినా.. ఓటుకు నోట్లు ఎరవేసినా ఈ సర్కారు పట్ల తమ వ్యతిరేకతను ఉపాధ్యాయులు స్పష్టంగా ఓటు రూపంలో వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల టీచర్లు ఎన్నికల్లో పాల్గొన్న తీరు, ఫలితం.. ఈ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఎంత వ్యతిరేకత నెలకొందో స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల్లో హామీలిచ్చి ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చాక చంద్రబాబు ప్రభుత్వం అన్ని వర్గాలను మోసగించిందని మండిపడుతున్నారు. కూటమి అభ్యర్థి రఘువర్మ గెలుపు కోసం కృషి చేయాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు వెబెక్స్ ద్వారా స్వయంగా ఆదేశాలు జారీ చేస్తూ వచ్చినా భంగపాటు తప్పలేదు. ఉపాధ్యాయ సంఘాలన్నీ కలిసికట్టుగా తమ అభ్యర్థిగా ప్రకటించిన గాదె శ్రీనివాసులు నాయుడును గెలిపించి కూటమి సర్కారుపై తమ ఆగ్రహాన్ని చాటుకున్నాయి. తమ ఓటు కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకమని స్పష్టంగా తేల్చి చెప్పారు. కాగా తమ అభ్యర్థి ఓడిపోవడంతో కూటమి నేతలు ఒక్కసారిగా ప్లేటు ఫిరాయించారు. పోలింగ్ రోజు వరకూ తమ అభ్యర్థి రఘువర్మను గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించి అనుకూల మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేసిన టీడీపీ నేతలు ఆయన ఓడిపోవడంతో.. గెలిచిన గాదె శ్రీనివాసులు కూడా తమవారేనంటూ కొత్త పల్లవి అందుకోవడం టీడీపీ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలతోనే రఘువర్మను తమ అభ్యర్థిగా ప్రకటిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్వయంగా ప్రకటించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గట్టి షాక్ తగలడంతో సీఎం చంద్రబాబు నేరుగా రంగంలోకి దిగారు. దీని నుంచి బయటపడేందుకు పోలీస్ కమిషనర్ ఫోన్ ద్వారా గెలిచిన అభ్యర్థి గాదెతో ఆయన స్వయంగా ఫోన్‌లో మాట్లాడారంటే టీడీపీని పరాజయం ఏ స్థాయిలో వణికించిందో అర్థం అవుతోంది.

సజావుగా జరిగి ఉంటే.. ఆ రెండు చోట్ల కూడా!

కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికారపార్టీ నేతలు భారీగా నగదు పంపిణీతో పాటు పీడీఎఫ్ అభ్యర్థి కుటుంబ సభ్యులు, ఏజెంట్లపై దాడులకు దిగి బీభత్సం సృష్టించారు. దొంగ ఓట్లను నమోదు చేసి... ఏకంగా రిగ్గింగుకు కూడా తెగబడ్డారు. స్వయంగా అధికార పార్టీ నేతలే విచ్చలవిడిగా డబ్బులను పంపిణీ చేశారు. ఎన్నికలు సజావుగా జరిగి ఉంటే ఇక్కడ కూడా అధికార కూటమికి కచ్చితంగా ఓటమి ఎదురయ్యేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రెండో స్థానం కోసం పోటాపోటీ...

ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ నుంచి బరిలో నిలిచిన గాదె శ్రీనివాసులు నాయుడు ప్రతి రౌండ్‌లోనూ స్పష్టమైన ఆధిక్యతను కనబరిచారు. ఏ రౌండ్‌లో కూడా కూటమి అభ్యర్థి రఘువర్మకు మెజార్టీ రాకపోవటాన్ని గమనిస్తే టీడీపీ సర్కారుపై ఉపాధ్యాయుల్లో ఎంత వ్యతిరేకత ఉందో తేటతెల్లమవుతోంది.

రాజకీయ జోక్యంతో!

టీడీపీ, జనసేన అధికారికంగా రఘువర్మను తమ అభ్యర్థిగా ప్రకటించాయి. గెలుపు కోసం అధికారపార్టీ ఎమ్మెల్యేలు విశ్వ ప్రయత్నాలు చేశారు. కూటమి పార్టీల తరఫున బరిలో నిలిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీని గెలిపించాలంటూ టీచర్లపై ఒత్తిళ్లు తెచ్చారు. ప్రధానంగా ప్రైవేటు టీచర్లను బెదిరించే ధోరణిలో వ్యవహరించారు. ఎంత

ఉత్తరాంధ్ర ఫలితం ఇలా..

మొత్తం పోలైన ఓట్లు:	20,791
చెల్లిన ఓట్లు:	20,135
చెల్లని ఓట్లు:	656
మ్యాజిక్ ఫిగర్:	10,068
విజేత గాదె శ్రీనివాసులకు వచ్చిన ఓట్లు:	12,035
మ్యాజిక్ ఫిగర్‌తో పోల్చితే మెజారిటీ:	1967
ఎలిమినేషన్ అయ్యే సరికి వర్మకు ఓట్లు:	8527



గాదె శ్రీనివాసులు

చేసినా ప్రజా వ్యతిరేకతను తప్పించుకోలేకపోయారు. అధికార పార్టీకి చెందిన విద్యాలయాల్లో పని చేసే ప్రైవేట్ టీచర్లు సైతం కూటమి అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటేశారంటే ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత నెలకొందో ఊహించవచ్చు.

ఉభయ గోదావరి తొలిరౌండ్ ఫలితాల వెల్లడి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో తొలి రౌండ్ పూర్తయింది. మొదటి రౌండులో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు 16,520 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు 5,815 ఓట్లు, జీవీ సుందర్‌కు 1,968 ఓట్లు వచ్చాయి. 2,416 చెల్లని ఓట్లుగా గుర్తించారు.

ఆధిక్యంలో ఆలపాటి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్ధరాత్రి 12 గంటలకు ఐదో రౌండు ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి టీడీపీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ 47,872 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. మొత్తం పోలైన ఓట్లు 1,40,297 కాగా చెల్లని ఓట్లు 14,888 ఉన్నాయి. పోలైన ఓట్లలో ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు 84,595, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు 36,723 వచ్చాయి. కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది.

పుట్టకముందే ప్రైవేటుపరం!

- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని రైల్వేశాఖ సూత్రప్రాయ నిర్ణయం
- ఫ్యాక్టరీ ఉద్యోగులలో 80 శాతానికిపైగా ప్రైవేటువారే ఉండే చాన్స్
- వచ్చే డిసెంబరు నాటికి యూనిట్ రెడీ.. తర్వాత ఏడెనిమిది నెలల్లో ఉత్పత్తి ప్రారంభం
- ఐదేళ్లపాటు తయారీ పనిని టెండర్ ద్వారా ప్రైవేటు సంస్థకు అప్పగించాలని రైల్వే యోచన
- రైల్వే ఇచ్చే ఇండెంట్ ఆధారంగా ఉత్పత్తి చేసి అప్పగించనున్న ప్రైవేటు సంస్థ
- కొన్ని కీలక పోస్టులు తప్ప అన్నీ ప్రైవేటు సంస్థ పరిధిలోకి వెళ్లే చాన్స్
- భారీగా రైల్వే శాఖ ఉద్యోగాలు వస్తాయనుకుంటున్న స్థానిక యువతకు షాక్


కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణ స్థలం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ దశాబ్దాల కల కాజీపేట రైలు కోచ్ ఫ్యాక్టరీ.. అందినట్టే అంది, చేజారుతూ, ఊరిస్తూ చివరికి రైల్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ రూపంలో ఏర్పాటవుతున్న ఈ ఫ్యాక్టరీతో ఉద్యోగాలు వస్తాయని, ఉపాధి లభిస్తుందన్నది రాష్ట్ర యువత ఆశ. కానీ రైల్వేశాఖ ఈ ఆశలను కుదిపేసే నిర్ణయం తీసుకుంది. రైల్వేశాఖ వర్గాల ప్రకారం.. ఈ కోచ్ ఫ్యాక్టరీ నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించాలని రైల్వేశాఖ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఏడాదిన్నరలో ఉత్పత్తి ప్రారంభమవనున్న ఈ యూనిట్ నిర్వహణను టెండర్ల ద్వారా ప్రైవేటుకు అప్పగించాలని భావిస్తోంది. ఇదే జరిగితే కొన్ని కీలక పోస్టులు తప్ప మిగతా ఉద్యోగాలన్నీ ప్రైవేటు సంస్థ ఆధీనంలోనే ఉండనున్నాయి.

రూ.530 కోట్ల వ్యయంతో...

కాజీపేటకు మంజూరైన రైలు తయారీ కేంద్రం నిర్మాణం వచ్చే డిసెంబరు నాటికి సిద్ధం కాబోతోంది. తర్వాత ఏడెనిమిది నెలల్లో ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కాజీపేట శివారులోని మడికొండ సమీపంలో రూ.530 కోట్ల వ్యయంతో 160 ఎకరాల విస్తీర్ణంలో ఇది రూపొందుతోంది. రైల్వే అనుబంధ సంస్థ రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్), జపాన్‌కు చెందిన టైకిషా సంస్థ జాయింట్ వెంచర్‌గా దీన్ని నిర్మిస్తున్నాయి. ఈ యూనిట్‌లో వందేభారత్ రైలు కోచ్‌లు, ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్(ఈఎంయూ) రైళ్లు, ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు తయారు చేయనున్నారు.

మెల్లగా ప్రైవేటువైపు రైల్వే చూపు..

ఇన్నాళ్లూ రైల్వేను సొంత నిర్వహణలోనే ఉంచుకున్న కేంద్ర ప్రభుత్వం.. క్రమంగా ప్రైవేటు వైపు దృష్టి సారిస్తోంది. తొలుత రైళ్ల తయారీ యూనిట్లను ప్రైవేటుకు అప్పగించటం ద్వారా వేతనాల భారాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్‌గా ఉన్న భారతీయ రైల్వేలో ప్రస్తుతం 12.52 లక్షల మంది ఉద్యోగులున్నారు. ఏటా రూ.లక్ష కోట్లకుపైగా జీతాలకే ఖర్చవుతోంది. ఇది రైల్వేకు భారంగా మారింది. రైల్వే ఉద్యోగుల వేతనాలు కూడా భారీగా ఉండటం, క్రమం తప్పకుండా సవరించాల్సి రావడంతో.. ఈ పద్దులో పొదుపు సాధ్యంకాని పరిస్థితి. రైల్వే నష్టాలకు ఇది కూడా ఓ కారణమన్న వాదన ఉంది. ఈ క్రమంలో కొన్ని విభాగాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించటం ద్వారా భారం తగ్గించుకోవాలని రైల్వే భావిస్తోంది.

అంతా సిద్ధం చేసి.. నిర్వహణ ప్రైవేటుకు..

కాజీపేట ఫ్యాక్టరీలోనే రైళ్లను పూర్తి స్థాయిలో తయారు చేసేందుకు వీలుగా అన్ని రకాల విభాగాలను ఆర్‌వీఎన్‌ఎల్ నిర్మిస్తోంది. ఆధునిక రైలు కోచ్‌ల తయారీ కోసం స్థానికంగా లభించే యంత్రాలతోపాటు టైకిషా కంపెనీ నుంచి అధునాతన యంత్రాలను దిగుమతి చేసుకోనుంది. అన్ని విభాగాలు, వాటిలో యంత్రాలు, పరికరాలను సిద్ధం చేసిన తర్వాత ప్రైవేటు సంస్థకు టెండర్ ద్వారా అప్పగించాలని రైల్వే భావిస్తోంది. టెండర్ ఖరారయ్యే నాటి నుంచి తర్వాతి ఐదేళ్లలో ఎన్ని ఏయే రకాల రైళ్లు, కోచ్‌లు ఎన్ని కావాలనేది అందులో పేర్కొంటుంది. టెండర్ దక్కించుకున్న సంస్థ ఆ మేరకు రైళ్లు, కోచ్‌లను తయారు చేసి అందించాల్సి ఉంటుంది. అయితే కీలక విభాగాల్లోని ఉన్నతాధికారులు, ప్రధాన ఇంజనీర్లు కొందరిని రైల్వే రిక్రూట్ చేస్తుంది. మిగతా ఉద్యోగులను ప్రైవేటు సంస్థనే నియమించుకోవాల్సి ఉంటుంది.

80 శాతానికిపైగా ప్రైవేటు ఉద్యోగులే!

కాజీపేట రైలు కోచ్ తయారీ యూనిట్‌కు 3 వేల మంది వరకు ఉద్యోగులు అవసరమని రైల్వే వర్గాలు చెబుతున్నాయి. వీరంతా ప్రత్యక్ష ఉద్యోగులు, పరోక్షంగా మరో 15వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. అయితే ఫ్యాక్టరీలో అవసరమైన 3 వేల మంది రెగ్యులర్ ఉద్యోగుల్లో.. సుమారు 2.5వేల మందిని ప్రైవేటు సంస్థనే సమకూర్చుకుంటుందని, 500 మంది వరకు మాత్రమే రైల్వే శాఖ ద్వారా రిక్రూట్ అవుతారని అంటున్నారు. అంటే 80శాతానికిపైగా ఉద్యోగులు ప్రైవేటువారే ఉంటారని స్పష్టమవుతోంది.

ఈ ఫ్యాక్టరీలో ఏమేం తయారు చేస్తారు?

రైల్వే అధికారుల అంచనాలు, ప్రాథమిక సమాచారం ప్రకారం..

- కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో ఏటా 15 వందే భారత్ రైళ్ల (ఒక్కోదానిలో 16 కోచ్‌లు) తయారు చేసే సామర్థ్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో వందే భారత్ రైలు తయారీకి రూ.140 కోట్లు ఖర్చవుతుంది.
- నెలకు 10 చొప్పున ఎంఎంటీఎస్ తరహా రైలు రేక్స్ (ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్లు) తయారు చేయనున్నారు. ఈ ఒక్కో రైలుకు రూ.90 కోట్ల వరకు ఖర్చు అవుతుంది.
- సాధారణ రైళ్లలో వినియోగించే ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను నెలకు 50 వరకు తయారు చేస్తారు. ఒక్కో కోచ్ ధర రూ.1.6 కోట్లు ఉంటుంది. అదే ఏసీ కోచ్ అయితే రూ.2 కోట్లు ఖర్చవుతుంది.

దశాబ్దాల కల ఇది..

మాజీ ప్రధాని పీవీ ఒత్తిడితో 1980వ దశకంలో ఇందిరా గాంధీ ప్రభుత్వం కాజీపేటకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేసింది. దానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో నాటి ప్రధాని ఇందిర హత్యకు గురయ్యారు. ఆ సమయంలో జరిగిన సిక్కుల ఊచకోతతో కాంగ్రెస్ పార్టీపై సిక్కుల్లో వ్యతిరేకత నెలకొంది. రాజీవ్ గాంధీ ప్రధాని అయిన తర్వాత సిక్కులను సముదాయించే చర్యల్లో భాగంగా.. కాజీపేటకు రావాల్సిన కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కపుర్తలాకు మళ్లించారు. అప్పటి నుంచి కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ కోసం తెలంగాణ ఎదురుచూస్తూనే ఉంది. మమతా బెనర్జీ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలో కాజీపేటకు రైలు చక్రాల తయారీ యూనిట్ మంజూరు చేశారు. తర్వాత కేంద్ర ప్రభుత్వం దాన్ని రైల్ పీరియాడికల్ ఓవర్ హాలింగ్ వర్క్‌షాప్‌గా మార్చింది. కానీ పనులేవీ మొదలుకాలేదు. నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక కేంద్ర ప్రభుత్వం కాజీపేటకు వ్యాగన్ తయారీ కేంద్రాన్ని మంజూరు చేసి, ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే దీనిని రైల్వే కోచ్ తయారీ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేశారు.

క్లుప్తంగా...

అన్ని పార్టీల నేతలు గౌరవించే అరుదైన నేత చెన్నమనేని

- 'శాసనసభలో మూడు దశాబ్దాల ప్రజావాణి చెన్నమనేని' పుస్తకాన్ని ఆవిష్కరించిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: పార్టీల మధ్య సిద్ధాంత వైరుధ్యాలు ఉన్నప్పటికీ అన్ని పార్టీల నేతలు గౌరవించే అరుదైన నేతగా చెన్నమనేని రాజేశ్వరరావు గుర్తింపు తెచ్చుకున్నారని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. చెన్నమనేని రాజేశ్వరరావు శత జయంతి సందర్భంగా 'చెన్నమనేని రాజేశ్వర రావు, లలితాదేవి ఫౌండేషన్' ద్వారా విడుదలైన 'శాసనసభలో మూడు దశాబ్దాల ప్రజావాణి- చెన్నమనేని' పుస్తకాన్ని సోమవారం స్పీకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్, చెన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. పాలకవర్గాలపై విమర్శలు చేస్తూనే ప్రజలు కోరుకునే పరిష్కార మార్గాలు చూపిన రాజేశ్వరరావు తీరు అత్యంత విశేషం అన్నారు. కొత్తతరం శాసనసభ్యులు తప్పక ఈ పుస్తకాన్ని చదవాలని పేర్కొన్నారు.

పీఎం కుసుమ్ పథకం గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం -కుసుమ్) పథకం కింద 4 వేల మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతుల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ గడువును ఈ నెల 2 నుంచి 10 వరకు పొడిగించారు. ఈ విషయాన్ని తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (రెడ్కో) వైస్ చైర్మన్, ఎండీ వి. అనీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహిక రైతులు పీఎం కుసుమ్ తెలంగాణ వెబ్‌సైట్ www. pmkusum. telangana. gov. in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జీఎస్ఐ సలహాల్లేకుండా ఎస్ఎల్‌బీసీ పనులు

- ప్రాజెక్టుపై రెండు వాగులతో ముప్పు ఉండే అవకాశం
- బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్



సాక్షి, హైదరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) సలహాలు, సూచనలు తీసుకోకుండా ఎస్ఎల్‌బీసీ పనులు ప్రారంభించారని బీజేఎల్పీ ఉప నేత పాయల్ శంకర్ ఆరోపించారు. ఆయన సోమవారం బీజేపీ కార్యాలయంలో కలిసి విలేకరులతో మాట్లాడారు. తమకు శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) పనులపై అనుమానాలున్నాయని చెప్పారు. ఆర్థికంగా నష్టాల్లో ఉన్న సంస్థకు ఈ పనులు ఇచ్చారని సమాచారం ఉందన్నారు. బీఆర్ఎస్ చేయని పని తాము చేయాలని నాలుగేళ్లు పెండింగ్‌లో పెట్టిన ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రారంభించి 8 మంది ప్రాణాలను ఇబ్బందుల్లో పడేసిందని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీపైన రెండు వాగులు ప్రవహిస్తున్నాయని, ప్రాజెక్టు మొత్తం ప్రమాదంలో పడే చాన్స్ ఉందని అభిప్రాయపడ్డారు. రేవంత్‌రెడ్డి ఇది కప్పిపుచ్చుకునేందుకే కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లపై విమర్శలు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తనను సీఎం పదవి నుంచి తొలగిస్తారనే సమాచారంతోనే కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లపై రేవంత్ విమర్శలు చేస్తున్నారన్నారు. ఇలాంటి ప్రాజెక్టు ప్రమాదకరమని ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్త స్పష్టం చేస్తుంటే.. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అని రేవంత్ రెడ్డి అంటున్నారని విమర్శించారు.

'మహిళా సాధికారత' విధాన రూపకల్పనకు కమిటీ

- మహిళా సంక్షేమశాఖ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మహిళా సాధికారతపై విధాన రూపకల్పన కోసం ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంలో భాగంగా వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమాలను వేగంగా చేపట్టాలని భావిస్తోంది. అలాగే చిన్నతనం నుంచే పిల్లలకు మహిళలను గౌరవించడాన్ని నేర్పేందుకు ప్రత్యేక పాఠ్యాంశాలను సిలబస్‌లో చేర్చడానికి కసరత్తు చేస్తున్నట్టు పంచాయతీరాజ్, మహిళా సంక్షేమశాఖ మంత్రి సీతక్క సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే వారు నిజమైన సమానత సాధిస్తారు. మార్చి 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాం' అని తెలిపారు. 'ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది. దీంతో ఆదా అయ్యే మొత్తాన్ని ఇతర అవసరాలకు ఖర్చు చేసే వెసులుబాటు మహిళలకు కలిగింది'అని పేర్కొన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద 17 రకాల వ్యాపారాలను గుర్తించి మహిళా సంఘాలకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

ప్రభుత్వ బడుల ప్రమాణాలు పెంచాలి


- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు అవసరమైన సూచనలు చేయాలని విద్యాశాఖ ఉన్నతాధికారులను.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. ప్రభుత్వ పాఠశాలల ముఖ చిత్రాన్ని మార్చాలన్నదే తమ లక్ష్యమన్నారు. విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా, ఇతర ఉన్నతాధికారులతో ఆయన సోమవారం సచివాలయంలో సమీక్ష జరిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గుజరాత్ నుంచి ఏటా 30-40 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు సింగపూర్ వెళ్లి ఉన్నత శిక్షణ పొంది వస్తున్నారని, ఆ తరహా ప్రయత్నం మనవద్ద కూడా జరగాలని సూచించారు. సింగపూర్ ప్రభుత్వం మన దగ్గర ప్రపంచస్థాయి విద్యా సంస్థల ఏర్పాటుకు అంగీకరించిందని వెల్లడించారు. త్వరలోనే ఆ దేశ బృందం రాష్ట్రాన్ని సందర్శిస్తుందన్నారు.

సాగునీటి ఇబ్బందులకు బీఆర్ఎస్సే కారణం


- కృష్ణా జలాల తరలింపును అడ్డుకోవాలి: ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తన సొంత ఎజెండాతో రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టిన కేసీఆర్, బీఆర్ఎస్ కారణంగానే తెలంగాణలో సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలోనే ఎస్ఎల్‌బీసీని పూర్తి చేసి ఉంటే ఇప్పుడు ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని చెప్పారు. సోమవారం గాంధీభవన్‌లో ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ అనాలోచిత నిర్ణయాల వల్లనే జగిత్యాల, ధర్మపురి ప్రాంతాలు ముంపునకు గురయ్యా యని ఆరోపించారు. రాయలసీమ ప్రాజెక్టుల పేరుతో కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోయినా బీఆర్ఎస్ హయాంలో పట్టించుకోలేదని, ఇప్పుడైనా కృష్ణా జలాల తరలింపును నియంత్రించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తుమ్మిడిహెట్టికి నిధులు ఇవ్వాలని, అక్కడే బరాజ్ నిర్మాణం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ నేతలు ఇప్పటికైనా విజ్ఞత ప్రదర్శించి చేసిన తప్పులు ఒప్పుకుంటే ప్రజలు హర్షిస్తారని, అలా కాకుండా ప్రతిపక్షం కాబట్టి ప్రభుత్వాన్ని విమర్శిస్తామంటే కుదరదని జీవన్‌రెడ్డి హితవు పలికారు.

సర్కార్ చర్యలు సంతృప్తికరం

- 'ఎస్ఎల్‌బీసీ' ప్రమాదంపై విచారణ అనవసరమన్న హైకోర్టు
- ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని ముగించిన తాత్కాలిక సీజే ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై హైకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ విషయంలో విచారణ అవసరం లేదని అభిప్రాయపడింది. అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎ. సుదర్శన్‌రెడ్డి వాదనలను నమోదు చేసుకుంది. ప్రమాదానికి సంబంధించి దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో విచారణ ముగించింది. సొరంగంలో చిక్కుకున్న 8 మందిని సురక్షితంగా తీసుకురావాలంటూ జాతీయ వలస కార్మికుల సంఘం ఉపాధ్యక్షుడు పీవీకేకే భార్గవ్ పిల్ దాఖలు చేశారు. ప్రమాదం జరిగి 10 రోజులవుతున్నా కార్మికుల ఆచూకీ తెలియరాలేదని.. సొరంగ నిర్మాణాన్ని నిలిపేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. అలాగే ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసే కార్మికుల భద్రత, సంక్షేమంతోపాటు పరిహారం కూడా ముందే నిర్ధారించేలా ఉత్తర్వులివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సుజోయ్‌పాల్, న్యాయమూర్తి రేణుకా యారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ 'నీటిపారుదల కోసం నిర్మిస్తున్న 44 కిలో మీటర్ల పొడవైన సొరంగం ఎస్ఎల్‌బీసీ. చాలా వరకు నిర్మాణం పూర్తయింది. శ్రీశైల ప్రవేశ వైపుగా అనుకోకుండా ప్రమాదం చోటుచేసుకుంది. 8 మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారు. గత నెల 22న ప్రమాదం జరిగిన నాటి నుంచి ప్రభుత్వం సహాయక చర్యల్లో తలమునకలైంది. సహాయక చర్యల్లో సైన్యం, నేవీ, సింగరేణి, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, హైడ్రా బృందాలతోపాటు ఎల్ అండ్ టీ పాల్గొంటోంది. మంత్రులతోపాటు ముఖ్యమంత్రి కూడా ప్రమాద స్థలాన్ని సందర్శించారు. 24 గంటలూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వాటిని ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది'అని చెప్పారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. సహాయక చర్యలన్నీ కొనసాగుతున్నప్పుడు ప్రత్యేకంగా న్యాయ విచారణ అవసరం లేదని పేర్కొంది.

తవ్వినకొద్దీ ఊట

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలకు ఆటంకం

- కార్మికుల ఆచూకీ కోసం కొనసాగుతున్న తవ్వకాలు
- పదిరోజులు గడుస్తున్నా కన్పించని ఆనవాళ్లు
- కన్వేయర్ బెల్టు సిద్ధమైతేనే వేగంగా మట్టి తరలింపు


టన్నెల్‌లో కార్మికులు ఉన్నట్టు భావిస్తున్న స్థలంలో తవ్వుతున్న రెస్క్యూ సిబ్బంది

సాక్షి, నాగర్‌కర్నూల్: ఎస్ఎల్‌బీసీ సొరంగంలో జరిగిన ప్రమాదంతో లోపల చిక్కుకుపోయిన 8 మంది కార్మికులను వెలికితీసేందుకు కొనసాగుతున్న సహాయక చర్యలకు ప్రమాదస్థలంలో పెద్ద ఎత్తున ఉబికివస్తున్న ఊటనీరు ఆటంకంగా మారింది. గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) నిపుణులు సూచించిన పాయింట్లలో తవ్వకాలు కొనసాగుతున్నాయి. తవ్వుతున్న కొద్దీ సొరంగంలోని బురద నుంచి ఇంకా హెచ్చుస్థాయిలో నీరు ఊరుతూనే ఉండటంతో పనులు అనుకున్న విధంగా ముందుకు సాగడం లేదు. జీపీఆర్ గుర్తించిన మూడు పాయింట్ల వద్ద తవ్వకాలు జరిపినా కార్మికుల ఆచూకీ లభ్యం కాలేదు. మరికొన్ని మార్కింగ్‌ల వద్ద సింగరేణి గనుల రెస్క్యూ టీం ఆధ్వర్యంలో మాన్యువల్‌గా తవ్వకాలు కొనసాగుతున్నాయి.

పదిరోజులుగా శిథిలాల కిందే..

సొరంగంలో ప్రమాదం జరిగి సోమవారం నాటికి పది రోజులు పూర్తయ్యాయి. కార్మికుల ఆచూకీ ఇంతవరకు దొరకలేదు. పది రోజులుగా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, బార్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, సింగరేణి, ర్యాట్ హోల్ మైనర్స్, ఎన్‌జీఆర్ఐ, దక్షిణ మధ్య రైల్వే, ఆర్మీ, ఎల్‌అండ్‌టీ, రాబిన్స్, మేఘా, నవయుగ కంపెనీల బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. ప్రస్తుతం సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం, ర్యాట్ హోల్ మైనర్స్ ఆధ్వర్యంలో మట్టి తవ్వకాలు, దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో గ్యాస్ కట్టర్స్‌తో టీబీఎం విడిభాగాలు, శిథిలాల తొలగింపు కొనసాగుతోంది. పలువురు నిపుణులు, అధికారులు ఘటనా స్థలంలో ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

రెడీ కాని కన్వేయర్ బెల్టు

సొరంగం లోపల 13 కి.మీ. అవతల ప్రమాదం చోటు చేసుకోగా, అక్కడ భారీగా మట్టి, శిథిలాలు 200 మీటర్ల మేర పేరుకుపోయాయి. కన్వేయర్ బెల్టు తీవ్రంగా దెబ్బతినడంతో దీనిని వేగంగా తొలగించేందుకు అవకాశం లేకుండా పోయింది. బెల్టు మరమ్మతుకు గత వారం రోజులుగా సింగరేణి, రాబిన్స్ కంపెనీలకు చెందిన నిపుణులు శ్రమిస్తున్నారు. మంగళవారం వరకు బెల్టు అందుబాటులోకి వస్తుందని చెబుతుండగా, ఆ తర్వాతే మట్టి తరలింపు వేగవంతం కానుంది. 'సొరంగంలో మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. పూర్తిస్థాయిలో మట్టి తొలగింపునకు ఎన్ని రోజులు పడుతుందో చెప్పలేం. వీలైనంత త్వరగా కార్మికుల ఆచూకీ కనుక్కొనేందుకు నిరంతరాయంగా రెస్క్యూ కొనసాగుతోంది..' అని జిల్లా కలెక్టర్ సంతోష్ చెప్పారు. మరోవైపు కాంట్రాక్టు సంస్థ జేపీ మేనేజింగ్ చైర్మన్ మనోజ్ గౌర్ సోమవారం ఘటనా స్థలాన్ని సందర్శించారు. టీబీఎం రాక్ కట్టర్స్ 67 దెబ్బతిన్నట్లు తెలిపారు. సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు.





ప్రపంచం అనేది నా భావన.
– ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి
మంగళవారం, 4 మార్చి 2025

వైట్‌హౌస్ రియాలిటీ షో!

రోజులన్నీ ఒకేలా ఉండవు. ఈ పరమ సత్యం వైట్‌హౌస్ వేదికగా, ప్రపంచ మాధ్యమాల సాక్షిగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి సంపూర్ణంగా అర్థమైవుంటుంది. హోంవర్క్ ఎగ్గొట్టిన కుర్రాడిని మందలించినట్టు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ విరుచుకుపడుతుంటే జెలెన్‌స్కీ సంజాయిషీ ఇస్తూనే, అవకాశం చిక్కినప్పుడల్లా తన ఆత్మగౌరవాన్ని కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఆయన దయనీయ స్థితిని ప్రత్యక్షంగా తిలకించిన సాధారణ ప్రజానీకం సరే... అంతర్జాతీయంగా చిన్నా పెద్దా దేశాధినేతలందరూ విస్మయపడ్డారు. కాస్త వెనక్కు వెళ్తే జరిగిందంతా వేరు. గత మూడేళ్లుగా ఆయనకు ఎక్కడికెళ్లినా రాజలాంఛనాలు! అమెరికన్ కాంగ్రెస్‌లోనూ, పాశ్చాత్య దేశాల పార్లమెంట్లలోనూ, అవార్డు ప్రదానోత్సవాల్లోనూ, న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లోనూ ఆయనకు సాదర స్వాగతాలు!! ఆయన కోరకుండానే మారణాయుధాలూ, యుద్ధ విమానాలూ, డాలర్లూ పెద్దయెత్తున వచ్చిపడ్డాయి. వాటి విలువ ట్రంప్ అంటున్నట్టు 35,000 కోట్ల డాలర్లా, జెలెన్‌స్కీ సవరించినట్టు 11,200 కోట్ల డాలర్లా అన్నది ముమ్ముందు తేలుతుంది. చిత్రమేమంటే... ఆయనతో అమర్యాదకరంగా వ్యవహరిస్తున్న ట్రంప్‌ను పల్లెత్తు మాట అనని మీడియా, సూట్‌కు బదులు టీ షర్ట్ వేసుకురావటం అగ్రరాజ్యాధినేతను అవమానించినట్టేనని జెలెన్‌స్కీకి హితబోధ చేసింది!

ట్రంప్ తీరు దౌత్యమర్యాదలకు విఘాతమనీ, వర్ధమాన దేశాధినేతను కించపరుస్తూ, ఆధిపత్యం చలాయిస్తూ మాట్లాడటం సరికాదనీ వస్తున్న వాదనలు ముమ్మాటికీ సమర్థించదగినవే. కానీ అమెరికా వ్యవహార శైలి గతంలో కూడా భిన్నంగా లేదు. మర్యాదలివ్వటం మాట అటుంచి గిట్టని పాలకులను పదవీచ్యుతుల్ని చేయటం, తిరుగుబాట్లకు ప్రోత్సహించటం రివాజు. కాకపోతే ట్రంప్ బహిరంగంగా ఆ పని చేశారు. అమెరికా చరిత్రనూ, పాశ్చాత్య దేశాల తీరుతెన్నులనూ చూస్తే ఎన్నో ఉదాహరణలు దొరుకుతాయి. 1946–49 మధ్య గ్రీస్‌లో రాచరిక నియంతృత్వంపై చెలరేగిన తిరుగుబాటును అణచటానికి అప్పటి అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ సైన్యాన్ని తరలించారు. క్యూబా, చిలీ, వియత్నాం, ఇరాన్ వగైరాల్లో ప్రభుత్వాలను కూలదోసి తనకు అనుకూలమైనవారిని ప్రతిష్ఠించేందుకు అమెరికా ఎన్ని ప్రయత్నాలు చేసిందో తెలుసుకుంటే దిగ్భ్రాంతి కలుగుతుంది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో మనల్ని చీకాకు పరిచేందుకు పాకిస్తాన్‌లో సైనిక తిరుగుబాట్లకు ఉసిగొల్పింది అమెరికాయే. ప్రభుత్వాల కూల్చివేతకు క్యూబాలోనూ, ఇతరచోట్లా పన్నిన పథకాలను రిటైర్డ్ సీఐఏ అధికారులు ఏకరువు పెట్టారు. ఈ పరంపరలో పాశ్చాత్య దేశాలు అమెరికాతో కలిసి కొన్నీ, సొంతంగా కొన్నీ చేశాయి. మన దేశంలో దాదాపు 200 ఏళ్ల అధికారం చలాయించి ఇక్కడి సంపదను బ్రిటన్ కొల్లగొట్టింది. ఆ దేశమే 1982లో ఫాక్‌ల్యాండ్ ద్వీపసముదాయం కోసం అర్జెంటీనాపై యుద్ధం చేసి ఆక్రమించింది. ఇంకా 1990–91 నాటి గల్ఫ్ యుద్ధం, 1992–95 మధ్య కొనసాగిన బోస్నియా యుద్ధం, 1999లో కొసావో యుద్ధం, 2001లో ఉగ్రవాదంపై యుద్ధం పేరుతో మొదలెట్టి 2021 వరకూ సాగించిన అఫ్గాన్ యుద్ధం, 2003–2011 మధ్య సాగిన ఇరాక్ యుద్ధం, 2011లో జరిగిన లిబియా దురాక్రమణ... ఇవన్నీ అమెరికా–పాశ్చాత్య దేశాలు 'నాటో' ఛత్రఛాయలో సాగించిన యుద్ధాల్లో కొన్ని. ఈ దేశాల్లో మానవ హక్కుల హననం జరుగుతున్నదనీ, ప్రభుత్వాలు నియంత పోకడలు పోతున్నాయనీ సంజాయిషీ ఇచ్చారు. కానీ అక్కడ పౌరులు లేరా... వారు తిరగబడలేరా?

వాదోపవాదాల మధ్యన జెలెన్‌స్కీని ఉద్దేశించి 'మీ దగ్గర పేకముక్కలు అయిపోయాయి' అన్నారు ట్రంప్. అది వాస్తవం. ఒక వ్యంగ్యచిత్రకారుడు ఆ ఉదంతంపై వేసిన కార్టూన్ మాదిరే ఆయన్ను ఇన్నాళ్లూ అమెరికా, పాశ్చాత్య దేశాలు పేకమేడ ఎక్కించాయి. మారిన పరిస్థితులను జెలెన్‌స్కీ గ్రహించలేకపోతున్నారు. ఒక సార్వభౌమాధికార దేశంపై మరో దేశం విరుచుకుపడటం, దురాక్రమించటం, జనావాసాలను ధ్వంసం చేయటం ముమ్మాటికీ నేరం. ఉక్రెయిన్ విషయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆ తప్పు చేశారు. కానీ అందుకు తన చర్యల ద్వారా దోహదపడింది జెలెన్‌స్కీయే. ఈ పోకడలు నివారించాలనీ, ఆయనకు మద్దతునీయటంకాక, చర్చల ద్వారా పరిష్కరించుకొమ్మని నచ్చజెప్పాలనీ పుతిన్ కోరినప్పుడు అమెరికా, పాశ్చాత్య దేశాలు ముఖం చాటేశాయి.

ట్రంప్ తన పూర్వాశ్రమంలో రియాలిటీ షోలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవారు. ఇప్పుడు వైట్‌హౌస్ ఉదంతం ఆ మాదిరి ప్రదర్శనే. తాను పుతిన్‌తో చేతులు కలపటం సరైందేనని అమెరికా ప్రజానీకం అనుకునేలా చేయటమే ట్రంప్ లక్ష్యం. అది నెరవేరిందో లేదోగానీ ఉక్రెయిన్ కోసం పాశ్చాత్య దేశాలు ఏకమవుతున్న సూచనలు కనబడుతున్నాయి. సైన్యాన్ని కూడా తరలిస్తామంటున్నాయి. కానీ జెలెన్‌స్కీ ఒక సంగతి గ్రహించాలి. ఎవరి మద్దతూ ఉత్తపుణ్యానికి రాదు. ఉక్రెయిన్ నేల ఒడిలో నిక్షిప్తమైవున్న అపురూప ఖనిజాలు, ఇతర ప్రకృతి సంపదపైనే ఎవరి దృష్టి అయినా. ఇవాళ మద్దతునిస్తామంటున్న పాశ్చాత్య దేశాలు రేపన్నరోజు అమెరికాతో రాజీపడితే ఉక్రెయిన్‌కు మళ్లీ సమస్యలే. నిన్నటివరకూ మద్దతిచ్చిన అమెరికా స్వరం మార్చడాన్ని చూసైనా యూరప్ దేశాలను నమ్ముకుంటే ఏమవుతుందో జెలెన్‌స్కీ గ్రహించాలి. రష్యాతో శాంతి చర్చలకు వేరే ప్రత్యామ్నాయం లేదు. ఇకపై స్వతంత్రంగా వ్యవహరించగలమన్న అభిప్రాయం కలగజేస్తే, దురాక్రమించిన భూభాగాన్ని వెనక్కివ్వాలని రష్యాను డిమాండ్ చేస్తే జెలెన్‌స్కీకి అన్నివైపులా మద్దతు లభిస్తుంది.

మన వృద్ధి నమూనా స్థిరమైనదేనా?

విశ్లేషణ



బొడ్డు సృజన



హైదరాబాద్ మురికివాడల్లో నివసిస్తున్న కార్మికులతో నా ఇంటర్వ్యూల సందర్భంగా, ఒక సాధారణ విషయం బయటపడింది: అదేమిటంటే వేతనాలు పెరగనందువల్ల రోజువారీ ఖర్చులను తీర్చుకోవడం వారికి కష్టతరం అవుతోంది. జీవన ప్రమాణాలను మెరుగు పరచుకోవడం గురించి ఇక చెప్పనవసరం లేదు. అనధికారిక కార్మికులు అంటే వారు పెద్ద బహుళజాతి సంస్థలు లేదా మధ్యతరహా సంస్థలలో పనిచేసేవారు అయినా సరే... వారి వేతన పెరుగుదల చాలా తక్కువగా ఉంటోంది లేదా అసలు కనిపించడం లేదు. మరోవైపు జీవన వ్యయం పెరుగుతూనే ఉంది. ఆహార ద్రవ్యోల్బణం ఇప్పుడు 8 శాతం మించిపోవడంతో, ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడం కూడా కష్టంగా మారుతోంది.

ఈ పరిస్థితి విస్తృత స్థాయి ఆర్థిక సవాలును ప్రతిబింబిస్తుంది. వేతనాలు పెరగనప్పుడు, వృద్ధి నిలిచిపోతుంది. తక్కువ ఆదాయాలు కుటుంబంలో వినియోగాన్ని పరిమితం చేస్తాయి. ఇది తీవ్ర పరిణామాలను కలగజేస్తుంది. మొదటిది, ఇది ఆరోగ్యం, విద్య, పోషకాహారంపై అవసరమైన ఖర్చును ప్రభావితం చేస్తుంది. తద్వారా నేరుగా శ్రేయస్సుపై ప్రభావం చూపుతుంది. తక్కువ వేతన పెరుగుదల ఉన్న వినియోగదారులు తక్కువ ఖర్చు చేస్తారు, ఇది డిమాండ్ తగ్గడానికి దారితీస్తుంది. రెండవది, వినియోగదారుల వైపు నుంచి పడిపోయిన డిమాండ్, వ్యాపార సంస్థలు పెట్టుబడి పెట్టకుండా నిరుత్సాహపరుస్తుంది. మందగించిన ఆర్థిక కార్యకలాపాల చక్రాన్ని బలోపేతం చేస్తుంది. ఈ స్తబ్ధత ఒక క్లిష్టమైన ప్రశ్నను లేవనెత్తుతుంది. అదేమిటంటే భారతదేశ ప్రస్తుత వృద్ధి నమూనా స్థిరమైనదా, లేదా దానిపై తీవ్రమైన పునరాలోచన అవసరమా?

ప్రత్యామ్నాయం ఏమిటి?

వేతనాల ఆధారంగా సాగే వృద్ధి వ్యూహం సరళమైనదే కానీ, అది శక్తిమంతమైన సూత్రంపై పనిచేస్తుంది. కార్మికులు ఎక్కువ సంపాదించినప్పుడు, వారు ఎక్కువ ఖర్చు చేస్తారు. డిమాండును, ఆర్థిక విస్తరణను నడిపిస్తారు. కార్పొరేట్ లాభాలు చివరికి కార్మికులకు కూడా ప్రయోజనం చేకూరుస్తాయని భావించే 'ట్రికిల్ డౌన్' నమూనాల మాదిరిగా కాకుండా, వేతన ఆధారిత వృద్ధి తక్షణ, విస్తృత ఆర్థిక భాగస్వామ్యాన్ని నిర్ధారిస్తుంది.

భారతదేశ ఆర్థిక పథం ఒక వైరుధ్యాన్ని ప్రదర్శిస్తోంది. ఒకవైపు అధిక జీడీపీ వృద్ధి, మరోవైపు స్తబ్ధుగా ఉన్న నిజ వేతనాలు తీవ్రమైన ఆదాయ అసమానతకు దారితీస్తున్నాయి. ఇది ముఖ్యంగా వస్త్రాలు, ఎలక్ట్రానిక్స్, నిర్మాణం వంటి పరిశ్రమలలో స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడ ఉత్పాదకత పెరిగింది, అయినప్పటికీ వేతనాలు స్తబ్ధుగా ఉన్నాయి. బలమైన వేతన వృద్ధి లేకపోతే, దేశీయ డిమాండ్ బలహీనంగా ఉంటుంది. ఇది దీర్ఘకాలిక ఆర్థిక పురోగతిని అడ్డుకుంటుంది.

ఈ వలయాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వ రంగ జోక్యమే కీలకమైన మార్గం. ఇటీవలి ఆర్థిక విధానాలు ప్రైవేట్ వ్యాపార సంస్థలకు, వ్యక్తులకు క్రెడిట్ లీడ్ (రుణ ప్రాధాన్యతా) వ్యూహం రూపంలో మద్దతు ఇవ్వడానికి ప్రాధాన్యమిస్తున్నాయి. దీంట్లో రైతులు, వ్యాపారస్తులు మొదలైన వివిధ రంగాలవారికి క్రెడిట్ కార్డుల రూపంలో సులభమైన రుణ కల్పన చేయడం జరుగుతోంది. కానీ డిమాండ్‌ను తక్షణమే పెంచడానికి ఏకైక ప్రత్యామ్నాయం ప్రభుత్వరంగ పెట్టుబడే. వేతన వృద్ధి కంటే ఖర్చు తగ్గింపునకు, ముఖ్యంగా చౌక శ్రమకు ప్రైవేట్ సంస్థలు ప్రాధాన్యమిస్తాయన్నది తెలిసిందే. దీనికి బదులుగా మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, ఉపాధి కార్యక్రమాలలో ప్రభుత్వాలు పెట్టే పెట్టుబడులు నేరుగా ఆదాయాలను పెంచుతాయి; ఇవి ఉద్యోగాలను సృష్టిస్తాయి; దీర్ఘకాలిక ఆర్థిక స్థితిస్థాపకతను పెంచుతాయి.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం జర్మనీ తన పునర్నిర్మాణంలో గానీ లేదా దక్షిణ కొరియా తన అభివృద్ధి నమూనాలోగానీ వేతన ఆధారిత వ్యూహాలను విజయవంతంగా అవలంబించిన దేశాలు. ఇవి వ్యూహాత్మక రంగాలలో ప్రభుత్వ పెట్టుబడిపై ఆధారపడ్డాయి. 2008 ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో కూడా, ఆర్థిక విస్తరణను అనుసరించిన స్వీడన్ వంటి దేశాలు, పొదుపుకు ప్రాధాన్యత ఇచ్చిన వాటి కంటే వేగంగా కోలుకున్నాయి.

భారతదేశం అమలుపర్చిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' కూడా ఒక గొప్ప కేస్ స్టడీని అందిస్తుంది. సామాజిక సంక్షేమ కార్యక్రమం అయినప్పటికీ, ఇది గ్రామీణ గృహాలలో వేతనాలను ప్రవేశపెట్టింది. దానివల్ల ఆర్థిక వ్యవస్థ అంతటా తీవ్ర ప్రభావాలను ప్రేరేపించింది. అధిక గ్రామీణ ఆదాయాలు వృద్ధికి కీలక చోదకాలైన వినియోగదారీ ఉత్పత్తులు, గృహనిర్మాణం, సేవలు వంటివాటికి డిమాండ్‌ను పెంచాయి. ఇలాంటి ఉపాధి కార్యక్రమాలను, ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో విస్తరించడం, బలోపేతం చేయడం కూడా ఇదే విధమైన సానుకూల ప్రభావాన్ని చూపుతుంది.

ముందుకు సాగే మార్గం

వేతన ఆధారిత వృద్ధిని విమర్శించేవారు తరచుగా అధిక వేతనాలు ద్రవ్యోల్బణానికీ, ఆర్థిక ఒత్తిడికీ దారితీయవచ్చని వాదిస్తారు. అయితే, ముఖ్యంగా పెరుగుతున్న ఉత్పాదకతతో పాటు జీతాల పెంపు ఉన్నప్పుడు, మితమైన వేతన పెరుగుదల తప్పనిసరిగా ద్రవ్యోల్బణానికి కారణం కాదు. ఉదాహరణకు, జపాన్‌లో స్తబ్ధతతో కూడిన వేతనాలు ద్రవ్యోల్బణ ప్రమాదాల కంటే ప్రతి ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు దోహదపడ్డాయి. అంతేకాకుండా, ఆర్థిక లోటుపై ఆందోళనలను వేతన ఆధారిత వ్యూహాల దీర్ఘకాలిక ప్రయోజనాలతో పోల్చి చూడాలి. ప్రభుత్వ రంగ వేతన వృద్ధికి నిధులను అధిక రుణాల ద్వారా కాకుండా, ప్రగతిశీల పన్నులు, మెరుగైన ఆదాయ సమీకరణ ద్వారా వ్యూహాత్మకంగా సమకూర్చుకోవచ్చు. మంచి లక్ష్యంతో కూడిన ప్రభుత్వ పెట్టుబడి... ఆర్థిక బాధ్యత, ఆర్థిక విస్తరణ రెండింటికీ ఉపకరిస్తుంది.

వేతన ఆధారిత వృద్ధిని వాస్తవం చేయడానికి, భారతదేశం తన పారిశ్రామిక, కార్మిక విధానాలను పునరాలోచించాలి. కార్మిక రక్షణలను బలోపేతం చేయడం, అర్థవంతమైన కనీస వేతన సంస్కరణలను అమలు చేయడం, సామాజిక భద్రతా కవరేజీని విస్తరించడం ముఖ్యమైన చర్యలు. ప్రభుత్వ రంగ సంస్థలు కూడా న్యాయమైన వేతన ప్రమాణాలను నిర్దేశించాలి, తద్వారా ప్రైవేట్ రంగ యజమానులు కూడా దీనిని అనుసరించేలా చేయాలి.

ప్రస్తుత ప్రభుత్వ ఆర్థిక వ్యూహం ప్రధానంగా క్రెడిట్ విస్తరణ, ప్రైవేట్ ఖర్చులకు ప్రోత్సాహకాల ద్వారా వినియోగాన్ని ప్రేరేపించడం చుట్టూ తిరుగుతోంది. ఇది తాత్కాలికంగా డిమాండ్‌ను పెంచినప్పటికీ, ఆదాయ స్తబ్ధతకు సంబంధించిన ప్రధాన సమస్యను పరిష్కరించదు. దీనికి విరుద్ధంగా, వేతన ఆధారిత వృద్ధి... కార్మికులు స్థిరమైన కొనుగోలు శక్తిని కలిగి ఉండేలా, స్వయం సమృద్ధ ఆర్థిక వ్యవస్థను సృష్టించేలా మరింత స్థిరమైన మార్గాన్ని అందిస్తుంది.

భారతదేశం ప్రపంచ ఆర్థిక శక్తి కేంద్రంగా మారాలని కోరుకుంటున్నప్పుడు, విదేశీ పెట్టుబడులు లేదా కార్పొరేట్ ఆధారిత నమూనాలపై మాత్రమే ఆధారపడటం సరిపోదు. ప్రభుత్వ రంగ చొరవల ద్వారా బలోపేతమైన వేతన ఆధారిత వృద్ధి వ్యూహం, ఆర్థిక విస్తరణను వేగవంతం చేయడమే కాకుండా, దాన్ని సమానంగా, స్థిరంగా ఉండేలా చేస్తుంది. అసమానతలు పెరుగుతున్న ఈ కాలంలో, న్యాయమైన వేతనాలకు, బలమైన ప్రభుత్వ పెట్టుబడులకు ప్రాధాన్యత ఇవ్వడం అనేది కేవలం ఆర్థిక అవసరం మాత్రమే కాదు, నైతిక ఆవశ్యకత కూడా!

వ్యాసకర్త ఆర్థిక శాస్త్ర బోధకురాలు,
ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్

- వేతనాలు పెరగనప్పుడు, వృద్ధి నిలిచిపోతుంది. తక్కువ ఆదాయాలు కుటుంబంలో వినియోగాన్ని పరిమితం చేస్తాయి. ఇది తీవ్ర పరిణామాలను కలగజేస్తుంది.
- వేతనాల ఆధారంగా సాగే వృద్ధి వ్యూహం శక్తిమంతమైనది. కార్మికులు ఎక్కువ సంపాదించినప్పుడు, ఎక్కువ ఖర్చు చేస్తారు. ఆర్థిక విస్తరణను నడిపిస్తారు.
- మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య కార్యక్రమాలలో ప్రభుత్వాలు పెట్టే పెట్టుబడులు నేరుగా ఆదాయాలను పెంచుతాయి; ఉద్యోగాలను సృష్టిస్తాయి.

సోషల్ మీడియా

మేము ఉక్రెయిన్‌తోనే!



ఉక్రెయిన్ మీద రష్యా యుద్ధం 2022 ఫిబ్రవరి 24 నాడు ప్రారంభం కాలేదు. అది దశాబ్దం క్రితం క్రిమియాలో మొదలైంది. అప్పటినుంచి కూడా కెనడా తన వైఖరిలో స్పష్టంగా ఉంది: మేము ఉక్రెయిన్ ప్రజలకు అండగా ఉంటాం.

– జస్టిన్ ట్రూడో, కెనడా ప్రధాని

ఆంగ్లం చదివిద్దాం!



కావాల్సిన విధంగానే, అధికారికంగా అమెరికా జాతీయ భాష ఇంగ్లిష్ అయ్యింది. ఇక మన పిల్లల్ని తప్పకుండా ఆంగ్లం చదవడం, రాయడంలో ప్రవీణుల్ని చేయాలి. యూఎస్ లోని 8వ తరగతి పిల్లల్లో 70 శాతం మంది ధారాళంగా చదవలేరు. ఇది ఆమోదయోగ్యం కాదు.

– వివేక్ రామస్వామి, అమెరికా నాయకుడు

ఉమ్మడి జీవితం



'నో అదర్ లాండ్' (ఆస్కార్ ఉత్తమ డాక్యుమెంటరీ గెలుచుకుంది) తీసిన పాలస్తీనియన్, ఇజ్రాయెలీ దర్శకుల ఉపన్యాసాలు సరళంగా, శక్తిమంతంగా ఉన్నాయి. 'నేను ఎదుర్కొన్న అణచివేతను నా కుమార్తె ఎదుర్కోకూడ'దని పాలస్తీనియన్ చెబుతున్నాడు. 'నా పాలస్తీనా సోదరుడు స్వేచ్ఛగా లేకపోతే నేను సురక్షితంగా ఉండ'నని ఇజ్రాయెలీ అంటున్నాడు.

– జేమ్స్ జె. జోగ్బీ, రచయిత

తృప్తే సంపద



ఒక మనిషి తనకు దేవుడు ఇచ్చినదానితో సంతోషపడితే, అతడు నెమ్మదినీ, తృప్తినీ, మనశ్శాంతినీ అనుభవించగలడు. ఇతరులకు ఉన్నదానికోసం అతడు ఆరాటపడడు. ఆయన ఇచ్చిన దానితో నువ్వు తృప్తి పడితే, నువ్వే అత్యంత ధనికుడివి.

– ముఫ్తీ మెంక్, ఇస్లాం బోధకుడు

వాళ్ల యుద్ధం



గత రెండు యుద్ధాలు ఎందుకు 'ప్రపంచ యుద్ధాలు' అయ్యాయంటే, దానికి కారణం చాలా దేశాలు వాటి వలసలుగా ఉండటమే! లేదంటే అది ఎప్పుడూ యూరప్ యుద్ధమే. ఇప్పుడూ అంతే!

– శమికా రవి, ఆర్థికవేత్త

ఇన్ బాక్స్

డాలర్ సంకెళ్లు


సుంకాల బెదిరింపులతో
ఆయుధాల వ్యాపారంతో
ప్రపంచాధిపతి పోజులో ట్రంప్.
అక్రమ వలసదారుల ముద్రతో
సంకెళ్లతో తిప్పి పంపిన అగ్రరాజ్యం!
డాలర్ శాసనాల ఎదుట
దీనంగా మోకరిల్లిన రూపాయి.
బతుకుదెరువు వేటలో
అడుగడుగునా భయం భయంగా
జీవన్మరణ యాత్రలో –
ప్రవాస జీవులు.
ఉపాధి గ్యారంటీ ఇవ్వలేని –
ఇండియన్ డెమోక్రసీ.
'డాలర్ డ్రీమ్స్'తో కరిగిన
కలల కన్నీటితో
'వికసిత భారత్'కభిషేకం
డాలర్ సామ్రాజ్యానికి రక్షణగా
కార్పొరేట్ ప్రజాస్వామ్యాలు!!

– నిఖిలేశ్వర్ । 91778 81201

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి.
ఈ–మెయిల్:
editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

లోక్‌పాల్ వర్సెస్ న్యాయమూర్తులు

అభిప్రాయం



మంగారి రాజేందర్

ఉన్నత స్థాయిలోని అవినీతిని నిరోధించడానికి 'లోక్‌పాల్'ను ఏర్పాటు చేశారు. సిట్టింగ్ హైకోర్టు న్యాయ మూర్తులపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించే అధికారం తమకు ఉందని లోక్‌పాల్ అభిప్రాయపడింది. దీంతో లోక్‌పాల్ అధికారాల పరిధి, న్యాయ మూర్తులకు లభించే రక్షణల గురించిన ప్రశ్నలు చర్చనీయాంశాలయినాయి. అంతేకాదు, న్యాయవ్యవస్థ స్వతంత్రత మీద నీలినీడలు ఏర్పడినాయి.

2025 ఫిబ్రవరి 20న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, సూర్యకాంత్, ఏఎస్ ఓకాలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం లోక్‌పాల్ జారీ చేసిన ఎంక్వైరీ ఉత్తర్వుల మీద చర్చించడానికి ప్రత్యేకంగా సమావేశమయ్యింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఏఎం ఖన్విల్కర్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల లోక్‌పాల్ బెంచ్... 'హైకోర్టు న్యాయమూర్తులు లోక్‌పాల్, లోకాయుక్త చట్టం –2013' పరిధిలోకి వస్తారని అభిప్రాయపడింది. పార్లమెంట్ తయారు చేసిన చట్టం ద్వారా ఏర్పాటైన హైకోర్టులలోని న్యాయమూర్తులు కాబట్టి వారు ఈ చట్టాల పరిధిలోకి వస్తారని లోక్‌పాల్ బెంచ్ అభిప్రాయపడింది.

'ఇది చాలా కలవరపెట్టే విషయం' అని జస్టిస్ గవాయ్ విచారణ సందర్భంగా వ్యాఖ్యానించారు. అంతకు ముందు రోజు ఈ అంశాన్ని సుప్రీంకోర్టు తనకు తానుగా స్వీకరించి విచారణ చేపట్టింది. ప్రజాహితాన్ని దృష్టిలో పెట్టుకొని, ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలు జరుగకుండా ఉండటానికి సుప్రీంకోర్టు తన అధికారాన్ని వినియోగించుకొని ఈ విషయంలో జోక్యం చేసుకుంది. లోక్‌పాల్ జారీ చేసిన ఉత్తర్వులపై స్టేని మంజూరు చేసింది. అంతేకాదు లోక్‌పాల్ విచారణ చేపట్టిన హైకోర్టు న్యాయమూర్తుల పేర్లు బహిర్గతం చేయకూడదని కూడా ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులపై విచారణ చేపట్టే ముందు లోక్‌పాల్ 1991వ సంవత్సరంలో న్యాయమూర్తి కె. వీరాస్వామి కేసుని కూడా ఉదహరించింది. ఉన్నత న్యాయస్థానంలోని న్యాయమూర్తిని పబ్లిక్ సర్వెంట్స్ నిర్వచనం నుండి మినహాయించలేరు. అందుకని హైకోర్టు న్యాయమూర్తుల మీద తాము విచారణని చేపట్టినామని లోక్‌పాల్ తన ఉత్తర్వులలో పేర్కొంది.

1991వ సంవత్సరంలో 'కె. వీరాస్వామి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ప్రకారం – న్యాయ మూర్తులందరూ 'అవినీతి నిరోధక చట్టం–1988' ప్రకారం పబ్లిక్ సర్వెంట్స్ అని పేర్కొంది. హైకోర్టు న్యాయమూర్తి లేదా ప్రధాన న్యాయమూర్తి లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై ఫిర్యాదు దాఖలైనప్పుడు కేసు నమోదు చేయడానికన్నా ముందు భారత ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించాలని కూడా ఆ తీర్పులో పేర్కొన్నారు.

న్యాయమూర్తులను – అవసరం లేని ప్రాసిక్యూషన్ నుంచి, అనవసర వేధింపుల నుండి రక్షించడానికి రాష్ట్రపతి, భారత ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించాలి. ప్రధాన న్యాయమూర్తి తన ముందు ఉంచిన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని, ఆ విషయంలో సంతృప్తి చెందిన తరువాత సంబంధిత న్యాయమూర్తిపై ప్రాసిక్యూషన్ ప్రారంభించడానికి లేదా ఎఫ్ఐఆర్‌ని విడుదల చేయడానికి రాష్ట్రపతికి తగు సలహాని ఇవ్వాలి. ఈ తీర్పుని ఆధారం చేసుకొని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, లోక్‌పాల్ ఖన్విల్కర్ నేతృత్వంలోని బెంచ్ న్యాయమూర్తులపై వచ్చిన ఫిర్యాదులను భారత ప్రధాన న్యాయమూర్తి పరిశీలనకి పంపింది. 2013వ చట్టంలోని సెక్షన్ 20(4) ప్రకారం ఫిర్యాదును పరిష్కరించడానికి అవసరమైన కాలపరిమితిని దృష్టిలో పెట్టుకొని కేసుని నాలుగు వారాల పాటు వాయిదా వేయాలని ఆదేశించింది.





హైకోర్టు న్యాయమూర్తులు లోక్‌పాల్ అనుకున్నట్టు చట్టబద్ధమైన అధికారులు మాత్రమే కాదని, వాళ్ళు రాజ్యాంగ బద్ధమైన న్యాయమూర్తులని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గవాయ్, జస్టిస్ ఏఎస్ ఓకా విచారణ సందర్భంలో అన్నారు. సుప్రీంకోర్టు వెలిబుచ్చిన ఆందోళనలో భారత సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, న్యాయవాది కపిల్ సిబాల్ కూడా పాలుపంచుకున్నారు. లోక్‌పాల్, లోకాయుక్త చట్టంలోని సెక్షన్ 14 పరిధిలోకి వస్తాయని లోక్‌పాల్ అభిప్రాయపడింది కానీ దాని యోగ్యతలను లోక్‌పాల్ ఇంకా పరిశీలించలేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. అయితే లోక్‌పాల్ అభిప్రాయం తప్పని సుప్రీంకోర్టు గట్టిగా చెప్పింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 214(1)ను లోక్‌పాల్ విస్మరించిందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ అధికరణం ప్రకారం హైకోర్టులను ఏర్పాటు చేస్తారు.

రాజ్యాంగం కొన్ని వ్యవస్థలకు రక్షణలను కల్పించింది. అందులో రాష్ట్రపతి, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, ఎలక్షన్ కమిషనర్లు వస్తారు. వీళ్ళే కాదు హైకోర్టు న్యాయమూర్తులూ వస్తారు. లోక్‌పాల్ అభిప్రాయం న్యాయవ్యవస్థ స్వతంత్రతకు సవాలు విసురుతుంది. న్యాయ వ్యవస్థ స్వతంత్రత మీద నీలినీడలు కమ్ముకుంటాయి. ఈ జోక్యం వల్ల అత్యున్నత న్యాయ వ్యవస్థ బలహీనపడుతుంది. న్యాయ వ్యవస్థలో పరోక్ష జోక్యాలు, ఒత్తిళ్లు పెరిగిపోతాయి. ప్రేరేపిత ఆరోపణల నుంచి రక్షణ లేకుండా పోతుంది. అయితే వారి మీద ఎలాంటి విచారణ లేకపోతే జవాబుదారీతనం లేకుండా పోతుంది. హైకోర్టు న్యాయమూర్తుల మీద వచ్చిన ఆరోపణలను విచారించడానికి, తగు చర్యలు తీసుకోవడానికి సరైన యంత్రాంగం లేదు. దీనివల్ల అవినీతికి స్థానం దొరికేలా ఉంటుంది. సుప్రీంకోర్టు ఈ విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంది. ప్రస్తుతం ఉన్న విధానం మెరుగు పడాల్సిన అవసరం ఉందని దేశ అత్యున్నత న్యాయస్థానం భావించింది.

ఇటీవలి కాలంలో తమ పరిధికి మించి ఉత్తర్వులను, బెయిల్ షరతులను విధిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులను చూస్తున్నాం. అదే విధంగా కేసు విచారణ సందర్భంలో, బయట సమావేశాల్లో రాజ్యాంగ స్ఫూర్తికి భంగం కలిగేలా ప్రవర్తిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకున్న సందర్భాలు లేవు. వారి పరిధి నుంచి కేసుల ఉపసంహరణ లాంటి చర్యలను కూడా సుప్రీంకోర్టు తీసుకోవడం లేదు. న్యాయవ్యవస్థ స్వతంత్రత ఎంత ముఖ్యమో... జవాబు దారీతనం కూడా అంతే ముఖ్యం. లోక్‌పాల్ అభిప్రాయం సరైంది రాకపోవచ్చు. కానీ చాలా అంశాలు సుప్రీం తీర్పు ముందుకు వస్తున్నాయి. సుప్రీం కోర్టు ఏం చేస్తుందో చూడాలి మరి!

వ్యాసకర్త తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ మాజీ డైరెక్టర్, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ సభ్యుడు

సహనం విలువ

బయాజిద్ బిస్తామి ఓ సూఫీ. ఆయనను 'జ్ఞానవాదుల రాజు' అని పిలిచేవారు. ఒకరోజు ఎక్కువసేపు మసీదులో గడిపి ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో ఓ తాగుబోతు ఎదురుపడ్డాడు. అతని చేతిలో ఓ సంగీత వాద్యం ఉంది. నోటికొచ్చినట్టల్లా ఏదో పాడుకుంటూ వస్తున్నాడు. ఆ దారిన వచ్చిపోతున్నవారిని తిడుతున్నాడు. అదే దారిలో బిస్తామీ వెళుతూ అతని స్థితిని చూసి బాధపడ్డారు. అతని దగ్గరకు వెళ్ళి 'ఎందుకిలా ఉన్నావు?' అని జాలిగా అడిగారు. బయటకు వచ్చినప్పుడు ఎలా ఉండాలో నాలుగు మంచి మాటలు చెప్పసాగారు. అయితే తాగుబోతుకి కోపం వచ్చింది. అతను తన చేతిలో ఉన్న సంగీత వాద్యంతో బిస్తామీ తల మీద కొట్టాడు. ఆయన తలకు గాయమైంది. రక్తం కారింది. అంతేకాదు, తాగుబోతు దగ్గరున్న వాద్యం కూడా విరిగింది. ఇంత జరిగినా సూఫీ జ్ఞాని అతనిని ఏమీ అనలేదు. ఆయన ఇంటికి దగ్గర్లోనే ఉంటాడా తాగుబోతు. మరుసటి రోజు ఆయన తీపి పదార్థాలను, కాస్తంత డబ్బు, ఒక ఉత్తరం ఒకరికి ఇచ్చి తాగుబోతు వద్దకు పంపించారు. తాగుబోతు ఆ ఉత్తరం చదివాడు. అందులో ఇలా ఉంది.



'మీ సంగీత వాద్యం ముక్కలైంది. అందుకు కారణం నా తలే. అందుకు నేను ఎంతో బాధపడుతున్నాను. కనుక నేను మీకిస్తున్న డబ్బుతో వాద్యం కొనుక్కోండి. అన్నట్టు మరొక విషయం. మీరు నిన్న రాత్రి నాతో మాట్లాడుతున్నప్పుడు మీ నోటంట అనేక చేదు మాటలు దొర్లాయనిపించింది. కనుక మీకు పంపిన తీపిపదార్థాలు తినండి. లోపల ఉన్న చేదు పోతుంది. అప్పుడు మీ మాటలు తీయగా ఉంటాయి'.

తాగుబోతు ఈ సంఘటన తర్వాత తాగుడు మానేశాడు. బిస్తామీ వద్దకు వెళ్ళి తన తప్పును క్షమించమన్నాడు. ఇంకెప్పుడూ అలా చేయనని హామీ ఇచ్చాడు. 'మీ సహనం, మీ మంచి మాటలు నా కళ్ళు తెరిపించాయ'న్నాడు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.పంచమి రా.8.08 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** అశ్విని ఉ.9.03 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** సా.5.57 నుండి 7.26 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.40 నుండి 9.27 వరకు, తదుపరి రా.10.57 నుండి 11.46 వరకు, **అమృత ఘడియలు:** రా.2.55 నుండి 4.23 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.21, **సూర్యాస్తమయం:** 6.03.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 425 9899

తెలంగాణ ప్రభుత్వం
ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ

NITs: 31/DB/Kosgi & Kodangal/Development Works/2024-25 తేది: 03.03.2025
(02) పనులు - పనుల పేరు: కొడంగల్ మరియు కోస్గి మున్సిపాలిటీల్లో మౌలికసదుపాయాల అభివృద్ధి పనుల ఏర్పాటు. **మొత్తం అంచనా వ్యయం: రూ.590.78 కోట్లు.** బిడ్ దాఖలు ముగింపు తేది: 24.03.2025న సా.4.30 గం.వరకు. వివరాల కొరకు దర్శించండి: https://tender.telangana.gov.in. సంప్రదించు నం.040-23325849, 9154299724
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (PH), వెస్ట్ సర్కిల్, హైదరాబాద్
DIPR RO No.10807-PP/CL/Advt/1/2024-25, Dt: 03.03.2025

తెలంగాణ ప్రభుత్వం
అటవీ శాఖ

Rc No: 1252/2019/S3, **బహిరంగ కలప వేలం ప్రకటన** తేది: 01-03-2025
ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా ఈ క్రింద తెలుపబడిన అటవి జాతుల కలపను ఏటూరునాగారం ప్రభుత్వ కలప డిపో (Govt. Timber Depot) నందు బహిరంగ వేలం నిర్వహించబడును. ఈ క్రింద తెలుపబడిన తేదిలలో Date of Sale & Time : 1) 07-03-2025, 10.00AM, 2) 13-03-2025, 10.00AM, 3) 21-03-2025, 10.00AM, 4)28-03-2025, 10.00AM ఈ క్రింది తెలుపబడిన రకముల కలప. 1) యేగిస 2) నల్లమద్ది 3) బండారు 4) బట్టగనం 5) జిట్రేగి 6) టేకు 7) నారేప, పూర్తి వివరములకు అటవి క్షేత్రాధికారి, ఏటూరునాగారం నార్త్ రేంజ్ గారిని (ఫోన్ నంబర్ 9177720923) నందు సంప్రదించగలరు. నోట్: ఒక వేల సమయం సరిపోకపోతే మరుసటి రోజు కూడా సేల్స్ నిర్వహించబడును.
సం/- (ఎస్.రమేష్) డివిజనల్ అటవీ శాఖ అధికారి, ఏటూరునాగారం వన్యప్రాణి విభాగం, జిల్లా ములుగు,
DIPR RO No.10804-PP/CL/Advt/1/2024-25, Dt.03-03-2025

విద్యుత్, సాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించండి

- కలెక్టర్లకు సీఎస్ శాంతికుమారి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: యాసంగిలో సాగుచేస్తున్న పంటలకు సాగునీరు అందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ఈ ఏడాది యాసంగిలో సాగువిస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో జలాశయాల్లో ఉన్న నీటి నిల్వలను జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్లతో సోమవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వచ్చే 10 రోజులు అత్యంత కీలకమని, విద్యుత్, సాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ
"టూరిజం హౌస్", # 3-5-891, హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన నం.11/EE/SD/TGTDC/2024-25, తేది: 03.03.2025 (3వ పిలుపు)

క్ర. సం.	పని పేరు	అంచనా వ్యయం (రూ.లక్షల్లో)	బిడ్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది
1	2	3	4
2	తెలంగాణ రాష్ట్రం, వికారాబాద్ జిల్లా, "అనంతగిరి వద్ద ఎకో-టూరిజం జోన్" యొక్క అభివృద్ధి, ఆపరేషన్స్, మెయింటెనెన్స్ మరియు మేనేజ్‌మెంట్ కొరకు స్వదేశ్ దర్శన్ 2.0 పథకం క్రింద ఏజెన్సీ ఎంపిక.	3800.60	05.03.2025

అర్హతగల కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై బిడ్లు కోరబడుచున్నవి. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, TGTDC Ltd., హైదరాబాద్
DIPR RO No.10823-PP/CL/Advt/1/2024-25, Dt. 03.03.2025

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
Head Office: 10-152/1, Sri Sai Towers, Bandar Road, Kanuru, Vijayawada - 520007
Lr.No.PDS.3/18/2755/2024-26-B Dated: 03.03.2025

SHORT TENDER NOTICE

TENDER FOR APPOINTMENT OF STAGE I TRANSPORT CONTRACTORS FOR THE TRANSPORTATION OF FOOD GRAINS FROM DESIGNATED BUFFER GODOWNS TO MLS POINTS/OTHER GODOWNS WITHIN OR OUTSIDE THE DISTRICT, FOR PVP MANYAM DISTRICT OF AP, FOR A PERIOD OF TWO YEARS FOR 2024-26 THROUGH NCDEX E MARKETS LTD AUCTION PLATFORM.

Applications are invited from the interested bidders for the appointment of Stage I transport contractors for transportation of food grains from designated buffer godowns to MLS Points/other godowns within or outside the district, for PVP Manyam District of AP, for a period of two years i.e for 2024-26.

All the interested bidders in All Over India may visit **www.apscscl.in & www.neml.in** to view and download tender documents at free of cost from **04.03.2025** onwards.

Interested bidders need to register in portal as vendor i.e., in NeML (NCDEX e Markets limited) platform and **Contact: Tel: 9962055599** and for registration may visit website **www.neml.in**

The interested bidders may visit **www.apscscl.in or www.neml.in** for tender details, application forms and terms & conditions

Last date for online registration and completion of formalities for submitting the online tenders shall be upto **5.00pm on 11.03.2025** in NeML (NCDEX e Markets limited) platform.

Sd/- VC & MANAGING DIRECTOR







ఆ సముద్ర ప్రవాహం... నెమ్మదిస్తోంది!

అంటార్కిటికాలో ప్రమాదకర పరిణామం

- మంచు కరుగుదలే ప్రధాన కారణం
- వాతావరణ సమతుల్యతకు కీలకమైన ఏసీసీ
- ఇంకా నెమ్మదిస్తే ప్రపంచమంతా విపత్తులే
- 'క్లైమేట్ చేంజ్' విపరిణామానికి నిదర్శనం



పర్యావరణ మార్పుల తాలూకు విపరిణామాలు ఊహాతీత వేగంతో ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ధ్రువాల వద్ద మంచు ఎన్నడూ లేనంత వేగంతో కరిగిపోతుండటం కొన్నేళ్లుగా మనమంతా చూస్తున్న భయానక పరిణామమే. ఇది మరో పెను ప్రమాదానికి కూడా దారి తీస్తోందని తాజా అధ్యయనం ఒకటి తేల్చింది. అంటార్కిటికాలో అత్యంత బలమైన సముద్ర ప్రవాహ గతి కొన్నేళ్లుగా క్రమంగా నెమ్మదిస్తూ వస్తోందని వెల్లడించింది. అంటార్కిటికా వద్ద భారీ మంచు ప్రమాదకర వేగంతో కరుగుతుండటమే ఇందుకు కారణమని వివరించింది. ప్రపంచ వాతావరణాన్ని క్రమబద్ధీకరించడంలో ఈ ప్రవాహానిదే అతి కీలకపాత్ర. అంతేగాక మహాసముద్రాల ప్రవాహాల గతి కూడా చాలావరకు ఈ ప్రవాహ గతిమీదే ఆధారపడి ఉంటుంది. ''లక్షలాది ఏళ్లుగా సమతుల్యంగా కొనసాగుతూ వస్తున్న అత్యంత సంక్లిష్టమైన ఈ ప్రవాహం కూడా పర్యావరణ మార్పుల దెబ్బకు గాడి తప్పుతుండటం అత్యంత ఆందోళనకరం. ఇదిలాగే కొనసాగితే మానవాళి ఊహాతీతమైన పర్యావరణ విపత్తులు ఎదుర్కోవాల్సి వస్తుంది'' అని అధ్యయనం హెచ్చరించింది.

ఏసీసీ... పెట్టనికోట!

ప్రపంచ పర్యావరణ సమతుల్యతకు అంటార్కిటికా అత్యంత కీలకమైనది. అంటార్కిటిక్ సర్కంపొలార్ కరెంట్ (ఏసీసీ)గా పిలిచే అక్కడి మహాసముద్ర ప్రవాహం ఈ విషయంలో పెద్దన్న పాత్ర పోషిస్తుంటుంది. ఇది ప్రపంచంలోనే అత్యంత బలమైన సముద్ర ప్రవాహం! పశ్చిమం నుంచి తూర్పుగా అంటార్కిటికా మహాసముద్రం పొడవునా సాగే ఈ ప్రవాహం ప్రపంచ వాతావరణాన్ని, ఇతర సముద్ర ప్రవాహాల గతిని నిత్యం నియంత్రిస్తూ ఉంటుంది. అంతేగాక ప్రధానంగా వేటాడే తత్వముండే ఇతర ప్రాంతాల్లోని సముద్ర జీవరాశులు అంటార్కిటికా జలాల్లోకి ప్రవేశించకుండా ప్రాకృతిక అడ్డుగోడలా కూడా ఏసీసీ నిలుస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే మానవాళి మనుగడకు ఇది పెట్టనికోట వంటిది. గ్లోబల్ వార్మింగ్ తదితరాల దెబ్బకు అంటార్కిటికాలోని అపారమైన మంచు కొన్నేళ్లుగా శరవేగంగా కరుగుతోంది. దాంతో అపార స్వచ్ఛ జలరాశి నిరంతరం సముద్రంలోకి పోటెత్తుతోంది. దాని దెబ్బకు అంటార్కిటికా మహాసముద్రంలో లవణీయత, నీటి సాంద్రత మార్పుచేర్పులకు లోనవుతున్నాయి. ఇదంతా అంతిమంగా ఏసీసీపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దాని ప్రవాహ గతి నానాటికీ నెమ్మదిస్తూ వస్తోంది.

ఇలా చేశారు

ఏసీసీ ప్రవాహ గతిలో మార్పులపై ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ మెల్‌బోర్న్‌కు చెందిన పరిశోధకుల బృందం పరిశోధన చేసింది. అధ్యయనంలో భాగంగా పలు అంశాలపై సైంటిస్టులు లోతుగా దృష్టి పెట్టారు. ఆస్ట్రేలియాలోనే అత్యంత వేగవంతమైన సూపర్ కంప్యూటర్ జీఏడీఐ సాయంతో సముద్ర ప్రవాహాల్లో మార్పులు తదితరాలను కచ్చితంగా లెక్కగట్టారు. హెచ్చు రెజల్యూషన్‌తో కూడిన సముద్ర, యాక్సెస్-ఓఎం2-01 క్లైమేట్ మోడల్ సేవలను కూడా ఇందుకు వాడుకున్నారు. మహాసముద్ర ప్రవాహాలపై మంచు, స్వచ్ఛ జలరాశి ప్రభావం, తద్వారా వేడిని మోసుకుపోయే సామర్థ్యంలో హెచ్చుతగ్గులు తదితరాలను నిశితంగా పరిశీలించారు. అంతిమంగా ఇవన్నీ ఉష్ణోగ్రత, లవణీయత, పవనాల గతి తదితరాల్లో ఎలాంటి మార్పులకు కారణమవుతాయో గమనించారు. మంచు కరిగి సముద్రంలోకి చేరే అపార జలరాశి ఏసీసీ ప్రవాహాన్ని వేగవంతం చేస్తుందన్న గత పరిశోధనల ఫలితాలు సరికావని స్పష్టం చేశారు. అందుకు పూర్తి విరుద్ధంగా ఏసీసీ ప్రవాహ గతి బాగా నెమ్మదిస్తోందని తేల్చారు. తాజా పరిశోధన ఫలితాలను ఎన్విరాన్‌మెంటల్ రీసెర్చ్ లెటర్స్‌లో ప్రచురించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

పెను విపత్తులే...!

ఏసీసీ ఒకరకంగా ప్రపంచ వాతావరణ సమతుల్యతకు ఇంజిన్ వంటిదని అధ్యయన బృంద సభ్యుడైన అసోసియేట్ ప్రొఫెసర్ భిష్మద్గత గయేన్ వివరించారు. ''మహాసముద్రాలన్నింటికీ కన్వేయర్ బెల్ట్ మాదిరిగా ఏసీసీ పని చేస్తుంది. వేడిమి, కార్బన్ డయాక్సైడ్‌తో పాటు సముద్రంలోని జీవరాశుల మనుగడకు అత్యంత కీలకమైన పలు పోషకాలు తదితరాలు పసిఫిక్, అట్లాంటిక్, హిందూ తదితర మహాసముద్రాల మధ్య సజావుగా పంపిణీ అయ్యేలా చూస్తుంది. అది గనక పడకేసిందంటే జరిగే విపరిణామాలు అన్నీ ఇన్నీ కావు'' అని ఆయన స్పష్టం చేశారు. అవేమిటంటే...

- ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు
- పలు ప్రాంతాల్లో అత్యంత వేడిమి, ఆ వెనకే అతి శీతల పరిస్థితులు
- సముద్ర జలాల్లో లవణీయత పరిమాణం నానాటికీ తగ్గిపోవచ్చు
- ఫలితంగా గ్లోబల్ వార్మింగ్ ప్రక్రియ మరింత వేగం పుంజుకోవచ్చు
- ఇతర ప్రాంతాల సముద్ర జలాలకే పరిమితమైన నాచు, కలుపు మొక్కలు, మొలస్కా వంటి జీవులు అంటార్కిటికాలోకి ప్రవేశించవచ్చు. అదే జరిగితే అక్కడి జీవావరణ వ్యవస్థ దెబ్బ తింటుంది. ఇవి అంతిమంగా పెంగ్విన్ల వంటి స్థానిక జీవరాశుల ఆహార వనరులకు కూడా ఎసరు పెట్టవచ్చు.

అతి తెలివి కుర్రాళ్లు!

అన్నీ తమకే తెలుసనుకుంటారు

- మనల్ని పాత తరంగా భావిస్తారు
- యూట్యూబర్ తీరుపై సుప్రీం కన్నెర్ర
- మేమేం చేయగలమో తెలిసినట్టు లేదు
- పశ్చాత్తాపపడుతున్నారనే ఆశిస్తున్నాం
- రణ్‌వీర్, రాణాలపై కోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: దేశమంతటా రచ్చ అయిన 'ఇండియాస్ గాట్ టాలెంట్' యూట్యూబ్ షో వివాదం తాలూకు మంటలు ఇంకా చల్లారడం లేదు. ఆ షోలో అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసి ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా చిక్కుల్లో పడటం తెలిసిందే. మెదడులోని చెత్తనంతా వాంతి రూపంలో బయట పెట్టుకున్నారంటూ సుప్రీంకోర్టు ఆయనకు తీవ్రంగా తలంటింది కూడా. ఈ వ్యవహారంలో రణ్‌వీర్‌తో పాటు సదరు షో హోస్ట్ సమయ్ రైనా కూడా పలు కోర్టు కేసులు ఎదుర్కొంటున్నారు. ఇంతటి రగడకు కారణమైన ఆ వివాదాస్పద ఎపిసోడ్‌పై ఇటీవల కెనడాలో నిర్వహించిన ఒక షోలో సమయ్ వ్యంగ్యాస్త్రాలు విసిరి తాజాగా మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహానికి గురయ్యారు. ''బాగా ఫన్నీగా ఏవేవో చెప్పి నవ్విస్తానని అనుకుంటున్నారేమో! బీర్‌బైసెప్స్ (రణ్‌వీర్ అలహాబాదియా)ను ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి! బహుశా నా టైం బాగా లేనట్టుంది. కానీ ఒక్కటి గుర్తు పెట్టుకోండి. నా పేరే సమయ్'' అని ప్రేక్షకులను ఉద్దేశించి రైనా వ్యాఖ్యలు చేశారు. ''ఈ షో టికెట్లు కొనడం ద్వారా నా కోర్టు ఖర్చులను భరించినందుకు కృతజ్ఞతలు'' అంటూ ముక్తాయించారు. సోమవారం అలహాబాదియా పిటిషన్‌పై విచారణ సందర్భంగా రైనా తాజా వ్యాఖ్యలను సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రత్యేకంగా ప్రస్తావించి మరీ వాటిపై కన్నెర్ర చేసింది. ''ఈ అతి తెలివి కుర్రాళ్లు తమకే అన్నీ తెలుసనుకుంటారు. మనల్ని బహుశా పనికిరాని పాత తరంగా భావిస్తారేమో తెలియదు! వీళ్లలో ఒకరు కెనడాకు వెళ్లి మరీ ఆ పనికిమాలిన ఎపిసోడ్‌ను మరోసారి పనిగట్టుకుని ప్రస్తావించారు. ఈ కోర్టు న్యాయపరిధి ఎంతటిదో, తలచుకుంటే ఎలాంటి చర్యలు తీసుకోగలదో బహుశా వీళ్లకు తెలిసినట్టు లేదు'' అంటూ న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా హెచ్చరించారు. ''కాకపోతే ఎంతైనా వాళ్లు కుర్రాళ్లు. మేం అర్థం చేసుకోగలం. అందుకే అలాంటి చర్యలేవీ తీసుకోదలచలేదు'' అని స్పష్టం చేశారు. చేసిన తప్పులకు వాళ్లు ఇప్పటికైనా పశ్చాత్తాపపడుతున్నారని ఆశిస్తున్నట్టు చెప్పారు.

హక్కులతో పాటే బాధ్యతలు

అలహాబాదియాకు కూడా ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ గట్టిగా చురకలు వేశారు. ''కొందరు గిరాకీ లేని వ్యక్తులు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పేరిట పనికిరాని వ్యాసాలు రాసి వదులుతున్నారని మాకు తెలుసు. వారిని ఎలా హ్యాండిల్ చేయాలో కూడా బాగా తెలుసు. ప్రాథమిక హక్కులు తమ సొత్తని ఎవరైనా భావిస్తే పొరపాటు. మన దేశంలో ఎవరికైనా సరే, బాధ్యతలతో పాటు హక్కులు వర్తిస్తాయి. హక్కులను ఆస్వాదించాలంటే వాటితో పాటుగా రాజ్యాంగం కల్పించిన బాధ్యతలను నిర్వర్తించి తీరాల్సిందే. దీన్ని అర్థం చేసుకోని వారిని ఎలా డీల్ చేయాలో మాకు తెలుసు'' అని హెచ్చరించారు. రణ్‌వీర్ యూట్యూబ్ షోపై విధించిన నిషేధాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం ఎత్తేసింది. ఇకపై నైతిక ప్రమాణాలకు లోబడి పద్ధతిగా వ్యవహరించాలని హెచ్చరించింది. ఈ మేరకు హామీ పత్రం సమర్పించాల్సిందిగా ఆదేశించింది.



నిబంధనలు తప్పనిసరి

సోషల్ మీడియా కట్టడిపై సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ కంటెంట్ ప్లాట్‌ఫాంలు ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి, ఏది పడితే అది జనంపై రుద్దడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా వివాదానికి సంబంధించిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. ఆన్‌లైన్ కంటెంట్‌ను నియంత్రించేందుకు ఒక సమగ్ర వ్యవస్థ తప్పనిసరన్న కేంద్ర ప్రభుత్వం వాదనతో ఏకీభవించింది. అలాగని రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్య్రం, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ వంటి ప్రాథమిక హక్కులను హరించే సెన్సార్‌షిప్ మాదిరిగా ఉండరాదని న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ''వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుంటూ ఆర్టికల్ 19(4) పరిధులకు లోబడి ఉండేలా సోషల్ మీడియా నియంత్రణకు నిబంధనలను సూచించండి. అనంతరం వాటిపై ఇరు వర్గాలతో పాటు ప్రజల నుంచి కూడా సలహాలు, సూచనలు స్వీకరించండి'' అని కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించారు. భారత సమాజ నైతిక ప్రమాణాలకు గొడ్డలిపెట్టు వంటి అశ్లీల, అభ్యంతరకర ఆన్‌లైన్ కంటెంట్ ప్రసారాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందని ఎస్జీ అన్నారు. ''నైతికత విషయంలో మిగతా దేశాలకు, మనకు తేడా ఉంది. అమెరికాలో జాతీయ పతాకాన్ని తగలబెట్టడం ప్రాథమిక హక్కు. మన దగ్గర మాత్రం క్రిమినల్ నేరం'' అని ఉదహరించారు.

సోషల్ ఖాతాల నిషేధంపై సమీక్ష

సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్ల వాదనలు వినకుండానే వారి ఖాతాలను నిషేధించడాన్ని సమీక్షించాలంటూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ గవాయ్ సారథ్యంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం విచారణకు స్వీకరించింది. ప్రభుత్వాలకు ఇందుకు వీలు కల్పిస్తున్న ఐటీ రూల్స్, 2009లోని 16వ నిబంధనను కొట్టేయాలన్న పిటిషనర్ అభ్యర్థనపై కేంద్రం స్పందన కోరింది. వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ అప్లికేషన్లు, సోషల్ మీడియా అకౌంట్లకు నోటీసులివ్వకుండా, వాదనలే వినకుండా బ్లాక్ చేస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది ఇందిరా జైసింగ్ వాదించారు. సోషల్ మీడియా గురించి ధర్మాసనానికి బాగా తెలిసే ఉంటుందని జైసింగ్ అనడంతో జస్టిస్ గవాయ్ సరదాగా స్పందించారు. ''నేనైతే ఎలాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలోనూ లేను. ఎక్స్‌లోనే కాదు, వై, జెడ్ వేటిలోనూ లేను'' అనడంతో నవ్వులు విరిశాయి.

దృష్టి లోపమున్నా... న్యాయ నియామకాలకు అర్హులే

- సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు
- వివక్షాపూరిత నిబంధనల కొట్టివేత

న్యూఢిల్లీ: దృష్టి లోపం ఉన్నంత మాత్రాన జ్యుడీషియల్ సర్వీస్‌లో ఉద్యోగావకాశాలను నిరాకరించడం కూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ ఉద్యోగాలకు వాళ్లు అనర్హులని పేర్కొంటున్న మధ్యప్రదేశ్ జ్యుడీషియల్ సర్వీస్ (ఎంపీజేఎస్) నిబంధనలను కొట్టేసింది. న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం సోమవారం ఈ మేరకు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. దృష్టి లోపమున్న వారికి పలు రాష్ట్రాలు జ్యుడీషియల్ సర్వీస్ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా కల్పించకపోవడం తదితరాలపై దాఖలైన కేసులను ధర్మాసనం విచారించింది. ''వైకల్యం ఆధారంగా వివక్ష చూపరాదన్నది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. దివ్యాంగుల హక్కుల చట్టం, 2016 కూడా అదే చెబుతోంది'' అని పేర్కొంది. ''దృష్టి లోపమున్న అభ్యర్థులకు జ్యుడీషియల్ పోస్టుల్లోనూ సముచిత ప్రాతినిధ్యం దక్కాలి. ఎంపిక ప్రక్రియలో ప్రతి దశలోనూ ఇందుకు అవసరమైన అన్ని చర్యలనూ ప్రభుత్వాలు చేపట్టాలి. వారికి కటాఫ్ మార్కులను విడిగా నిర్ణయించాలి. మెరిట్ లిస్టునూ విడిగానే సిద్ధం చేయాలి. దాని ఆధారంగానే ఎంపిక జరగాలి'' అని ఆదేశించింది. దృష్టి లోపం కేటగిరీలో తగినంత మంది అభ్యర్థులు లేకపోతే కటాఫ్ మార్కులను తగ్గించేందుకు కూడా ధర్మాసనం ఈ సందర్భంగా అనుమతించింది. న్యాయ వ్యవస్థలో ఇప్పటికే చేపట్టిన, ఇకపై చేపట్టబోయే భర్తీ ప్రక్రియలన్నింటికీ ఈ తీర్పును ప్రాతిపదికగా తీసుకోవాలని స్పష్టం చేసింది.

రాజ్యాంగ స్ఫూర్తి అదే

జ్యుడీషియల్ సర్వీసులకు పోటీ పడేందుకు దృష్టి లోపమున్న వాళ్లు పూర్తిగా అర్హులేనని జస్టిస్ మహదేవన్ స్పష్టం చేశారు. ధర్మాసనం తరఫున ఈ మేరకు 122 పేజీల తీర్పు ఆయనే రాశారు. ''ఈ విషయంలో ఎంపీజేఎస్‌లో పొందుపరిచిన నిబంధనలు రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వపు హక్కు తదితరాలకు పూర్తిగా విరుద్ధం. నిజానికి ఇలాంటి విషయాల్లో సముచిత ప్రాతినిధ్య సూత్రాలను పాటించాలి. అంతే తప్ప కాఠిన్యం కూడదు. కఠినమైన కటాఫ్ నిబంధనలు తదితర పరోక్ష అడ్డంకుల ద్వారా దివ్యాంగులను ఉద్యోగావకాశాలకు దూరం చేయకూడదు. పలు అంతర్జాతీయ సూత్రాలు, ఒప్పందాలు కూడా అదే చెబుతున్నాయి'' అన్నారు. ''పౌరులందరినీ కలుపుకుని ముందుకు సాగాలన్న సూత్రమే మన రాజ్యాంగానికి పునాది. రాజ్యాంగపు మౌలిక స్వరూపంలో విడదీయలేని భాగం. సమానత్వం తదితర ప్రాథమిక హక్కులన్నింటికీ మూలాధారం. ప్రాథమిక హక్కుల్లో భాగంగా ఆర్టికల్స్ 14, 15, 16ల్లో దీన్ని విస్పష్టంగా పేర్కొన్నారు'' అని న్యాయమూర్తి గుర్తు చేశారు. ''సముచిత ప్రాతినిధ్యం పౌరుల ప్రాథమిక హక్కే తప్ప విచక్షణాత్మక చర్య కాదు. దివ్యాంగులకు సమానత్వం కూడా అందులో అంతర్భాగమే'' అని సుప్రీంకోర్టు గత తీర్పులను ఉటంకిస్తూ స్పష్టం చేశారు. ''సమాజంలోని బలహీన వర్గాల ప్రయోజనాల పరిరక్షణను 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా ప్రభుత్వాల తప్పనిసరి బాధ్యతగా మార్చుకున్నాం. ఈ నిర్వచనం పరిధిలోకి శారీరక, మానసిక వికలాంగులు కూడా వస్తారు'' అని వివరించారు.

గిర్ అభయారణ్యంలో ప్రధాని

- ఆసియా సింహాలను పరిరక్షిస్తున్న గిరిజనులను పొగిడిన ప్రధాని
- జాతీయ వన్యప్రాణి బోర్డ్ సమావేశంలో పాల్గొన్న మోదీ


ససన్(గుజరాత్): నిత్యం పరిపాలనలో బిజీగా ఉండే ప్రధాని నరేంద్ర మోదీ కొన్ని గంటలపాటు వనంలో కలియతిరిగారు. ఆసియా సింహాలకు ప్రసిద్ధి చెందిన గుజరాత్‌లోని గిర్ అభయారణ్యాన్ని మోదీ సందర్శించారు. ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని పురస్కరించుకుని సొంత రాష్ట్రంలోని జునాగఢ్ జిల్లాలో ఉన్న గిర్ వన్యప్రాణి అభయారణ్యానికి సోమవారం తెల్లవారుజామునే మోదీ వెళ్లారు. ఈ సందర్భంగా సింహాల సఫారీకి వెళ్లారు.

ఫొటోలు తీస్తూ, ఉత్సాహంగా కలియ తిరుగుతూ

ససన్ గ్రామంలోని అటవీశాఖ గెస్ట్‌హౌస్ సింహ్‌సదన్ నుంచి తెల్లవారుజామునే అటవీశాఖకు సంబంధించిన జీప్‌లో అధికారులతో కలిసి మోదీ సఫారీకి బయల్దేరారు. ఆయనకు మార్గమధ్యంలో నెమళ్లు, జింకలు, అరుదైన పక్షులు స్వాగతం పలికాయి. ఇంకాస్త ముందుకెళ్లాక మృగరాజు ఠీవిగా ఆయనకు ఎదురొచ్చింది. సువిశాల వన్యప్రాణి సంరక్షణా కేంద్రంలో ఒకదాని తర్వాత మరొకటి స్వేచ్ఛగా తిరుగుతున్న ఆసియా సింహాలను మోదీ తన కెమెరాలో బంధించారు. మోదీ ప్రయాణించిన వాహనం సింహాల అత్యంత సమీపంగా ముందుకుసాగింది. సింహ గర్జనలు, సింహం కూనల అల్లరిని మోదీ తన కెమెరాలో చిత్రించారు. మోదీ వెంట కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్, ఇతర రాష్ట్ర మంత్రులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు వచ్చారు. మోదీ తన సఫారీ యాత్రా విశేషాలతో దాదాపు మూడున్నర నిమిషాల నిడివి ఉన్న వీడియోను తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్‌చేశారు. ఎప్పటికీ గుర్తుండిపోయే సందర్శన ఇది అని దానికి ఒక ట్యాగ్‌లైన్ ఇచ్చారు.

సమష్టి కృషి ఫలితమిది

సింహాల సంఖ్య పెరగడంపై ఆనందం వ్యక్తంచేస్తూ మోదీ మరో పోస్ట్‌చేశారు. '' ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా ఆసియాటిక్ సింహాలకు చిరునామాగా మారిన గిర్ అభయారణ్యంలో ఉదయాన్నే సఫారీకి వెళ్లా. వెళ్తుంటే గుజరాత్ సీఎంగా మేం ఉమ్మడిగా చేసిన కృషి గుర్తొచ్చింది. ఆసియాటిక్ సింహాల సంతతి వృద్ధి చెందడంలో, వాటి సంరక్షణలో ఇక్కడి స్థానిక గిరిజనులు, మహిళల కృషి ఎంతో ఉంది. గత దశాబ్దకాలంగా చూస్తే సింహాలతోపాటు దేశంలో పులులు, చిరుతలు, ఖడ్గమృగాల సంఖ్య సైతం పెరిగింది. వన్యప్రాణుల సంరక్షణకు మనం ఎంతగా పాటుపడుతున్నామో పెరిగిన వాటి సంఖ్యే చెబుతుంది'' అని మోదీ వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని 9 జిల్లాల పరిధిలోని 53 తాలూకాల్లో దాదాపు 30,000 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో ఆసియాటిక్ సింహాలు నివసిస్తున్నాయి.



'ప్రాజెక్ట్ లయన్' కోసం రూ.2,900 కోట్లు

సింహాల పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా కేంద్రం 'ప్రాజెక్ట్ లయన్' కోసం రూ.2,900 కోట్లకుపైగా నిధులు కేటాయించినట్లు ప్రభుత్వం తెలిపింది. సఫారీ ముగించుకున్నాక ససన్‌లో ఏడవ జాతీయ వన్యప్రాణి బోర్డ్ సమావేశంలో మోదీ పాల్గొన్నారు. ఈ సమావేశంలో చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్, రాష్ట్రాల ప్రతినిధులు, ఎన్జీవోలు, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్లు, రాష్ట్రాల కార్యదర్శులు హాజరయ్యారు. ఈ ఏడాది మేలో ఆసియాటిక్ సింహాల సంఖ్యపై అంచనాలను వెల్లడిస్తామని చెప్పారు. వన్యప్రాణి దినోత్సవం సందర్భంగా జునాగఢ్‌లో నేషనల్ రెఫరల్ సెంటర్-వైల్డ్‌లైఫ్ కేంద్రానికి మోదీ శంకుస్థాపన చేశారు. ఆహారం, ఆవాసం కోసం అడవిని దాటి వన్యప్రాణాలు బయటకు రావడంతో పెరిగిన 'మానవులు- వన్యమృగాల సంఘర్షణ' తగ్గించేందుకు కృషిచేసే తమిళనాడులోని కోయంబత్తూర్‌లో సలీమ్ అలీ సెంటర్ ఫర్ ఆర్నిథాలజీ, నేచరల్ హిస్టరీ కేంద్రంలో ఎక్స్‌లెన్స్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తామని చెప్పారు.

దేశంలో 6,327 రివర్ డాల్ఫిన్లు

భారతీయ నదీ జలాల్లో 6,327 డాల్ఫిన్లు ఉన్నట్లు మోదీ ప్రకటించారు. నదీజలాల్లో డాల్ఫిన్ల సంఖ్యపై దేశంలో తొలిసారిగా 'రివర్ డాల్ఫిన్ల అంచనా నివేదిక'ను మోదీ సోమవారం ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా ఎనిమిది రాష్ట్రాల్లోని 28 నదులను 8,500 కిలోమీటర్ల పొడవునా పరిశీలించి 3,150 పనిగంటలపాటు అధ్యయనం చేసి డాల్ఫిన్ల సంఖ్యపై ఈ నివేదికను రూపొందించారు. రాష్ట్రాలవారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక డాల్ఫిన్లు ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో బిహార్, పశ్చిమబెంగాల్, అస్సాంలు నిలిచాయి. '' డాల్ఫిన్లు అనేవి నదుల్లో జీవవైవిధ్యాన్ని ప్రతిబింబిస్తాయి. స్థానికులు, గ్రామస్తుల భాగస్వామ్యంతోనే డాల్ఫిన్లను పరిరక్షించగలం. తరచూ పాఠశాల విద్యార్థులను డాల్ఫిన్ల ఆవాస ప్రాంతాలకు తీసుకెళ్లడం ద్వారా భావితరాల్లో అవగాహన పెంచొచ్చు'' అని మోదీ వ్యాఖ్యానించారు. గతంతో పోలిస్తే వాటి సంఖ్య పెరిగినా సరే ఇప్పటికే భారతీయ నదీజలాల డాల్ఫిన్ 'అంతరించిపోతున్న జాతుల జాబితా'లో చేరిపోయింది. నదీజలాల కాలుష్యం, వాటి ఆవాసాల విధ్వంసంతో డాల్ఫిన్లు అంతరించిపోతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

బీజేపీతో పొత్తుకు అవకాశం లేదు

బీజేపీతో మైత్రి వార్తలపై ఒమర్ అబ్దుల్లా స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీతో నేషనల్ కాన్ఫరెన్స్‌కు పొత్తు సంబంధాలపై వస్తున్న ఊహాగానాలకు జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా బ్రేక్ వేశారు. బీజేపీతో పొత్తు పెట్టుకునే ఆలోచనలో తమ పార్టీ లేదని ఒమర్ స్పష్టం చేశారు. సోమవారం శ్రీనగర్‌లో మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. ''బీజేపీతో పొత్తుకు ఆస్కారం లేదు. అవసరం కూడా లేదు. నేషనల్ కాన్ఫరెన్స్, బీజేపీల అభిప్రాయాలు సరిపోవట్లేవు. జమ్మూ కశ్మీర్ అభివృద్ధి విషయంలో చూస్తే మా అభిప్రాయాలు బీజేపీ అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి'' అని అన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రతి అంశంపై చర్చిస్తామని వెల్లడించారు. అభివృద్ధి పథకాలపై దృష్టి పెట్టడమే తప్ప రాజకీయ పొత్తుల వైపు వెళ్లకూడదన్నదే తమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి ప్రకటించారు.

ఉక్రెయిన్‌లో శాంతిస్థాపన... ఇక మా సారథ్యంలో: బ్రిటన్

- పార్లమెంటులో స్టార్మర్ ప్రకటన
- ముగింపు సుదూరం: జెలెన్‌స్కీ
- అత్యంత చెత్త మాటలు: ట్రంప్

లండన్/కీవ్/వాషింగ్టన్: అమెరికాకు బదులుగా ఇకపై ప్రపంచ పెద్దన్న పాత్రను పోషించేందుకు బ్రిటన్ సిద్ధమవుతున్నట్టు కన్పిస్తోంది. రష్యాతో ఘర్షణకు తెర దించి ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు ఇక బ్రిటన్ సారథ్యం వహిస్తుందని ఆ దేశ ప్రధాని కియర్ స్టార్మర్ ప్రకటించారు. అందుకోసం అవసరమైతే ఉక్రెయిన్‌కు సైనికంగా, ఆర్థికంగానే గాక అన్నివిధాలా దన్నుగా నిలుస్తామని పునరుద్ఘాటించారు. ''ఈ ప్రయత్నాల్లో ఇతర దేశాలనూ కలుపుకుని సాగుతాం. ఇందుకు అమెరికా చాలా కీలకం'' అని చెప్పారు. ఉక్రెయిన్ విషయమై స్టార్మర్ చొరవ తీసుకుని మరీ ఆదివారం యూరప్ దేశాలతో లండన్‌లో అత్యవసర భేటీ నిర్వహించడం తెలిసిందే. అందులో చర్చించిన అంశాలను సోమవారం ఆయన పార్లమెంటుకు వివరించారు. ఈ విషయంలో స్టార్మర్‌కు విపక్ష కన్జర్వేటివ్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించడం విశేషం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉక్రెయిన్ అధినేత జెలెన్‌స్కీ వాగ్యుద్ధం ఇబ్బందికర పరిణామాలకు దారి తీసిందని స్టార్మర్ అన్నారు. అగ్ర రాజ్యంతో పటిష్టమైన సంబంధాలు బ్రిటన్‌కు చాలా ముఖ్యమని చెప్పారు.

అమెరికా భరించబోదు

రష్యాతో ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు కనుచూపు మేరలో కన్పించడం లేదంటూ జెలెన్‌స్కీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాల మధ్య ఆ దిశగా ఒప్పందం ఇప్పటికైతే సుదూరంలోనే ఉందన్నారు. వీటిపై ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు. ''జెలెన్‌స్కీ చేసిన అత్యంత పనికిమాలిన ప్రకటన బహుశా ఇదే! ఆయనను అమెరికా ఇక ఎంతమాత్రమూ భరించబోదు'' అని స్పష్టం చేశారు. ''జెలెన్‌స్కీకి కావాల్సింది శాంతి కాదని మొదటినుంచీ చెప్తూనే ఉన్నా. అదే నిజమని మరోసారి తేలింది. అలాంటి వ్యక్తికి యూరప్ దేశాల సంఘీభావమా? అవి అసలు ఏమనుకుంటున్నాయి?'' అంటూ మండిపడ్డారు. జెలెన్‌స్కీతో ట్రంప్ వాగ్యుద్ధం యాదృచ్ఛికమేమీ కాదని, పక్కా ప్రణాళిక ప్రకారమే జరిగిందని జర్మనీ కాబోయే చాన్స్‌లర్ ఫ్రెడరిక్ మెర్జ్ అనుమానం వెలిబుచ్చారు.

బీఎస్పీ నుంచి ఆకాశ్ ఆనంద్ బహిష్కరణ

లక్నో: మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నుంచి బహిష్కరిస్తున్నట్లు పార్టీ అధినేత్రి మాయావతి సోమవారం ప్రకటించారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆకాశ్‌ను పార్టీ పదవుల నుంచి తప్పించిన మరుసటి రోజే బహిష్కరణ వేటు వేయడం గమనార్హం. ఆదివారం తాను తీసుకున్న నిర్ణయంపై ఆకాశ్ స్పందన స్వార్థ, అహంకారపూరితంగా ఉందని మాయావతి పేర్కొన్నారు. మామ అశోక్ సిద్ధార్థ్ చెప్పినట్లు నడుచుకుంటున్నారని, పార్టీ ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని చెప్పి ఆకాశ్ ఆనంద్‌ను ఆదివారం పార్టీ బాధ్యతల నుంచి మాయావతి తప్పించారు. ఆకాశ్ పశ్చాత్తాపం వ్యక్తం చేయలేదని, పరిణతి చూపలేదని మాయావతి సోమవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. స్వార్థంతో, అహంకారపూరితంగా స్పందించారని పేర్కొన్నారు. కాన్షీరాం నెలకొల్పిన క్రమశిక్షణను దృష్టిలో పెట్టుకొని ఆకాశ్ ఆనంద్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు మాయావతి ప్రకటించారు. గత ఏడాది కూడా ఆకాశ్‌పై వేటువేసిన మాయావతి తిరిగి అతన్ని పార్టీలోకి తీసుకొని తన వారసుడిగా ప్రకటించిన విషయం తెలిసిందే.

కొత్త జంటలు త్వరగా పిల్లల్ని కనాలి

లేదంటే రాష్ట్రంలో జనాభా తగ్గిపోయి ఎంపీ సీట్లు తగ్గే ప్రమాదముంది: స్టాలిన్

నాగపట్టణం(తమిళనాడు): లోక్‌సభ స్థానాల పునర్విభజన అంశంపై తరచూ పౌరుల వద్ద ప్రస్తావిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే చీఫ్ ఎంకే స్టాలిన్ ఈసారి ఈ అంశాన్ని కొత్త జంటలనుద్దేశిస్తూ పునరుద్ఘాటించారు. సోమవారం రాష్ట్రంలోని నాగపట్టణంలో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో స్టాలిన్ మాట్లాడారు. ''కొత్తగా పెళ్లయిన జంటలు వెంటనే పిల్లలను కనకుండా కొంతకాలం ఆగితే మంచిదని నేను గతంలో చెప్పాను. నాటి సలహా ఇప్పుడు పాటించాల్సిన పనిలేదు. అధిక జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను రాష్ట్రాలకు కేటాయిస్తున్న నేపథ్యంలో తమిళనాడులో నా పాత సూచన పనికిరాదు. ఆనాడు అధిక జనాభాను కట్టడిచేసేందుకు చర్యలు చేపట్టాం. ఇప్పుడు అదే మనకు ప్రతికూలతగా మారింది. అందుకే కొత్తగా నేనిచ్చే సలహా ఏంటంటే కొత్త జంటలు తక్షణం పిల్లల్ని కనండి. వాళ్లకు అందమైన తమిళ పేర్లు పెట్టండి'' అని అక్కడి వధూవరులను చూస్తూ స్టాలిన్ సలహా ఇచ్చారు. తమిళ నానుడి అయిన '16 రకాల సంపదలకు గుర్తు'గా 16 మంది పిల్లల్ని కనండి అని గత ఏడాది అక్టోబర్ 21న స్టాలిన్ వ్యాఖ్యానించారు. తక్కువ జనాభా కారణంగా తమిళనాడు 8 ఎంపీ స్థానాలను కోల్పోకూడదంటే తమిళనాడులో జనాభా పెరగాలని స్టాలిన్ సలహా ఇచ్చారు. '' ఎంపీ నియోజకవర్గాల పునర్విభజన అనేది కేవలం రాజకీయ అంశం కాదు. అది తమిళనాడు ప్రజల హక్కులు, రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశం. బలవంతంగా త్రిభాషా విధానాన్ని తీసుకురావాలని చూస్తున్నారు. అదేవిధంగా నియోజకవర్గాల పునర్విభజన తెచ్చి తమిళనాడులో ఎంపీ స్థానాలకు కోత పెట్టాలని కేంద్రప్రభుత్వం కుట్ర పన్నుతోంది'' అని స్టాలిన్ అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా రేపు చెన్నైలో అఖిలపక్ష భేటీని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



కన్నా.. కన్నవాళ్లంరా..



చిత్రంలో కనిపిస్తున్నామె పేరు రామేశ్వరమ్మ(65). ఈమెది మాడ్గుల మండల కేంద్రం. భర్త బ్రహ్మాచారి 23 ఏళ్ల క్రితం చనిపోయాడు. ఐదుగురు కుమార్తెలు. ఒక కుమారుడు. ఆమెకు ఏకైక ఆధారం భర్త సంపాదించిన ఇల్లు ఒక్కటే. ఎవరికీ తెలియకుండా కుమారుడు ఇంటిని తన పేరున రాయించుకున్నాడు. ఆ తర్వాత తల్లి సహా ఇద్దరు చెల్లెళ్లను ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టాడు. దీంతో న్యాయం చేయాలని కోరుతూ రామేశ్వరమ్మ ఏడాది క్రితం ఇబ్రహీంపట్నం ఆర్డీఓను ఆశ్రయించింది. ఇప్పటికీ న్యాయం దక్కలేదు. తలదాచుకునేందుకు ఇల్లు లేకపోవడంతో వీధుల్లో బతుకీడుస్తోంది.

బతికుండగానే నరకం చూస్తున్న వృద్ధులు

- తల్లిదండ్రులకు ఛీత్కారాలు.. భరించలేని వేధింపులు
- ఆస్తిపాస్తులు లాక్కొని.. ఆగం చేస్తున్న బిడ్డలు
- వయోవృద్ధుల సంక్షేమశాఖ కాల్ సెంటర్‌కు ఫిర్యాదుల వెల్లువ
- అత్యధికం ఆస్తులకు సంబంధించిన కేసులే..



సాక్షి, రంగారెడ్డి జిల్లా: జీవిత చరమాంకంలో అండగా నిలబడాల్సిన కన్న బిడ్డలు.. ఆ తల్లిదండ్రుల పాలిట కర్కోటకులుగా ప్రవర్తిస్తున్నారు. పెన్షన్ డబ్బులు ఇవ్వాలంటూ కొందరు.. ఉన్న ఇళ్లు, భూములు, ఇతర ఆస్తులు రాసి ఇవ్వాలంటూ మరికొందరు వేధిస్తున్నారు. ఇంకొందరు ప్రత్యక్ష దాడులకు పాల్పడటంతోపాటు బలవంతంగా ఇంటి నుంచి బయటకు గెంటేస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో కొంతమంది జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖను ఆశ్రయించి, న్యాయం పొందుతుండగా, మరికొంత మంది ఆత్మాభిమానం చంపుకొని జీవించలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే 2023–24లో 1,105 ఫిర్యాదులు అందగా, వాటిలో 979 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ ఏడాది జనవరి 25 వరకు 107 ఫిర్యాదులు అందగా, 69 పరిష్కారం అయ్యాయి. నిజానికి ప్రొటెక్షన్ ఆఫ్ పేరెంట్స్ అండ్ మెయింటెనెన్స్ 2007 యాక్ట్ ప్రకారం ఫిర్యాదు చేసిన 90 రోజుల్లోనే తుది తీర్పు ఇవ్వాల్సి ఉన్నా.. మెజారిటీ కేసుల్లో రెండు మూడేళ్లైనా విచారణ పూర్తి కావడం లేదు.

కఠినచర్యలు తప్పవు



వనస్థలిపురం సచివాలయనగర్‌కు చెందిన వృద్ధురాలు కె.రత్నమణి ఇటీవల జిల్లా వయోజన వృద్ధుల సంక్షేమశాఖను ఆశ్రయించింది. కొడుకు అమృతరాజ్, కోడలు పద్మ తన ఆస్తులను లాగేసుకుని ఆ తర్వాత తన సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ ఇప్పటికే ఈ అంశంపై విచారణ జరిపి, తుది ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఇలా ఇప్పటికే ఎనిమిది కేసుల్లో తీర్పులు ఇచ్చాం. వృద్ధులు/తల్లిదండ్రులపై ప్రత్యక్ష దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయిస్తాం. బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తాం. ఆర్డీఓతో విచారణ జరిపించి..వారిచ్చే నివేదిక ఆధారంగా తుది ఆదేశాలు జారీ చేస్తున్నాం. ఇప్పటికే మెజారిటీ కేసులను పరిష్కరించాం.

– సంధ్యారాణి, రంగారెడ్డి జిల్లా వయోవృద్ధుల సంక్షేమ విభాగం అధికారి

సత్వర న్యాయం చేయాలి



విచారణ పేరుతో ఏళ్ల తరబడి కేసును సాగదీస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రులను చాలా మంది పిల్లలు భారంగా భావిస్తున్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఆస్పత్రిని ఏర్పాటు చేయాలి. వృద్ధులపై దాడులకు పాల్పడే కొడుకులు, కోడళ్లపై కఠినచర్యలు తీసుకోవాలి. అప్పుడే సమాజంలో వృద్ధులకు రక్షణ పెరుగుతుంది.


– మధుసూదన్‌రావు, అధ్యక్షుడు, తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్


తల్లిదండ్రుల మైండ్‌సెట్ మారాలి

పిల్లలకు స్వేచ్ఛ ఇస్తే ఎక్కడ పాడవుతారో అనే భయం తల్లిదండ్రుల్లో ఉంది. తన తర్వాత తన ఆస్తి తన పిల్లలకే చెందుతుందని చెబుతుంటారు. సొంతకాళ్లపై నిలబడకుండా చేస్తున్నారు. దీంతో వారు తమ తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తి చివరకు తనకే వస్తుందనే భావనలో ఉండిపోతున్నారు. బలవంతంగా ఆస్తులన్నీ తమ పేరుపై రాయించుకొని చివరకు వారిని ఇంటి నుంచి గెంటివేస్తున్నారు. నిజానికి తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తులపై పిల్లలకు హక్కులుండవు. తాత నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తులపైనే పిల్లలకు హక్కులు ఉంటాయి. విదేశీయుల మాదిరిగా ఇండియన్ పేరెంట్ మైండ్‌సెట్ కూడా మారాలి. అప్పుడే ఆస్తి వివాదాలు, గొడవలు తగ్గుతాయి



– విశేష్, సైకాలజిస్ట్





కనికరం లేని కొడుకులు

మలిసంధ్యలో పండుటాకుల రోదన

కలెక్టరేట్ మెట్లెక్కిన మాతృమూర్తులు

సిరిసిల్లటౌన్: మలిసంధ్యలో తల్లిదండ్రులను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన కొడుకులు కనికరం కూడా చూపడం లేదు.పట్టెడన్నం పెట్టడానికి ససేమిరా అంటున్నారు. కొడుకులపై ఇద్దరు అవ్వలు సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వద్దకు వచ్చి తమ గోడు వెళ్లబోసుకున్నారు.

మాది చందుర్తి మండలం ఎన్గల్. నా భర్త మల్లయ్య చాలా రోజుల క్రితం చనిపోయాడు. నాకు ముగ్గురు కొడుకులు. రెండు, మూడో కొడుకులు నన్ను సాదడం లేదు. నెల రోజుల కింద ఇంట్లోంచి వెళ్లగొట్టారు. నన్ను ఇబ్బంది పెడుతున్న ఆ ఇద్దరిపై చర్యలు తీసుకోవాలి.

– గసికంటి నర్సవ్వ





కొడుకులు, కోడళ్లతో మాటలు పడుతున్నా..

నా వయస్సు 63 ఏళ్లు. నేను గుండెజబ్బుతో బాధపడుతున్న. నా భర్త చనిపోగా నన్ను బాగా చూసుకోవాల్సిన ఇద్దరు కొడుకులు కొట్లాటలతో మానసికంగా హింసిస్తున్నారు. పెద్దమనుషులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరిగే ఓపిక నాకు లేదు. నా ఇద్దరి కొడుకులకు కౌన్సెలింగ్ ఇచ్చి, నన్ను మంచిగా చూసుకునేలా కలెక్టర్ దయ తలచాలి.

– జిందం రామవ్వ, సిరిసిల్ల

5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

అయినా ముందే చేరుకోవాలి

- రేపట్నుంచే ఇంటర్ పరీక్షలు.. ప్రతి ప్రశ్నపత్రానికీ యూనిక్ సీరియల్ నంబర్.. హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్... అన్నిచోట్లా సీసీ కెమెరాలు
- హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ రూం: ఇంటర్ బోర్డ్



కృష్ణఆదిత్య

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి జరిగే ఇంటర్ వార్షిక పరీక్షలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్టు ఆ బోర్డు కార్యదర్శి కృష్ణఆదిత్య వెల్లడించారు. ప్రతీ పరీక్ష కేంద్రాన్ని సీసీ కెమెరాల పర్యవేక్షణలోకి తెచ్చామన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులను గరిష్టంగా ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతిస్తామని చెప్పారు. ఈసారి ప్రతీ ప్రశ్నపత్రానికి యూనిక్ సీరియల్ నంబర్ ఇచ్చామని, పేపర్ ఎవరిదో తేలికగా కనిపెట్టొచ్చన్నారు. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు నుంచి పర్యవేక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,532 పరీక్ష కేంద్రాలను సీసీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ వ్యవస్థకు అనుసంధానించామని తెలిపారు. ప్రతీ పరీక్ష కేంద్రంలోనూ సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే ప్రశ్నపత్రాలను తెరిచి, పరీక్ష అయ్యాక సీల్ చేస్తామని చెప్పారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి కలిపి మొత్తం 9,96,971 మంది ఇంటర్ పరీక్షలు రాయబోతున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఇంటర్ పరీక్షల విభాగం ముఖ్య అధికారి జయప్రదాబాయ్, ఇతర అధికారులతో కలిసి కృష్ణఆదిత్య సోమవారం బోర్డు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

విద్యార్థులకు సూచనలు

- విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 8.30 వరకూ చేరుకోవాలి. అంతకు ముందు వచ్చినా అనుమతిస్తారు. 9 గంటల తర్వాత ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతిస్తారు. అయితే ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవడం మంచిది.
- tgbie.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు పొందొచ్చు. దానిపైన క్యూఆర్ కోడ్ ఉంటుంది. దానిని ఓపెన్ చేస్తే పరీక్ష కేంద్రం జీపీఎస్ చూసుకోవచ్చు. దీనిద్వారా ముందే పరీక్ష కేంద్రాన్ని గుర్తించొచ్చు. ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా అనుమతిస్తారు.
- రిస్ట్‌వాచీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ప్రింటెడ్ మెటీరియల్, సెల్‌ఫోన్లు పరీక్ష కేంద్రానికి అనుమతించరు. స్మార్ట్‌వాచీలు వస్తున్న నేపథ్యంలో రిస్ట్‌వాచీలను తొలిసారి నిషేధించారు.
- హాల్‌టికెట్‌పై సమాచారం, మాధ్యమం తప్పుగా ఉంటే అధికారుల దృష్టికి తేవాలి. ప్రైవేట్ కాలేజీలు ఏ కారణంగానూ హాల్‌టికెట్లు నిరాకరించొద్దు. ఒకవేళ నిరాకరిస్తే కఠిన చర్యలు ఉంటాయి.

ఫెయిలవుతానన్న భయంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య



హాసిని(ఫైల్)

జైపూర్: పరీక్షల్లో ఫెయిల్ అవుతానన్న భయంతో ఓ ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం షెట్‌పల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని షెట్‌పల్లి గ్రామానికి చెందిన తుంగపిండి రాజేశంకు కుమారుడు, కూతురు హాసిని (18) ఉన్నారు. భార్య గతంలోనే మృతిచెందింది. కుమారుడికి పెళ్లి కాగా సీసీసీలో నివాసం ఉంటున్నాడు. రాజేశం కూలీ పనులు చేస్తూ కూతురిని చదివిస్తున్నాడు. చెన్నూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో హాసినిని ఇంటర్‌లో చేర్పించాడు. అయితే చదవడం ఇష్టం లేక బాలిక మధ్యలోనే మానేసి ఇంట్లోనే ఉంది. ఆ విద్యాసంవత్సరం వృథా కావడంతో కూతురుని ఒప్పించి మళ్లీ ఈ విద్యాసంవత్సరం మంచిర్యాలలోని ప్రైవేటు కళాశాలలో చేర్పించాడు. ఈ క్రమంలో ఇంటర్ పరీక్షలు సమీపిస్తుండటంతో ఫెయిలవుతాననే భయంతో హాసిని సోమవారం వేకువజామున ఇంట్లోనే ఉరేసుకుంది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై బాలయ్య తెలిపారు.



పచ్చగా వర్ధిల్లింది

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం 50 వేల బస్తాలకు పైగా పసుపు తరలి వచ్చింది. శివరాత్రి, అమావాస్య, ఇతర వరుస సెలవుల అనంతరం ప్రారంభమైన మార్కెట్‌కు పసుపు పంట పోటెత్తింది. నిర్మల్, ఉమ్మడి కరీంనగర్, కామారెడ్డి, ఆదిలాబాద్, మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాల నుంచి రైతులు పసుపును తీసుకొచ్చారు. మార్కెట్‌యార్డు పసుపు మయంగా మారింది.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

దివ్యాంగులకు ఉచిత భోజనం

కలెక్టరేట్‌కు పనుల కోసం వచ్చే వారికి ఏర్పాటు

- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వినూత్న నిర్ణయం
- రేపటి నుంచి కలెక్టరేట్ క్యాంటీన్‌లో అమలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కలెక్టరేట్‌కు వచ్చే దివ్యాంగుల సమస్యలను తెలుసుకుని, పరిష్కరించడమే కాక వారి ఆకలి తీర్చేలా ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. పాలనలో తనకంటూ ప్రత్యేకతను చూపుతున్న ఆయన.. ప్రజా సమస్యల పరిష్కారంలో వినూత్న పంథా అనుసరిస్తున్నారు. ప్రతీ సోమవారం జరిగే ప్రజావాణితోపాటు వివిధ పనుల కోసం జిల్లా నలుమూలల నుంచి దివ్యాంగులు కలెక్టరేట్‌కు వస్తుంటారు. అయితే వీరు ఆకలితో వెళ్లొద్దనే భావనతో కలెక్టరేట్ క్యాంటీన్‌లో ఉచితంగా మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలని కలెక్టర్ నిర్ణయించారు. ఈ పథకం ఈ నెల 5వ తేదీ నుంచి అమల్లోకి రానుంది.



కడుపు నిండా తినేలా..: ఉచిత భోజనం అంటే అన్నం, ఒక కూర కాకుండా.. పూర్తి మెనూతో అమలయ్యేలా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అన్నం, ఆకుకూర పప్పు, రోటిపచ్చడి, రెండు కూరలు, సాంబార్ లేదా రసం, పెరుగుతో దివ్యాంగులకు భోజనాన్ని సమకూరుస్తారు. కలెక్టరేట్‌లోని కార్యాలయాలకు ఇందుకోసం కూపన్లు ఇస్తారు. ఆయా శాఖలకు 40% వైకల్యంతో ఉన్న దివ్యాంగులు వస్తే కూపన్లు అందజేయనున్నారు. ప్రతీరోజు జారీ చేసిన కూపన్ల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి, ఒక్కో భోజనానికి రూ. 80 చొప్పున క్యాంటీన్ నిర్వాహకులకు నెలకోమారు చెల్లిస్తారు. దివ్యాంగులకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నామనే విషయాన్ని కలెక్టరేట్‌లోని ప్రవేశ మార్గాల్లో బోర్డులు ఏర్పాటు చేయించనున్నారు.

'సదరం'నంబర్ ఆధారంగా..



దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ నంబర్ ఆధారంగా కూపన్ జారీ చేస్తారు. ఈ కూపన్‌తో కలెక్టరేట్ క్యాంటీన్‌లో ఉచితంగా భోజనం చేయొచ్చు. ఇందుకోసం క్యాంటీన్ బాధ్యులకు రూ.80 చొప్పున చెల్లిస్తాం. దివ్యాంగుల నుంచి వచ్చిన విజ్ఞప్తితో ఈ నిర్ణయం తీసుకున్నాం. బుధవారం నుంచి ఉచిత భోజన కార్యక్రమం ప్రారంభమవుతుంది.

– ముజమ్మిల్‌ఖాన్, కలెక్టర్, ఖమ్మం

కోతుల బెడదపై చర్యలేవీ?



కౌంటర్ దాఖలు చేయాలని సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కోతుల బెడద నివారణకు ఏం చర్యలు చేపట్టారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కేసు విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. గ్రామాల్లో కోతులు సాగిస్తున్న పంటనష్టం, భౌతిక దాడుల సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి అధ్యక్షుడు ఎం. మల్లన్న హైకోర్టుకు రాసిన లేఖను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్ నేతృత్వంలోని ధర్మాసనం సుమోటోగా విచారణకు స్వీకరించింది. దీనిపై సోమవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరపున అటవీశాఖ జీపీ ఈటూరి పూర్ణచందర్‌రావు వాదనలు వినిపిస్తూ గతంలో ఇదే అంశంపై దాఖలైన పిల్ ఇంకా విచారణ దశలోనే ఉందని.. ఆ పిల్‌లో పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశామని చెప్పారు. దీంతో గత పిల్‌తో సుమోటో పిల్‌ను జత చేయాలని రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

కుతుబ్‌షాహి సమాధుల రక్షణకు ఏం చేశారు?


రాష్ట్ర ప్రభుత్వం, ఆగాఖాన్ ట్రస్టుకు హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్:కుతుబ్‌షాహి సమాధుల రక్షణకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఆగాఖాన్ ట్రస్టును హైకోర్టు ఆదేశించింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది. రూ.100 కోట్లతో కుతుబ్‌షాహి సమాధులను పరిరక్షించేందుకు ముందుకొచ్చిన ఆగాఖాన్ ట్రస్టు.. ఆ మేరకు సరైన చర్యలు తీసుకోవడం లేదంటూ కాంగ్రెస్ నాయకుడు మధుయాష్కీ హైకోర్టుకు లేఖ రాశారు. యునెస్కో గుర్తించిన వారసత్వ నిర్మాణాల రక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. నిధుల వినియోగం, వనరుల దుర్వినియోగంపై దర్యాప్తు ప్రారంభించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలన్నారు. ఈ లేఖను ఏసీజే సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించారు. పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్, న్యాయమూర్తి రేణుకా యారా ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం పురావస్తు శాఖ ముఖ్య కార్యదర్శి, డైరెక్టర్ జనరల్, మున్సిపల్, పట్టణాభివృద్ధి, యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖల ముఖ్య కార్యదర్శులు, జీహెచ్‌ఎంసీ కమిషనర్, కుతుబ్‌షాహి సమాధుల రక్షణ బాధ్యతను చూస్తున్న ఆగాఖాన్ ట్రస్ట్‌కు నోటీసులు జారీ చేసింది.

ఇద్దరు పిల్లల నిబంధనలో జోక్యం చేసుకోలేం

'స్థానిక' ఎన్నికల్లో రూల్‌ను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు విధించిన ఇద్దరు పిల్లల నిబంధనపై జోక్యం చేసుకోలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఆ నిబంధనపై చట్టసభలే విధాన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలున్న అభ్యర్థులు సర్పంచ్/ఎంపీటీసీ/జెడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేయడాన్ని నిషేధించే పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 21



(3)ను ఎత్తేసేలా రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ నల్లగొండ జిల్లాకు చెందిన ఆవుల నాగరాజు హైకోర్టులో పిల్ వేశారు. పలు అభ్యంతరాలతో ఈ పిల్‌కు హైకోర్టు రిజిస్ట్రీ ఎలాంటి నంబర్ కేటాయించలేదు. ఫైలింగ్ నంబర్‌పైనే తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు దృష్ట్యా ఇలాంటి నిబంధనలకు కాలం చెల్లిందన్న పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. అయితే చట్టపరమైన అంశాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని, పార్లమెంట్, అసెంబ్లీలు విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం తెలిపింది. ప్రజాప్రయోజన వ్యాజ్యం పేరిట పిల్ వేయడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందులో ప్రజాప్రయోజనం ఏముందని ప్రశ్నించింది. పిటిషనర్ తీరును తప్పుబడుతూ రూ. 25 వేలు జరిమానా విధించింది. ఆ సొమ్మును లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని ఆదేశించింది.



కొత్తగా 45 ఏటీసీలు!

నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ల (ఏటీసీ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 65 ఏటీసీలున్నాయి. ఇవన్నీ ఇదివరకు పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లుగా కొనసాగినవే. ఐటీఐలను మరింత ఆధునీకరించి, అవసరమైన కోర్సులను ప్రవేశపెడుతూ ప్రభుత్వం ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేసింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఏటీసీలు ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర కార్మిక, ఉపాధిశిక్షణ శాఖను ఆదేశించారు. గతవారం కార్మికశాఖ సమీక్షలో భాగంగా ఏటీసీల నిర్వహణను సమీక్షించిన సీఎం... కొత్త ఏటీసీలపైనా సుదీర్ఘంగా చర్చించారు. మూడు గంటలపాటు సాగిన ఈ సమీక్షలో పలు అంశాలపై అధికారులకు సూచనలు చేశారు.

- సాక్షి, హైదరాబాద్

- గ్రామీణ నియోజకవర్గాల్లో ఏర్పాటుకు కార్మిక, ఉపాధి కల్పనశాఖ కార్యాచరణ
- ఏటీసీలు లేని చోట కొత్తగా ఏర్పాటుకు సీఎం రేవంత్ ఆదేశం
- ఈ మేరకు జిల్లాల నుంచి ప్రతిపాదనలు పంపాలన్న ఉన్నతాధికారులు

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఏటీసీ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ఈ లెక్కన ఏటీసీలు లేని ప్రాంతాలను గుర్తించే పనిలో కార్మిక, ఉపాధిశిక్షణ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం రాష్ట్రంలో వరంగల్ రీజియన్ పరిధిలో 35, హైదరాబాద్ రీజియన్ పరిధిలో 30 ఏటీసీలు ఉన్నాయి. ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండు చొప్పున ఏటీసీలుండగా, 55 నియోజకవర్గాల్లో ఒక్కో ఏటీసీ ఉంది. సీఎం నిర్ణయం ప్రకారం 45 గ్రామీణ నియోజకవర్గాల్లో కొత్తగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో ఆయా జిల్లాల ఉపాధి కల్పన అధికారులకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. కలెక్టర్లతో సంప్రదించి కొత్త ఏటీసీల ఏర్పాటుకు అవసరమైన భూముల లభ్యత, విద్యార్థులకు అనువైన ప్రాంతం, పరిశ్రమలకు అందుబాటులో ఉండే ప్రాంతాన్ని గుర్తిస్తూ ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. మరోవైపు ఏటీసీల్లో ఇన్‌స్ట్రక్టర్లు, ట్రైనర్లకు సంబంధించిన ఖాళీల సమాచారాన్ని కూడా డైరెక్టరేట్ అధికారులు సేకరిస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో రెగ్యులర్ ఎంతమంది, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారి వివరాలు తీసుకుంటున్నారు.

సీతారామ డిజైన్లను సమీక్షించండి

- సీడబ్ల్యూసీకి టీఏసీ ఆదేశం
- ఇప్పటికే డిజైన్లు సమర్పించిన రాష్ట్రం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ (ఎన్డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదిక నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు డిజైన్లపై కేంద్ర జలసంఘంలోని టెక్నికల్ అడ్వైయిజరీ కమిటీ(టీఏసీ) సందేహాలను వ్యక్తం చేసింది. మేడిగడ్డ బరాజ్ కుంగిపోవడానికి డిజైన్ల లోపం కూడా ఒక కారణమని ఎన్డీఎస్‌ఏ తన నివేదికలో స్పష్టం చేయడంతో టీఏసీ అప్రమత్తమైంది. సీతారామ ప్రాజెక్టు డిజైన్లను నెల రోజుల్లోగా సమీక్షించాలని సీడబ్ల్యూసీని ఆదేశించింది. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన గత నెల 11న ఢిల్లీలో జరిగిన టీఏసీ భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన మినిట్స్‌ను తాజాగా సీడబ్ల్యూసీ, రాష్ట్రానికి పంపింది. ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ నుంచి అనుమతులు పొందాలని టీఏసీ సూచించింది. ప్రాజెక్టు కింద ఆయకట్టుకు సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సరఫరాకు ప్రణాళికను సమర్పించాలని రాష్ట్రాన్ని కోరింది. 67.05 టీఎంసీల గోదావరి జలాలను ఎత్తిపోయడం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 1.68 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీరు, లక్షన్నర హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ కోసం ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్మిస్తోంది. టీఏసీ సూచనల మేరకు ప్రభుత్వం ప్రాజెక్టు డిజైన్లను సీడబ్ల్యూసీకి పంపింది.

సాక్షి హైదరాబాద్

మంగళవారం ׀ 4 ׀ మార్చి ׀ 2025




చెత్త వేస్తే..ఇక ఈ-చలాన్
నగరంలో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తే మీకు జరిమానా తప్పదు. ఇకపై చెత్త వేసే వారికి 'ఈ-చలాన్' జారీ చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. -10లో



అరచేతిలో ఆరోగ్యం..
ఇటీవల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం సిటీజనులు స్మార్ట్ ఫోన్‌పై ఆధారపడుతున్నారు. యాప్స్ ద్వారా ఇప్పుడు విభిన్న రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
36.0/22.0
నగరంలో మంగళవారం కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండ వేడిమి పెరుగుతుంది. సాయంత్రం, రాత్రివేళ వాతావరణం చల్లగా ఉంటుంది.



పుట్టిన వెంటనే వినికిడి పరీక్షలు చేయించాలి

- ఆరోగ్యం విలువ తెలిసిన వ్యక్తి వైఎస్సార్
- మంత్రి కొండా సురేఖ



జూబ్లీహిల్స్‌లో హియరింగ్ డే వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ

సాక్షి, సిటీబ్యూరో: అప్పుడే పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా వినికిడి పరీక్ష నిర్వహించాలని పర్యావరణ, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ప్రపంచ హియరింగ్ డే సందర్భంగా జూబ్లీహిల్స్ మా ఈఎన్‌టీ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. మనిషికి అందం, ఐశ్వర్యం ఉన్నా వినికిడి జ్ఞానం లేనపుడు ఆ జీవితం అంధకారంలో ఉన్నట్లు అనిపిస్తుందన్నారు. 'పిల్లలు మనం మాట్లాడినపుడు విని మాటలు నేర్చుకుంటారు. వినలేకపోతే మూగవారిగా మారిపోయే ప్రమాదం ఉంది. ఎదుటి వ్యక్తి చెప్పినపుడు మనకు ఆ మాట వినిపించకపోతే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. చికిత్సలు చేయించుకోవడానికి కొంత మందికి ఆర్థిక స్థోమత సహకరించకపోవచ్చు. అందుకే మూగ, చెవుడు చికిత్సలకు వైఎస్సార్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో రూ.7 లక్షల వరకు అందించింది. తరువాత వచ్చిన ప్రభు త్వం దీన్ని నిలిపివేసింది. మా ప్రభుత్వంలో పునరుద్ధరించడానికి ప్రతిపాదిస్తాం. ఆయన వైద్యుడు కాబట్టే మనిషి ఆరోగ్యం విలువ తెలిసిన వ్యక్తిగా ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చి, అందరికి నాణ్యమైన వైద్యం అందించారు. వైఎస్సార్‌కు రూపాయి డాక్టర్ అనే పేరుందేది' అని మంత్రి గుర్తుచేశారు. ఆసుపత్రులు డబ్బులే కాకుండా పేదలకు కొంత సేవా దృక్పథంతో ఉచితంగా చికిత్సలు అందించా లని కోరారు. మా ఇంట్లోనూ వినికిడి సమస్య వంశపారంపర్యంగా(జెనిటిక్) వస్తుందని తెలిపారు. మా ఈఎన్‌టీ ఆసుపత్రి వైద్యుడు మేఘనాథ్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ సేవ్ ద ఫ్యూచర్ అనే నినాదంతో ఈ ఏడాది హియరింగ్ డే జరుపుకుంటోందన్నారు. కార్యక్రమంలో మా ఈఎన్‌టీ ఆసుపత్రి ఎండీ సునీత జీ కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

10 రోజుల్లో ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్స్

హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

సాక్షి, సిటీబ్యూరో: అన్ని విధాలుగా అర్హత కలిగి ఉండి..సకాలంలో ఫీజులు చెల్లించిన వారికి 10 రోజుల్లో ఎల్ఆర్ఎస్ అనుమతి పత్రాలను (ప్రొసీడింగ్స్)ను అందజేయనున్నట్లు హైదరాబాద్ మెట్రోపాలిటన్ అథారిటీ (హెచ్ఎండీఏ) కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. అక్రమ స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రవేశపెట్టిన ఈ ఎల్ఆర్ఎస్ పథకం అమలులో సందేహాల నివృత్తి కోసం కాల్‌సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. స్థలాల క్రమబద్ధీకరణను పారదర్శకంగా చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ నెల 31వ తేదీ లోపు ఎల్ఆర్ఎస్ ఫీజుల్లో 25 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఎల్ఆర్ఎస్ ఫీజుతో పాటు ప్లాట్‌లలో ఓపెన్ స్పేస్ చార్జీలను (ప్రా-రాటా) కూడా చెల్లించిన వాళ్లకు మాత్రమే ఈ తగ్గింపు వర్తిస్తుందన్నారు. ఎల్ఆర్ఎస్-2020 పథకంలో భాగంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వాళ్లకు మాత్రమే ప్రస్తుతం స్థలాలను క్రమబద్ధీకరించుకొనే సదుపాయం ఉంది. తిరస్కరణకు గురయ్యే దరఖాస్తులపైన చెల్లించిన ఫీజులో 90 శాతం రీఫండ్ చేస్తారు. మిగతా 10 శాతం ప్రాసెసింగ్ చార్జీల కోసం కేటాయిస్తారు. చెరువులు, కుంటలు, తదితర నీటివనరులకు 200 మీటర్ల పరిధిలో ఉన్న ప్లాట్‌లకు మాత్రం రెవెన్యూ, నీటి పారుదల శాఖల అనుమతితోనే ఎల్ఆర్ఎస్‌లు లభిస్తాయి. నిషేధిత భూములు, సరస్సులు, నీటి వనరుల పరిధిలో లేకుండా, అన్ని విధాలుగా అర్హత కలిగిన ప్లాట్లకు ఆటోమేటిక్‌గా ఫీజు నోటీసులు అందుతాయి. సకాలంలో ఫీజులు చెల్లించిన వారికి 10 రోజుల్లో ఎల్ఆర్ఎస్ జారీ ప్రక్రియను పూర్తి చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వనున్నట్లు కమిషనర్ వివరించారు.

సందేహాల నివృత్తి ఇలా..

- ఎల్ఆర్ఎస్‌ల దరఖాస్తులు ఏ దశలో ఉన్నా, ప్రొసీడింగ్ వివరాలు, ఫీజ్ వివరాలు, షార్ట్ ఫాల్స్ తదితర వివరాల కోసం ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.
- అలాగే హెచ్ఎండీఏ కాల్‌సెంటర్: 18005998838 నంబర్‌కు సంప్రదించవచ్చు.



మాదాపూర్‌లో..

మెట్రో స్కైవాక్!

ప్రతి మెట్రో స్టేషన్ వద్ద సురక్షితంగా రోడ్డు దాటేలా పైవంతెనలు

- స్కైవాక్స్‌ను ప్రోత్సహిస్తాం: మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి
- ఆసక్తి చూపే సంస్థలకు అవకాశం ఇస్తామని వెల్లడి




హైటెక్ సిటీలో..

సాక్షి, సిటీబ్యూరో:

మెట్రో స్టేషన్‌ల నుంచి నేరుగా వాణిజ్య భవనాల్లోకి రాకపోకలు సాగించేవిధంగా స్కైవాక్‌ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు హైదరాబాద్ మెట్రో రైలు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం రాయదుర్గం మెట్రోస్టేషన్ నుంచి రహేజా మైండ్‌స్పేస్‌కు వెళ్లేందుకు అనుకూలంగా ఏర్పాటు చేసిన స్కైవాక్ తరహాలోనే అవసరమైన అన్ని మెట్రోస్టేషన్ల వద్ద అలాంటి స్కైవాక్‌లను అందుబాటులోకి తేనున్నారు. అలాగే ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు, వాహన కాలుష్య నియంత్రణకు కూడా ఈ స్కైవాక్‌లు దోహదం చేయనున్నాయి. ఈ మేరకు మెట్రో స్టేషన్ల నుంచి సమీపంలో వాణిజ్య, నివాస భవనాల సముదాయాలకు పైవంతెనల (స్కైవాక్స్) నిర్మాణాన్ని ప్రోత్సహించాలని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్‌లు నిర్ణయించారు. ఈ మేరకు ఇటీవల హెచ్ఎండీఏ కార్యాలయంలో జరిగిన కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) సమావేశంలో ఈ అంశంపైన చర్చించారు. ప్రస్తుతం పంజగుట్ట, హైటెక్ సిటీ, ఎర్రమంజిల్ మెట్రో స్టేషన్ల నుంచి నేరుగా మాల్స్‌లోకి వెళ్లేందుకు స్కైవాక్‌లు ఉన్నాయి. ఎల్అండ్‌టీ స్వయంగా వీటిని ఏర్పాటు చేసింది. అదే విధంగా జేబీఎస్, పెరేడ్ గ్రౌండ్ స్టేషన్‌లకు స్కైవాక్‌లు ఉన్నాయి. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి రహేజా మైండ్ స్పేస్ కాంప్లెక్స్ లోని 11 టవర్లకు స్కైవాక్ ద్వారా రాకపోకలు సాగించవచ్చు. పలు అంతర్జాతీయ సంస్థల్లో పనిచేస్తున్న వందలాది మందికి ఇది ఎంతో సౌకర్యంగా ఉంది.

స్కైవాక్‌ల నిర్మాణానికి స్వాగతం...

ఉప్పల్ మెట్రో స్టేషన్ నుంచి రింగ్‌రోడ్డుకు అన్ని వైపులా రాకపోకలు సాగించేందుకు అనుగుణంగా హెచ్ఎండీఏ నిర్మించిన వలయాకారపు రోటరీ స్కైవాక్ మెట్రో ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతుందని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. ఇలా నగరంలోని వివిధ మెట్రోస్టేషన్ల వద్ద ఉన్న స్కైవాక్స్‌ను దృష్టిలో ఉంచుకొని మెట్రో స్టేషన్ల నుంచి స్కైవాక్‌ల నిర్మాణాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ సంస్థలు, ఐటీ కంపెనీలు, నివాస భవనాలు, వాణిజ్య సముదాయాల నుంచి ఇప్పటికే అనూహ్యమైన స్పందన లభిస్తోందన్నారు. ఈ క్రమంలో బాలానగర్ మెట్రో స్టేషన్ నుంచి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఫీనిక్స్, ల్యాండ్ మార్క్ మాల్ కొత్తగా స్కైవాక్ నిర్మాణం కొనసాగుందన్నారు. అలాగే ఎల్బీనగర్ స్టేషన్ నుంచి సమీపంలో నిర్మాణంలో ఉన్న వాసవీ ఆనంద నిలయం నివాస భవనాల సముదాయానికి రాకపోకలు సాగించేందుకు వాసవి గ్రూప్ స్కైవాక్ నిర్మిస్తుందన్నారు. వాసవి ఆనందనిలయం కాంప్లెక్స్ మొత్తం 25 ఎకరాలలో ఒక్కో టవర్‌లో 33 అంతస్తులతో మొత్తం 12 టవర్లు నిర్మిస్తోందని చెప్పారు. మరోవైపు నగరంలో 69 కిలోమీటర్ల మేర విస్తరించిన మెట్రో కారిడార్‌లలోని 57 స్టేషన్లలో ప్రతి స్టేషన్‌కు రెండు వైపులా రోడ్డుకు ఒక వైపు నుంచి మరో వైపునకు చేరుకునేందుకు మెట్రో వంతెనలు ఉన్నాయని, పాదచారులు వాటిని వినియోగించుకొని సురక్షితంగా రోడ్డు దాటాలని ఎన్వీఎస్ కోరారు.



ఉప్పల్‌లో..

ఇలా సంప్రదించండి..

మరికొన్ని సంస్థలు నాగోల్, ఉప్పల్ స్టేడియం, దుర్గం చెరువు, కూకట్‌పల్లి తదితర మెట్రో స్టేషన్ల నుంచి స్కైవాక్‌లు నిర్మించేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్లు ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ కేవీబీ రెడ్డి తెలిపారు. ప్రైవేట్ సంస్థలు మెట్రో స్టేషన్ల నుంచి స్కైవాక్‌లు నిర్మించదలిస్తే ఎల్‌అండ్‌టీ ప్రతినిధి కేవీ నాగేంద్ర ప్రసాద్‌ను (ఫోన్ నెంబర్ 9900093820) సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

ఎండలు అలా.. కరెంటు ఇలా..!

గ్రేటర్‌లో పెరిగిన ఎండలు | **విద్యుత్ డిమాండ్ పైపైకి..**



సోమవారం మధ్యాహ్నం ఎండతో నిర్మానుష్యంగా మారిన బషీర్‌బాగ్ చౌరస్తా

- షేక్‌పేటలో గరిష్టంగా 36.2 డిగ్రీలు..
- మహేశ్వరంలో 38.2 డిగ్రీలు నమోదు
- రికార్డు స్థాయిలో (70 ఎంయూలు) విద్యుత్ డిమాండ్
- ఇష్టానుసారం ఎల్సీలు తీసుకుంటే..ఇక వేటే

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎండలు భగ్గున మండుతున్నాయి. సోమవారం హైదరాబాద్ జిల్లా షేక్‌పేటలో గరిష్ఠంగా 36.2 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం ఇండస్ట్రియల్ ఏరియాలో అత్యధికంగా 38.2 సెల్సియస్ డిగ్రీలు నమోదైంది. అదేవిధంగా మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లో 38 డిగ్రీలు నమోదు కాగా, వికారాబాద్ జిల్లా మొమిన్‌పేటలో 38.1 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాధారణంగా మధ్యాహ్నం 12 తర్వాత రికార్డయ్యే ఎండలు.. ప్రస్తుతం ఉదయం 10 గంటలకే నమోదవుతుండటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. పగటి ఉష్ణోగ్రతలకు ఉక్కపోత తోడవడంతో ఇంట్లోని ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు, రిఫ్రిజిరేటర్ల వినియోగం భారీగా పెరిగింది. గతంతో పోలిస్తే ప్రస్తుతం గృహ విద్యుత్ వినియోగం 25 శాతం అధికంగా నమోదవుతున్నట్లు డిస్కం ఇప్పటికే స్పష్టం చే సింది. సోమవారం అత్యధికంగా 70 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం. నేటి నుంచి మరో నాలుగు రోజుల పాటు పగటి ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో విద్యుత్ డిమాండ్ కూడా అదేస్థాయిలో నమోదయ్యే అవకాశం లేకపోలేదు. మార్చి చివరి నాటికి వంద ఎంయూలకు దాటే అవకాశం ఉన్నట్లు డిస్కం ఇంజనీర్లు అంచనా వేశారు. ఆ మేరకు ముందస్తు ఏర్పాట్లు కూడా చేశారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త

డాక్టర్ వెంకటి, డీఎంహెచ్ఓ, హైదరాబాద్

ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటి తెలిపారు. 'సాధారణంగా మనిషి శరీరం 37 డిగ్రీల ఉష్ణోగ్రతలను మాత్రమే తట్టుకుంటుంది. ఆపై నమోదయ్యే ఉష్ణోగ్రతలను తట్టుకోలేదు. ఎండకు చర్మం నల్లగా కమిలిపోవడంతో పాటు డిహైడ్రేషన్‌కు లోనవుతుంటారు. మూత్రంలో మంట, కిడ్నీల్లో రాళ్లు ఏర్పడుతుంటాయి. కాబట్టి ఎండల నుంచి కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఇంట్లో వండిన ఆహారమే తీసుకోవాలి. నీళ్లు బాగా తాగాలి' అని ఆయన పేర్కొన్నారు.

గ్రేటర్ జిల్లాల్లో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు ఇలా.. (సెల్సియస్ డిగ్రీలు)

జిల్లా	2024 మార్చి 3	2025 మార్చి 3
హైదరాబాద్	38.06	35.07
రంగారెడ్డి	37.01	36.02
మేడ్చల్	38.03	35.09
వికారాబాద్	38.02	36.04

గత వారం గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ ఇలా...

తేదీ	సమయం	మెగావాట్లు
ఫిబ్రవరి 26	09.23	3306
27	18.55	3272
28	18.56	3398
మార్చి 01	19.02	3254
02	19.14	3017
03	18.00	3369



ఇష్టానుసారం ఎల్సీలు ఇక కుదరదు

ముషారఫ్ ఫారూఖీ, సీఎండీ, ఎస్పీడీసీఎల్

గతంతో పోలిస్తే గృహ విద్యుత్ వినియోగం ప్రస్తుతం రెట్టింపైంది. ప్రతి ఇంట్లోనూ ఏసీ, కూలర్, రిఫ్రిజిరేటర్‌లు సర్వసాధారణమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నంతో పోలిస్తే.. సాయంత్రం వేళ విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. ఇలాంటి సమయంలో అనివార్యమైతే తప్ప...ఎల్సీ(లోడ్ రిలీఫ్)లు తీసుకోవద్దని సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశారు. రేపటి నుంచి 25 వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా చూడాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఇంజనీర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

డెడ్‌లైన్ సండే!

ఆలోపు అక్రమ హోర్డింగ్స్ తొలగించండి



సమావేశంలో రంగనాథ్ తదితరులు

- నిర్వాహకులకు స్పష్టం చేసిన హైడ్రా కమిషనర్
- ఏజెన్సీల ప్రతినిధులతో ప్రధాన కార్యాలయంలో భేటీ

సాక్షి, సిటీబ్యూరో: నగర వ్యాప్తంగా అనుమతులు లేకుండా, అనుమతి గడువు ముగిసినా కొనసాగుతున్న అక్రమ హోర్డింగ్స్‌ను ఆదివారం లోపు తొలగించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. అలా కాకుంటే తాము వాటిపై చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. సోమవారం తన కార్యాలయంలో యాడ్ ఏజెన్సీల ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. దాదాపు మూడు నెలల క్రితమే తొలగింపు ప్రక్రియ చేపట్టామని, అయితే యాడ్ ఏజెన్సీల విజ్ఞప్తి మేరకు కొంత సమయం ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. రెండు నెలలుగా పలుమార్లు మున్సిపల్ కమిషనర్లు, యాడ్ ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఇదే విషయాన్ని స్పష్టం చేసినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ హోర్డింగ్స్‌పై ప్రభుత్వం విధివిధానాలు రూపొందించాల్సి ఉండటంతో రెన్యూవల్స్ ఆగిపోయాయని పలువురు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కారణంగానే 2022-23 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన రుసుములు కూడా కట్టలేకపోయామని రంగనాథ్‌కు తెలిపారు. 2023 మార్చి 31 వరకూ చెల్లింపులు చేసిన హోర్డింగుల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకూ తొలగించమని హామీ ఇచ్చిన రంగనాథ్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని వారికి చెప్పారు. ఈ హోర్డింగ్స్ ద్వారా ప్రభుత్వానికి రూ.వందల కోట్ల ఆదాయం రావాల్సి ఉన్నా ప్రస్తుతం కేవలం రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్లు వరకే వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అక్రమ హోర్డింగుల తొలగింపు విషయంలో హైడ్రా ఎవరికీ, ఎలాంటి మినహాయింపులకు ఇవ్వదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదాయం పెంపు లక్ష్యంగా తాము పని చేస్తున్నామని రంగనాథ్ పునరుద్ఘాటించారు. హోర్డింగుల ఏర్పాటుతో పాటు ప్రకటనల రుసుం చెల్లింపు విషయంలో ప్రభుత్వం కొత్త విధానం తీసుకువస్తే ఆ ప్రకారం నడచుకోడానికి తామంతా సిద్ధంగా ఉన్నామని యాడ్ ఏజెన్సీ ప్రతినిధులు హైడ్రా కమిషనర్‌కు తెలిపారు. బాలాపూర్‌లో అనుమతి లేని హోర్డింగ్స్‌ను తొలగిస్తున్నప్పుడు హైడ్రాపై ఆరోపణలు చేసిన అఖిల యాడ్ ఏజెన్సీ యజమాని తమను కూడా తప్పుదోవ పట్టించారని పలువురు రంగనాథ్‌కు తెలిపారు. అఖిల యాడ్ ఏజెన్సీ పేరిట మీర్‌పేటలో ఉన్న అనుమతులను చూపించిన యజమాని బాలాపూర్ చౌరస్తాలో అక్రమంగా హోర్డింగులను ఏర్పాటు చేసినట్లు హైడ్రా ఆధారాలను ఏజెన్సీల ప్రతినిధులకు చూపించింది.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

రేపటి నుంచి ప్రారంభం

- గ్రేటర్‌లో 579 పరీక్ష కేంద్రాలు
- హాజరవనున్న 4,64,445 మంది విద్యార్థులు
- సీసీ కెమెరా నిఘాలో ప్రశ్నపత్రాల ఓపెన్, జవాబు పత్రాల సీల్
- క్యూఆర్ కోడ్ ద్వారా కేంద్రాల లొకేషన్ వెసులుబాటు
- సందేహాల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 040-29700934

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టింది. బుధవారం నుంచి ప్రథమ సంవత్సరం, గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఆరంభం కానున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలో దాదాపు 4,46,445 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందుకోసం సుమారు 579 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

- ఎండలు తీవ్రతరమవుతున్న నేపథ్యంలో కేంద్రాల వద్ద ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. - తాగునీటి సదుపాయంతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు. - విద్యార్థులు అస్వస్థతకు గురైతే సత్వర సేవలందించేందుకు వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లను నియమించారు.
- విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

25 మంది చొప్పున సీటింగ్

ఇంటర్ పరీక్ష కేంద్రంలో ఒక్కో గదిలో 25 మంది చొప్పున కూర్చునే విధంగా సీటింగ్ ఏర్పాటు చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇన్విజిలేటర్లను నియమించారు. మాస్ కాపీయింగ్ అరికట్టేందుకు తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులు, సిట్టింగ్, ఫ్లయింగ్, స్క్వాడ్ బృందాలను నియమించారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో సిట్టింగ్ స్క్వాడ్ 10, ఫ్లయింగ్ స్క్వాడ్ 4 బృందాలు, రంగారెడ్డి జిల్లాలో సిట్టింగ్ స్క్వాడ్ 5, ఫ్లయింగ్ స్క్వాడ్ 4, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 5 సిట్టింగ్, 6 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను రంగంలో దింపనున్నారు. వీరితో పాటు జిల్లాకు డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ (డీఈసీ)లో ఐదుగురు సభ్యులు, ఇద్దరు హైపవర్ కమిటీ సభ్యుల చొప్పున నియమించారు. పరీక్ష కేంద్రానికి పోలీస్ స్టేషన్ నుంచి తీసుకొచ్చే ప్రశ్నపత్రాల సీల్ తీయడం మొదలుకుని, విద్యార్థులు రాసిన సమాధాన పత్రాలను సీల్ వరకు సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణలోనే ప్రక్రియను పూర్తి చేయనున్నారు. చీఫ్ సూపరింటెండెంట్ తప్ప మిగతా వారికి మొబైల్ ఫోన్ అనుమతి ఉండదు. పరీక్ష కేంద్రాల్లోకి సంబంధిత అధికారి జారీ చేసిన ఐడీ కార్డులు ఉంటేనే తప్ప ఇతరులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరు. సందేహాల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ 040-29700934 సంప్రదించవచ్చు.

పరీక్ష కేంద్రం చిరునామా కోసం

విద్యార్థులు పరీక్ష కేంద్రం చిరునామా ఈజీగా తెలుసుకునే విధంగా ఎగ్జామ్ సెంటర్ లోకేటర్ యాప్‌ను అందుబాటులో తెచ్చారు. ఆండ్రాయిడ్ ఫోన్లో ప్లే స్టోర్‌కు వెళ్లి ఐపీఈ ఎగ్జామ్ సెంటర్ లొకేటర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నో యువర్ ఎగ్జామ్ సెంటర్ ఆప్షన్‌లో కాలేజీ కోడ్/విద్యార్థి పేరు టైప్ చేస్తే సెంటర్ అడ్రస్ సులువుగా తెలుస్తుందని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా హాల్ టికెట్‌పై గల క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే అడ్రస్ వెంటనే వస్తుందన్నారు.



ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు ఇలా..

జిల్లా	పరీక్ష కేంద్రాలు	ప్రథమ సంవత్సరం	ద్వితీయ సంవత్సరం
హైదరాబాద్	244	85,753	93,465
రంగారెడ్డి జిల్లా	185	80,409	78,395
మేడ్చల్-మల్కాజిగిరి	150	64,107	62,316

పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలి

విద్యార్థులు హడావుడిగా కాకుండా..సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ప్రయత్నించాలి. పరీక్ష కేంద్రాల అడ్రస్ తెలుసుకుని ఒకరోజు ముందే సందర్శిస్తే బాగుంటుంది. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేశాం. తాగునీరు, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాం.

– ఒడ్డెన్న, జిల్లా ఇంటర్ బోర్డు అధికారి, హైదరాబాద్

పాత లేఔట్లలోనే కబ్జాల జోరు

హైడ్రా ప్రజావాణిలో 49 ఫిర్యాదులు



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పాత లేఔట్లలోనే కబ్జాలు ఎక్కువగా జరుగుతున్నాయి. తమ ప్లాట్లతో పాటు ప్రజావసరాలకు ఉద్దేశించిన పార్కులు, రహదారులను కబ్జా చేసేస్తున్నారంటూ ఆయా లేఔట్లకు చెందిన పలువురు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి (హైడ్రా) ఫిర్యాదు చేస్తున్నారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 49 ఫిర్యాదులు రాగా... అత్యధికం వీటికి సంబంధించినవే ఉన్నాయి. 1980–90 దశకాల్లో వేసిన లేఔట్లను మాయం చేసి, ఆ స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటున్న కబ్జారాయుళ్లు మళ్లీ విక్రయాలకు యత్నిస్తున్నారంటూ బాధితులు రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. భూములకు ధరలు అమాంతం పెరగడంతో గతంలో తమకు అమ్మిన వాళ్లే కబ్జాలకు పాల్పడుతున్నారని వాపోయారు. పంచాయతీ లేఔట్లను వ్యవసాయ భూములుగా మార్చేసి సాగు చేసుకుంటున్నారనీ హైడ్రాకు కొన్ని ఫిర్యాదులు అందాయి. వీటిపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ ఫిర్యాదుదారుల సమక్షంలోనే గూగుల్ మ్యాప్‌లు, సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లను పరిశీలించారు. వాటిలో లభించిన సమాచారం ఆధారంగా సమగ్ర విచారణకు అధికారులను ఆదేశించారు. ప్రజా అవసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడుతామని కమిషనర్ హామీ ఇవ్వడంతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

- రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామంలో 1980 దశకంలో 2684 ప్లాట్లతో చాణక్యపురి లేఔట్ వేశారు. గత ఏడాది అందులోని 30 ఎకరాలు కబ్జాకు గురైనట్లు పలువురు ఫిర్యాదు చేశారు. అందులోని పార్కులు, రహదారులు కూడా కనుమరుగయ్యాయని ఆరోపించారు.
- రంగారెడ్డి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నం.58, 59లో ఉన్న ఎస్ఎంఆర్–దివ్యానగర్ లేఔట్‌లో తాము ప్లాట్లు కొన్నామని, ఇప్పుడవి కనిపించట్లేదని యజమానులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఇలా 66 ప్లాట్లు గల్లంతయ్యాయని, ఇప్పుడు అక్కడ వ్యవసాయం చేస్తున్నారని వాపోయారు.
- గచ్చిబౌలిలోని గోపన్నపల్లిలోని టీఎన్‌జీవో కాలనీలో ఉద్యోగులకు కేటాయించిన భూములు ఉన్నాయి. వీటిలో ఎనిమిది ఎకరాలను కొందరు కబ్జా చేసి ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేశారు. దీనిపై టీఎన్‌జీవో కాలనీ సంక్షేమ సంఘం (గచ్చిబౌలి) ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు.
- మేడ్చల్ జిల్లా చెంగిచర్ల గ్రామంలోని సర్వే నం.7, 10లో వేసిన శ్రీపురం కాలనీలో పార్కులు, రహదారులు కబ్జాకు గురయ్యాయని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.

కార్మికుల హక్కుల సాధనకు రాజీలేని పోరాటం



సాక్షి, సిటీబ్యూరో: కార్మికుల హక్కుల సాధనకు రాజీలేని పోరాటం చేయాలని వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు రాజిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సంజీవరెడ్డి నగర్‌లోని యూనియన్ ఆఫీస్‌లో ప్రధాన కార్యదర్శి శేఖర్ ఆధ్వర్యంలో రాజిరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, అందుకు కలిసి కట్టుగా మందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సతీష్ కుమార్,జనరల్ సెక్రెటరీ రాఘవేంద్ర రాజు పాల్గొన్నారు.

చెత్త వేస్తే .. ఇక ఈ–చలాన్

యూపీఐ ద్వారానే పెనాల్టీల చెల్లింపులు
- యాప్ రూపొందించిన జీహెచ్ఎంసీ
- త్వరలో అందుబాటులోకి ..



సాక్షి,సిటీబ్యూరో: ఒక్కో విభాగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్న జీహెచ్ఎంసీ.. డంపర్‌బిన్లలో చెత్త దాదాపు 75 శాతం నిండగానే అలర్ట్ చేసేలా ఆధునిక డంపర్‌బిన్లను అందుబాటులోకి తెస్తోంది. చెత్త తరలింపునకే కాకుండా ఎక్కడ పడితే అక్కడ చెత్త, నిర్మాణ.. కూల్చివేతల వ్యర్థాలు, ఇతరత్రా వ్యర్థాలు వేసే వారికి విధించే పెనాల్టీలకు ఇకపై ఈ–చలాన్‌లను జారీ చేయనుంది. అంతేకాదు, చెల్లింపులు సైతం మాన్యువల్‌గా కాకుండా యూపీఐ చెల్లింపులే స్వీకరించనుంది. ఇందుకు గాను జీహెచ్ఎంసీ త్వరలో ప్రత్యేక యాప్‌ను వినియోగంలోకి తేనుంది. ప్రముఖ ఐటీ సంస్థ టీసీఎస్ ద్వారా ఈ యాప్‌ను రూపొందించారు.

నిధులు పక్కదారి పట్టకుండా..

స్వచ్ఛ కార్యక్రమాల అమల్లో భాగంగా జీహెచ్ఎంసీ బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేసేవారితో పాటు నిర్మాణ, కూల్చివేతల వ్యర్థాలు వేసే వారికి పెనాల్టీలు విధిస్తోంది. పెనాల్టీలను చలాన్ బుక్‌ల ద్వారా క్షేత్రస్థాయిలోని అధికారులు జారీ చేస్తున్నారు. అధికారులు తమ ఇష్టానుసారం పెనాల్టీలు విధించడం, ఎక్కువ పెనాల్టీ వసూలు చేసి జీహెచ్ఎంసీ పుస్తకాల్లో మాత్రం తక్కువ మొత్తాలు రాస్తూ తమ జేబులు నింపుకునే పనులకు పాల్పడుతున్నారు. దీంతో ప్రజలు చెల్లిస్తున్న పెనాల్టీల సొమ్ము మొత్తం జీహెచ్ఎంసీ ఖజానాకు చేరడం లేదు. చలాన్ బుక్‌ల ద్వారా జారీ చేసిన వాటిలో ఎన్నింటికి పెనాల్టీలు వసూలయ్యాయో వంటి సమాచారం సైతం ఉండటం లేదు. ఈ నేపథ్యంలో వాహన నిబంధనలు ఉల్లంఘించే వారికి ట్రాఫిక్ పోలీసుల ఈ–చలాన్ ల మాదిరిగా వ్యర్థాలు వేసేవారికి క్షేత్రస్థాయిలోని ఏఎంఓహెచ్‌లు, డీఈఈలు, ఏసీపీలు, తదితర అధికారులు ఈ–చలాన్‌లు జారీ చేయనున్నారు. రెండు మూడు రోజుల్లో యాప్‌పై సంబంధిత అధికారులకు శిక్షణ ఇచ్చిన తర్వాత యాప్‌ను వినియోగంలోకి తెస్తామని జీహెచ్ఎంసీ కమిషనర్ సీఎస్ రఘుప్రసాద్(పారిశుధ్యం) తెలిపారు. ఏ ఉల్లంఘనకు ఎంత పెనాల్టీ విధించాలో యాప్ ద్వారా ఆటోమేటిక్‌గానే జనరేట్ అవుతుందన్నారు. పెనాల్టీలను యూపీఐ ద్వారానే చెల్లించాల్సి ఉంటుందన్నారు. తద్వారా క్షేత్రస్థాయిలోని అధికారులు ఇకపై ఇష్టారాజ్యంగా వ్యవహరించే వీలుండదు.

చార్మినార్ జోన్‌కు అధికంగా..

గతంలో స్వచ్ఛ ర్యాంకింగ్స్ కోసం డంపర్‌బిన్లను తొలగించిన జీహెచ్ఎంసీ అధికారులు అవి లేనిదే చెత్త సమస్యలు తీరవని గ్రహించి తిరిగి వాటిని ఏర్పాటు చేస్తున్నారు.ఆటోమేటిక్‌గా చెత్త పూర్తిగా నిండకముందే అలర్ట్ చేసే సాంకేతికతతో కూడిన డంపర్‌బిన్లను దాదాపు వెయ్యి చెత్త వల్నరబుల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 260 డంపర్‌బిన్లు సమకూర్చుకోగా రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకుని చార్మినార్ జోన్‌కు అధికంగా 134 డంపర్‌బిన్లు తరలించారు. వాటిల్లో 121 బిన్లను వల్నరబుల్ ప్రాంతాల్లో ఉంచారు. ఖైరతాబాద్‌జోన్‌కు 20 బిన్లు తరలించగా, వాటిల్లో ఆరింటిని వల్నరబుల్‌ప్రాంతాల్లో అమర్చారు. మిగతా వాటిని ఏర్పాటు చేసే పనుల్లో ఉన్నారు.

సీఅండ్‌డీ వ్యర్థాల ద్వారా

దాదాపు నాలుగునెలల నుంచి నిర్మాణ, కూల్చివేతల(సీఅండ్‌డీ) వ్యర్థాలను క్షేత్రస్థాయిలో గుర్తించి పెనాల్టీలు విధిస్తున్న టౌన్‌ప్లానింగ్ ఏసీపీలు ఇప్పటి వరకు రూ. 54,15,792 పెనాల్టీలు విధించారు. ఒక్క కాప్రా సర్కిల్‌లోనే రూ.7,27,500 పెనాల్టీలు విధించారు.

చెత్త వేసిన వారికి..

- రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారికి జనవరి ఒకటో తేదీ నుంచి మార్చి 3వ తేదీ వరకు రూ.2,33,600 పెనాల్టీలు విధించారు.
- ఈ–చలాన్ యాప్ అందుబాటులోకి వస్తే పెనాల్టీల మొత్తం ఇంకా పెరిగే అవకాశంతోపాటు, ఉల్లంఘనులు చెల్లించే సొమ్ము నేరుగా జీహెచ్ఎంసీ ఖజానాలోనే జమ అవుతుంది.

శానిటరీ జవాన్లా మజాకా ?

జీహెచ్ఎంసీలో ఉన్న 269 మంది శానిటరీ జవాన్లలో 139 మందిని ఇటీవల బదిలీ చేయడం తెలిసిందే. వారు బదిలీ అయిన స్థానాల్లోకి వెళ్లక ముందే స్థానిక కార్పొరేటర్ల నుంచి మొదలు పెడితే.. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ దాకా తమ పరిధిలోని శానిటరీ జవాన్ల బదిలీ నిలిపివేయాలంటూ సంబంధిత ఉన్నతాధికారుల వద్దకు క్యూలు కడుతున్నారు. స్వచ్ఛ ర్యాంకింగ్ కోసం కేంద్ర బృందం నగరంలో పర్యటిస్తున్న తరుణంలో పారిశుధ్యం బాగుండాలనే తలంపుతో కమిషనర్ శానిటరీ జవాన్లను బదిలీ చేసినట్లు తెలుస్తోంది. వారిలో చాలామందికి రాజకీయ అండదండలుండటంతో చేయాల్సిన పనులు చేయడం లేదు. రెగ్యులర్ ఉద్యోగులైన శానిటరీ జవాన్లు తమ పనుల్ని ఔట్‌సోర్సింగ్‌పై నియమితులైన శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లకు అప్పగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒకే చోట పనిచేస్తున్న శానిటరీ జవాన్లలో గత 35 ఏళ్లుగా ఒకేచోట పని చేస్తున్నవారు కూడా ఉండటం విశేషం.

ఏసీబీ వలలో డీఈఈ

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ క్వాలిటీకంట్రోల్ విభాగంలో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న ఎ.దశరథ్ ముదిరాజ్ ఫైల్స్ క్లియర్ చేయడానికి, వాటిని ఈఈకి పంపించేందుకు ఒక వ్యక్తిని రూ:20వేలు డిమాండ్ చేసి, తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. లంచం సొమ్మును స్వాధీనం చేసుకొని నాంపల్లి ఏసీబీ కేసుల కోర్టులో హాజరు పరిచారు. అడ్వాన్స్‌గా అంతకు ముందే రూ. 10వేలు తీసుకున్నట్లు ఏసీబీ పేర్కొంది.

కంటోన్మెంట్‌లో సీబీఐ దాడులు!

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో సీబీఐ దాడులు కలకలం సృష్టించాయి. సికింద్రాబాద్ డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీస్‌లో గత నెలలో సీబీఐ సోదాలు జరగడంతో ఇటు డీఈఓ కార్యాలయంతో పాటు కంటోన్మెంట్ ఉద్యోగుల్లోనూ వణుకు మొదలైంది. విశ్వసనీయ సమాచారం మేరకు రక్షణ భూముల్లో అక్రమ నిర్మాణాల అంశంతో పాటు డీఈఓ కార్యాలయ సిబ్బంది, రక్షణ భూముల కబ్జాదారుల నుంచి అక్రమ వసూళ్లపై ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ప్రాథమిక ఆధారాలతో ఫిర్యాదులు అందడంతోనే సీబీఐ అధికారులు దాడులు నిర్వహించినట్లు సమాచారం. దీంతో సదరు ఉద్యోగి కాల్ డేటా, బ్యాంకు లావాదేవీలు, కార్యాలయ సిబ్బంది సహకారంపై కూడా ఆరాతీసినట్లు తెలుస్తోంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నర్సాపూర్ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ లింగం కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సాయి నిఖిల్(21), అతడి మిత్రుడు మనీశ్ ఆదివారం మెదక్‌లో జరిగిన వారి మిత్రుడి వివాహానికి హాజరయ్యారు. రాత్రి ఇంటికి తిరిగి బయలుదేరారు. నర్సాపూర్ మీదుగా హైదరాబాద్ వెళ్తుండగా నర్సాపూర్ శివారులోని అయ్యప్ప దేవాలయం సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న రెయిలింగ్‌కు బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న మనీశ్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తరలించారు. బైక్‌ను అతి వేగంగా అజాగ్రత్తగా నడిపినందునే అదుపు తప్పి ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.
Ph: 040-23256000 Ext: 6344, 9912220352

‘ప్రత్యేక అభివృద్ధి’ పనులు పూర్తి చేయాలి

పురోగతిపై జిల్లా కలెక్టర్ అనుదీప్ సమీక్ష



సాక్షి, సిటీబ్యూరో: ప్రత్యేక అభివృద్ధి నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇంజనీరింగ్ శాఖల ఆధ్వర్యంలో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన పనుల పురోగతి, పెండింగ్ పనులను సమీక్షించారు. సీడీఎఫ్ పథకం కింద 268 పనులకుగాను 79 పనులు పూర్తి కాగా, మరో 73 పనులు పురోగతిలో ఉన్నాయని, 10 పనులు టెండర్ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. మిగిలిన 48 పనులకు స్థల పరిశీలన చేసి ప్రతిపాదనలు సిద్ధంగా ఉంచాలన్నారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, ఎక్కడైనా ఏజెన్సీలు ఇబ్బంది పెడితే తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనులు పూర్తయిన వాటికి సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లు అందచేయాలని సూచించారు. ఎక్కడైనా స్థలం సమస్య, టెండర్ ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు ఉంటే నివేదిక రూపంలో అందజేయాలనీ కలెక్టర్ అధికారులకు సూచించారు. సమీక్షా సమావేశంలో సీపీవో డాక్టర్ సురేందర్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఘాట్ వద్ద కారు బీభత్సం

రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఫుట్‌పాత్ పైకి ఎక్కిన కారు..



లక్డీకాపూల్ : నెక్లెస్ రోడ్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఓ కారు బీభత్సం సృష్టించింది. రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెను ముప్పు తప్పింది. సోమవారం ఖైరతాబాద్ జంక్షన్ నుంచి సెక్రటేరియేట్ వైపు వెళుతున్న ఓ కారు అతివేగం కారణంగా ఎన్టీఆర్ ఘాట్ మలుపు వద్ద అదుపు తప్పింది. కారు డివైడర్‌పైకి దూసుకెళ్లి కరెంట్ పోల్‌ను ఢీకొనడంతో పోల్ రోడ్డుపై అడ్డంగా విరిగిపడింది. ఈ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో విద్యుత్ స్తంభంతో పాటు రెండు చెట్లు ధ్వంస మయ్యాయి. కాగా కారు నడిపిన వ్యక్తి కూడా సురక్షితంగా బయటపడ్డాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కారు నడిపిన వ్యక్తి మద్యం మత్తులో ఉన్నాడా అనే కోణంలో విచారణ చేపట్టారు. ప్రమాదం అనంతరం కారు డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి పారిపోయినట్లు సమాచారం.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS SERVICE
■మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800526]
■మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్,ఏఇతర ఫైనాన్స్‌లోఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [H-783412]

HOME NEEDS

PEST CONTROL
■వాసనలేని మరకలు పడని ISI కెమికల్స్ 5 సం॥ వ్యారంటీతో చెదలు (బొద్దింకలు, నల్లులు, బల్లులు) నివారించే సంస్థ, హిందూస్తాన్ పెస్ట్ కంట్రోల్. సంప్ర: 7981533849, 9059989604 [HA-1202]

PERSONAL CARE

CHANGE OF NAME
■I, Pabbe Madhukar S/o, Pabbe Sayanna R/o H. No. 8-48, Village Post Mandal Marpalle Vikarabad Dist, Telangana, have changed my name to Pabbe Madhuker for all purposes. [DA-13417]
■I, Nazia Sulthana W/o, Abdul Rahman R/o A301, Gem Nakshathra, Shanthi Nagar Road, Kokapet, Hyderabad - 500075 Telangana have changed my name to Shaik Nazia Sulthana. [DA-41627]
■I, Peedikakandi Chackara Prem Sunil R/o 12-6-36/a/1/d Venkiah Heights Flat 501 Pragathi Nagar Rd 10 Moosapet Hyderabad 500018 have changed my minor daughter's name from Pc Dhriti Sri Prem to Dhritisri Prem. [DA-41625]

OLD AGE HOME
■వృద్ధులు, NRI'S, విలాసవంతమైన గదులు, లిఫ్ట్, మేడిపల్లి, దీర్ఘకాలిక మంచానున్న వారికి 24/7 మెడికల్ సర్వీసెస్. ఉప్పల్ & ECIL-కీసర రోడ్, చీర్యాల్ 'x' రోడ్, భోజన వసతితో. 7981467036, 9391039990, 9949520296 [H-783368]

Wanted
■బషీర్‌బాగ్, హైదర్‌గూడలో పని చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. తెలుగు, హిందీ, ఇంగ్లీషు తెలిసినవారు సంప్ర : 9652128807 [HA-15115]
■మాయొక్క అపార్ట్‌మెంట్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్స్, స్వీపర్స్, స్త్రీ/పు॥ కావలెను. సంప్రదించండి: సెల్: 9494611875, 9494396558. [W-1265057]
■డైరెక్ట్ హోటల్ జాబ్స్ ఫీజులేదు, HYD లోని 5స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు కేటరింగ్ బాయ్స్ & హెల్పర్స్ కావలెను. జీ: 12-16K రూమ్+ఫుడ్ ఫ్రీ: age: 18-30. Ph: 9989978685 [SCA25001904]
■హెల్పర్స్, సూ॥వైజర్స్, డ్రైవర్లు, గార్డెన్ వర్క్, వాచ్‌మెన్, టెలికాలర్స్, టైపింగ్, వీడియో ఎడిటింగ్, మేస్త్రీలు, ఫ్రీ హాస్టల్ జీ: 12K-24K. 7780468727 [SCA25001952]
■హైదరాబాద్‌లో ఇంట్లోనే ఉండి ఇంటి, వంట పనికి, పిల్లలను, పెద్దలను చూసుకొనుటకు ఆడవాళ్లు కావలెను. జీతం 18-30K. ఫోన్: 8019373131 [H-800524]
■క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటో నగర్ ఆఫీస్ నందు గుమాస్తాలుగా పని చేయుటకు 10th ఆపై చదివి 30 సం॥ లోపు వయస్సు గల మేల్ అభ్యర్థులు కావలెను. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. సంప్ర: Ph No: 87901 91999 [B-1]
■Wanted Experienced B.Com/ M.Com Candidates for Accounts Office @ Jeedimetla. Ph: 9848204466, mail resumes to: ymreddy77@gmail.com [HA-2466]
■Sales Executive, Telecaller, TVS Two Wheeler Mechainic @ MJ Motors Krishna plaza, Manikonda 8142816161, 8297613131 [SCA25001965]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

మహిళ అనుమానాస్పద మృతి

భర్తే కొట్టి చంపాడని మృతురాలి బంధువుల ఆరోపణ



భర్త వినయ్‌తో శిరీష (ఫైల్)

చాదర్‌ఘాట్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ రవి రాజ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అక్బర్‌బాగ్ డివిజన్ జమున టవర్స్‌లో 106 సింగం వినయ్, శిరీష(32) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమార్తె. శిరీష ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో నర్సుగా పని చేస్తుండగా, ఆమె భర్త వినయ్ ప్రైవేట్ ఉద్యోగి. ఆదివారం శిరీషకు గుండెపోటు వచ్చిందని ఆమె మేనమామ మధుకర్‌కు శిరీష స్నేహితురాలు సమాచారం అందించింది. దీంతో మధుకర్ ఆమె ఇంటికి వెళ్లేలోగా వినయ్ ఆమెను హాస్పిటల్‌కు తీసుకెళ్లాడు. శిరీషను పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించాడు. దీంతో వినయ్ శిరీష మృతదేహాన్ని తీసుకుని అంబులెన్స్‌లో తన స్వగ్రామమైన దోమలపెంటకు బయలుదేరి వెళ్లాడు. దీనిపై అనుమానం వచ్చిన మధుకర్ చాదర్‌ఘాట్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన పోలీసులు అంబులెన్స్ డ్రైవర్‌కు ఫోన్ చేసి మృతదేహాన్ని వెనక్కి రప్పించారు. కాగా శిరీష శరీరంపై గాయాలు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. శిరీషను ఆమె భర్త వినయ్ కొట్టి చంపాడని మేనమామ మధుకర్ ఆరోపిస్తున్నారు. శిరీషపై అనుమానం పెంచుకున్న వినయ్ తరచూ ఆమెను వేధించేవాడని తెలిపాడు. 2017లో వారు ప్రేమించి పెళ్లి చేసుకున్నట్లు తెలిపాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు ఆమె భర్త వినయ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య



దేవిక మృతదేహం

గచ్చిబౌలి: ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా, తోర్‌మామిడికి చెందిన కమలాపురం దేవిక(25) మాదాపూర్‌లోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తోంది. మంచిర్యాల మార్కెట్ రోడ్డుకు చెందిన సద్గుర్తి శరత్ చంద్రతో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీయడంతో పెద్దల అంగీకారంతో వారిరువురు గత ఆగస్టు 23న గోవాలో పెళ్లి చేసుకున్నారు. రాయదుర్గంలోని ప్రశాంత్‌హిల్స్‌లో నివాసం ఉంటున్నారు. కొద్ది రోజులుగా భార్యా భర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి కూడా వారి మధ్య గొడవ జరగడంతో దేవిక గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. బయటికి వెళ్లి తిరిగి వచ్చిన శరత్‌చంద్ర తలుపు తట్టినా దేవిక స్పందించకపోవడంతో నిద్రపోయి ఉంటుందని భావించాడు. సోమవారం ఉదయం 10 గంటలైనా దేవిక బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన శరత్ చంద్ర తలుపు విరగ్గొట్టి చూడగా ఆమె ఉరి వేసుకుని కనిపించింది. ఇరుగు పొరుగు సహాయంతో కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందింది. వర కట్నం కోసం శరత్‌చంద్ర తన కుమార్తెను వేధిస్తున్నాడని, ఈ కారణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని మృతురాలి తల్లి రామలక్ష్మి రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

174 మంది జూనియర్ అసిస్టెంట్లకు పోస్టింగులు



సాక్షి,సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో 174 మంది జూనియర్ అసిస్టెంట్లకు సోమవారం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పోస్టింగ్ ఆర్డర్లను అందజేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 4 ఉద్యోగాల రిక్రూట్‌మెంట్‌లో భాగంగా జీహెచ్ఎంసీకి కేటాయించిన వారిలో రిపోర్టు చేసిన 174 మందికి పోస్టింగ్ ఆర్డర్స్ అందజేశారు. వారిని ప్రధాన కార్యాలయంతోపాటు జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగం వచ్చిందని రిలాక్స్ కావద్దని, ప్రతి ఉద్యోగి బాధ్యతగా, అంకితభావంతో పనిచేసి కార్పొరేషన్‌కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. క్రమశిక్షణతో పనిచేసి ప్రజలకు మంచి సేవలు అందించినప్పుడే ఉద్యోగికి గుర్తింపుతో పాటు మరింత ఉన్నతంగా రాణిస్తారన్నారు. నగరంలో హెల్త్, శానిటేషన్ నిర్వహణ బాగుండాలని, ఆ విషయంలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెద్ద ఎత్తున ఉద్యోగ నియామకాలు చేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన విభాగం అడిషనల్ కమిషనర్ వేణుగోపాల్, జాయింట్ కమిషనర్ శ్రీనివాస్,ఏఎంసీ జీవన్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

ఆర్చిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ సీజ్

- అనుమతులు లేకుండా నిర్వహణ
- పలు మార్లు విద్యాశాఖ అధికారుల హెచ్చరికలు
- పట్టించుకోని స్కూల్ యాజమాన్యం



స్కూల్‌ను సీజ్ చేస్తున్న డిప్యూటీ ఈఓ వెంకటరమణ తదితరులు

గోల్కొండ: ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనంలో కొనసాగుతున్న ఓ పాఠశాలను సోమవారం విద్యాశాఖ అధికారులు సీజ్ చేశారు. డిప్యూటీ ఈవో సి.హెచ్.వెంకటరమణ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసుల సమక్షంలో విద్యార్థులందరినీ ఇంటికి పంపి పాఠశాల గేట్లకు తాళం వేశారు. గత సంవత్సరం ప్రారంభమైన ఈ పాఠశాలకు ఎలాంటి అనుమతులు లేవని డిప్యూటీ ఈవో తెలిపారు. విద్యా శాఖ ఆర్‌జేడీ కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు స్కూల్‌ను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఐదంతస్తుల భవనంలో కొనసాగుతున్న ఈ పాఠశాలకు అగ్నిమాపక విభాగం అధికారుల అనుమతులు లేవని తెలిపారు. ట్రాఫిక్ అధికారులు, బల్దియా విభాగం నుంచి ఎలాంటి అనుమతులు లేవని, పాఠశాలకు గుర్తింపు సైతం లేదన్నారు. పలుమార్లు పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్‌ను అనుమతుల విషయమై హెచ్చరించామని, అయినా యాజమాన్యం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో గత నెల 2న పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి, అనుమతులు లేనందున సదరు పాఠశాలలో పిల్లలను చేర్పించవద్దని ఇక్కడ ఉన్న పిల్లలను వేరే పాఠశాలలోకి మార్చుకోవాలని స్పష్టం చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల సూచనమేరకు పాఠశాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, డిప్యూటీ ఐఓఎస్ మహ్మద్ బషీర్‌తో పాటు విద్యాశాఖకు చెందిన సయ్యద్ జాఫర్, మహ్మద్ నసీర్ తదితరులున్నారు.

విద్య పేరుతో దోపిడీ...

ఆర్చిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం పిల్లల భద్రతను గాలికి వదిలేసి ఫీజుల పేరిట దోపిడీ చేస్తుందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలను సీజ్ చేసినట్లు తెలియడంతో నానల్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకున్నారు. గేట్లకు తాళం వేసి ఉండడం చూసి స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే వేలల్లో ఫీజులు చెల్లించామని విద్యా సంవత్సరం చివరలో తమ విద్యార్థుల భవిష్యత్తు ఏమిటని విద్యాశాఖ అధికారులను నిలదీశారు. వచ్చే నెలలో పరీక్షలు ఉన్నాయని దాని కోసం పిల్లలు కష్టపడి చదువుతున్నారని ఇప్పుడు పాఠశాలకు తాళం వేస్తే వారి పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవన్న విషయం తమకు తెలియదని ప్రభుత్వ గుర్తింపు ఉందని ఇప్పటి వరకు పాఠశాల యాజమాన్యం చెబుతూ వచ్చిందని వారు ఆరోపించారు.

రోగి లేకుండా.. సైరన్ మోగిస్తే ఊరుకోం..



బంజారాహిల్స్: చాలామంది అంబులెన్స్ డ్రైవర్లు రోగి లేకుండానే సైరన్ మోగిస్తూ అతివేగంగా రెడ్ సిగ్నల్ పడిన తర్వాత కూడా దూసుకుపోతున్నారు. పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ కట్టా ఆధ్వర్యంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఎస్సార్‌నగర్, పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అంబులెన్స్‌లో రోగి లేకుండానే సైరన్లు మోగిస్తూ అతివేగంగా దూసుకెళ్తుండగా వారిని గుర్తించి పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో అంబులెన్స్ డ్రైవర్లకు ఏసీపీ హరిప్రసాద్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. అత్యవసర సమయాల్లో మాత్రమే సైరన్‌లు మోగించుకుంటూ వెళ్లాలని, రోగి లేనప్పుడు కూడా సైరన్లు మోగించుకుంటూ వెళ్లడం వల్ల పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. రోగి ఉన్నప్పుడు మాత్రమే అంబులెన్స్‌లు రెడ్ సిగ్నల్ పడ్డా వెళ్లవచ్చని, తామే ట్రాఫిక్ క్లియర్ చేస్తుంటామని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: కామాటిపుర 11కేవీ ఫీడర్, సంజీవయ్య పార్క్ సబ్‌స్టేషన్ పరిధిలో కొనసాగుతున్న మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు కామాటిపుర, ప్రకాశ్‌నగర్, ఎక్స్‌టెన్షన్ ప్రకాశ్‌నగర్, వాటర్ ట్యాంక్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ సోమవారం తెలిపారు. అదేవిధంగా ఇంటర్ గ్రాఫ్ 11కేవీ ఎయిర్‌పోర్ట్ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు ఇంటర్‌గ్రాఫ్ ఏరియాలో, బీఎస్‌పురి, ఎర్రగడ్డ 11కేవీ ఫీడర్లు మోతీనగర్, జనప్రియ సబ్‌స్టేషన్ల పరిధిల్లో కొనసాగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గౌతంపురి కాలనీ, మిడ్‌ల్యాండ్ బేకరి, బీఎస్‌పురి కాలనీ, నటరాజ్‌నగర్, రాజీవ్‌నగర్, శంకర్‌లాల్‌నగర్, నేతాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బోరబండ ఎస్‌హెచ్‌ఓగా సురేందర్



రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా మల్కపురం సురేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్‌కు చెందిన సురేందర్ కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహించి ఆ తర్వాత చార్మినార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల నిర్వహిస్తూ బోరబండ ఎస్‌హెచ్‌ఓగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



పంజగుట్ట: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేరుస్తామని హామీ ఇవ్వడమే కాకుండా ఎన్నికల మేనిఫెస్టోలో కూడా పొందుపర్చారని అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా అతీగతీ లేదని, బోయ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు మీనుగ గోపి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోయలను వెంటనే ఎస్టీ జాబితాలో చేర్చకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బోయల తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి బోయలకు ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలని, బోయ ఫెడరేషన్‌కు పాలకమండలి వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బోయల ఉద్యమం ఎలా ఉంటుందో చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్ల అంజయ్య, మాదరబోయిన నర్సయ్య, నిర్మల, గగనం వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



సనత్‌నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 'జెక్‌కాలనీ మహిళలు–మహారాణులు' కార్యక్రమం సోమవారం ఉత్సాహంగా జరిగింది. కాలనీ స్ట్రీట్‌నెంబర్–1లోని విజయ గ్రాండియర్ అపార్ట్‌మెంట్‌లో జరిగిన వేడుకల్లో మహిళలు పలు వినోద కార్యక్రమాలతో ఉల్లాసంగా గడిపారు. కాంప్లిమెంటరీ తంబోలా, లక్కీడిప్, సిల్వర్ తంబోలా ఆటలతో సందడి చేశారు. ప్రతిభకనబర్చిన వారికి అవార్డులు అందజేశారు. ప్రభాఅనంతరెడ్డి, ఎస్.అన్నపూర్ణ, భాగ్యలత మల్లారెడ్డి, కృష్ణకుమారి శారద, అమరావతి, హైమావతి పాల్గొన్నారు.

> రోజులు కాదు.. నెలలు కాదు.. ఏళ్లు గడుస్తోంది.. బ్యానర్లు కట్టారు.. గులాబీలు పంచారు.. సెక్యూరిటీనీ సైతం ఏర్పాటు చేశారు.. మైకు పట్టారు.. ఇంటి గడపతొక్కారు.. దయచేసి రోడ్లపై చెత్త వేయవద్దూ.. మీ ఇంటికి వచ్చే చెత్తబండి వద్ద మాత్రమే తడి, పొడి వేరు చేసి ఇవ్వండి అంటూ అధికారులు వేడుకున్నారు. ఇంత చేసినా రోడ్లపై చెత్త గుట్టలుగా పేరుకుపోతోంది. దాంతో జీహెచ్‌ఎంసీ వినూత్న ప్రయోగానికి సిద్ధమైంది. ఓపెన్ గార్బేజీ పాయింట్ వద్ద వాయిస్ అసిస్టెన్స్ కెమెరాను ఏర్పాటు చేసింది. అది చెత్త వేసేందుకు వచ్చిన వారిని గుర్తించి హెచ్చరిస్తుంది. ఇటీవల వచ్చిన పుష్ప–2లో కిసిక్ అన్నట్లు ఫొటో తీస్తుంది.



బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీనగర్‌లో ఓపెన్ గార్బేజీ పాయింట్ వద్ద కెమెరా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

చెత్తవేస్తే.. ఆవాజ్

- బంజారాహిల్స్‌లో ఓపెన్ గార్బేజీల వద్ద వాయిస్ అసిస్టెన్స్ కెమెరాలు
- విజయవంతమైతే చెత్త వేసే అన్ని ప్రాంతాల వద్ద ఏర్పాటు

బంజారాహిల్స్: చెత్తరహిత నగరంగా మార్చే ప్రక్రియలో భాగంగా ఇప్పటికే పలు ప్రయోగాలు చేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు ఇప్పుడు సాంకేతికతను ఉపయోగించి వినూత్న తరహా ప్రయోగాలకు సిద్ధమయ్యారు. గతంలో ఓపెన్ గార్బేజీల వద్ద చెత్తను మొత్తం శుభ్రం చేసి ముగ్గులు వేయించారు. పచ్చని మొక్కలు ఏర్పాటు చేయించారు. చెత్త వేయడానికి వచ్చిన వారికి పూల హారాలు వేసి సన్మానాలు చేసి చెత్త వేయవద్దని వేడుకునే కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న మహిళా సమాఖ్యలతో కలిసి బహిరంగంగా చెత్త వేయవద్దంటూ ర్యాలీలు సైతం నిర్వహించారు. కానీ ఇంకా కొన్ని చోట్ల మార్పు రాకపోవడంతో అధికారులు వినూత్న తరహా ప్రయోగాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. తాజాగా బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని ఎన్బీటీనగర్ సాయిరాం స్కూల్ వద్ద ఉన్న ఓపెన్ గార్బేజీ పాయింట్ వద్ద సాంకేతికతను వినియోగించి వాయిస్ అసిస్టెన్స్ కెమెరాను ఏర్పాటు చేశారు. దీంతో ఈ పాయింట్‌లో చెత్త వేయడానికి వచ్చిన వారిని ఏర్పాటు చేసిన కెమెరా సెన్సార్లు గమనించి వాయిస్ కంట్రోల్‌కు సందేశం



ఎన్బీటీనగర్‌లో ఓపెన్ గార్బేజీ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన కెమెరా, మైక్‌సెట్

పంపించి క్షణాల్లోనే చెత్త వేయకుండా ఇక్కడ చెత్త వేయవద్దంటూ తెలుగు, ఇంగ్లిష్, హిందీ భాషల్లో మైక్‌సెట్‌లో హెచ్చరికలు వస్తాయి. దీంతో ఇక్కడ చెత్త వేయడానికి వచ్చే వారు నిఘా నేత్రాల వల్ల చెత్త వేయడం తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ తరహా ప్రయోగం ఇక్కడ విజయవంతమైతే జూబ్లీహిల్స్ సర్కిల్–18లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఏఎంహెచ్‌వో డాక్టర్ భార్గవ నారాయణ తెలిపారు. సీఎస్ఆర్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రస్తుతం బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని అల్‌కరీం హోటల్, నందినగర్‌లోని ముస్తఫా మజీదు, కొత్త చెరువు చుట్టూ, షేక్‌పేటలోని కొన్ని ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల్లో, టీడీపీ ఆఫీస్ వెనుక ఉన్న ఇందిరానగర్ బస్తీలో వాయిస్ అసిస్టెన్స్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వెంటనే అధికారులకు సమాచారం

ఈ తరహా టెక్నాలజీలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు చెత్త వేయడానికి వచ్చి అక్కడే చెత్త వేసి వెళ్తే.. వెంటనే స్థానిక ఎస్‌ఎఫ్‌ఏతో పాటు చెత్తను సేకరించి ఆటో రిక్షా కార్మికుడికి సైతం ఈ సందేశం, వీడియో, ఫొటో చిత్రాలు వెళ్తాయని అధికారులు తెలిపారు. తద్వారా అక్కడ చెత్త వేస్తున్న వారిని గుర్తించి మరోసారి చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

రాములోరు వచ్చినాడు.. హనుమంత వాహనంపై..

వేడుకగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవేంకటేశ్వరస్వామి 5వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా స్వామి వారు సోమవారం ఉదయం హనుమంత వాహనంపై రాములవారి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. హనుమంత వాహనంపై వచ్చిన శ్రీవారిని చూసిన భక్తులు పులకించిపోయారు. హనుమంతుడు భగవత్ భక్తులలో అగ్రగణ్యుడని గురు శిష్యులైన శ్రీరామ హనుమంతుల తత్వవివేచన తెలిసిన మహనీయులు కాబట్టి ఈ ఇరువురిని ఒకేసారి చూసిన భక్తులకు వేదాలతత్వం ఒనగూరుతుందని ఆలయ అర్చకులు తెలిపారు. మధ్యాహ్నం ఆలయంలో నిర్వహించిన రథ రంగ డోలోత్సవం కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారు గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు.



జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయంలో..







ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్

వెంగళరావునగర్: ప్రతి విద్యార్థి భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని, అందువల్ల తమ బిడ్డల్లా భావించి వారిని తీర్చిదిద్దాలని శిక్షణ డైరెక్టర్ పి.పరమేశ్వరమ్మ తెలియజేశారు. యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా కొనసాగుతున్న సమగ్ర శిక్షణ సోమవారంతో ముగిసింది. శిక్షణ డైరెక్టర్ పి.పరమేశ్వరమ్మ మాట్లాడుతూ నూతన టీచర్లు నిబద్ధతతో పని చేయాలన్నారు. విద్యార్థులతో పూర్తిగా కలిసిపోయి వారిలో ఉన్న భయాన్ని తొలగిస్తూ పాఠాలు చెప్పాలన్నారు. ప్రతి పాఠం వారికి అర్థం అయ్యేవిధంగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్స్ ఉదయ్‌కుమార్, హేమలత, బాలత్రిపుర సుందరి, మౌనిక, శ్రీదేవి, వంశీ, ఐశ్వర్యతో పాటు స్కూల్ టీచర్లు నర్సింహ, శ్రీనివాసన్, నాగరాజు, ప్రభాకర్, ఖైరతాబాద్ మండలం –1, 2, షేక్‌పేట, ఆసీఫ్‌నగర్, గోల్కొండ, అంబర్‌పేట, హిమాయత్‌నగర్ మండలాలకు చెందిన 156 మంది కొత్త టీచర్లు పాల్గొన్నారు.



నూతన ఉపాధ్యాయులతో ట్రైనర్, సీనియర్ టీచర్లు

7న తెలంగాణ జానపద నృత్య ప్రదర్శన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పంజగుట్ట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాలికలకు శారీరక, మానసిక ఫిట్‌నెస్ కోసం క్రివి ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒకేసారి వెయ్యి మంది బాలికలతో 'తెలంగాణ జానపద నృత్య ప్రదర్శన' నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు కె.వేదకీర్తి తెలిపారు. ఈ నెల 7వ తేదీన సికింద్రాబాద్, వెస్ట్ మారేడ్‌పల్లిలోని కస్తూర్బా గాంధీ డిగ్రీ, పీజీ కళాశాలలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కోసం ప్రయత్నిస్తున్నట్లు ఆమె చెప్పారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ పోస్టర్‌ను ఫౌండేషన్ ప్రతినిధులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. సమావేశంలో ఫౌండేషన్ వలంటీర్లు సరితాసింగ్, బ్లెస్సి, దిశావైష్ణవ్, అన్షు, దీపక్ సింగ్ పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేసి కులం పేరుతో దూరం పెట్టిన వ్యక్తిని జూబ్లీహిల్స్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. యూసుఫ్‌గూడ సమీపంలో నివసించే పిట్టు శ్రీనివాసరావు(39) మాదాపూర్‌లో ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. సమీపంలోనే నివసించే ఓ యువతితో ఏర్పడ్డ పరిచయం ప్రేమకు దారితీసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెతో సహజీవనం కూడా చేశాడు. అయితే కులం తెలియడంతో పాటు పెళ్లి చేసుకోకపోగా మానసిక వేదనకు గురిచేశాడంటూ బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడు శ్రీనివాసరావుపై నమ్మకం ద్రోహం, చీటింగ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు మాయం

వెంగళరావునగర్: ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్ నివాసి జి.మహేష్ ప్రైవేట్ జాబ్ చేస్తుంటాడు. తన స్నేహితురాలైన ఒక కానిస్టేబుల్ వద్ద నుంచి ద్విచక్ర వాహనం తీసుకుని విధులకు వెళ్లి వస్తుంటాడు. ఆదివారం విధులకు వెళ్లి రాత్రి తిరిగి వచ్చి ఇంటి ఎదుట వాహనాన్ని పార్క్ చేశాడు. సోమవారం ఉదయం కనిపించలేదు. ఇదిలా ఉండగా.. వెంగళరావునగర్‌లో నివసించే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జయప్రకాశ్‌రావు శనివారం తన ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్లి వచ్చి ఇంటి పక్కన వాహనాన్ని పార్క్ చేశాడు. మరుసటి రోజు ఆదివారం ఉదయం కనిపించలేదు. దీంతో బాధితులు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నాణ్యత లోపిస్తే ఊరుకునే ప్రసక్తే లేదు

వెంగళరావునగర్: ప్రజాధనం వృథా కాకుండా ప్రతి పనిని బాధ్యతగా పూర్తి చేయాలని స్థానిక కార్పొరేటర్ దేదీప్య విజయ్ తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ మసీదుగడ్డ ప్రాంతంలో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిలో నాణ్యత లోపించకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడైనా నాణ్యత లోపించినట్లు తెలిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు, మహమూద్, అబ్బాస్, రషీద్, షానావాజ్, సమద్, ఇమ్రాన్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న దేదీప్య విజయ్

ముసుగులు, సైకిల్ చైన్లతో బెదిరింపులు

బంజారాహిల్స్: ముసుగులు ధరించి సైకిల్ చైన్లు ఊపుకుంటూ హోటల్‌లోకి ప్రవేశించిన ఆగంతకులు కస్టమర్లను బెదిరింపులకు గురిచేస్తూ గదులు ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ హెచ్చరికలు జారీ చేసిన ఘటనలో నిందితులపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్‌కు చెందిన సుజాహత్ హుస్సేన్ (38) 2015లో బంజారాహిల్స్ రోడ్ నెంబర్–4లోని బగ్గా హోటల్స్‌ను లీజుకు తీసుకున్నాడు. 2030 వరకు ఈ లీజు గడువు ఉండగా బగ్గా హోటల్స్ యజమానులు సత్పాల్‌సింగ్ బగ్గా, బల్విందర్ బగ్గా మధ్య అద్దె విషయంలో గొడవలు వచ్చాయి. ఈ విషయంలో కోర్టులో కేసు నడుస్తుంది. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి 10 మంది ఆగంతకులు ముఖాలకు ముసుగులు ధరించి హోటల్‌లోకి ప్రవేశించి రిసెప్షనిస్ట్ సుభాన్‌ను బెదిరించి అక్కడి నుంచి వెళ్లిపోవాల్సిందిగా హెచ్చరించారు. అలాగే కస్టమర్లు ఉన్న గదుల వద్దకు వెళ్లి సైకిల్ చైన్లు ఊపుకుంటూ ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ బెదిరింపులకు గురిచేశారు. రిసెప్షనిస్ట్ ఇచ్చిన సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న సుజాహత్ డయల్ 100కు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే లోపే ముసుగులు ధరించిన వ్యక్తులంతా అక్కడి నుంచి పరారయ్యారు. సత్పాల్‌సింగ్ బగ్గా, బల్విందర్‌సింగ్ బగ్గా ఇద్దరూ హోటల్‌లోకి రౌడీలను పంపించారని, భయభ్రాంతులకు గురిచేశారని, విధ్వంసం సృష్టించారని, మెటీరియల్ ధ్వంసం చేశారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు నూతన భవన నిర్మాణం చేపట్టాలి

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం నూతన భవన నిర్మాణం చేపట్టాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మేడ్చెల్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ద్వారా ఆయన లేఖను పంపారు. సనత్‌నగర్‌లోని రౌండ్‌టేబుల్ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఇటీవల స్థానిక కార్పొరేటర్, అధికారులతో కలిసి రౌండ్‌టేబుల్ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులు, స్కూల్ సిబ్బందితో మాట్లాడారు. తరగతి గదుల కొరత కారణంగా విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపలేకపోతున్నారని, తరగతి కార్పొరేటర్‌తో పాటు ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మచారిలు వివరించారు. సమస్య పరిష్కారం కోసం రౌండ్‌టేబుల్ స్కూల్ సమీపంలో నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ హెల్త్ సెంటర్‌లో నూతన ప్రైమరీ స్కూల్ బిల్డింగ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా పబ్లిక్ హెల్త్ సెంటర్ స్థలంలో స్కూల్ బిల్డింగ్ నిర్మాణం కోసం అనుమతించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని కోరుతూ ఒక లేఖ పంపారు.

సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం

రహమత్‌నగర్: సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. బోరబండ డివిజన్‌లోని సైట్–3 ప్రాంత బస్తీల్లో సోమవారం పర్యటించి అక్కడి సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ కమిటీ నాయకులు శేషగిరిరావు, స్వామి మాట్లాడుతూ సమస్యలను సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. నాయకులు ఏఆర్ నరసింహ, బాలయ్య, జ్యోతి, సత్యనారాయణ, శేషు, భవాని తదితరులు పాల్గొన్నారు.



బస్తీల్లో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

నీటి ఎద్దడి తలెత్తకుండా చూడండి



బేగంపేట మాతాజీనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి

సనత్‌నగర్: మంచినీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని మాతాజీనగర్‌లో లోప్రెషర్ సమస్య, కలుషిత నీటి సరఫరా జరుగుతుందన్న ఫిర్యాదుల నేపథ్యంలో సోమవారం ఆమె వాటర్‌వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా నీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ రామేశ్వర్, నాయకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

'టుగెదర్ ఫర్ హర్ వెల్ బీయింగ్'తో అవగాహన

లక్డీకాపూల్ : ప్రతి మహిళా ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రసూతి, గైనకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మహితారెడ్డి అన్నారు. సర్వైకల్ కేన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అపోలో క్రెడిల్, చిల్డ్రన్ హాస్పిటల్, ఎంఎస్డీ ఫార్మాస్యూటికల్స్ సంయుక్తంగా మహిళల ఆరోగ్యంపై అవగాహనే లక్ష్యంగా 'టుగెదర్ ఫర్ హర్ వెల్ బీయింగ్'అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. తాజ్ దక్కన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 2022లో 1.5 లక్షలకుపైగా కొత్త హెచ్పీవీ సంబంధిత కేన్సర్ కేసులు నమోదయ్యాయని, మహిళల్లో సర్వైకల్ కేన్సర్ రెండో అత్యధిక క్యాన్సర్‌గా ఉందన్నారు. గైనకాలజిస్టును కలవడం, హెచ్పీవీ వ్యాక్సిన్,, స్క్రీనింగ్, నిరోధక చర్యలతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. హెచ్పీవీ వ్యాక్సినేషన్‌పై అవగాహన పెంచుకోవాలని గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మిని శిల్ప అన్నారు. శరీరంలో జరిగే మార్పులను గమనించడం, నివారణ చర్యలు తీసుకోవడం, ఏటా వైద్య పరీక్షలు చేయించుకోవడం వంటివి చేపట్టాలని గైనకాలజీ, లాప్రోస్కోపీ - రోబోటిక్ సర్జన్ డాక్టర్ జాస్మిన్ రాథ్ అన్నారు.

ఆదివాసీ హక్కుల నేతల అరెస్టు అక్రమం


మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మూలవాసీ బచావో మంచ్ మాజీ అధ్యక్షుడు రఘు మదియానిని ఎన్ఐఏ పోలీసులు రాయపూర్‌లో అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌర హక్కుల సంఘం నాయకులు ప్రొఫెసర్ లక్ష్మణ్, నారాయణరావు మాట్లాడుతూ అక్రమంగా అరెస్టు చేసిన రఘుతోపాటు గజేంద్ర, లక్ష్మణ్ అనే కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతోందన్నారు. గత 14 నెలల కాలంలో 434 మందిని కేంద్ర ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని ఆరోపించారు. పోలీసుల అప్రజాస్వామికగా చర్యలను బాహ్య ప్రపంచానికి చేరవేస్తున్నారని, పోలీసు క్యాంపులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని గజేంద్ర, లక్ష్మణ్ అనే కార్యకర్తలను జైలుకు పంపారని అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో వెలసిన పోలీసు క్యాంపులను ఎత్తివేయాలని, పర్యావరణాన్ని కాపాడాలని, ఆదివాసీ మహిళలపై జరుగుతున్న హత్యాచారాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చంద్రమౌళి, జాన్, భవాని, పీడీఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

– వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



గాంధీఆస్పత్రి: వినికిడి సమస్యలు, రుగ్మతలను ప్రాథమిక దశలో గుర్తించి వైద్యసేవలు అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సూచించారు. వరల్డ్ హియరింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మీనాక్షి వెంకటరామన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్నీ భవనంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై 40 మంది చిన్నారులకు వినికిడి యంత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన శిశువు శబ్దాలను గ్రహించకపోతే మాటలు వచ్చే అవకాశం లేదని, అప్పుడే వినికిడి లోపాలను గుర్తించి చికిత్స అందించాలన్నారు. ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఐదేళ్లలోపు శిశువులకు కూడా ఇంప్లాంట్ సర్జరీ చేసేవిధంగా నిబంధనలు సడలించేందుకు కృషి చేస్తానని అన్నారు. కోఠి ఈఎన్‌టీ ఆస్పత్రిలో పెండింగ్‌లో ఉన్న కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించామన్నారు. గాంధీ ఈఎన్‌టీ విభాగంలో కాంక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు నిర్వహిస్తున్నామని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని గాంధీ ఈఎన్‌టీ హెచ్ఓడీ ప్రొఫెసర్ భూపేంద్రసింగ్ రాథోడ్ కోరారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎన్ రాజకుమారి, ఈఎన్‌టీ విభాగాధిపతి ప్రొఫెసర్ భూపేంద్ర రాథోడ్ సింగ్, వినికిడి యంత్రాలదాత ఆదినారాయణ, ఎంవీ ఫౌండేషన్ ట్రస్టీ వసంత సేతురామన్, డైరెక్టర్లు రంగనాథ్, మురళీ నటరాజన్, జీఎంసీ అలుమ్నీ అసోసియేషన్ అధ్యక్షుడు జీఆర్ లింగమూర్తి, ప్రతినిధులు చంద్రశేఖర్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

జైళ్ల శాఖ టెండర్లకు ఆహ్వానం

కుషాయిగూడ: నగరంలోని చర్లపల్లి కేంద్ర కారాగారం, చర్లపల్లి ఖైదీల వ్యవసాయ క్షేత్రం, చర్లపల్లి మహిళ కారాగారంతోపాటు చంచల్‌గూడ జైళ్లకు ఈ ఆర్థిక సంవత్సరం ఆహార పదార్థాలు, జైలు ఉత్పత్తులకు ముడి సరుకుల సరఫరా కోసం తెలంగాణ జైళ్ల శాఖ టెండర్లను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు చర్లపల్లి జైలు అధికారులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 7న నిర్వహించే టెండర్లకు సంబంధించి టెండర్ ఫారాలు ఈ నెల 6 వరకు చర్లపల్లి కేంద్ర కారాగారం వద్ద ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొనవచ్చని జైలు పర్యవేక్షణాధికారి రామచంద్రం ప్రకటించారు. పూర్తి వివరాలకు 94946 32101, 9494632113, 9009 90588, 98669 22657.

మాటరాని నోట..

తేనె తేటల ఊట

- చిన్నారులకు కాక్లియర్ మిషన్లు పంపిణీ చేసిన సౌమ్య మిశ్రా
- ఘనంగా ప్రపంచ వినికిడి దినోత్సవం
- 56 మంది బధిర బాలలకు ఆపరేషన్లు

ఐదేళ్ల లోపు బాలబాలికలకు సువర్ణావకాశం





డాక్టర్ సౌమ్య మిశ్రా

నాంపల్లి: పుట్టు మూగ పిల్లలను చేరదీసి ఆశ్రయమిచ్చి తొలి పలుకులకు ఆకృతి ఇచ్చి మాటలు నేర్పించాయి ఆశ్రయ్-ఆకృతి సంస్థలు. తల్లిదండ్రుల మనోవేదనను దూరం చేశాయి. మాటలు రాని ఐదేళ్ల లోపు బాలలను గుర్తించి వారికి ఉచితంగా కాక్లియర్ ఆపరేషన్లు చేసి వారితో మాటలు మాట్లాడించాయి. ఆ పిల్లల నోట మాటలు రావడంతో కన్నవారి కంట కన్నీటి భాష్పాలు కనిపించాయి. మొత్తం 56 మంది చంటి పిల్లలను తల్లిదండ్రులు చంకనెత్తుకుని సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్ కేఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో సందడి చేశారు. ఆశ్రయ్-ఆకృతి సంస్థల సంయుక్త నిర్వహణలో ప్రపంచ వినికిడి దినోత్సవం జరిగింది. జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బధిర విద్యార్థులకు కాక్లియర్ పరికరాలను అందజేశారు. 'వినికిడి లోపం అనేది సొసైటీలో అందరితో కలిసిపోవడానికి అవరోధం. అలాంటి వారి జీవితంలో స్వేచ్ఛను తీసుకురావడానికి ఆశ్రయ్-ఆకృతి సంస్థలు ముందుకు రావడం సంతోషకరం. ఎంతో మందికి సర్జరీ చేసి వారి జీవితాల్లో వెలుగులు ప్రసాదించారు. భవిష్యత్తులో మరింత మందికి మేలు కలిగించాలి' అని ఆకాంక్షించారు.

- ఖమ్మం జిల్లాకు చెందిన మౌనిక-నర్సింహా దంపతుల నాలుగున్నరేళ్ల కుమారుడు జస్విక్‌కు ఆశ్రయ్-ఆకృతి సంస్థలవారు విజయవంతంగా కాక్లియర్ ఆపరేషన్ చేయించారు. తాజాగా పిలిస్తే పలుకుతానంటూ సభలో జస్విక్ అల్లరి చేస్తూ కనిపించాడు.

అందరూ ఐదేళ్ల లోపువారే..

ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదేళ్లలోపు ఉన్న 56 మందికి ఆపరేషన్లు చేశారు. ఇప్పటి వరకు 300 ఆపరేషన్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తొమ్మిది లక్షల రూపాయల ఆపరేషన్ల ఖర్చును ఆశ్రయ్-ఆకృతి భరించాయి. కేర్, అమ్రిత ఈఎన్‌టీ, అపోలో, మెడీ కవర్ ఆసుపత్రుల్లో బధిర బాధిత బాలబాలికలకు ఆపరేషన్లు చేశారు.

అందరినోట మాట రావడం సంతోషకరం



వినికిడి లోపంతో బాధపడేవారికి ఆపరేషన్లు చేసి పునీతులం కావాలని సంకల్పించాం. మనసులో తట్టిన ఆలోచనను ఆచరణలో పెట్టాం. ఎన్ని ఆటంకాలు ఎదురైన విశ్రమించకుండా పనిచేశాం. అనుకున్నది సాధించాం. అందరి నోట మాట రావడం మాకెంతో సంతోషంగా ఉంది.

–బాబు దీపికే, ఆశ్రయ్-ఆకృతి, ఎండీ

కాక్లియర్ మిషన్లు కూడా ఉచితం



ఆపరేషన్లతో పాటుగా కాక్లియర్ మిషన్లు ఉచితంగా అందజేశారు. సర్జరీ తర్వాత రెండేళ్ళు స్పీచ్ థెరఫీ చేయించుకోవాలని తెలిపారు. ఏడాదికి రెండు కొనాలనే నిబంధన ఉంది. ఈ కాంక్లియర్ మిషన్లు పాడైతే ఐదు లక్షలు ఖర్చు అవుతాయని వైద్యులు చెప్పారు. ఇప్పుడు మా బాబు సాత్విక్ మాట్లాడుతున్నారు.

–సాత్విక్ తల్లిదండ్రులు, బాచుపల్లి

అనువంశిక ప్రభావం అందరిపై ఉండదు



మేనరికపు వివాహాల ప్రభావం మూడు తరాలు దాటితే అధికంగా ఉండవచ్చు. మూగ, చెవిటి వారు పుట్టారని ఎవరూ ఆందోళన చెందవద్దు. మాటలు రాని పిల్లలు ఐదేళ్ల లోపే సర్జరీ చేసుకుంటే ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

–డాక్టర్ గ్రీష్మ పుల్లూరి, అమ్రిత ఈఎన్‌టీ ఆసుపత్రి

ముదిరాజ్‌ల డిమాండ్లను నెరవేర్చాలి


అభివాదం చేస్తున్న ముదిరాజ్ సంఘాల ప్రతినిధులు

పలు సంఘాల నేతల డిమాండ్

పంజగుట్ట: గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రతీ సభలో ముదిరాజ్‌లపై వరాల జల్లు కురిపించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పుడు వారిని పట్టించుకోక పోవడం దారుణమని పలు ముదిరాజ్ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో 'జనాభాలో మేమెంతో మాకు అన్ని అవకాశాలు ఇవ్వాలి'అన్న డిమాండ్‌తో ముదిరాజ్ సంఘాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఉప్పరి నారాయణ, పిట్ల నగేష్, సుధాకర్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 12 శాతానికిపైగా ఉన్న ముదిరాజ్‌లను బీసీ 'డి'గ్రూప్ నుంచి బీసీ 'ఏ'గ్రూప్‌లోకి మార్చాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. వెంటనే తమను బీసీ ఏ గ్రూపులోకి మార్చాలని, మంత్రివర్గంలో రెండు స్థానాలు కల్పించాలని, రెండు ఎమ్మెల్సీ పదవులు కేటాయించాలని, ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గత ప్రభుత్వానికి పట్టినగతే కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా పడుతుందని, త్వరలోనే ప్రత్యక్ష కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో నేతలు గొడుగు శ్రీనివాస్, శివ, తెలంగాణ సంపత్, అశ్విని, సాయికిరణ్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల డేటా బేస్‌కు 'అపార్' కీలకం

అంబేడ్కర్ వర్సిటీ వీసీ డాక్టర్ ఘంటా చక్రపాణి


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న అంబేడ్కర్ వర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: విద్యార్థుల డేటా బేస్ నమోదు, విద్యా సంబంధిత విషయాలు ఒకే దగ్గర నమోదై ఉండాలన్నా, దేశవ్యాప్తంగా ఆ విద్యార్థి అకాడమిక్ సంబంధిత విషయాలన్నీ ఒకే దగ్గర నమోదు చేయడానికి 'ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) ఐడీ తప్పనిసరి అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఘంటా చక్రపాణి అన్నారు. వర్సిటీ సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రెనింగ్ అండ్ డెవలప్‌మెంట్(సీఎస్‌టీడీ), తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో 'అపార్ అమలు'అనే అంశంపై రెండురోజుల వర్క్‌షాప్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం-2020లో భాగంగా యూజీసీ మార్గదర్శకాల ప్రకారం అపార్ ఐడీలను రూపొందించడంలో జాతీయ స్థాయిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం గుర్తింపు పొందడం గర్వకారణమని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి, సీఎస్‌టీడీ డైరెక్టర్ పరాంకుశం వెంకటరమణ మాట్లాడుతూ స్కాలర్‌షిప్, ఇతర విద్యా సంబంధిత విషయాల్లో ఆర్థిక సహాయం పొందాలన్నా అపార్ ఐడీ తప్పనిసరి అని అన్నారు. కార్యక్రమంలో డిజిటల్ ఇండియా కార్పొరేషన్(న్యూఢిల్లీ) అధికారులు రోహిత్‌సింగ్, రోహిత్ కశ్యప్, రవి పాండే, అన్ని విశ్వవిద్యాలయాల నుంచి ముగ్గురు ప్రతినిధులు, కళాశాల విద్యాశాఖ, ఇంటర్మీడియెట్ బోర్డు, టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగాల నుంచి 60 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: మహిళా దినోత్సవం- 2025 సందర్భంగా సోమవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ మహిళా విభాగం రూపొందించిన పోస్టర్‌ను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు మంజులారెడ్డి, కార్యదర్శి సునీతాజోషి, డాక్టర్ అమరావతి జ్యోతి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణ యాదవ్, ఆశన్న, ఖాదర్, శ్రీరామ్, వెంకటరమణారెడ్డి, అపర్ణ సంధ్య, నాగలక్ష్మి, స్నేహాలి, సునీత తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- కవికోకిల దువ్వూరి రామిరెడ్డి విజ్ఞాన సమితి, శ్రీమతి పొణకా కనకమ్మ ఆశయసాధన సమితి సంయుక్త ఆధ్వర్యంలో అబిడ్స్‌లోని రాజబహదూర్ వెంకటరామారెడ్డి భవన్‌లో ఉదయం 10:30 గంటలకు 'పినాకినీ రత్నదీపం - శ్రీమతి పొణకా కనకమ్మ'గ్రంథ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుంది.
- ఒయాసిస్ ఫెర్టిలిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు జూబ్లీహిల్స్ రోడ్ నెం .9లోని ఓషర్మ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరుగుతాయి.
- నాలెడ్జి సిటీలోని టీవర్క్స్ ప్రాంగణంలో ఏక్ చిత్రా సంస్థ ప్రతిష్టాత్మకంగా 'లివింగ్ టెంపుల్'పేరిట నిర్వహించిన సాంస్కృతిక సౌరభం కార్యక్రమం ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు సందర్శకులు ఉచితంగా ప్రదర్శనలను తిలకించే అవకాశం
- జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-69, నందగిరి హిల్స్‌లోని అన్ని హస్తకళాకృతులపై డిస్కౌంట్ కల్పిస్తున్న లేపాక్షి హ్యాండీ క్రాఫ్ట్స్ ఎంపోరియం ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- తెలంగాణ పరిశ్రమల శాఖ, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఉదయం 9 గంటలకు నేషనల్ సేఫ్టీ డే ఉత్సవాలు జరుగుతాయి.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

కార్గోలో జీఎంఆర్ గణనీయ వృద్ధి

శంషాబాద్: కార్గో ఎగుమతులు, దిగుమతుల్లో జీఎంఆర్ హైదరాబాద్ కార్గో విమానాశ్రయం గణనీయమైన వృద్ధిని సాధించినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. 2023 ఆర్థిక సంవత్సరం కంటే 2024లో 22 శాతం పెరుగుదల నమోదైందని తెలిపారు. 2024లో అంతర్జాతీయంగా, దేశీయంగా కలుపుకుని మొత్తం 1,80,914 మెట్రిక్ టన్నుల కార్గో నిర్వహణ జరిగినట్లు తెలిపారు. ఇందులో ఇంజినీరింగ్, ఎల్రక్టానిక్, ఔషధ వస్తువుల కదలికల్లో అధికంగా వృద్ధి నమోదైందని పేర్కొన్నారు. కేంద్ర కస్టమ్స్ బోర్డు(సీబీఐసీ) ప్రచురించిన నేషనల్ టైమ్ రిలీజ్ స్టడీ-2024 ప్రకారం కార్గో దిగుమతుల విడుదల సమయాల్లో హైదరాబాద్ విమానాశ్రయం రెండోదఫా ఉత్తమ విమానాశ్రయంగా నిలిచింది. ఎగుమతుల విడుదల సమయాల్లో రెండో ఉత్తమ విమానాశ్రయంగా నిలిచిందని తెలిపారు. గ్రౌండ్ హ్యాండ్లింగ్, భద్రతా ప్రమాణాల్లో మేటిగా వ్యవహరించడంతోపాటు అమెరికా కస్టమ్స్ ట్రేడ్ పార్టనర్‌షిప్ అగైన్స్ టెర్రరిజం సర్టిఫికెట్ సాధించింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న వాణిజ్య, ఆర్థికాభివృద్ధితో కార్గో రంగంలో గణనీయమైన వృద్ధి నమోదవుతుందని ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ పణికర్ తెలిపారు.

హైదరాబాద్ రెండో రాజధానిగా ఉండాలి

– ప్రకాష్ యశ్వంత్ అంబేడ్కర్


మాట్లాడుతున్న ప్రకాష్ యశ్వంత్ అంబేడ్కర్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: దేశ రక్షణ నిమిత్తం హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధానిగా ఏర్పాటు చేయాలని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనవడు ప్రకాష్ యశ్వంత్ అంబేడ్కర్ డిమాండ్ చేశారు. దేశ రెండో రాజధానిగా హైదరాబాద్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీ పాకిస్తాన్ సరిహద్దు నుంచి కేవలం 300 కిలోమీటర్ల దూరంలో ఉందని, శత్రుదేశాలు దేశ రాజధానికి దగ్గర ఉండటం దేశ రక్షణకు శ్రేయస్కరం కాదన్నారు. భారత దేశం బలమైన ప్రజా స్వామిక దేశంగా ఎదగాలంటే కులమతాలకు అతీతంగా అందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ హైదరాబాద్ రెండో రాజధాని అనే అంశంపట్ల లోతైన చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. నదీ జలాలు, యూనివర్సిటీలతోపాటు ప్రతి రంగంలోనూ కేంద్ర ప్రభుత్వం ఆదిపత్యం ధోరణిని కొనసాగిస్తోందని విమర్శించారు. హైదరాబాద్‌లో సుప్రీం కోర్టు ప్రత్యేక బెంచ్‌ని ఏర్పాటు చేయాలని కోరారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కీలకమైన అంశాల పట్ల సమన్యాయం కావాలని, హైదరాబాద్‌కు అన్ని విధాలుగా న్యాయం జరిగేటట్లు ఉండాలని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం అన్ని రాష్ట్రాలకు సమాన వాటా కల్పించాలన్నారు. ప్రముఖ సామాజిక వేత్త సంపత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి నర్సమ్మ, ప్రొఫెసర్ వెంకట్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలి


ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

- అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ఆదేశాలు
- గ్రేటర్ పరిధిలో వచ్చిన అర్జీలు 193

లక్డీకాపూల్: 'ప్రజావాణి'లో వచ్చిన విన్నపాలకు ప్రాధాన్యం ఇచ్చి సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంజీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డితో కలిసి కమిషనర్ స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ ఒకే సమస్యపై అర్జీదారు పదే పదే ప్రజావాణి చుట్టూ తిరగకుండా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. శ్రీలతాశోభన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఆర్జీల పరిష్కారంలో జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 107 దరఖాస్తులు వచ్చాయి. ఫోన్ ఇన్ ద్వారా 7 ఫిర్యాదులు అందాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 86 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, వేణుగోపాల్, పంకజ, గీతా రాధిక, రఘు ప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, సుభద్రదేవి, యాదగిరి రావు తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ

– జేఎన్‌టీయూహెచ్‌లో ప్రారంభం


శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ కిషన్ కుమార్ రెడ్డి తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: బోధనేతర సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్‌రెడ్డి అన్నారు. జేఎన్‌టీయూహెచ్‌లో 'బోధనేతర సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి'అనే శిక్షణ కార్యక్రమాన్ని యూజీసీ- మాలవ్యా మిషన్ టీచర్ ట్రెనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మార్చి 3 నుంచి 6 వరకు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి కిషన్ కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వీసీతోపాటు రెక్టర్ డా. కె.విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె.వెంకటేశ్వర రావు, కన్వీనర్ డా.ఎం.సుష్మ, కోఆర్డినేటర్ డా.మెరుగు సురేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ పరిపాలనా వ్యవహారాల్లో ప్రధానమైన అధికారిక కమ్యూనికేషన్, నోట్ తయారీ (డ్రాఫ్టింగ్) వంటి పరిపాలనా నైపుణ్యాల ప్రాముఖ్యతను గుర్తించాలని సూచించారు. బోధనేతర సిబ్బందికి అధికారిక పత్రాలు స్పష్టంగా, నిర్దిష్టంగా రాయడం ఎంతో ముఖ్యమైన విషయమని అన్నారు. కంప్యూటర్ నైపుణ్యాలు, ఆడిట్ సమాధానాలు, బడ్జెట్, ఖర్చుల నిర్వహణ, కొనుగోలు విధానాలు వంటివి పాలనా రంగంలో ప్రధానమైన అంశాలుగా మారాయని వివరించారు.

మూసీ నిర్వాసితులకు మేధాపాట్కర్ పరామర్శ


మేధాపాట్కర్‌ను వెనక్కి పంపిస్తున్న చాదర్‌ఘాట్ పోలీసులు

అనుమతి లేదంటూ తిప్పి పంపిన పోలీసులు


బాధితులను పరామర్శించి బయటకు వస్తున్న మేధాపాట్కర్


చాదర్‌ఘాట్: ప్రముఖ సామాజిక కార్యకర్త మేధాపాట్కర్ సోమవారం ఓల్డ్ మలక్‌పేట శంకర్‌నగర్‌లో మూసీ సుందరీకరణ నిర్వాసితులను పరామర్శించడానికి వచ్చారు. కొంతమంది నిర్వాసితులను పరామర్శించే క్రమంలో సమాచారం తెలుసుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు వచ్చి ఆమెను అడ్డుకున్నారు. అనుమతి లేకుండా సమావేశాలు, పరామర్శలు చేయకూడదని స్థానిక డీఐ రాజు అభ్యంతరం తెలిపారు. వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మేధాపాట్కర్‌ను అక్కడి నుంచి వెనక్కి పంపించి వేశారు. ఈలోపు ఒకే ఇంట్లో 25 మంది నిర్వాసితులు ఉన్న ముజాయిద్ కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. అనంతరం ఆమె అక్కడి నుంచి వెళ్లిపోయారు.

18న బీసీ మహిళల 'చలో ఢిల్లీ'



కాచిగూడ: పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని కోరుతూ ఈ నెల 18, 19 తేదీల్లో 'చలో ఢిల్లీ'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా ఉపాధ్యక్షురాలు మట్టా జయంతి తెలిపారు. మట్ట జయంతి ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆవిష్కరించారు. అనంతరం కాచిగూడలో మట్ట జయంతి మీడియాతో మాట్లాడుతూ మహిళా బిల్లు గురించి గొంతులు చించుకొని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బీసీ మహిళల గురించి వారికి జరుగుతున్న అన్యాయాల గురించి, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీసీలంటే చిన్న చూపా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో మొక్కుబడిగా తీర్మానం చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుందా అని అన్నారు. కార్యక్రమంలో స్వప్న, రమా, శ్రీనివాస్, ఉదయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.





డైట్ నుంచి మెడిసిన్ వరకూ అన్నీ మొబైల్‌లోనే
వైద్యుల సంప్రదింపులు, పరీక్షలు సైతం
జెనెటిక్ వెల్‌నెస్, ఫేస్‌స్కాన్‌లూ వస్తున్నాయ్
నగరవాసుల ఆరోగ్యానికి అనుసంధానంగా స్మార్ట్ ఫోన్



అరచేతిలో ఆరోగ్యం..

సర్వం స్మార్ట్ మయం

పంజాగుట్టలోని ఆఫీస్‌లో కంప్యూటర్ సిస్టమ్ ముందు దీక్షగా పనిచేస్తున్న రవిరాజ్‌కి ఒక్కసారిగా కళ్లు బైర్లు కమ్మాయి.. నిలుచుంటే తూలి పడిపోతానేమో అని ఫీలింగ్, వెంటనే మొబైల్ చేతిలోకి తీసుకుని వేళ్లు కదిపాడు. అంతే.. నిమిషాల వ్యవధిలోనే అతని శారీరక, మానసిక పరిస్థితుల స్టేటస్ చార్ట్ సిద్ధమవడం, వ్యక్తిగత వైద్యునికి చేరడం, జాగ్రత్తలు, మందుల జాబితా రవిరాజ్‌కి చేతికి రావడం జరిగిపోయింది.

నగరానికి చెందిన ఐటీ ఉద్యోగి నవీన్‌కి మూడేళ్ల బాబు.. ఉన్నట్లుండి అర్ధరాత్రి రెండు గంటలకు తీవ్ర జ్వరం, ఇతర ఆరోగ్య సమస్య తలెత్తింది.. అదే సమయంలో నవీన్ ఇంట్లో లేకపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి.. ఆయన భార్య మొబైల్ యాప్ సహాయంతో ఆన్‌లైన్‌లో డాక్టర్‌ని సంప్రదించారు. డాక్టర్ సలహా మేరకు వెంటనే మందులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టడంతో సమస్య నుంచి పరిష్కారం లభించింది. ఇలా ఇటీవల కాలంలో ఆన్‌లైన్‌లో డాక్టర్ కన్సల్టేషన్ తీసుకునేవారు అనేకం.. ఈ నేపథ్యంలో దీని గురించిన మరిన్ని విషయాలు..

– సాక్షి, సిటీబ్యూరో





రవిరాజ్ మాత్రమే కాదు పలువురు నగరవాసులు ఆరోగ్య సమస్యల పరిష్కారంలో స్మార్ట్ ఫోన్‌పైనే ఆధారపడుతున్నారు. కోవిడ్ సమయంలో ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో పలువురు టెక్నాలజీని బాగానే ఔపోసన పట్టారు. అనంతర పరిణామాల క్రమంలో ఆరోగ్యంపై పెరిగిన అవగాహన మొబైల్స్‌ని పలువురికి మెడికల్ అసిస్టెంట్లుగా మార్చేశాయి. తొలుత సకాలంలో వైద్యసేవలను మాత్రమే అందించిన మొబైల్ ఫోన్ యాప్స్ ద్వారా ఇప్పుడు విభిన్న రకాలుగా ఆరోగ్యరక్షణలోనూ కీలకపాత్ర పోషిస్తోంది.

ప్రివెంటివ్..కేర్

అనారోగ్యాలకు చికిత్సతో పాటు కొన్ని యాప్‌లు ప్రధానంగా ప్రివెంటివ్ హెల్త్ కేర్‌పై దృష్టి పెడుతున్నాయి. వైద్యులు, శిక్షకులను అందుబాటులోకి తెస్తున్నాయి. వ్యక్తి రోజువారీ ఫిట్‌నెస్ స్థాయిలు, రక్తపోటు హెచ్చుతగ్గులు, రక్తంలో చక్కెర స్థాయిలు వగైరాలన్నీ పర్యవేక్షిస్తూ మార్పుచేర్పులపై హెచ్చరిస్తున్నాయి. వినియోగదారులతో వైద్యులకు రిమోట్ యాక్సెస్ అందించే యాప్స్ ద్వారా వ్యక్తులు తమ పరిస్థితిని డాక్టర్‌కు వివరించడానికి చాట్ చేసే సౌకర్యం, వీడియో కాల్స్ వంటివెన్నో అందుబాటులోకి తెచ్చాయి.

యాప్స్ ద్వారా జెనెటిక్ వెల్‌నెస్..

‘డాక్టర్ దగ్గరకు వెళితే ప్రిస్క్రిప్షన్ రాస్తాడు. రోగం తగ్గిపోగానే ఆ ప్రిస్క్రిప్షన్ విసిరేస్తాం. కానీ వాటిని జాగ్రత్త చేయం. కానీ ఆ ప్రిస్క్రిప్షన్ చాలా అవసరం అనే విషయం గ్రహించం. భవిష్యత్తులో ఆరోగ్య చికిత్సలకు ఇది చాలా కీలకం. అందుకే డిజిటల్ హెల్త్ రికార్డ్స్ అందుబాటులోకి తెచ్చాం’ అంటూ చెప్పారు నగరానికి చెందిన హెల్త్‌కేర్ సంస్థ ఆసియానా నిర్వాహకులు సత్యనారాయణ. ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల విషయంలో జీన్స్ ప్రాధాన్యతను గుర్తిస్తూ సరికొత్త ఆన్‌లైన్ ఆరోగ్య వేదికను రూపకల్పన చేశారాయన. ప్రతి డయాబెటిక్ రోగికి తక్షణ చికిత్సగా మెట్ మార్ఫిన్ ఇస్తారని, కానీ వంశ పారంపర్యంగా వచ్చిందా, జీవనశైలి ద్వారా వచ్చిందా? అని గుర్తించాకే ట్రీట్‌మెంట్ ఇవ్వాలనీ అంటున్నారాయన. దీనికి వ్యక్తి ఆరోగ్య చరిత్ర, ఫ్యామిలీ హిస్టరీ వంటివన్నీ డిజిటల్ రికార్డ్స్‌గా భద్రపరచి యాప్స్‌తో అనుసంధానిస్తే ఆరోగ్య సమస్యలకు మరింత మెరుగైన పరిష్కారం లభిస్తుంది అంటున్నారాయన.



వంశ ఆరోగ్య చరిత్ర తెలిస్తే..

జెనెటిక్ వెల్‌నెస్ కోసం జెనెటిక్ టెస్టులు సైతం అందుబాటులోకి తెచ్చారు. భవిష్యత్తులో ఎలాంటి వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి? వంటివి సైతం గుర్తించవచ్చు. తద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చు. అలాగే ఒక డాక్టర్ దగ్గరకి వెళ్లినప్పుడు అతని జీన్స్ ప్రకారం ఏ మెడిసిన్ ఇవ్వొచ్చు? ఇవ్వకూడదు? వంటివి కూడా సూచించగలుగుతున్నారు. అలాగే న్యూట్రిషనిస్ట్ దగ్గరకు వెళ్లినప్పుడు కూడా నప్పే, నప్పని ఆహారంపైనా ముందస్తు సూచనలు అందించేలా ఈ యాప్స్ వెల్‌నెస్ ప్రోగ్రామ్స్ డిజైన్ చేస్తున్నాయి.

సరికొత్త సేవ ఫేస్‌స్కాన్..

ఎవరైనా తమ హెల్త్ ఎలా ఉంది? అని తెలుసుకోవాలి అనుకుంటే ఫేస్‌స్కాన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. కేవలం 30 సెకన్లలోనే 25 రకాల పరిశీలనలను ఇది అందిస్తుంది. ఇది కూడా యాప్ ద్వారానే సాధ్యమవుతోంది. అలాగే ఒక వెల్‌నెస్ ప్రోగ్రామ్‌లో జాయిన్ అయ్యాక ఇంప్రూవ్‌మెంట్ ఎలా ఉంది? అనేది సమీక్షించుకునేందుకు కూడా ఈ ఫేస్ స్కాన్ ఉపకరిస్తోంది. హార్ట్ రేట్, థైరాయిడ్, కొలెస్ట్రాల్ శాతం, వాస్క్యులార్ రిస్క్, షుగర్ కంటెంట్, హైపర్ గ్లైసీమియా.. వంటివాటికి సంబంధించిన విశేషాలన్నీ స్కాన్ చేసి చెబుతుంది. ఈ ఫలితాలను బట్టి అవసరమైతే మరిన్ని వైద్య పరీక్షలు చేయించుకోవచ్చు.

వర్చువల్ కేర్‌పై అవగాహన..



కోవిడ్ తర్వాత వర్చువల్ కేర్‌పై అందరికీ ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలోనే రోగులకు వైద్యసేవలకు మధ్య ఉన్న ఖాళీని పూరించేందుకు డిజిటల్ ప్లాట్ ఫార్మ్ ఏర్పాటు చేశాం. డిజిటల్ కన్సల్టేషన్, ఫార్మసీ కన్సల్టేషన్స్, ల్యాబ్ కన్సల్టేషన్స్ అన్నీ అందిస్తున్నాం. ఫేస్ స్కాన్, జెనెటిక్ వెల్‌నెస్ వంటి అత్యాధునిక సేవలను అందుబాటులోకి తెచ్చాం.

– సత్యనారాయణ వంటిపల్లి, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్, ఆసియానా హెల్త్‌కేర్

నేటి వరకూ
లివింగ్ టెంపుల్

సందర్శకుల తాకిడితో ప్రదర్శన పొడిగింపు



రాయదుర్గం : హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీవర్క్స్ ప్రాంగణంలో ఏక్ చిత్రా సంస్థ ప్రతిష్టాత్మకంగా ‘లివింగ్ టెంపుల్’ పేరిట నిర్వహించిన సాంస్కృతిక సౌరభం మంగళవారం వరకూ పొడిగించారు. సందర్శకులు, పలువురు ప్రముఖుల నుంచి వచ్చిన విజ్ఞప్తిని దృష్టిలో పెట్టుకొని ప్రదర్శనను పొడిగించినట్లు ఏక్‌చిత్రా సంస్థ నిర్వాహకులు, లివింగ్ టెంపుల్ రూపకర్త అన్నపూర్ణ మడిపడగ సోమవారం వివరించారు. భారతీయ ఆలయ సంస్కృతి, వారసత్వాన్ని చాటేలా కళాకారులు రూపొందించిన శిల్పాలు, కళా నైపుణ్యాలతో కూడిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ సందర్శకులు ఉచితంగా ప్రదర్శన తిలకించే అవకాశం కల్పించినట్లు తెలిపారు.



ఎలైట్ ఎలివేటర్స్ ఆవిష్కరణ

ఎక్స్ 300 ప్లస్‌తో అధునాతన హోమ్ లిఫ్టులు

సాక్షి, సిటీబ్యూరో: వినూత్న సాంకేతికత ఎక్స్ 300, ఎక్స్ 300 ప్లస్‌తో అత్యంత సంరక్షణను అందించే హోమ్ లిఫ్టులను నగరంలో మొదటిసారి ఆవిష్కరిస్తున్నామని ఎలైట్ ఎలివేటర్స్ సీఈఓ విమల్ బాబు తెలిపారు. నగర వేదికగా ఎలైట్ ఎలివేటర్స్ ఆధ్వర్యంలో ఒక సెకనుకు ఒక మీటరు వరకూ వేగాన్ని అందుకునే అధునాతన సాంకేతికతతో హోమ్ లిఫ్టులను ఆవిష్కరించారు. మారుతున్న అధునాతన జీవనశైలికి అనుగుణంగా సాంకేతికతలు మారాల్సిన అవసరముందని, ఇందులో భాగంగానే యాప్ ఆధారిత పనివిధానాన్ని చూపించే టెక్నాలజీని నగరంలో ప్రారంభించామన్నారు. రిమోట్ డయోగ్నస్టిక్స్ కోసం అత్యాధునిక క్యాన్‌బస్ కనెక్టివిటీని వినియోగించామని విమల్ పేర్కొన్నారు. పర్యావరణ సంరక్షణలో భాగంగా రీసైకిల్ చేసే విధంగా తమ ఉత్పత్తులు ఉన్నాయని, మరి కొద్ది రోజుల్లో తమ సాంకేతికతను యూఎస్ఏ, కెనడాలో ఆవిష్కరించనున్నామన్నారు.

కంటి ఆరోగ్యం కోసం
టెక్నిస్ ప్యూర్‌సీ

సాక్షి, సిటీబ్యూరో : కంటి ఆరోగ్య సమస్య అయిన ప్రెస్బియోపియా బాధితుల కోసం, టెక్నిస్ ప్యూర్‌సీ పేరిట రిఫ్రాక్టివ్ ఇంట్రాక్యులర్ లెన్స్ (ఐఓఎల్) అందుబాటులోకి వచ్చింది. ఈ విషయాన్ని జాన్సన్ అండ్ జాన్సన్ సర్జికల్ విజన్ కంట్రీ మేనేజర్, బుర్జిస్ షహానా ఓ ప్రకటనలో తెలిపారు. విభిన్న దూరాల్లో కంటి చూపు సమస్యలు ఎదుర్కొంటున్న కంటి రోగులకు ఇది అత్యుత్తమ ఉపశమనాన్ని అందిస్తుందని, సర్జన్లకు సైతం పలు ఆప్షన్లు అందుబాటులోకి తెస్తుందని వివరించారు.

పిల్లలపై
పేరెంటల్ కంట్రోల్



సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ విప్లవ నేపథ్యంలో తమ పిల్లల భద్రతపై ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులకు ఉపకరించేలా అమెరికాకు చెందిన పేరెంట్ జీనీ ఇంక్ లొకేషన్–బేస్డ్ పేరెంటల్ కంట్రోల్ యాప్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ విషయాన్ని సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శశి నాగ తెలిపారు. డిజిటల్ యుగంలో టెక్నాలజీని బాధ్యతాయుతంగా ఉపయోగించుకునేలా పిల్లలను మార్గనిర్దేశం చేయడానికి. ఆరోగ్యకరమైన డిజిటల్ సరిహద్దులను ఏర్పరచడానికి ఈ యాప్ ఉపకరిస్తుందని ఈ వెంచర్‌లో ప్రముఖ నటుడు ఆర్ మాధవన్ సైతం భాగస్వామిగా వ్యవహరిస్తున్నారని వివరించారు.

క్వేక్ అరీనాలో అగమ్ లైవ్..

మార్చ్ 6న ఉర్రూతలూగించే కార్యక్రమం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని క్వేక్ అరీనా వేదికగా మార్చ్ 6వ తేదీన తెలుగు, తమిల్, హిందీ, మళయాల ఫేం ‘అగమ్ లైవ్’ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కర్నాటిక్ ప్రోగ్రెసివ్ రాక్ యాక్ట్ నేపథ్యంతో నిర్వహిస్తున్న ఈ ఆసియా అతిపెద్ద క్లబ్ లైవ్‌లో సాంస్కృతిక, అధునాతన సంగీత, సాహిత్యవెల్లువలను ప్రదర్శించనున్నామని అగమ్ బృందం తెలిపింది. రాత్రి 8 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ లైవ్‌కు సంబంధించిన పాస్‌లను బుక్‌మై షోలో పొందవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు.

నైపుణ్యాల వేదిక
స్కిల్ కార్నివాల్

విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో నిర్వహణ



సాక్షి, సిటీబ్యూరో : నగరానికి చెందిన విశ్వం ఎడ్యుటెక్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 18వ స్కిల్ కార్నివాల్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. అబాకస్, వేద గణిత, స్పెల్లింగ్ బీ వంటి విజ్ఞాన, నైపుణ్యాలకు చెందిన ఈ స్కిల్ కార్నివాల్‌లో వివిధ దశల్లో వేలాది మంది పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కూకట్‌పల్లి వేదికగా నిర్వహించిన కార్నివాల్‌లో ఐదు రాష్ట్రాలకు చెందిన 7 వేల పాఠశాలల నుంచి 300 మంది విద్యార్థులు ఈ జాతీయ స్థాయి పోటీకి అర్హత సాధించారు. ఈ ఎంపిక ప్రక్రియలో పాఠశాల స్థాయిలో 5 లక్షల మంది విద్యార్థులు, జిల్లా స్థాయిలో జిల్లాకు దాదాపు 800 మంది విద్యార్థులు, రాష్ట్ర స్థాయిలో రాష్ట్రానికి 800 మంది విద్యార్థులు ఉన్నారని విశ్వం ఎడ్యుటెక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హరి చరణ్ తెలిపారు. విశ్వం ఎడ్యుటెక్ జాతీయ విజేతలు విదేశాల్లో ప్రయాణించడానికి, అంతర్జాతీయ అబాకస్ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.. వారి నైపుణ్యాలను ప్రదర్శించడానికి అనువైన ప్రపంచ వేదికను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విశ్వం ఎడ్యుటెక్ న్యూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ప్రోగ్రామ్ ‘ఫైనాన్షియల్ లిటరసీ అండ్ ఎంటర్‌ప్రూనర్‌షిప్’ను ప్రారంభించింది. విశ్వం ప్రయత్నాలు, వినూత్న కార్యక్రమాలు విద్యార్థుల నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించే ప్రధాన విలువలతో రూపొందించబడ్డాయని సంస్థ వ్యవస్థాపకులు పీపీఆర్ విశ్వం తెలిపారు. న్యూ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 నైపుణ్య కార్యక్రమంతో విద్యార్థుల 21వ శతాబ్దపు నైపుణ్యాలను మార్చడానికి కంపెనీ గణనీయమైన కృషి చేస్తోందని చెప్పారు.

ఆకట్టుకున్న హోరి ప్రదర్శన



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.7లో ఆద్యం హ్యాండ్ ఓవెన్, ఓరో జ్యువెల్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కథక్ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హోరి పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో న్యూయార్క్‌లో ప్రసిద్ధిగాంచిన కథక్ కళాకారులు బర్ఖా పటేల్, తన్వీనర్ ఆలం కథక్‌తో వివిధ పాటలకు నృత్యాలు చేస్తూ అలరింపజేశారు. కేవలం వస్త్రధారణలో సంప్రదాయాన్ని, సంస్కృతిని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ కథక్ నృత్య ప్రదర్శన నయనానందకరంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ అజయ్ మిశ్రా, డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క సతీమణి నందిని మల్లు, టర్కీ కౌన్సిల్ జనరల్ ఉర్హాన్, ఫిక్కీ ఫ్లో చైర్‌పర్సన్ ప్రియా గజ్జర్, అక్షత్, మనీష్, అన్వేష్, విశేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితం కోసం..

- పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సహాయం
- వలస కూలీలకు మాషా అల్లా పేరిట కిచెన్
- సకీనా ఫౌండేషన్ ద్వారా మహిళా సాధికారతకు కృషి
- ఆసిఫ్‌హుస్సేన్ సోహెల్ సేవలపై ప్రశంసలు

సమాజ హితం కోసం తాను ఏదో చేయాలనుకున్నాడు.. అనుకున్నదే తడవుగా.. తనకు తోచిన మేరకు పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాహాయం చేస్తున్నాడు. అంతటితో ఆగకుండా ఆపదలో ఉన్న పలువురు బస్తీ వాసులకు ఆపద్బాంధవుడిగా నిలుస్తున్నాడు. మురికి వాడల్లో నివసించే పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాడు. ఓ వైపు రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటూనే సమాజ సేవలోనూ ముందు వరుసలో ఉంటున్నాడు.. - గోల్కొండ



నగరంలో గోల్కొండకు చెందిన ఆసిఫ్‌హుస్సేన్ సోహెల్ సమాజంలో మార్పు కోసం తన వంతు కృషి చేస్తున్నాడు. మురికివాడల్లో చదువుకు నోచుకోని నిరుపేద విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నాడు. చదువు మధ్యలో ఆపేసిన వారిని గుర్తించి వారికి అవగాహన కల్పించి, పై చదువులకు ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడం వంటి కార్యక్రమాలు చేస్తున్నాడు. దీంతో పాటు ఆయా మురికి వాడల్లోని మహిళల సాధికారత కోసం సకీనా ఫౌండేషన్ ద్వారా సలహాలు, సూచనలు ఇస్తూ.. వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్నాడు. మహిళలకు ఉచితంగా వివిధ ఉపాధి పథకాల్లో శిక్షణ ఇప్పిస్తున్నాడు. పేదల బస్తీలైన విరాట్‌నగర్ వంటి ప్రాంతాల్లో ఫ్యాషన్ డిజైనింగ్, ఫస్ట్ ఎయిడ్, జిగ్ జాగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇప్పిస్తున్నాడు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా, వారి ఆర్థిక స్థితికి తోడ్పడుతూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాడు.

వలస కూలీలకు అండగా..

నగరంలో అది పెద్ద లేబర్ అడ్డాల్లో టోలిచౌకీ లేబర్ అడ్డా ఒకటి. పొరుగు రాష్ట్రాల నుంచే కాకుండా నగర పరిసరాల నుంచి ఎందరో నిరుపేదలు ఉపాధి కోసం స్థానిక లేబర్ అడ్డాలకు వస్తుంటారు. పని దొరకక వారిలో అనేక మంది రోజుల తరబడి పస్తులు ఉంటుంటారు. ఇది గమనించిన ఆసిఫ్ హుసేన్స్ సోహెల్ సూర్యనగర్ కాలనీలో మాషా అల్లా పేరిట కిచెన్ ఏర్పాటు చేశాడు. దీని ద్వారా నిత్యం 250 మందికి మధ్యాహ్న సమయంలో భోజనం అందిస్తున్నాడు.



కరోనా సమయంలో..

కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో వలస కూలీలకు తాను అండగా ఉన్నానంటూ నిత్యావసరాలు అందించడంతో పాటు వలస కూలీలు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు ఉచిత రవాణా కల్పించాడు. టోలిచౌకీ ముంపు కాలనీగా పేరుగాంచిన నదీమ్ కాలనీలో వరదల సమయంలో బోట్లతో రంగంలోకి దిగి ఎందరినో సురక్షిత ప్రాంతాలకు తరలించాడు. వీటన్నింటికీ తోడుగా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ బస్తీలో రోగులకు వారి ఇంటి ముందే మందులు అందిస్తున్నారు. మున్ముందు కూడా సకీనా ఫౌండేషన్ ద్వారా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని సోహెల్ చెబుతున్నారు.

క్లుప్తంగా...

సీఎం మార్పే.. కాంగ్రెస్ కొత్త ఇన్‌చార్జి టాస్క్

బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల కొత్త ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు రాహుల్ గాంధీ ఇచ్చిన టాస్క్, ఆపరేషన్ ఒక్కటేనని.. అది సీఎం మార్పు అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన సోమవారం విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. వచ్చే జూన్, ఆగస్టు కల్లా రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు తథ్యమని 'ఏలేటి' జోస్యం చెప్పారు. పరోక్షంగా సీఎం మార్పునకు రాహుల్ గాంధీ సంకేతం ఇచ్చినట్లు తెలుస్తోందన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఇన్‌చార్జి చేతుల్లోనే రేవంత్ భవితవ్యం ఉందన్నారు. మీనాక్షి నటరాజన్ ఆశీర్వాదం ఉంటేనే రేవంత్ సీఎంగా కొనసాగుతారని 'ఏలేటి' స్పష్టం చేశారు. దీపాదాస్ మున్షీ స్థానంలో మీనాక్షిని తీసుకురావడంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాస్టర్ ప్లాన్ ఉందని, ఇలాంటి మిలటరీ మాస్టర్ ప్లాన్స్ ఉత్తమ్‌వేనని చెప్పారు. గతంలో ఇన్‌చార్జిగా కుంతియను తెచ్చుకున్నది ఆయనేనని గుర్తు చేశారు. ప్రతి అంశం ఢిల్లీకి చేరవేస్తున్నది.. రేవంత్‌ను ఏ పని చేయకుండా అడ్డుకుంటున్నది ఉత్తమ్‌కుమార్ రెడ్డే అనుకుంటున్నారని 'ఏలేటి' చెప్పారు.

మహేశ్వర్‌రెడ్డి మళ్లీ నిద్ర లేచాడు

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నాలుగైదు నెలల పాటు నిద్రపోయి.. ఇప్పుడు లేచారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. సినిమా స్క్రిప్టు తయారు చేసుకుని మీడియా ముందు పిట్ట కథలు చెబుతున్నారని, చెత్త వాగుడు వాగుతున్నారని విమర్శించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ త్వరలో సీఎం మారతారని, అందుకే మీనాక్షిని ఇన్‌చార్జిగా పంపారని ఆయన చెబుతున్న మాటలు కట్టు కథలన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల్లోని అసంతృప్తులు ఆయనకు కనిపించడం లేదన్నారు. ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ అసలు పార్టీ వైపు కూడా రావడం లేదని, ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి మొహం చూసేందుకు కూడా ఇష్టపడటం లేదన్నారు. పార్టీ అధ్యక్ష పదవి కోసం బీజేపీలో కొట్టుకు చస్తున్నారని, ఎంపీలు ఎవరి దుకాణం వారు చూసుకుంటున్నారని విమర్శించారు. మహేశ్వర్‌రెడ్డి చిలుక జోస్యం మానుకోకపోతే ఆయన భవిష్యత్తు గురించి తాము చెప్పాల్సి ఉంటుందని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.

హరీశ్ దుబాయ్ వెళ్లిన రోజే కేదార్ హత్య జరిగింది

- మార్చి ఆరో తేదీన పెళ్లి ఉంటే ఫిబ్రవరి 22న ఎందుకు వెళ్లారు?
- భువనగిరి ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: ప్రతి విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకునే బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తాను దుబాయ్‌కి ఎందుకు వెళ్లాడో చెప్పలేదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కుటుంబంలో వివాహం మార్చి ఆరో తేదీన ఉందని, మరి ఫిబ్రవరి 22నే ఎవరి పెళ్లికి బ్యాండ్ కొట్టడానికి ఆయన దుబాయ్ వెళ్లాడో చెప్పాలని డిమాండ్ చేశారు. లూటీ చేసిన పైసలు దాచుకోవడానికే హరీశ్‌రావు దుబాయ్ వెళ్లాడు తప్ప పెళ్లికి కాదని సోమవారం గాంధీభవన్‌లో విలేక రులతో మాట్లాడుతూ చెప్పారు. హరీశ్‌రావు దుబాయ్‌కి వెళ్లిన రోజే కేదార్ చనిపోయాడని తెలిపారు. హరీశ్‌కు శవ రాజకీయాలు, ఎలక్షన్లు, కలెక్షన్లు కొత్త కాదని, ఆయన డిక్షనరీలో మొదటి పదాలే అగ్గిపెట్టె, రాజీ నామాలని ఎద్దేవా చేశారు. కేదార్ హత్యపై దర్యాప్తు చేయిస్తే వాస్తవాలు నిగ్గు తేలుతాయని చామల అభిప్రాయపడ్డారు.

రాష్ట్రంలో పాలన చతికిలపడింది

మాజీమంత్రి జి.జగదీశ్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 15 నెలలుగా ప్రభుత్వ పాలన చతికిలబడి, రివర్స్ గేర్‌లో సాగుతోందని, అభివృద్ధి సూచికలు పాతాళానికి పడిపోతున్నాయని మాజీమంత్రి జి.జగదీశ్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి పాలన పట్ల చిత్తశుద్ధి, ప్రజలంటే కమిట్‌మెంట్ లేదని, అదే సమయంలో మంత్రులకు తమ శాఖలపై అవగాహన లేదని అన్నారు. రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకునేలా పాలన జరుగుతోందని ఆరోపించారు. శ్రీశైలం హైడల్ పవర్ ప్రాజెక్టులో ప్రమాదం జరిగితే కొన్ని నిమిషాల్లోనే తాను ప్రమాదస్థలికి బయలుదేరానని, 24 గంటలలోపే మృతదేహాలను కనుగొన్నామని చెప్పారు. కోటి రూపాయల నష్టపరిహారంతో పాటు మరణించిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రేవంత్ ప్రతిపక్షంలో ఉండగా ఆ ఘటనను రాజకీయం చేయబోతే అరెస్టు అయ్యారని అన్నారు. ప్రమాదం జరిగిన పది రోజుల తర్వాత ఎస్ఎల్‌బీసీ వద్దకు వెళ్లిన రేవంత్ చిల్లర మాటలు మాట్లాడారన్నారు. రేవంత్ మోదీ ఏజెంట్‌లా తయారయ్యారని చెప్పారు.

పుట్టిన తేదీకి బర్త్ సర్టిఫికెట్టే ఆధారం

2023, అక్టోబర్ 1 తర్వాత జన్మించిన చిన్నారులకు వర్తింపు

పాస్‌పోర్టు దరఖాస్తు నిబంధనల్లో మార్పు చేసిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: పాస్‌పోర్టు జారీ నిబంధనల్లో విదేశాంగ శాఖ కీలక మార్పు చేసింది. 2023, అక్టోబర్ 1న లేదా ఆ తర్వాత పుట్టిన వాళ్ల జనన ధ్రువీకరణ పత్రంగా వారి బర్త్ సర్టిఫికెట్‌ను మాత్రమే పొందుపరచాలని ఇటీవల గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ప్రకారం నిర్దేశిత తేదీకి ముందు జన్మించిన వారికి జనన ధ్రువీకరణ పత్రం సమర్పించడం తప్పనిసరి కాదు. పాస్‌పోర్టు దరఖాస్తు ప్రక్రియను సరళీకృతం చేయాలని కేంద్రం భావిస్తోంది. ఇందులో భాగంగా దశలవారీగా కొన్ని సంస్కరణలు తీసుకొస్తోంది. ఇప్పటివరకు జనన ధ్రువీకరణ పత్రంగా బర్త్ సర్టిఫికెట్‌తోపాటు పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, స్కూల్ లివింగ్ సర్టిఫికెట్ తదితరాలను అంగీకరిస్తున్నారు. ఇకపై 2023 అక్టోబర్ 1కి ముందు పుట్టిన వారికి మాత్రమే ఇవి దాఖలు చేసే అవకాశం ఉంటుంది. ఆ తేదీతోపాటు ఆ తర్వాత జన్మించిన వాళ్లు మాత్రం కచ్చితంగా బర్త్ సర్టిఫికెట్‌నే దాఖలు చేయాల్సి ఉంటుందని కేంద్రం స్పష్టం చేసింది. ఈ కీలక మార్పు నేపథ్యంలో నిర్దేశిత తేదీ లేదా ఆ తర్వాత జన్మించిన పిల్లలకు సంబంధించిన జనన ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత ప్రభుత్వ విభాగాల నుంచి కచ్చితంగా తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఇప్పటికే బర్త్ సర్టిఫికెట్ పొందిన వాళ్లు దాన్ని జారీ చేసింది మున్సిపల్ లేదా జనన–మరణ రిజిస్ట్రారేనా? అనేది సరిచూసుకోవాలని స్పష్టం చేస్తున్నారు.



బర్త్ సర్టిఫికెట్ పొందొచ్చు ఇలా..

- హాస్పిటల్‌లో శిశువు జననం జరిగాక వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆస్పత్రిలో ఇచ్చిన శిశువు కుటుంబీకుల ఫోన్‌కు సైతం వివరాలు నమోదైనట్లు ఎస్ఎంఎస్ వెళ్తుంది. ఎస్ఎంఎస్ వచ్చాక మీ–సేవా కేంద్రానికి వెళ్లి నిర్ణీత ఫీజు చెల్లిస్తే బర్త్ సర్టిఫికెట్ ఇస్తారు.
- హాస్పిటల్‌లో జరగని జననాలకు ఆన్‌లైన్ వివరాలు ఉండవు కాబట్టి మీ–సేవా కేంద్రానికి వెళ్లి ఇంటి చిరునామా తదితర వివరాలతో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత ఏఎంఓహెచ్‌కు వెళ్తుంది. విచారణ జరిపి నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్ ఇస్తారు. ఆ సర్టిఫికెట్‌తో జిల్లా ఆర్‌డీఓకు దరఖాస్తు చేసుకుంటే విచారణ జరిపి ప్రొసీడింగ్స్ జారీ చేశాక ఏఎంఓహెచ్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. అనంతరం మీ–సేవా కేంద్రం నుంచి బర్త్ సర్టిఫికెట్ పొందొచ్చు.

ముందు మా కేటాయింపులు తేల్చాలి

- ఆ తర్వాతే గోదావరిలో మిగులు, వరద జలాల లెక్కలు వెల్లడవుతాయి
- కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ వెల్లడి



కేంద్రమంత్రి పాటిల్‌తో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్, నల్లగొండ ఎంపీ రఘువీర్, ఇతర అధికారులు

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని.. ఆ నది జలాలను ఆంధ్రప్రదేశ్ అక్రమంగా తరలిస్తోందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకుని, నదీ జలాల అక్రమ తరలింపును అడ్డుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నికర జలాల ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం కడుతున్న ప్రాజెక్టులపై అభ్యంతరాలను ఏపీ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాలమూరు–రంగారెడ్డి, సీతారామ సహా ఐదు ప్రాజెక్టులకు నీటిని కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గోదావరి లింక్ ప్రాజెక్ట్ బనకచర్లపై తెలంగాణ అభ్యంతరాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. సీఎం రేవంత్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే...

''సాగునీటి ప్రాజెక్టుల గురించి చర్చించాం. నీటి కేటాయింపులు, నీటి వినియోగంలో వస్తున్న సమస్యలు, జరుగుతున్న చర్చల అంశాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. నిర్మాణంలోని ప్రాజెక్టులకు అనుమతులు, నిధులు, నీటి కేటాయింపులను తక్షణమే తేల్చాలనేదే ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నాం. ఇటీవల ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదం గురించి కూడా కేంద్ర మంత్రికి వివరించాం.

మా ప్రాజెక్టులకు ఏపీ అభ్యంతరం ఎందుకు?

నికర జలాల ఆధారంగా కడుతున్న సమ్మక్క–సారక్క, సీతారామ, పలు ఇతర ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులే ఇంకా జరగలేదు. గోదావరిలో అదనంగా నీళ్లున్నాయని, సముద్రంలో కలిసిపోతున్నాయని.. ఆ నీటినే వినియోగించుకుంటున్నామని వాదిస్తున్న ఆంధ్రప్రదేశ్.. మా ప్రాజెక్టులకు ఎందుకు అభ్యంతరం చెబుతోంది? తెలంగాణ శాశ్వత ప్రాజెక్టులకు శాశ్వత కేటాయింపులు జరిగిన తర్వాతే కదా వరద జలాలు ఉన్నాయా లేదా అనే లెక్కలు తేలేది! గోదావరిపై నిర్మిస్తున్న తెలంగాణ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పూర్తయ్యాకే ఇతర ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలి. మేం కట్టిన సమ్మక్క–సారక్క, సీతారామ ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ ఫైనల్ క్లియరెన్స్ ఇంకా రాలేదు. అందుకే మళ్లీ మళ్లీ రిప్రజెంటేషన్ చేస్తున్నాం. గోదావరి వరద జలాలను బనకచర్లకు, కృష్ణా బేసిన్‌కు తరలిస్తామని ఏపీ చెబుతోంది. మీరు ఆ నీటిని వినియోగించుకోవాలనుకున్నప్పుడు.. మా ప్రాజెక్టుల అనుమతులకు ఎందుకు అభ్యంతర పెడుతున్నారు?

మళ్లీ ఆ సమస్యను ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేము

తెలంగాణ ప్రాజెక్టులు పూర్తిగాక, ఆయకట్టును స్థిరీకరించకపోతే.. టెయిల్ ఎండ్‌లోనో, వరద జలాల మీద ఆధారపడో ఏపీలో ఆయకట్టు స్థిరీకరణ అయితే మాకు ఇబ్బంది వస్తుంది. భవిష్యత్తులో నీటి కేటాయింపులు జరిపే సమయంలో.. స్థిరీకరణ అయిన ఆయకట్టుకే నీటిని ఇస్తామంటారు. కృష్ణా నీటి విషయంలో ఇదే జరిగింది. కృష్ణా నదిలో 811 టీఎంసీల నీళ్లు అందుబాటులో ఉంటే.. 512 టీఎంసీలు ఏపీ, కేవలం 299 టీఎంసీలు తెలంగాణ ఉపయోగించుకుంటున్నాయి. తెలంగాణలో ప్రాజెక్టులు పూర్తవకపోవడం.. ఏపీలో పూర్తయిన ప్రాజెక్టులకు నీటిని కేటాయించడమే దీనికి ప్రధాన కారణం. ఇలాంటి సమస్యనే గోదావరి నది విషయంలో కూడా ఎదుర్కొనేందుకు మేం సిద్ధంగా లేము. గోదావరిపై నిర్మిస్తున్న తెలంగాణ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు పూర్తి కావాలి. తర్వాతే వరద జలాల మిగులు లెక్క తేలుతుంది. అప్పుడు ఏపీ ఏమేం కట్టుకోవాలని అనుకుంటోందో డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ ఇస్తే.. గోదావరి బోర్డులో చర్చించి అభ్యంతరాలు ఉన్నాయా, లేవా అనేది చెబుతాం.

ఏపీ అభ్యంతరాలు ఉపసంహరించుకోవాలి

శాశ్వత నికర జలాల ప్రాజెక్టులపై ఏపీ అభ్యంతరాలన్నీ ఉపసంహరించుకోవాలి. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వాములు కాబట్టి.. మా ప్రాజెక్టులకు అనుమతులు త్వరగా ఇచ్చేలా చూడాలి. మా అనుమతులు క్లియర్ అయితే.. మీకు (ఏపీకి) కూడా అన్నీ క్లియర్ అవుతాయి. తెలంగాణకు కేటాయింపులు జరగకుండా ప్రాజెక్టుల భవిష్యత్తు గందరగోళంలో ఉన్నప్పుడు.. ఏపీ ప్రభుత్వం వరద జలాల ఆధారంగా ప్రాజెక్టులు కట్టుకుంటామంటే తెలంగాణకు కచ్చితంగా అభ్యంతరం ఉంటుంది..'' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

మా ప్రయోజనాలు కాపాడండి

▶ మొదటి పేజీ తరువాయి

సాయంత్రం ఢిల్లీలో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. కృష్ణా పరీవాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉన్నప్పటికీ... కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పక్షపాతంతో ఏపీకి 66శాతం, తెలంగాణకు 34శాతం నీటి కేటాయింపులు చేసిందని కేంద్ర మంత్రికి తెలిపారు. ఈ కేటాయింపుల వల్ల ఎన్నో ఏళ్లుగా తెలంగాణ నష్టపోతోందని.. ఈ ఏడాది సైతం ఏపీ కేటాయించిన మొత్తానికి మించి నీరు తరలించుకుపోయిందని వివరించారు. ఇక ముందు ఏపీ ఇలా వాటాకు మించి జలాలను తరలించుకు పోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణా ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు సంబంధించి వెంటనే టెలిమెట్రీ యంత్రాలను ఏర్పాటు చేయాలని.. అవసరమైతే అందుకయ్యే మొత్తాన్ని తామే భరిస్తామని కేంద్ర మంత్రికి తెలియజేశారు.

ఈ ప్రాజెక్టులకు అనుమతులు ఇప్పించండి

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డీపీఆర్‌ను 2022లోనే సమర్పించినా.. అనుమతుల్లో ఆలస్యం చేస్తున్నారని కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్ వివరించారు. అదే సమయంలో న్యాయస్థానాల పరిధిలో ఉన్న అప్పర్ భద్ర ప్రాజెక్టుకు మాత్రం అనుమతులు ఇచ్చారన్నారు. సీతారామ ఎత్తిపోతల, సమ్మక్క సాగర్ బ్యారేజీలకు మాత్రం అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. ఈ మూడు ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), సాంకేతిక సలహా మండలి (టీఏసీ) నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని కేంద్ర మంత్రిని కోరారు.

ఏపీ తీరు చట్టవిరుద్ధం

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం గోదావరి–బనకచర్ల అనుసంధాన పథకానికి రూపకల్పన చేసిందని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ వివరించారు. ఆ పథకానికి కేంద్ర జల సంఘం, గోదావరి నది యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ), కేఆర్ఎంబీల నుంచి ఎటువంటి అనుమతి పొందలేదని తెలిపారు. అపెక్స్ కౌన్సిల్‌లోనూ ఈ ప్రాజెక్టుపై ఎటువంటి చర్చ జరగలేదన్నారు. గోదావరిలో తెలంగాణకు సంబంధించి నికర జలాల వాటాలు తేల్చాలని.. రాష్ట్రం చేపడుతున్న ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. పాలమూరు– రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతల, మోదికుంట వాగు, చనాకా కొరట బ్యారేజీ (డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్), చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర) ఎత్తిపోతల పథకాలకు 'సత్వర సాగునీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ)', 'పీఎంకేఎస్‌వై 2024' కింద తగిన ఆర్థిక సాయం అందజేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇందులో భాగంగా మౌలిక వసతుల అభివృద్ధి కింద 50 సంవత్సరాల వడ్డీలేని రుణాలను ఇవ్వాలని అభ్యర్థించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించి తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మిస్తామని, ఈ క్రమంలో ఏర్పడే ముంపునకు సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు ఇప్పించాలని కోరారు.

బనకచర్లపై ఏపీ ప్రభుత్వం డీపీఆర్ ఇవ్వలేదు

- కేంద్ర మంత్రి స్వయంగా ఈ విషయం చెప్పారు: మంత్రి ఉత్తమ్
- కృష్ణాలో ఏపీ ఎక్కువ నీళ్లు తరలించకుండా చూడాలని కోరినట్టు వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ ప్రభుత్వం ఎలాంటి డీపీఆర్ ఇవ్వలేదని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చెప్పారని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డితో కలసి సీఆర్ పాటిల్‌తో భేటీ అయిన అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. ''కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని, ఏపీ ఎక్కువ నీళ్లు తీసుకెళుతోందని, దీన్ని ఆపాలని కేంద్ర మంత్రిని కోరాం. తప్పనిసరిగా జోక్యం చేసుకుంటామని వారు హామీ ఇచ్చారు. నాగార్జున సాగర్ కుడి కాల్వ ద్వారా ఏపీ తీసుకెళుతున్న 10వేల క్యూసెక్కులను 5 వేల క్యూసెక్కులకు తగ్గిస్తామని కూడా హామీ ఇచ్చారు. ముచ్చుమర్రి నుంచి ఏపీ తీసుకెళ్తున్న నీళ్లు కూడా ఆపిస్తామని హామీ ఇచ్చారు. గోదావరి, బనకచర్ల లింక్ ప్రాజెక్టు కోసం ఏపీ సీఎం చంద్రబాబు ప్రతిపాదన పెట్టినా.. కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ ప్రాజెక్టుపై తెలంగాణ తరఫున అభ్యంతరం తెలిపాం. దీనిని పరిగణనలోకి తీసుకుంటామని కేంద్ర మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు..'' అని ఉత్తమ్ తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి, సీతారామసాగర్, సమ్మక్క–సారక్క ప్రాజెక్టులకు త్వరగా నీటి కేటాయింపులు చేయాలని.. పలు ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలన్న విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. మేడిగడ్డతోపాటు మరో రెండు బ్యారేజీలు కూలడంపై ఎన్డీఎస్ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) విచారణ జరుగుతోందని, త్వరగా ఆ నివేదిక ఇవ్వాలని కోరామని తెలిపారు.

రాజస్తాన్‌తో కలిసి సింగరేణి జాయింట్ వెంచర్

- రాజస్తాన్ సీఎం, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో ఎంఓయూ
- 74 శాతం పెట్టుబడి పెట్టనున్న సింగరేణి.. 26 శాతం పెట్టనున్న ఆర్‌వీయూఎన్ఎల్



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు జ్ఞాపిక అందజేస్తున్న రాజస్తాన్ సీఎం భజన్‌లాల్ శర్మ

సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థ..రాజస్తాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ (ఆర్‌వీయూఎన్ఎల్)తో కలిసి జాయింట్ వెంచర్‌గా 3,100 మెగావాట్ల విద్యుత్ కేంద్రాలను నిర్మించనుంది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాజస్తాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్‌శర్మ సమక్షంలో సోమవారం జైపూర్‌లో జాయింట్ వెంచర్ ఏర్పాటుకు పరస్పర అవగాహన ఒప్పందం జరిగింది. జాయింట్ వెంచర్‌లో భాగంగా రాజస్తాన్‌లో 1,500 మెగావాట్ల సౌర విద్యుత్ కేంద్రాలను స్థాపించనున్నారు. మరో 1,600 (2x800) మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని సింగరేణి అధికారవర్గాలు తెలిపాయి. దీనిని సైతం రాజస్తాన్‌లోనే ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. మొత్తం పెట్టుబడిలో 74 శాతం వాటాను సింగరేణి సంస్థ, 26 శాతం వాటాను ఆర్‌వీయూఎన్ఎల్ సంస్థ భరించనుంది. లాభాల వాటాను అదే మొత్తంలో తీసుకుంటారు. సింగరేణి తన వాటాను మూలధన రూపంలో చెల్లించనుండగా, ఆర్‌వీయూఎన్ఎల్ మాత్రం తన వాటాను సౌర, థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు, మౌలిక సదుపాయాల రూపంలో భరించనుంది. విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను అన్ని రకాల అనుమతులతో సింగరేణికి రాజస్తాన్ ప్రభుత్వం అప్పగించనుంది.

కామన్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు

విద్యుత్ కేంద్రాల ఏర్పాటు, లాభదాయకత, నిర్మాణ తదితర విషయాలపై చర్చించేందుకు ఇరుపక్షాల నిపుణులతో ఒక కామన్ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేయనున్నారు. ఈ గ్రూపు పరస్పర అవగాహనతో లాభదాయకంగా విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు నివేదికలు రూపొందిస్తుందని ఒప్పంద పత్రంలో పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, సీఎండీలు కృష్ణభాస్కర్, ఎన్.బలరామ్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి సంక్షేమ గురుకులంలో ర్యాగింగ్

- 8వ తరగతి విద్యార్థిపై బైపీసీ విద్యార్థుల వేధింపులు
- సాక్ష్యం చెప్పిన పదో తరగతి విద్యార్థిపైనా దాడి
- దాడి చేసిన విద్యార్థులను చితకబాదిన తల్లిదండ్రులు

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీవోఈ) కళాశాలలో ర్యాగింగ్ ఘటన కలకలం రేపింది. నిందితులపై బాధిత విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు దాడి చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. చివరకు పోలీసులు, ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొందరు ఇంటర్ బైపీసీ సెకండియర్ విద్యార్థులు మూడు నెలల క్రితం ఓ 8వ తరగతి విద్యార్థి నోట్లో బలవంతంగా సిగరెట్ కుక్కడంతోపాటు టాయిలెట్ గది పక్కకు లాక్కెళ్లి అతన్ని బట్టలు విప్పించారు. సీనియర్ల ర్యాగింగ్‌పై అప్పట్లో నోరువిప్పేందుకు భయపడ్డ బాధిత విద్యార్థి ఎట్టకేలకు తల్లిదండ్రులకు విషయం చెప్పగా వారు శనివారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన విచారణ చేపట్టగా ఓ టెన్త్ విద్యార్థి సీనియర్ల ర్యాగింగ్ గురించి సాక్ష్యం చెప్పాడు. దీంతో ప్రిన్సిపాల్ ఆయా విద్యార్థులను పిలిపించి మందలించగా ఇకపై చేయబోమని వారు లిఖితపూర్వకంగా రాసిచ్చారు. అదే విషయాన్ని ఆయన బాధిత విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వెళ్లిపోయారు. అయితే టెన్త్ విద్యార్థిపై కక్ష పెంచుకున్న సీనియర్లు ఆదివారం రాత్రి అతన్ని చితకబాదారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం మూకుమ్మడిగా డార్మిటరీలోకి చొరబడి ర్యాగింగ్‌కు పాల్పడ్డ విద్యార్థులను చితకబాదారు. ఈ క్రమంలో అడ్డుకోబోయిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సైతం దెబ్బలు తగిలాయి. చివరకు తాళ్లగురిజాల ఎస్సై రమేష్ సిబ్బందితో వచ్చి గొడవను నిలువరించారు. ర్యాగింగ్‌కు పాల్పడ్డ విద్యార్థులను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇంటికి పంపించడంతో తల్లిదండ్రులు శాంతించారు.

పొద్దుతిరుగుడుకు రూ. 7,280 మద్దతు ధర

కొనుగోళ్లు ప్రారంభించామన్న మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పొద్దుతిరుగుడుపువ్వు కొనుగోళ్లను ప్రారంభించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. క్వింటాలుకు రూ.7,280 మద్దతు ధరతో పొద్దు తిరుగుడుపువ్వు సేకరణ కోసం మార్క్‌ఫెడ్‌ద్వారా 21 చోట్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో సోమవారం ఐదు సెంటర్లు ప్రారంభించామన్నారు. 2023–24లో రూ. 6,760 మద్దతు ధరతో 8,775.58 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసారి ఆ పరిమాణం పెరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పంట వేసిన రైతులెవరూ నష్టపోలేదని, ఆయా పంటలకు మార్కెట్‌లో ధర లేనప్పుడు ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తూ వస్తోందని చెప్పారు. కందిపంటను ఈ ఏడాది ఇప్పటివరకు 4,625 మెట్రిక్ టన్నుల మేర కొనుగోలు చేశామని, అందుకోసం క్వింటాలుకు రూ.7,550 మద్దతు ధర చెల్లించినట్లు తెలిపారు. 2022–23లో బీఆర్ఎస్ ప్రభుత్వం కందిని కొనలేదని, సోయాబీన్ పంటను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాతే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు నిజాలు తెలుసుకోవాలని తుమ్మల సూచించారు.

సెంటీమీటర్ తవ్వలేదు కానీ.. మాపై నిందలా

ఎక్స్‌లో సీఎం రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు



సాక్షి, హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీలో సెంటీమీటర్ సొరంగం తవ్వడం కూడా చేతకాని సీఎం రేవంత్‌రెడ్డి.. 12 కిలోమీటర్ల టన్నెల్ పూర్తి చేసిన బీఆర్ఎస్‌పై నిందలు వేయడం సిగ్గుచేటని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గత 13 నెలలుగా ప్రాజెక్టు పనులను పూర్తిగా పక్కనబెట్టి, తన వైఫల్యాన్ని గత ప్రభుత్వంపైకి నెట్టాలనే నీచానికి దిగడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఎస్ఎల్‌బీసీ పనులపై ప్రభుత్వ ఆరోపణలకు కేటీఆర్ ఎక్స్ వేదికగా కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ పోస్టు పెట్టారు. 'కనీస ప్రణాళిక లేకుండా పనులు మొదలుపెట్టి, నాలుగు రోజులు కాకముందే ఎనిమిది మంది అమాయకుల ప్రాణాలను పణంగా పెట్టిన పాపం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదే. మొత్తం సొరంగం 43.94 కిలోమీటర్లయితే, 2005–2014 వరకు ఉన్న గత కాంగ్రెస్ సర్కారు హయాంలో తవ్వింది కేవలం 22.89 కిలోమీటర్లే. సొరంగంలో క్లిష్టమైన పరిస్థితులున్నా, ఏ ప్రమాదం జరగకుండా ఏకంగా 12 కిలోమీటర్ల మేర టన్నెల్ పనులు పూర్తి చేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిది. నాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎస్ఎల్‌బీసీ పనులకు రూ.3,300 కోట్లు ఖర్చుచేస్తే, బీఆర్ఎస్ పాలనలో రూ.3,900 కోట్ల పనులు పూర్తిచేసిన వాస్తవాన్ని దాచే ప్రయత్నంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బొక్కబోర్లా పడ్డారు. గత కాంగ్రెస్ సర్కారుకన్నా రూ.600 కోట్లు ఎక్కువ ఖర్చుచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై బురదజల్లడం ఈ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం'అని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మూడున్నరేళ్లలోనే 203 కిలోమీటర్ల సొరంగాలు తవ్వినా, ఎస్ఎల్‌బీసీ వంటి దారుణ సంఘటనలు జరిగిన దాఖలాలు లేవని వెల్లడించారు. 'చేసిన తప్పును ఒప్పుకోవడం తప్ప ముఖ్యమంత్రి ముందు మరో మార్గం లేదు. ఈ ''డ్యామేజ్ డైవర్షన్''కుట్రలు చైతన్యవంతమైన తెలంగాణ గడ్డపై ఎప్పటికీ సాగవు'అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిని కేంద్ర మంత్రులే అడ్డుకుంటున్నారు

- కిషన్‌రెడ్డి సైంధవుడే
- టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అభివృద్ధి విషయంలో ప్రధాని మోదీ సానుకూలంగానే ఉన్నా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమర్థించారు. తెలంగాణ అభివృద్ధిని రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులే అడ్డుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఫిషరీస్, ఎస్సీ కార్పొరేషన్ల చైర్మన్లు మెట్టు సాయికుమార్, నాగరిగారి ప్రీతం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్‌తో కలసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సైంధవుడిగా మారారని పునరుద్ఘాటించారు. బీఆర్ఎస్‌తో కిషన్‌రెడ్డికి ఉన్న లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే అడ్డుకుంటున్నారని చెప్పిన మహేశ్‌గౌడ్.. రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలున్నా ఏ రోజైనా మోదీని కలసి తెలంగాణ ప్రయోజనాల కోసం చర్చించారా అని ప్రశ్నించారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటులో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సహకరించలేదని చెప్పిన బీజేపీ నేతలు.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తున్నా రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ ఎంపీలు మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళనకు ఎందుకు సహకరించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవిని ఆశిస్తున్న రఘునందన్‌రావు తన పాచికలు బీజేపీలో పారకపోవడంతో రాష్ట్రంలో పాలన పడకేసిందంటూ కాంగ్రెస్ పార్టీపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకురాలు కవిత తన పింక్‌బుక్‌లో ఆ పార్టీ నేతల స్కామ్‌ల గురించి రాయాలని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆమె ఎందుకు ఉద్యమించాల్సి వస్తోందో చెప్పాలని మహేశ్‌కుమార్‌గౌడ్ నిలదీశారు.

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పోస్టుకార్డుల ఉద్యమం

హామీల అమలుపై సీఎంకు 10 వేల పోస్టుకార్డులు పంపిన కవిత



సాక్షి, హైదరాబాద్: మహిళలకు ఇచ్చిన హామీలను మార్చి 8న మహిళా దినోత్సవంలోపు అమలు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలకిచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సోమవారం పోస్టుకార్డు ఉద్యమాన్ని ఆమె ప్రారంభించారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 10 వేల పోస్టుకార్డులను సీఎం రేవంత్‌రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వడంతో పాటు అన్ని హామీలపై కార్యాచరణ ప్రకటించాల్సిందేనని డిమాండ్ చేశారు. వరంగల్‌లో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి రాణీరుద్రమదేవి పేరు పెట్టాలని ప్రభుత్వానికి సూచించారు. హామీల అమలుపై మార్చి 8లోగా ప్రకటన చేయకపోతే 10 వేల మంది మహిళలు 10 వేల గ్రామాల్లోకి వెళ్తారన్నారు. అన్ని గ్రామాల్లో మహిళలను కూడగట్టి లక్షలాది పోస్టు కార్డులను తయారు చేసి సోనియా గాంధీకి పంపిస్తామని కవిత తెలిపారు. సోనియాగాంధీ, ప్రియాంకాగాంధీ మాట్లాడక ముందే మహిళా బిల్లు కోసం తెలంగాణ జాగృతి ఢిల్లీలో ధర్నా చేసిందని గుర్తుచేశారు.

బీజేపీకి రేవంత్ దాసోహం

మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు 37 సార్లు ఢిల్లీకి వెళ్లినా.. బీజేపీకి జీ హుజూర్ అనడం తప్ప తెలంగాణకు తెచ్చిందేమీ లేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆయన సోమవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, పల్లె రవికుమార్, శుభప్రద్ పటేల్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వనపర్తి సభలో సీఎం బీజేపీ గురించే ఎక్కువ మాట్లాడారని, సీఎం మరోసారి జైలుకు వెళ్లకుండా బీజేపీతో ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదానికి మాజీ సీఎం కేసీఆర్‌దే బాధ్యత అనడం దుర్మార్గమన్నారు. వట్టెం పంప్‌హౌస్, పెద్దవాగు ప్రాజెక్టు మునగడానికి, సుంకిశాల కూలిపోవడానికి కూడా బీఆర్ఎస్ కారణమా? అని ప్రశ్నించారు.

ఓబీసీల డిమాండ్ల సాధనలో విద్యార్థుల పాత్ర కీలకం

ఓబీసీల డిమాండ్ల సాధనలో విద్యార్థుల పాత్ర కీలకమని, ప్రతి ఉద్యమంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఓబీసీ జాతీయ సమాఖ్య ప్రధాన సలహాదారుడు, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ కోరారు. మార్చి 8న హైదరాబాద్‌లో సావిత్రీబాయి పూలే ఆడిటోరియంలో నిర్వహించనున్న ఓబీసీ యూత్ లీడర్‌షిప్ సమ్మిట్–2025 పోస్టర్‌ను సోమవారం ఓబీసీ నేతలు ఆవిష్కరించారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్ మాట్లాడుతూ, రాజకీయ, బ్యూరోక్రటిక్, వ్యాపార, అకడమిక్ రంగాల్లో యువత రాణించేలా మార్గనిర్దేశనం చేయడానికే ఈ సదస్సు ఏర్పాటు చేశామని చెప్పారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 4-3-2025

న్యూస్‌మేకర్ - మైకీ

2024 సంవత్సరానికి ఆస్కార్ ఉత్తమ నటిగా నిలిచారు మైకీ మ్యాడిసన్. సినిమా పేరు 'అనోరా'. ధరించిన పాత్ర 'వేశ్య'. హాలీవుడ్ కాని, ఇండియన్ సినిమాల్లోకాని వేశ్య పాత్ర పోషించడం పట్ల తారలకు కొన్ని అభ్యంతరాలుంటాయి. అలాగే ఆ పాత్రలు పోషించిన వారందరూ ప్రశంసలు కూడా అందుకున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి వేశ్య పాత్ర వార్తల్లోకి వచ్చింది. 'అనోరా' గురించి, మైకీ మ్యాడిసన్ గురించి కథనం.




ఆస్కార్‌తో మైకీ మ్యాడిసన్

భావోద్వేగాలకు జీవం

వారికి ఆదివారం రాత్రి. మనకు సోమవారం తెల్లవారు జాము. కాని తారలకు, తారలను ప్రేమించే ప్రేక్షకులకు ఇది పడుతుందా?

అమెరికా లాస్ ఏంజెలెస్‌లో జరిగిన 97వ అకాడమీ అవార్డ్స్ వేడుకలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేక్షకులు నిద్ర మానుకొని, మేల్కొని, వివిధ స్థానిక సమయాల ప్రకారం వీక్షించారు. విజేతలకు చప్పట్లతో శుభాకాంక్షలు తెలియజేశారు. తాము ఊహించిన సినిమాకో నటికో వస్తే తెగ ఉత్సాహం ప్రదర్శించారు. అయితే వీరందరూ కొంత ఊహించినా ఇంతగా ఎక్స్‌పెక్ట్ చేయని ఒక సినిమా ఆశ్చర్య పరిచింది. 'ఉత్తమ చిత్రం' పురస్కారంతో పాటు ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటి, ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే, ఉత్తమ ఎడిటింగ్ విభాగాల్లో ఐదు పురస్కారాలను సొంతం చేసుకుని హోరెత్తించింది. ఆ సినిమాయే 'అనోరా'. 2024లో విడుదలైన ఈ చిత్రం అటు విమర్శకుల ప్రశంసలను, ఇటు బాక్సాఫీసు కాసుల రికార్డులనూ కొల్లగొట్టింది. భారతీయ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం జరిగిన ఆస్కార్ అవార్డు ప్రదానోత్సవంలో సైతం అదే పంథా కొనసాగించింది.



ఎవరీ 'అనోరా'?:

నిజానికి ఇలాంటి కథలు మనకు 'మొఘల్-ఏ-ఆజమ్' నుంచి ఉన్నాయి. కథానాయకుడు వేశ్యను ప్రేమిస్తే సంఘం/పెద్దమనుషులు ఓర్వలేక విడగొట్టడం. కాని మొఘల్-ఏ-ఆజమ్‌లో కథానాయకుడి ప్రేమ నిజమైనది అయితే 'అనోరా'లో కపట మైనది. అందుకే ఆ ప్రేమకు విక్టిమ్ అవుతుంది అనోరా. 23 ఏళ్ల ఈ అమ్మాయి న్యూయార్క్‌లోని ఓ క్లబ్‌లో స్ట్రిప్పర్‌గా పని చేస్తూ ఉంటుంది. ఒకరోజు ఈమెను క్లబ్ యజమాని రష్యాకు చెందిన ఇవాన్ అనే శ్రీమంతుల కుర్రవాడికి పరిచయం చేస్తాడు. చదువుకోవడానికి అమెరికాకు వచ్చిన ఈ కుర్రాడు బాధ్యత లేకుండా పార్టీల్లో, వీడియో గేమ్స్‌లో సమయం గడుపుతూ ఉంటాడు. అనోరా సాంగత్యం ఇష్టపడ్డ ఇవాన్ తరచూ ఆమెను తన బంగ్లాకు ఒక రాత్రి కోసం తీసుకువెళుతూ ఉంటాడు. ఆ తర్వాత హఠాత్తుగా 'నాకు వారం రోజుల పాటు గర్ల్‌ఫ్రెండ్‌గా ఉండు. 15 వేల డాలర్లు ఇస్తాను' అని క్లబ్‌కు వెళ్లకుండా ఆపేస్తాడు. ఆ వారంలో ఆమె మీద ప్రేమ పుట్టిందని చెప్పి, ఉక్కిరిబిక్కిరి చేసి, ఉరుకుల పరుగుల మీద పెళ్లి చేసుకుంటాడు.

కష్టాలు మొదలు

అయితే ఇది పిల్లల ఆట కాదు. ఇద్దరు కలవడం వెనుక, కలిసి జీవించడం వెనుక ఎంత పెద్ద వ్యవస్థ ఇన్‌వాల్వ్ అయి ఉంటుందో మెల్లగా అనోరాకు తెలిసి వస్తుంది. ఇది క్లబ్‌లో తన ఇష్టానికి స్ట్రిప్పర్‌గా ఉండటం కాదని 'పెళ్లి' అనే వ్యవస్థ చుట్టూ అంతస్తు, సంఘ మర్యాద, వంశం... ఇలాంటివి అన్నీ ఉంటాయని అర్థమై హడలిపోతుంది. ఇవాన్‌ను ఈ పెళ్లి నుంచి బయటపడేయడానికి రష్యా నుంచి వచ్చిన ఇద్దరు మనుషులు ఈ యువ జంటను బెదిరిస్తారు. 'గ్రీన్ కార్డు పొందడం కోసమే ఆమె నిన్ను పెళ్లి చేసుకుంది. ఆమె వేశ్య' అని ఇవాన్ మనసును మార్చేస్తారు. ఈ మొత్తం వ్యవహారానికి బెదిరి అనోరాను వదిలి ఇవాన్ పారిపోతాడు. ఇవాన్‌ను వదిలి పెడితే 10 వేల డాలర్లు ఇస్తామనే బేరం పెడతారు రష్యా మనుషులు. ఈ పరిస్థితులు మానసికంగా అనోరాను బాధిస్తాయి.

ఊరడించే బంధం

అయితే ఈ మొత్తం కథలో ఒక వ్యక్తి అనోరా పట్ల సానుభూతిగా ఉంటాడు. అతను ఇవాన్‌ను పెళ్లి నుంచి బయట పడేయడానికి రష్యా నుంచి వచ్చిన ఇగోర్. అనోరాకి అన్యాయం జరుగుతోందని ఆమె తన మానాన తాను బతుకుతుంటే ఇవాన్ డిస్ట్రబ్ చేశాడని అతనికి అనిపిస్తుంది. చివరకు అతను ఆమెకు స్నేహితుడిగా మారతాడు. అతనికి అనోరా తన సర్వస్వం అర్పించడానికి దగ్గరయ్యి ఆ కాస్త ఓదార్పుకు వెక్కివెక్కి ఏడ్వడంతో సినిమా ముగుస్తుంది. ఈ కథ మొత్తాన్ని తన భుజస్కందాల మీద అద్భుతంగా పోషించడం వల్ల, వివిధ భావోద్వేగాలను పలికించడం వల్ల 'అనోరా' పాత్ర పోషించిన మైకీ మాడిసన్‌కు ఉత్తమ నటి అవార్డు వచ్చింది. అవార్డు అందుకుంటూ ఆమె 'సెక్స్ వర్కర్ కమ్యూనిటీకి కృతజ్ఞతలు' అని చెప్పడం విశేషం.

'వన్స్ అపాన్ ఎ టైం ఇన్ హాలీవుడ్', 'స్క్రీమ్' సినిమాలో మైకీ నటన చూసి తాను తీస్తున్న 'అనోరా'లో ఈ అమ్మాయి బాగుంటుందని సీన్ బేకర్ భావించారు. అలా ఈ ప్రాజెక్టులోకి అడుగుపెట్టిన మైకీ సినిమాను తన భుజాల మీద మోసింది. వేశ్యగా, ప్రేమికురాలిగా, పెళ్లయిన మహిళగా, ప్రియుడి చేత మోసగింపబడ్డ యువతిగా... ఇన్ని రకాల హావభావాలను ఆ పాత్రలో పలికించి అందర్నీ మెప్పించింది.

సినిమా విశేషాలు

- ఇది కల్పిత కథ కాదు. అలాగని పూర్తి వాస్తవ కథ కూడా కాదు. దర్శకుడు సీన్ బేకర్‌కి తన స్నేహితుడు చెప్పిన ఒక రష్యన్-అమెరికన్ జంట కథ ఆధారంగా పుట్టిందే ఈ కథ. 2000-2001 సమయంలో న్యూయార్క్‌లో సీన్ బేకర్ వీడియో ఎడిటర్‌గా పని చేస్తూ అనేక రష్యన్-అమెరికన్ జంటల పెళ్లి వీడియోలను ఎడిట్ చేశాడు. ఇవన్నీ కలిసి అతని మనసులో చెరగని ముద్ర వేశాయి. ఈ సినిమాకు రచనా సహకారం కోసం కెనెడియన్ రచయిత్రి, నటి ఆండ్రియా వెరన్‌ను సంప్రదించాడు దర్శకుడు. అందుకు కారణం ఆమె గతంలో సెక్స్ వర్కర్‌గా పని చేసి, ఆ అనుభవాలతో 'మోడ్రన్ వోర్' అనే స్వీయచరిత్ర రాసింది. బార్లలో ఆడిపాడే వారికి, వేశ్యా వృత్తిలో ఉన్నవారికీ మనసుంటుందనీ, అదీ ఒక తోడు కోరుకుంటుందని చెప్పడానికే తాను ఈ సినిమా తీసినట్లు ఆయన వివరించారు.
- కథలో ప్రధానమైన పాత్రను ధరించిన మైకీ మాడిసన్ ఆ పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయింది. 25 ఏళ్ల మైకీ మాడిసన్ లాస్ ఏంజెలెస్‌లో పుట్టి శాన్ ఫెర్నాండ్ వ్యాలీలో పెరిగింది. యూదు కుటుంబానికి చెందిన మైకీ తల్లిదండ్రులిద్దరూ సైకాలజిస్టులు. ఈమెకు ఇద్దరు అక్కలు, ఇద్దరు అన్నలు.
- 2013లో తొలిసారి 'రిటైర్‌మెంట్ అండ్ పనిష్ బాక్స్' అనే షార్ట్ ఫిల్మ్‌లో నటించే నాటికి మైకీ మాడిసన్ ఏడో తరగతి చదువుతోంది. సినిమాల వల్ల స్కూలుకు వెళ్లడం సాధ్యం కాకపోవడంతో ఆ తర్వాత ఆమె చదువంతా ఇంట్లోనే సాగింది. 2017లో హీరోయిన్‌గా తొలి చిత్రం 'లిజా లిజా స్కైస్ ఆర్ గ్రే' విడుదలైంది. అంతకుముందే 2016లో 'బెటర్ థింగ్స్' అనే కామెడీ డ్రామా సిరీస్‌లో టీనేజ్ యువతి పాత్ర పోషించింది. ఆ సిరీస్ విజయవంతమై 2022 దాకా నడిచింది. ఈ మధ్యలో 'ఇంపోస్టర్స్', 'మాన్‌స్టర్', 'నోస్టాల్జియా' వంటి సిరీస్‌లలోనూ నటించి, మెప్పించింది.
- 2019లో వచ్చిన 'వన్స్ అపాన్ ఎ టైం ఇన్ హాలీవుడ్' అనే సినిమా మైకీకి గుర్తింపు తెచ్చింది. అందులో 'సూసన్' పాత్రలో ఆమె నటన అందర్నీ ఆకట్టుకుంది. 77వ కాన్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఈ చిత్రం ప్రశంసలు పొందింది. ఆ పై 'స్క్రీమ్', 'లేడీ ఇన్ ది లేక్' సినిమాల్లో నటించింది.
- తెలుగులో అక్కినేని నాగేశ్వరరావు, జయప్రద హీరో హీరోయిన్లుగా రూపొందిన 'ప్రేమమందిరం' కథ 'అనోరా' పోలికలతోనే ఉంటుంది. అందులో జయప్రద దేవదాసీల ఇంట్లోనే పుట్టిన అమ్మాయి పాత్ర పోషించగా అక్కినేని జమీందారు బిడ్డ పాత్ర పోషించారు.

Impact

నాకు నచ్చిన పాత్ర విమల - కాత్యాయనీ విద్మహే



నచ్చటం అనేది నిరపేక్ష అంశం కాదు. ప్రత్యేకించి సాహిత్య పాత్రలు నచ్చటం- అవి చదివిన కాలం నాటి మన వయసు, ఆలోచనా స్థాయి, భావుకత్వ శక్తి వీటన్నిటిని బట్టి ఉంటుంది. అందువల్ల ఒకసారి నచ్చింది అలాగే ఉండిపోతుంది అనుకొనటానికి లేదు. ఒకొకసారి యూటర్న్ కూడా తీసుకోవచ్చు. లేదా గుణాత్మకంగా పరిణామమూ చెందవచ్చు. నా సాహిత్య సహవాసం ఆరోతరగతి నుండి వారపత్రికలలో సీరియల్‌గా వచ్చే స్త్రీల నవలలు చదవటంతో మొదలైంది (1966 -67). ఆ వరుసలో రంగనాయకమ్మ స్వీట్ హోమ్ నవలలోని విమల పాత్ర నాకు చాలా నచ్చింది. పన్నెండు పదమూడేళ్ల వయసులో విమల నాకెందుకు నచ్చింది? ఇళ్లల్లో కనబడే దాంపత్య సంబంధాల్లోని గంభీర ముద్రను, ఒద్దికను చెరిపేస్తూ భర్తతో అల్లరిగా, చిలిపిగా, చనువుగా ప్రవర్తించే ఆ పాత్ర విశిష్ట వ్యక్తిత్వం నన్ను ఆకర్షించిందా? అప్పటికి నేను చదివిన నవలల్లోని స్త్రీ పాత్రలకు భిన్నంగా తాను లోపల ఏమి అనుకొంటున్నదో దానిని ఎవరేమనుకొంటారో అని లోలోపల అణిచేసుకోకుండా బయటకు అనగల ధీరత్వం వలన విమల నాకు అపురూపంగా అనిపించిందా? ఆ క్రమంలో తాను స్త్రీ, భార్యే అయినా ప్రత్యేకవ్యక్తిని అన్న నిరంతర చైతన్యంతో జీవించటం వల్ల నాకు నచ్చిందా? ఏమో !? నాకవన్నీ ఆ రోజుకు ఇంత స్పష్టంగా తెలుసునని చెప్పలేను. కానీ ఆ నవల చదువుతూ సమ న్యాయానికి, సహజీవన సౌందర్యానికి సంబంధించిన అవ్యక్త అనురాగం ఏదో నా లోలోపల ఊపిరి పోసుకొంటుంటే విమల ప్రేమలో పడిపోయానన్నది వాస్తవం. ఆ తరువాత ఎన్నిసార్లు ఆ నవల చదివానో లెక్కలేదు. విమల ఎందుకు నచ్చిందో ఆ కారణాలు రోజురోజుకీ మరింత విశదం అవుతూ వస్తున్నాయి.

స్త్రీకి సహజ లక్షణాలుగా సమాజం నిర్దేశిస్తున్న విలువలను తిరస్కరించటం విమలను ప్రత్యేకంగా నిలబెడుతుంది. శాంతం, సహనం స్త్రీధర్మాలు అనే బోధలు ఆమె సహించలేదు. పతివ్రతలుగా జీవించటం, మరణించటం స్త్రీకి ఆదర్శం చేసిన వ్యవస్థపై ఆమెకు కోపం. స్త్రీకి భర్త పట్ల అనురాగం స్వచ్ఛందంగా సహజ మానవీయ సంబంధాల నుండి కలగవలసినదే కానీ పై నుండి నిర్బంధం వల్ల కాదు అన్నది ఆమె నిశ్చితాభిప్రాయం. భర్త కోసం తాను ఇష్టంగా ఇంటి పని ఎంతైనా చేయవచ్చు కానీ, ఇంటి పని స్త్రీలదే అంటే మాత్రం విమల ఒప్పుకోదు. వంటిల్లు మగవాడిది కూడా అని చెప్పగలిగిన సమాన హక్కుల చైతన్యం ఆమెది. ఆమె సంస్కరణ కుటుంబానికి పరిమితమైనదే. కానీ కుటుంబంలో భార్యాభర్తల సంబంధాలలో ప్రజాస్వామీకీకరణను కలగనగలిగిన ఆధునిక మధ్యతరగతి యువతిగా విమల నాకు నచ్చిందనుకొంటాను. కుటుంబానికి అవతల నాకు అంతగా నచ్చిన మరొక స్త్రీ పాత్ర మధురవాణి.

Inspiration

నా ఇన్స్పిరేషన్ అమ్మ.. - స్మృతి ఇరానీ



ఎందుకంటే..

'నాకు ఏడేళ్లప్పుడు మా అమ్మ నన్ను, నా ఇద్దరు చెల్లెళ్లను తీసుకుని నాన్న దగ్గర్నుంచి బయటకు వచ్చేసింది. ఆ ఇంట్లోంచి వెళ్లిపోతున్నప్పుడు 'మనం ఊరెళ్లిపోతున్నాం' అని చెప్పింది అమ్మ. 'ఎందుకు?' అడిగాను. 'నేను కొడుకును కనివ్వలేను కాబట్టి' అంది. నాన్న వాళ్లింట్లోంచి వచ్చేప్పుడు అనుకున్నాను 'ఎప్పటికైనా ఆ ఇంటిని కొంటాను' అని! అనుకోవడమే కాదు అమ్మతో చెప్పాను కూడా! చాలెంజెస్ ఫేస్ చేయడం ఆ రోజు నుంచే మొదలైంది. డబుల్, ట్రిబుల్ జాబ్స్ చేస్తూ డబ్బు సంపాదించాను. ఆ ఇంటిని కొనేంత కూడబెట్టాను. ఒకరోజు అక్కడికి వెళ్లి అమ్మకు ఫోన్ చేశాను. 'చిన్నప్పుడు వదిలి వచ్చేసిన ఇంటి దగ్గరున్నానమ్మా' అని! అప్పుడు అమ్మ 'ప్రతీకారకాంక్ష మనల్ని దహించేస్తుంది.. విలువైన సమయాన్ని వృథా చేస్తుంది. మన ఎనర్జీని నిరుపయోగమైన వాటివైపు మళ్లిస్తుంది. అందుకే మనల్ని హర్ట్ చేసిన వాళ్లను క్షమించి, మరచిపోవాలి. మనకు కోపం తెప్పించే వాటిని ఇగ్నోర్ చేయాలి. మన ఎనర్జీని పదిమందికి ఉపయోగపడే విషయాలపై వెచ్చించాలి' అని చెప్పింది. ఆ మాట నా దిశను మార్చేసింది. అందుకే మా అమ్మే నా ఇన్స్పిరేషన్, టీచర్, గైడ్, ఫిలాసఫర్!'



'కార్బన్ పాజిటివ్' పొలం!

లిస్సిమోల్ జె. వదక్కూట్.. దేశవ్యాప్తంగా విశిష్ట గుర్తింపు పొందిన డైనమిక్ వ్యవసాయ అధికారిణి. కేరళ వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖలో సహాయ సంచాలకురాలిగా గత 8 ఏళ్లుగా పనిచేస్తున్నారు. కొచ్చిన్ నగరానికి సమీపంలో అలువి అనే చోట వందేళ్లకు ముందే ఏర్పాటైన ప్రభుత్వ వరి విత్తనోత్పత్తి క్షేత్రం ఉంది. ఎనిమిదేళ్ల క్రితం లిస్సిమోల్ ఈ క్షేత్రం బాధ్యతలు తీసుకునేటప్పటికి దేశంలో ఎవరికీ దీని గురించి తెలీదు. అయితే, ఆమె అకుంఠిత దీక్షతో పనిచేసి ఈ క్షేత్రానికి ఎనలేని కీర్తిని తెచ్చి పెట్టారు. దేశంలోనే తొలి 'కార్బన్ న్యూట్రల్' వరి క్షేత్రంగా అలువి సీడ్ ఫామ్‌కు గుర్తింపు దక్కింది. 5.32 హెక్టార్ల ఈ క్షేత్రంలో పూర్తిగా సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్నారు. వరి (ఇక్కడ పండించే వరి రకాల్లో అత్యధికం దేశీ రకాలే)తో పాటు అనేక ఇతర పంటలను సాగుచేస్తూ.. ఒక ఆదర్శ సమీకృత వ్యవసాయ క్షేత్రంగా లిస్సిమోల్ ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు.

'కార్బన్ న్యూట్రల్' అంటే?

నీటిని నిల్వగట్టి వరి పంటను సాగు చేస్తే కర్బన ఉద్గారాలు భారీగానే వాతావరణంలోకి విడుదల అవుతున్నాయి. రసాయనిక ఎరువులు, పురుగుమందుల ఉద్గారాలతో పాటు... నీటిని నిల్వగట్టడం వల్ల మిథేన్ వాయువు వాతావరణంలోకి వెలువడుతుంటుంది. అటువంటి పొలం నుంచి విడుదలయ్యే ఉద్గారాలను అనేక పర్యావరణ హిత సాగు పద్ధతులను అనుసరించటం ద్వారా అతి తక్కువ స్థాయికి తగ్గించటం మాత్రమే కాకుండా.. అంతకన్నా ఎక్కువ కర్బనాన్ని వాతావరణం నుంచి గ్రహించి భూమిలో స్థిరీకరించే స్థాయికి ఈ ఫామ్‌ను అభివృద్ధి చేయటంలో లిస్సిమోల్ విజయం సాధించారు. 2022 డిసెంబర్‌లో అలువ ఫామ్‌ను ప్రభుత్వం కార్బన్ న్యూట్రల్ ఫామ్‌గా ప్రకటించింది.

170 టన్నుల కర్బనం మిగులు!

కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న 'కాలేజ్ ఆఫ్ క్లైమెట్ ఛేంజ్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్' (ఇలాంటి కాలేజీ ఒకటి దేశంలో ఇతర రాష్ట్రాల్లో మాటేమో గానీ తెలుగు రాష్ట్రాల్లో అయితే లేదు) ప్రయోగాలు చేసి ఉద్గారాలను శాస్త్రీయంగా లెక్కగట్టింది. తురుత్ ద్వీప ప్రాంతంలో గల ఈ ఫామ్ 43 టన్నుల కర్బనాన్ని వాతావరణంలోకి విడుదల చేస్తుండగా, 213 టన్నుల కర్బనాన్ని వాతావరణం నుంచి గ్రహించి భూమిలో స్థిరీకరిస్తోందని ఈ ప్రయోగాల్లో తేలింది. అంటే.. ఈ క్షేత్రం 170 టన్నుల కార్బన్ క్రెడిట్లను సంపాయించిందన్న మాట. ఇది నిజానికి 'కార్బన్ పాజిటివ్' క్షేత్రం!

కేరళ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 13 విత్తనోత్పత్తి క్షేత్రాలు నడుస్తున్నాయి. వీటన్నిటినీ కార్బన్ న్యూట్రల్ ఫామ్స్‌గా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం చేరుకోవటంలో లిస్సిమోల్ విజయం సాధించారు. అంతేకాదు, రాష్ట్రంలోని 140 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా ఇటువంటి కార్బన్ న్యూట్రల్ ప్రదర్శనా క్షేత్రాలను నిర్మించే ప్రయత్నమూ జరుగుతోంది.

ఇదీ సమీకృత సేంద్రియ సేద్యం

5.32 హెక్టార్ల ఈ క్షేత్రంలో 3 హెక్టార్లలో వరితో పాటు.. ఒక హెక్టారులో చిరుధాన్యాలు, చియా గింజలు, కొబ్బరి, అరటి, దుంప పంటలు, జాపత్రి, కూరగాయలు, ప్యాషన్ ఫ్రూట్ తదితర పంటలను సాగు చేస్తున్నారు. 2012 నాటికే ఎస్‌పిఓపి ఆర్గానిక్ సర్టిఫికేషన్ వచ్చింది. 15 మంది కార్మికులు పనిచేస్తున్నారు. కాసర్‌గోడ్ కల్లన్ రకం దేశీ ఆవులు 9, మలబార్ మేకలు 16, కుట్టనాడన్ బాతులు వంద, నాటు కోళ్లు, గిన్నె కోళ్లు కలిపి 50తో పాటు బ్యాచ్‌కి 5 వేల గిఫ్ట్ తిలాపియా చేపలను సైతం ఈ సమీకృత క్షేత్రంలో పెంచుతున్నారు.

దేశీ వరి రకాలు (జపాన్ వైలెట్, రక్తశాలి, గోల్డెన్ నవార, వెల్లతొండి, వదక్కన్ వెల్లారి కైమ, జైవ, మను రత్న..), అధికోత్పత్తినిచ్చే వరి వంగడాల విత్తనోత్పత్తిని చేపట్టడంతో పాటు లైవ్ రైస్ మ్యూజియంగా ఈ క్షేత్రాన్ని తీర్చిదిద్దారు. పంచగవ్య, జీవామృతం వంటి ఆర్గానిక్ గ్రోత్ ప్రమోటర్ ద్రావణాలతో పాటు చీడపీడలను అరికట్టే కషాయాలను తయారు చేసుకొని పంటలకు వాడటమే కాకుండా రైతులకు విక్రయిస్తున్నారు. వామ్, వర్మీ కంపోస్టు, వర్మీవాష్‌ను తయారు చేస్తున్నారు. రెడువీడ్ వంటి మిత్రపురుగులను సైతం పెంచుతున్నారు. తేనెటీగల పెంపకం కూడా ఉంది. పర్యాటకులను సైతం ఆకర్షిస్తున్న ఈ క్షేత్రం నిజంగా విలక్షణమైనదే. మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే.. వరి పొలంలో అనేక సమస్యల పరిష్కారానికి బాతులను ఉపయోగించటం. కలుపు నివారణ, చీడపీడల నియంత్రణతో పాటు భూసారం పెంపొందించడానికి కూడా బాతులు ఉపయోగపడుతున్నాయని లిస్సిమోల్ తెలిపారు. ఇక్కడ అనుసరించే ప్రతి పనినీ శాస్త్రీయంగా రికార్డు చేసి, అధ్యయనం చేసి గణాంకాలను రూపొందించారు. సమీకృత సేంద్రియ వ్యవసాయాన్ని అన్ని హంగులతో సక్రమంగా చేస్తే ఫలితాలు ఎలా ఉంటాయో ఈ క్షేత్రం కళ్లకు కడుతున్నదనటంలో అతిశయోక్తి లేదు!



లిస్సిమోల్ జె. వదక్కూట్



అలువి సీడ్ ఫామ్‌లో పెంచిన చేపలతో సిబ్బంది

దేశం నేర్చుకోదగ్గ పాఠాలు

2012 నుంచి సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ఈ క్షేత్రంలో అనుసరిస్తూ పదేళ్లలో ఈ మైలురాయిని దాటాం. హరిత గృహ వాయువుల ఉద్గారాలను తగ్గించే విధంగా వ్యవసాయ పనులను సమూలంగా మార్చాం. ఇలా చేయాల్సిన అవసరం ఏమిటో రైతులు, స్థానిక ప్రజలకు అవగాహన కలిగించేందుకు కృషి చేస్తున్నాం. దేశం యావత్తూ నేర్చుకోదగిన పర్యావరణ హిత సేద్య పాఠాలకు మా క్షేత్రం కేంద్ర బిందువైంది.

– లిస్సిమోల్ జె. వదక్కూట్,
సహాయ సంచాలకురాలు, స్టేట్ సీడ్ ఫామ్ అలువి,
ఎర్నాకులం జిల్లా పంచాయత్, కేరళ

వైఎస్సార్ జిల్లాల్లో డా. ఖాదర్ సభలు

డా. వైఎస్సార్ కడప జిల్లాలో సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై మార్చి 9, 10, 11 తేదీల్లో జరిగే అనేక సభల్లో స్వతంత్ర శాస్త్రవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. ఖాదర్‌వలి ప్రసంగిస్తారు. మార్చి 9 (ఆదివారం) ఉ. 11 గంటలకు పులివెందులలోని రానితోపు సమీపంలో సిరి సంజీవిని మిల్లెట్ కేఫ్ ఆధ్వర్యంలో సభ జరుగుతుంది. అదేరోజు సా. 5 గంటలకు గవర్నమెంట్ కాలేజీ (బాయ్స్) ఆవరణలో 'ఇంటాక్' ఆధ్వర్యంలో జరిగే సభలో డా. ఖాదర్ ప్రసంగిస్తారు. 10 (సోమవారం)న ఉ. 7 గంటలకు కడపలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం సమీపంలో మొట్టమొదటి సిరిధాన్యాల అంబలి కేంద్రాన్ని డా. ఖాదర్ ప్రారంభిస్తారు. అదే రోజు ఉ. 11.30 గంటలకు కడప ప్రభుత్వ మహిళా కళాశాలలో జరిగే సదస్సులో డా. ఖాదర్ ప్రసంగిస్తారు. 11(మంగళవారం)న ఉ.9.30 గంటలకు 'ఆహారం- ఆరోగ్యం- సుస్థిర జీవనం' అనే అంశంపై ప్రొద్దుటూరులోని వాగ్దేహి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కాలేజ్‌లో జరిగే సదస్సులో డా. ఖాదర్ ప్రసంగిస్తారు.

ఆస్ట్రేలియా ఎప్పుడైనా బలమైన ప్రత్యర్థే. మైదానంలో సహజంగానే కొంత ఉత్కంఠ ఖాయం. అయితే గెలవాలనే ఒత్తిడి మాపైనే కాదు వారిపైనా ఉంది. కీలక ఆటగాళ్లు లేకపోయినా ఆ జట్టులో పోరాటపటిమకు లోటు ఉండదు. కాబట్టి మా వ్యూహాలు, ప్రణాళికలకు అనుగుణంగా మేం బాగా ఆడటం ముఖ్యం. వరుణ్‌లో ప్రత్యేక ప్రతిభ ఉంది. ఎంపికపై కొన్ని విమర్శలు వచ్చినా సరే, జట్టు ప్రయోజనాల కోసం ప్రత్యేక ఆటగాడిగా చూస్తూ అతడికి సరైన సమయంలో అవకాశం ఇవ్వడం ముఖ్యం. మా నమ్మకాన్ని అతను నిలబెట్టుకున్నాడు. ఒకే నగరంలో ఉంటూ ఒకే వేదికపై అన్ని మ్యాచ్‌లు ఆడటం పట్ల మాపై విమర్శలు వస్తున్నాయి. అయితే ఇదేమీ మాకు అదనపు ప్రయోజనం కలిగించడం లేదు. ప్రతీసారి పిచ్ కొత్త సవాళ్లు విసురుతోంది. మూడు మ్యాచ్‌లలోను పిచ్ భిన్నంగా స్పందించింది. ఇది మా సొంత మైదానం కాదు. దుబాయ్‌లో మేం తరచుగా మ్యాచ్‌లు ఆడం. మాకు కూడా ఇది కొత్తగానే ఉంది. -రోహిత్ శర్మ, భారత కెప్టెన్

పిచ్ చూస్తే స్పిన్‌కు అనుకూలంగా కనిపిస్తోంది. ఇక్కడ వరుణ్‌ను మాత్రమే కాదు... ఇతర భారత స్పిన్నర్లను ఎదుర్కోవడం కూడా పెద్ద సవాల్‌వంటిది. మేం వారిని ఎలా ఎదుర్కొంటామనే దానిపైనే మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంటుంది. దుబాయ్‌లో రెండు రోజుల ప్రాక్టీస్ అవకాశం లభించడం మేలు చేసింది. ఎదురుదాడి చేయడంపై మాకూ కొన్ని వ్యూహాలు ఉన్నాయి. అవి ఎలా పని చేస్తాయో చూద్దాం. కీలక మ్యాచ్‌లలో ఒత్తిడి ఎప్పుడూ ఉంటుంది. అయితే ట్రవిస్ హెడ్ ఇలాంటి పరిస్థితుల్లో ఎప్పుడైనా బాగా ఆడతాడు. ఈసారి కూడా తనదైన శైలిలో దూకుడుగా చెలరేగి జట్టును గెలిపిస్తాడని నమ్ముతున్నా. -స్టీవ్ స్మిత్, ఆస్ట్రేలియా కెప్టెన్

కొడితే కొట్టాలిరా ఆసీస్‌ను...

భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌లు ఏకపక్షంగా మారిపోయాయి... వేర్వేరు కారణాలతో యాషెస్ సమరాలు గత కొన్నేళ్లుగా కళ తప్పాయి... అంతర్జాతీయ క్రికెట్‌లో ఇప్పుడు అన్నింటికంటే ఆసక్తికర పోరు అంటే భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగేదే. ఫార్మాట్ ఏదైనా హోరాహోరీ పోరాటాలు, అత్యుత్తమ స్థాయిలో వ్యక్తిగత ప్రదర్శనలు వెరసి ఇరు జట్ల మధ్య మ్యాచ్‌లను ఆకర్షణీయంగా మార్చేశాయి. ఇప్పుడు అభిమానులు ఎదురు చూసినట్లుగా మరోసారి రెండు అగ్రశ్రేణి టీమ్‌ల మధ్య నాకౌట్ సమరానికి సర్వం సిద్ధమైంది.

ఐసీసీ టోర్నీల్లో ప్రత్యేకంగా నాకౌట్ మ్యాచ్‌లలో భారత్, ఆసీస్ మధ్య మ్యాచ్ ఉండే తీవ్రతే వేరు... వన్డే వరల్డ్ కప్ ఫైనల్ తర్వాత ఈ ఫార్మాట్‌లో ఇరు జట్లు మళ్లీ ఇప్పుడే తలపడబోతున్నాయి. చాంపియన్స్ ట్రోఫీ సెమీఫైనల్ మ్యాచ్‌కు, వరల్డ్ కప్ ఫైనల్‌కు మధ్య స్థాయి అంతరం ఎంతో ఉన్నా... ఆసీస్‌ను ఓడించి ఇంటికి పంపిస్తే వచ్చే మజాయే వేరు. ఈ టోర్నీలో లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌లలో గెలిచి టీమిండియా అజేయంగా నిలవగా, అగ్రశ్రేణి ఆటగాళ్లు లేకున్నా... ఇంగ్లండ్‌పై ఛేదన ఆసీస్ పట్టుదలను చూపించింది.

నేడు చాంపియన్స్ ట్రోఫీ తొలి సెమీఫైనల్

ఆస్ట్రేలియాతో భారత్ 'ఢీ' | జోరు మీదున్న టీమిండియా | బ్యాటింగ్‌పైనే కంగారూల భారం

మధ్యాహ్నం గం.2:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



పిచ్, వాతావరణం

టోర్నీలో ఇప్పటి వరకు జరిగిన అన్ని మ్యాచ్‌ల తరహాలోనే ఇప్పుడూ నెమ్మదైన పిచ్ సిద్ధంగా ఉంది. స్పిన్నర్లు సహజంగానే ప్రభావం చూపిస్తారు. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకోవడం ఖాయం.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, రాహుల్, అక్షర్, పాండ్యా, జడేజా, కుల్దీప్, షమీ, వరుణ్.

ఆస్ట్రేలియా: స్మిత్ (కెప్టెన్), హెడ్, ఇన్‌గ్లిస్, లబుషేన్, కనోలీ, కేరీ, మ్యాక్స్‌వెల్, ఎలిస్, స్పెన్సర్, జంపా, ద్వార్‌షుయిస్/సంఘా.

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీలో లీగ్ దశ తర్వాత ఇప్పుడు అత్యంత కీలక మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. దుబాయ్ అంతర్జాతీయ స్టేడియంలో నేడు జరిగే తొలి సెమీఫైనల్లో మాజీ చాంపియన్లు భారత్, ఆస్ట్రేలియా తలపడనున్నాయి. వనరులు, ఫామ్‌ను బట్టి చూస్తే రోహిత్ బృందానిదే అన్ని రకాలుగా పైచేయిగా కనిపిస్తుండగా, చెప్పుకోదగ్గ బౌలింగ్ లేని ఆసీస్ పూర్తిగా తమ బ్యాటింగ్‌నే నమ్ముకుంది. భారత్ స్పిన్ చతుష్టయాన్ని కంగారులు ఎలా ఎదుర్కొంటారనేదే ఆసక్తికరం.

అదే జట్టుతో...

న్యూజిలాండ్‌తో చివరి లీగ్‌కు ముందు పేసర్ హర్షిత్ రాణాకు విశ్రాంతినిస్తూ జట్టు స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని ఎంచుకుంది. తనకు లభించిన ఈ అవకాశాన్ని అద్భుతంగా వాడుకున్న అతను ఐదు వికెట్లతో తన విలువను ప్రదర్శించాడు. ఆసీస్ టాప్-7 ఆటగాళ్లలో మ్యాక్స్‌వెల్, స్మిత్‌లకు మాత్రమే వరుణ్‌ను ఎదుర్కొన్న అనుభవం ఉంది. స్టీవ్ స్మిత్ కూడా 2021 తర్వాత అతని బౌలింగ్‌లో ఆడలేదు. ఆ తర్వాతే వరుణ్ తన బౌలింగ్‌ను మెరుగుదిద్దుకొని మరింతగా రాటుదేలాడు. కాబట్టి అతడిని పక్కన పెట్టి మళ్లీ రెండో పేసర్‌ను ఆడించే అవకాశం లేదు. మిగతా ముగ్గురు స్పిన్నర్లు రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ కూడా ఎంతో ప్రభావం చూపిస్తున్నారు. కాబట్టి ఇక్కడి పిచ్‌పై మన నలుగురు స్పిన్నర్లు మంత్రం బాగా పని చేస్తున్నట్లే. షమీకి తోడుగా హార్దిక్ పాండ్యా పేస్ బౌలింగ్ ఓవర్ల కోటా పూర్తి చేయగలిగితే చాలు. బ్యాటింగ్‌లో టాప్-3 గత మ్యాచ్‌లో విఫలమైనా... ఈ కీలక పోరులో చెలరేగిపోగల సత్తా వారికి ఉంది. శ్రేయస్ అయ్యర్ తన ఫామ్‌ను కొనసాగిస్తుండగా, కేఎల్ రాహుల్ కూడా రాణించాడు. అయితే రాహుల్ తన కీపింగ్‌లో మరింత చురుగ్గా ఉండాల్సిన అవసరం ఉంది. అక్షర్ బ్యాటింగ్‌లో అంచనాలకు మించి రాణిస్తుండటం సానుకూలాంశం. పాండ్యా దూకుడైన బ్యాటింగ్ చివర్లో భారత్‌కు భారీ స్కోరు అందించగలదు. ఓవరాల్‌గా చూస్తే టీమిండియా దాదాపు ఎలాంటి లోపాలు లేకుండా అన్ని రకాలుగా పటిష్టంగా కనిపిస్తోంది.

బ్యాటర్లు రాణిస్తేనే...

ముగ్గురు ప్రధాన పేసర్లు స్టార్క్, కమిన్స్, హాజల్‌వుడ్ దూరం కావడంతో టోర్నీకి ముందే ఆస్ట్రేలియా విజయావకాశాలు తగ్గిపోయాయి. అయితే ఇంగ్లండ్‌పై 352 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించడంతో ఆ జట్టు స్థాయి ఏమిటో



కనిపించింది. దక్షిణాఫ్రికాతో మ్యాచ్ రద్దు కాగా, అఫ్గానిస్తాన్‌పై కూడా మ్యాచ్ ఆగే సమయానికి ఆసీస్ విజయం వైపు వెళుతోంది. బ్యాటింగ్‌లో ట్రవిస్ హెడ్, ఇన్‌గ్లిస్‌లు దూకుడుగా ఆడగల సమర్థులు కాగా... లబుషేన్, స్మిత్ ఇన్నింగ్స్‌ను నడిపించగలరు. మన టీమ్‌పై హెడ్ ఆట ఏమిటో కొత్తగా చెపాల్సిన అవసరం లేదు. చివర్లో కేరీ, మ్యాక్స్‌వెల్ వేగంగా పరుగులు రాబట్టగలరు. షార్ట్ గాయంతో దూరం కావడంతో అతని స్థానంలో వచ్చిన ఆల్‌రౌండర్ కూపర్ కనోలీ బరిలోకి దిగుతాడు. బ్యాటింగ్‌తో పాటు అతని లెఫ్టార్మ్ స్పిన్ కూడా కీలకం కానుంది. రెగ్యులర్ స్పిన్నర్ ఆడమ్ జంపా ఒక్కడే కాగా, మ్యాక్స్‌వెల్‌పై అదనపు భారం ఉంది. పిచ్‌ను బట్టి చూస్తే ముగ్గురు పేసర్లతో ఆసీస్ ఆడుతుందా అనేది సందేహమే. ద్వార్‌షుయిస్ స్థానంలో మరో స్పిన్నర్ తన్వీర్ సంఘాను ఎంచుకునే అవకాశం కూడా ఉంది. స్పిన్, అనుభవం లేని పేస్‌తో భారత్‌ను నిలువరించడం అంత సులువు కాదు కాబట్టి అనుభవజ్ఞులైన బ్యాటర్లపై జట్టు ఆధారపడుతోంది.

151 ఇప్పటి వరకు భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన వన్డేలు. 57 మ్యాచ్‌ల్లో భారత్... 84 మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా గెలిచాయి. 10 మ్యాచ్‌లు రద్దయ్యాయి.

4 చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో భారత్, ఆస్ట్రేలియా ముఖాముఖిగా నాలుగుసార్లు తలపడ్డాయి. రెండు సార్లు భారత్ (1998లో ఢాకాలో 44 పరుగుల తేడాతో; 2000లో నైరోబిలో 20 పరుగుల తేడాతో) నెగ్గింది. ఒకసారి ఆస్ట్రేలియా గెలిచింది (2006లో మొహాలిలో 6 వికెట్ల తేడాతో). 2009లో దక్షిణాఫ్రికాలో ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

6 అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వన్డే టోర్నమెంట్‌లలో (వరల్డ్‌కప్, చాంపియన్స్ ట్రోఫీ) భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆరుసార్లు నాకౌట్ దశ మ్యాచ్‌లు జరిగాయి. మూడుసార్లు భారత్ (1998, 2000 చాంపియన్స్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్‌లో; 2011 వరల్డ్‌కప్ క్వార్టర్ ఫైనల్లో)... మూడుసార్లు ఆస్ట్రేలియా (2003 వరల్డ్‌కప్ ఫైనల్, 2015 వరల్డ్‌కప్ సెమీఫైనల్, 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్) గెలిచి 3-3తో సమంగా ఉన్నాయి.

గుజరాత్ ఘన విజయం

- 81 పరుగులతో యూపీ చిత్తు
- బెత్ మూనీ 96 నాటౌట్



లక్నో: ఉమెన్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో గుజరాత్ జెయింట్స్ కీలక విజయాన్ని అందుకుంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో జెయింట్స్ 81 పరుగుల తేడాతో యూపీ వారియర్స్‌పై ఘన విజయం సాధించింది. ముందుగా గుజరాత్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 186 పరుగులు సాధించింది. ఓపెనర్ బెత్ మూనీ (59 బంతుల్లో 96 నాటౌట్; 17 ఫోర్లు) త్రుటిలో సెంచరీ అవకాశం కోల్పోగా, హర్లీన్ డియోల్ (32 బంతుల్లో 45; 6 ఫోర్లు) రాణించింది. అనంతరం వారియర్స్ 17.1 ఓవర్లలో 105 పరుగులకే ఆలౌటైంది. షినెల్ హెన్రీ (14 బంతుల్లో 28; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), గ్రేస్ హారిస్ (30 బంతుల్లో 25; 3 ఫోర్లు) మినహా అంతా విఫలమయ్యారు. గుజరాత్ బౌలర్లలో కాశ్వీ, తనూజ చెరో 3 వికెట్లు తీశారు. వాజ్‌పేయి ఇకానా స్టేడియంలో ఇదే తొలి డబ్ల్యూపీఎల్ మ్యాచ్ కాగా... సొంత మైదానంలో యూపీ చిత్తుగా ఓడింది. తొలి ఓవర్లోనే హేమలత (2) వికెట్ కోల్పోయినా... మూనీ, హర్లీన్ రెండో వికెట్‌కు రెండో వికెట్‌కు 68 బంతుల్లోనే 101 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ముఖ్యంగా మూనీ బౌండరీలతో విరుచుకుపడి జట్టుకు భారీ స్కోరును అందించింది. 37 బంతుల్లో ఆమె అర్ధ సెంచరీ పూర్తయింది. యూపీ బౌలర్లంతా సమష్టిగా విఫలం కాగా...ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడే అవకాశం దక్కించుకున్న హైదరాబాదీ లెఫ్టార్మ్ స్పిన్నర్ గౌహర్ సుల్తానాకు ఒక్క ఓవర్ కూడా వేసే అవకాశం రాలేదు! ఛేదనలో వారియర్స్ మరీ పేలవంగా ఆడింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే రెండు వికెట్లు తీసి డాటిన్ దెబ్బ కొట్టగా...పవర్‌ప్లే ముగిసే సరికి స్కోరు 29/4కు చేరింది. ఆ తర్వాత ఏ దశలోనూ యూపీ కోలుకోలేకపోయింది. రెండు రోజుల విశ్రాంతి అనంతరం గురువారం జరిగే మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో యూపీ వారియర్స్ ఆడుతుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



సీన్ పెరిగింది

అమెరికన్ ఫిల్మ్ మేకర్ సీన్ బేకర్ సీన్ ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోయింది. 'అనోరా' సినిమాకు గాను ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఒరిజినల్ స్క్రీన్‌ప్లే, ఫిల్మ్ ఎడిటింగ్ విభాగాల్లో సీన్ బేకర్‌కు నాలుగు అవార్డులు దక్కాయి. ఆస్కార్ చరిత్రలో ఒకే సినిమాకి నాలుగు అవార్డులు సాధించిన ఒకే ఒక్కడు సీన్ బేకర్ కావడం విశేషం. హాలీవుడ్ సమాచారం ప్రకారం... 1954లో వాల్ట్ డిస్నీ (అమెరికన్ యానిమేటర్, వాయిస్ యాక్టర్, ప్రొడ్యూసర్)కు నాలుగు ఆస్కార్ అవార్డులు వచ్చాయట. కానీ ఇవి ఒకే సినిమాకి రాలేదు. అలాగే 1974లో అమెరికన్ ఫిల్మ్ మేకర్ ఫ్రాన్సిస్ ఫోర్డ్ కొప్పోల 'ది గాడ్ ఫాదర్ 2' చిత్రానికి మూడు ఆస్కార్ అవార్డులు (బెస్ట్ పిక్చర్, డైరెక్టర్, అడాప్టెడ్ స్క్రీన్ ప్లే విభాగాల్లో) గెలుచుకున్నారు.

సీన్ బేకర్

దయచేసి థియేటర్లలోనే సినిమా చూడండి - సీన్ బేకర్

''సెక్స్ వర్కర్స్ (వేశ్యల నేపథ్యంలో 'అనోరా'ని రూపొందించారు) కమ్యూనిటీకి థ్యాంక్స్ చెబుతున్నాను. ఈ ఆస్కార్ అవార్డును వారితో షేర్ చేసుకుంటున్నట్లుగా ఫీలవుతున్నాను'' అన్నారు సీన్ బేకర్. ఇంకా ఆయన మాట్లాడుతూ – ''థియేటర్స్‌లో సినిమా చూడటం ఓ గొప్ప అనుభూతి. మనందరం కలిసి నవ్వుతాం... ఏడుస్తాం... ఉత్సాహంగా అరుస్తాం. ప్రపంచమంతా వివిధ భాగాలుగా విడిపోతున్నట్లు కనిపిస్తున్న ఇలాంటి తరుణంలో థియేటర్స్‌లో అందరం కలిసి సినిమా చూడటం అనేది ఓ ముఖ్యమైన అంశం కావొచ్చు. ప్రస్తుతం థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ప్రమాదంలో ఉంది. సినిమా థియేటర్స్, మరీ ముఖ్యంగా స్వంతంత్రంగా రన్ చేస్తున్న థియేటర్స్ యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. మనందరం సపోర్ట్ చేయాలి. సినిమాలను థియేటర్స్‌లో చూడటం అనేది మన సంప్రదాయంలో ఒక భాగం. తల్లిదండ్రులు కూడా వారి పిల్లలను థియేటర్స్‌లో సినిమాలు చూసే విధంగా ప్రోత్సహించాలి. అద్భుతమైన ఆర్టిస్టుల రక్తం, కన్నీళ్లు, చెమటలతో 'అనోరా'ను నిర్మించడం జరిగింది. ఇండిపెండెంట్ సినిమాలు కలకాలం జీవించాలి'' అని పేర్కొన్నారు సీన్ బేకర్. మరో హైలెట్ ఏంటంటే... సీన్ బేకర్ తల్లి పుట్టిన రోజునే ఆయనకు నాలుగు ఆస్కార్ అవార్డులు వచ్చాయి. తన అవార్డు యాక్సెప్టెన్స్ స్పీచ్‌లో తన తల్లికి సీన్ బేకర్ థ్యాంక్స్ చెప్పారు.

● ''అనోరా'ను మేం తక్కువ డబ్బుతోనే చేశాం. యంగ్ ఫిల్మ్‌మేకర్స్ మీరు చెప్పాలనుకుంటున్న కథలను చెప్పండి. మీరు ఏ మాత్రం పశ్చాత్తాపపడనడానికి మాకు దక్కిన ఈ అవార్డు ఓ ఉదాహరణ'' అని 'అనోరా' నిర్మాతలు అలెక్స్ కోకో, సమంత క్వాన్ అన్నారు.



పింక్ గౌనులో ప్రెట్టీగా...

ఆస్కార్ అవార్డు వేడుకలో అందాల తారలు అదిరిపోయే డ్రెస్సుల్లో వీక్షకులను ఆకట్టుకుంటుంటారు. ఈ ఏడాది ముఖ్యంగా నటి, గాయని సెలీనా గోమెజ్ సెంటరాఫ్ ఎట్రాక్షన్ అయ్యారు. 16వేల క్రిస్టల్స్ పొదిగిన హాఫ్ షోల్డర్ పింక్ గౌనులో ప్రెట్టీగా అగుపించారు సెలీనా. హాయ్ అంటూ చిరునవ్వులు చిందిస్తూ, రెడ్ కార్పెట్‌పై వయ్యారంగా నడుచుకుంటూ వెళ్లిన సెలీనా వైపు నుంచి వీక్షకులు చూపులు తిప్పుకోలేకపోయారు.

● బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో 'నో అదర్ ల్యాండ్' సినిమా ఆస్కార్ అవార్డు గెలుచుకుంది. పాలస్తీనా- ఇజ్రాయెల్‌కు చెందిన నలుగురు బాసెల్ అడ్రా, హమ్దాన్ బల్లాల్, యువల్ అబ్రహాం, రాచెల్ స్జోర్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన చిత్రం ఇది. వీరు ఆస్కార్ అవార్డు తీసుకునేందుకు స్టేజ్ మీదకు వచ్చారు. పాలస్తీనా ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఆపేందుకు సరైన చర్యలు తీసుకోవాల్సిందిగా, ప్రపంచాన్ని కోరుతున్నట్లుగా ఈ వేదికపై అడ్రా మాట్లాడారు.

● 97వ ఆస్కార్ అవార్డుల ప్రకటన

అనోరా... పాంచ్ పటాకా

- ఉత్తమ నటుడు అడ్రియన్ బ్రాడీ, ఉత్తమ నటి మైకీ మాడిసన్
- 'అనోరా'కు ఐదు అవార్డులు
- నాలుగు అవార్డులతో చరిత్ర సృష్టించిన దర్శకుడు సీన్ బేకర్

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తికరంగా ఎదురు చూసిన 97వ ఆస్కార్ అవార్డుల విజేతల వివరాలు వెల్లడయ్యాయి. అమెరికాలోని లాస్ ఏంజెలెస్ డాల్బీ థియేటర్‌లో ఆదివారం రాత్రి (భారతీయ కాలమానం ప్రకారం సోమవారం ఉదయం) 97వ ఆస్కార్ అవార్డు వేడుక ఘనంగా జరిగింది. 23 విభాగాల్లో అవార్డులను ప్రకటించారు. మొత్తం ఆరు విభాగాల్లో (ఉత్తమ చిత్రం, నటి, దర్శకుడు, ఒరిజినల్ స్క్రీన్ ప్లే, సపోర్టింగ్ యాక్టర్) నామినేషన్స్ దక్కించుకున్న అమెరికన్ రొమాంటిక్ కామెడీ డ్రామా 'అనోరా' చిత్రం ఉత్తమ సహాయ నటి విభాగం మినహాయించి, మిగిలిన ఐదు విభాగాల్లో అవార్డులు సాధించి, 97వ ఆస్కార్ అవార్డ్స్‌లో అత్యధిక అవార్డులు సాధించిన చిత్రంగా నిలిచింది. ఆ తర్వాత పీరియాడికల్ డ్రామా 'ది బ్రూటలిస్ట్'కి మూడు (ఉత్తమ నటుడు, సినిమాటోగ్రఫీ, ఒరిజినల్ స్కోర్) అవార్డులు దక్కాయి. ఇక ఈ ఆస్కార్ అవార్డ్స్‌లో అత్యధికంగా 13 నామినేషన్లు దక్కించుకున్న స్పానిష్ మ్యూజికల్ క్రైమ్ కామెడీ ఫిల్మ్ 'ఎమిలియా పెరెజ్', 10 నామినేషన్లు దక్కించుకున్న అమెరికన్ మ్యూజికల్ ఫ్యాంటసీ 'వికెడ్', అమెరికన్ సైన్స్ ఫిక్షన్ 'డ్యూన్ పార్టు 2' చిత్రాలు రెండేసి అవార్డులతో సరిపెట్టుకున్నాయి. అమెరికన్ ప్రముఖ సింగర్, సాంగ్ రైటర్ బాబ్ డైలాన్ బయోగ్రాఫికల్ మ్యూజికల్ డ్రామా 'ఏ కంప్లీట్ అన్‌నోన్' చిత్రానికి ఎనిమిది నామినేషన్స్ దక్కినా ఒక్క అవార్డు కూడా గెలుచుకోలేకపోయింది. 'ది బ్రూటలిస్ట్'లోని నటనకుగాను అడ్రియన్ బ్రాడీకి ఉత్తమ నటుడిగా, 'అనోరా'కి మైకీ మాడిసన్‌కి ఉత్తమ నటిగా అవార్డులు దక్కాయి. ఉత్తమ చిత్రంగా 'అనోరా' నిలవగా, అదే చిత్రానికి ఉత్తమ దర్శకుడి అవార్డు సీన్ బేకర్‌కి దక్కింది. ఇంకా పలు విభాగాల్లో పలువురు అవార్డులు అందుకున్నారు.



కోనన్ ఓ బ్రైయన్

నమస్కార్... 'బాహుబలి, ఆర్ఆర్ఆర్, పుష్ప1, 2' వంటి చిత్రాలతో భారతీయ సినిమా ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయిన సంగతి తెలిసిందే. ఈ చిత్రాలకు ముందు భారతీయ సినిమా అంటే హిందీ అన్నట్లుగా ఉండేది. ఇప్పుడు తెలుగు సినిమా ఆ స్థాయికి చేరుకుంది. ఇక భారతీయ చిత్రసీమని, ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి విదేశీయులు ఆసక్తి చూపుతున్నారు. అందుకు ఓ ఉదాహరణ 97వ ఆస్కార్ అవార్డు వేడుక. ఈ వేడుకకు కోనన్ ఓ బ్రైయన్ హోస్ట్‌గా వ్యవహరించారు. ఆస్కార్ వేడుకను హోస్ట్ చేయడం ఆయనకు ఇదే తొలిసారి. తన వ్యాఖ్యానంతో ప్రపంచ ప్రేక్షకులను ఆకట్టుకోవాలనుకున్న కోనన్ హిందీ, స్పానిష్, మాండరిన్ భాషల్లో మాట్లాడారు. భారతీయులను ఉద్దేశించి, 'నమస్కార్' అంటూ హిందీ భాష పలుకుతూ 'నమస్కార్... నాస్తే కే సాథ్ ఆస్కార్ కర్ రహే హై ఆప్ లోగ్' (నమస్కారం... మీకు అక్కడ ఉదయం కాబట్టి బ్రేక్‌ఫాస్ట్ తింటూ ఆస్కార్ ఫంక్షన్‌ని చూస్తున్నారనుకుంటున్నా) అన్నారు. ఇలా ఆస్కార్ వేదికపై భారతీయ భాష వినపడడం భారతీయులను ఆనందపరిచే విషయం అని చెప్పొచ్చు.



దర్శకుడు వాల్టర్ సాల్లెస్



నల్ల జాతీయుడి రికార్డ్

ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ విభాగంలో 'వికెడ్' సినిమాకు గాను, పాల్ తేజ్‌వెల్ ఆస్కార్ అవార్డును అందుకున్నారు. ఈ విభాగంలో అవార్డు అందుకున్న తొలి నల్ల జాతీయుడు పాల్ కావడం విశేషం. "కాస్ట్యూమ్ డిజైన్ విభాగంలో తొలి అవార్డు అందుకున్న తొలి నల్ల జాతి వ్యక్తిని నేనేనని గర్వంగా చెబుతున్నా. ఈ అవార్డుతో గౌరవించిన ఆస్కార్ అకాడమీకి థ్యాంక్స్. మా 'వికెడ్' లీడింగ్ లేడీస్, టీమ్‌కి కూడా థ్యాంక్స్" అని పాల్ పేర్కొన్నారు.

ఆస్కార్ విజేతలు...

● ఉత్తమ చిత్రం – అనోరా ● నటుడు – అడ్రియన్ బ్రాడీ (ది బ్రూటలిస్ట్) ● నటి – మైకీ మాడిసన్ (అనోరా) ● దర్శకత్వం – అనోరా (సీన్ బేకర్) ● సహాయ నటుడు – కీరన్ కైల్ కల్కిన్ (ది రియల్ పెయిన్) ● సహాయ నటి – జోయా సాల్దానా (ఎమిలియా పెరెజ్) ● స్క్రీన్‌ప్లే – అనోరా (సీన్ బేకర్) ● సినిమాటోగ్రఫీ – ది బ్రూటలిస్ట్ (లాల్ క్రాలీ) ● విజువల్ ఎఫెక్ట్స్ – డ్యూన్: పార్ట్2 ● ఒరిజినల్ సాంగ్ – ఎల్ మాల్ (ఎమిలియా పెరెజ్) ● అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే – కాన్‌క్లేవ్ (పీటర్ స్ట్రాగన్) ● సౌండ్ – డ్యూన్: పార్ట్2 ● మేకప్, హెయిర్ స్టైల్ – ది సబ్‌స్టాన్స్ ● ఎడిటింగ్ – అనోరా (సీన్ బేకర్) ● కాస్ట్యూమ్ డిజైన్ – వికెడ్ (పాల్ తేజ్‌వెల్) ● ఒరిజినల్ స్కోర్ – ది బ్రూటలిస్ట్ (డానియల్ బ్లమ్‌బెర్గ్) ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ – ఐయామ్ స్టిల్ హియర్ (వాల్టర్ సాల్లెస్-బ్రెజిల్) ● డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్– ది ఓన్లీ గర్ల్ ఇన్ ది ఆర్కెస్ట్రా ● లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ – ఐయామ్ నాట్ ఏ రోబో ● ప్రొడక్షన్ డిజైన్ – వికెడ్ ● యానిమేటెడ్ షార్ట్‌ఫిల్మ్ – ఇన్ ది షాడో ఆఫ్ ది సైప్రెస్ ● యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ – ఫ్లో ● డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ – నో అదర్ ల్యాండ్

● "డొమినికన్ ఆరిజన్‌కు చెందిన తొలి అమెరికన్‌గా నేను ఆస్కార్ అవార్డు అందుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. ఇలా అవార్డు అందుకుంటున్న చివరి అమ్మాయిని నేను కాదని కూడా నాకు తెలుసు" అన్నారు ఉత్తమ సహాయ నటి సల్దానా.

భారతీయులకు నిరాశ

లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో భారతదేశం చిత్రం 'అనూజ' పోటీలో నిలిచినా అవార్డును గెలుచుకోలేకపోవడం భారతీయ ప్రేక్షకులను నిరాశపరిచింది. ఈ విభాగంలో డచ్ ఫిల్మ్ 'ఐయామ్ నాట్ ఏ రోబో' మూవీ అవార్డు ఎగరేసుకుపోయింది. ఇక ఉత్తమ విదేశీ చిత్రం విభాగానికి ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా హిందీ చిత్రం 'లాపతా లేడీస్' చిత్రాన్ని ఆస్కార్ ఎంట్రీకి పంపగా నామినేషన్ దక్కించుకోలేకపోయిన విషయం గుర్తుండే ఉంటుంది.



మైకీ మాడిసన్

మహిళలకు అంకితం - దర్శకుడు వాల్టర్ సాల్లెస్

పొలిటికల్ బయోగ్రాఫికల్ డ్రామా ఫిల్మ్ 'ఐయామ్ స్టిల్ హియర్' చరిత్ర సృష్టించింది. 97 ఏళ్ల ఆస్కార్ చరిత్రలో ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో అవార్డు సాధించిన తొలి బ్రెజిల్ మూవీగా ఈ చిత్రం నిలిచింది. వాల్టర్ సాల్లెస్ ఈ సినిమాకు దర్శకుడు. కథ రాసిన రూబెన్స్ నిర్మించారు. ఈ సినిమాలోని ప్రధాన పాత్ర యూనిస్ పైవాగా బ్రెజిలియన్ నటి ఫెర్నాండా టోర్రెస్ నటించారు. అదృశ్యమైన తన భర్త కోసం ఓ మహిళ చేసే అసాధారణమైన పోరాటం నేపథ్యంలో 'ఐయామ్ స్టిల్ హియర్' మూవీ సాగుతుంది. ''ఓ మహిళ అసాధారణ పోరాటమే ఈ సినిమాకు అవార్డు తెచ్చిపెట్టింది. ఆ పోరాటానికి ప్రాణం పోసిన ఫెర్నాండా టోర్రెస్, ఫెర్నాండా మోంటెనెగ్రోలకు ఈ అవార్డు దక్కుతుంది'' అని వాల్టర్ సాల్లెస్ పేర్కొన్నారు.

అమెరికన్ రికార్డు ప్రొడ్యూసర్–కంపోజర్ క్విన్సీ జోన్స్‌తో పాటు పలువురు ప్రముఖులకు ఆస్కార్ నిర్వాహకులు నివాళులు అర్పించారు. ఇక ఇటీవల మరణించిన ప్రముఖ హాలీవుడ్ నటుడు హాక్‌మాన్ గురించి మెమోరియమ్ సెగ్మెంట్‌లో అమెరికన్ యాక్టర్, ప్రొడ్యూసర్ మోర్గాన్ ఫ్రీమాన్ మాట్లాడారు.



గాళ్ ఫ్రెండ్ జార్జినా చాప్‌మాన్ వైపు చూయింగ్ గమ్ విసురుతున్న అడ్రియన్

● ఆస్కార్ వేదికగా 'కిల్‌బిల్' (2003) ఫేమ్ డారిల్ హన్నా ఉక్రెయిన్ తరఫున తన స్వరం వినిపించారు. ఫిల్మ్ ఎడిటింగ్ విభాగంలో విజేతను ప్రకటించేందుకు వేదికపైకి వచ్చిన, డారిల్ ఉక్రెయిన్‌కు విజయం వరించాలన్నట్లుగా విక్టరీ సింబల్ చూపించారు.

చూయింగ్ గమ్.. ఛీ... ఛీ

ఆస్కార్ విజేతలు వేదికపై మాట్లాడేందుకు నిర్వాహకులు 45 సెకన్ల నిడివిని నిర్ణయించారు. కానీ అడ్రియన్ దాదాపు మూడు నిమిషాలకు పైనే మాట్లాడుతుండటంతో నిర్వాహకులు మ్యూజిక్ ప్లే చేశారు. ఆ మ్యూజిక్‌ను ఆపాలని అడ్రియన్ పేర్కొన్నారు. అలాగే స్టేజ్ మీదకు వచ్చే ముందు నోట్లో ఉన్న చూయింగ్ గమ్‌ను తన గాళ్ ఫ్రెండ్ జార్జినా చాప్‌మాన్ (నటి, ఫ్యాషన్ డిజైనర్) వైపు విసిరేశారు. ఈ వింత ప్రవర్తన చాలామంది వీక్షకులకు నచ్చలేదు. 'ఇదేంటి... ఛీ ఛీ' అన్నట్లుగా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇక అడ్రియన్‌కు ఇది రెండో ఆస్కార్ అవార్డు. 2003లో వచ్చిన 'ది పియానిస్ట్' చిత్రానికి బెస్ట్ యాక్టర్‌గా తొలి ఆస్కార్ అందుకున్నారు అడ్రియన్. అప్పుడు తనకు అవార్డు అందజేసిన నటి హాలీ బెర్రీని ముద్దుపెట్టుకున్నారు. 75వ ఆస్కార్ అవార్డ్స్‌లో జరిగిన ఈ సంఘటన అప్పట్లో సంచలనమైంది. తాజాగా 97వ ఆస్కార్ అవార్డ్స్ రెడ్ కార్పెట్‌పై హాలీ బెర్రీని ముద్దాడి వార్తల్లో నిలిచారు అడ్రియన్.

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	112	73,086
నిఫ్టీ ▽	5	22,119

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11:30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	18,768	▽	79
డోజోన్స్	43,738	▽	100
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,871	△	61
డాక్స్	23,139	△	588
షాంఘై	3,317	▽	4
నికాయ్	37,785	△	630

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	85,320
బంగారం (99.5 స్వచ్ఛత)	84,978
వెండి (కిలో)	94,398

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	86.95	87.97
£	బ్రిటన్ పౌండ్	108.80	111.64
€	యూరో	89.77	92.41
¥	జపాన్ ఎన్ (100)	57.48	58.93
AUS	ఆస్ట్రేలియా డాలర్	53.25	55.46
S$	సింగపూర్ డాలర్	62.64	67.30
SAR	సౌదీ రియాల్	22.40	23.96
UAE D	యూఏఈ దిర్హామ్	22.90	24.68
¥	చైనా యువాన్	11.12	12.94

కంపెనీల బాండ్ బాజా!

ఎఫ్‌ఐఐల అమ్మకాలు ఆగటం లేదు. మార్కెట్లు పడిపోతున్నాయి. దీంతో చాలా కంపెనీల షేర్లు ఏడాది కనిష్ఠానికి వచ్చేశాయి. మిగిలిన పెట్టుబడి సాధనాల్లో... బంగారం పెరుగుతున్నా... ధరల్లో ఊగిసలాట తప్పదు. రియల్ ఎస్టేట్ అంతంత మాత్రంగానే ఉంది. బ్యాంకు డిపాజిట్లు సురక్షితమే కానీ... వడ్డీ రేట్లు తక్కువ. మరి వీటికన్నా ఎక్కువ వచ్చే ప్రభుత్వ బాండ్లు బెటరా? లేకపోతే అంతకన్నా కాస్త ఎక్కువ గిట్టుబాటయ్యే ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీల బాండ్లు బెటరా? రాబోయే వారం పది రోజుల్లో పలు ప్రభుత్వ కంపెనీలు సైతం బాండ్లు జారీ చేయటానికి ముందుకొస్తున్న నేపథ్యంలో... వాటి లాభనష్టాలు, రిస్కుల గురించి తెలుసుకుందాం...

- సాక్షి, బిజినెస్ ప్రతినిధి

నిధుల కోసం లైను కడుతున్న కార్పొరేట్లు

- **లిక్విడిటీ కట్టడితో మరిన్ని కంపెనీల ప్రవాహం**
- **ప్రభుత్వ సెక్యూరిటీల జారీ కూడా ఎక్కువే**
- మరి బాండ్లలో పెట్టుబడి ఎంతవరకూ లాభం?
- ఏ బాండ్లలో రిస్కు ఎక్కువ? వేటిలో తక్కువ?
- ఇన్వెస్ట్ చేసే ముందు చూడాల్సిన అంశాలేంటి?
- విక్రయించేటపుడు ఉండే షరతులేంటి?
- ఇన్వెస్టర్ల కోసం 'సాక్షి' బిజినెస్ విశ్లేషణాత్మక కథనం

వడ్డీ రేట్లు పెంచుతూ లిక్విడిటీని రిజర్వు బ్యాంకు కట్టడి చేస్తోంది. దీంతో అప్పుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సహా పలు కంపెనీలు బాండ్ల జారీకి వస్తున్నాయి. ఈ తాకిడి ఎంతలా అంటే... ఈ ఒక్కవారంలోనే కంపెనీలు రూ.30 వేల కోట్ల విలువైన బాండ్లు జారీ చేస్తున్నాయి. వీటిలో ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఇరెడా) 7.40 శాతం వడ్డీతో 11 ఏళ్ల కాలానికి రూ.820 కోట్లు సమీకరించగా... నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) ఏడేళ్ల కాలానికి 7.35 శాతం వడ్డీ రేటుతో రూ.4,800 కోట్లు సమీకరించింది. ఇక ఆర్‌ఈసీ 7.99 శాతం వడ్డీతో నిరవధిక బాండ్లను జారీ చేసింది. రూ.2,000 కోట్లు సమీకరించాలనుకున్నా రూ.1,995 కోట్లే చేయగలిగింది. ఇక రాబోయే రోజుల్లో నాబార్డ్ పదేళ్ల కాలానికి రూ.7,000 కోట్లు, సిడ్బి నాలుగేళ్ల కాలానికి రూ.6,000 కోట్లు, పీఎఫ్‌సీ నాలుగేళ్లకు రూ.4 వేల కోట్లు సమీకరించనున్నాయి.

జనవరిలో ట్రంప్ టారిఫ్‌ల ప్రకటన, భౌగోళిక అనిశ్చితుల నేపథ్యంలో బాండ్ మార్కెట్ భయపడింది. వడ్డీ రేట్లు పెరిగాయి. ఆర్‌బీఐ సైతం వడ్డీ రేట్లు పెంచి లిక్విడిటీని కట్టడి చేసింది. దీంతో ప్రభుత్వ బాండ్లపై ఈల్డ్‌లు (రాబడి) 0.5 శాతం వరకూ పెరిగాయి. దీంతో కార్పొరేట్లు మరింత ఎక్కువ వడ్డీని ఆఫర్ చేయాల్సి వచ్చింది. ప్రస్తుతం ప్రభుత్వ బాండ్ల ఈల్డ్ 7.1 శాతం నుంచి 7.3 శాతం మధ్య ఉండగా... ప్రైవేటు కంపెనీలు అంతకన్నా ఎక్కువ కూపన్ రేటును ఆఫర్ చేయాల్సి వస్తోంది.

ప్రభుత్వ సావరిన్ బాండ్లు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేస్తాయి కనుక చాలా తక్కువ రిస్కు ఉంటుంది.
- సురక్షితం కనుక... తక్కువ వడ్డీని ఆఫర్ చేస్తాయి. కానీ బ్యాంకు డిపాజిట్లతో పోలిస్తే వడ్డీ కాస్తంత ఎక్కువ ఉంటుంది.
- డిపాజిట్ల మాదిరి ఎప్పుడు కావాలంటే అప్పుడు క్యాన్సిల్ చేసుకోలేరు. కానీ బాండ్ మార్కెట్లో ట్రేడవుతాయి కనుక అప్పటి ధరకు విక్రయించుకోవచ్చు.
- ఏడాదికోసారి వడ్డీ మన ఖాతాలో ఠంచనుగా పడుతుంది.

ప్రైవేటు, ప్రభుత్వ కంపెనీల బాండ్లు

- కంపెనీలు తమ సొంత పూచీకత్తుపై జారీ చేస్తాయి. వాటి పని తీరుపై ఆధారపడి ఉంటాయి కనుక రిస్కు కాస్తంత ఎక్కువ.
- రిస్కు ఎక్కువ కనుక ప్రభుత్వ బాండ్ల కన్నా వడ్డీ కాస్త ఎక్కువే.
- వీటిని కూడా ప్రభుత్వ బాండ్ల మాదిరి ఎప్పుడు కావాలంటే అప్పుడు బాండ్ మార్కెట్లో విక్రయించుకునే అవకాశం ఉంటుంది.
- వీటి రేటింగ్‌ను బట్టి వడ్డీ ఉంటుంది. ట్రిపుల్ ఏ బాండ్లకు కాస్త తక్కువగా... రేటింగ్ తగ్గుతున్న కొద్దీ వడ్డీ పెరిగేలా ఉంటాయి.
- కాకపోతే తక్కు రేటింగ్ ఉన్న బాండ్లకు రిస్కు కూడా ఎక్కువని గమనించాలి.

నిరవధిక బాండ్లు అంటే..

సాధారణంగా పెర్పెట్యువల్ బాండ్లుగా పిలిచే ఈ బాండ్లకు నిర్ణీత కాలమంటూ ఏదీ ఉండదు. ఒక కంపెనీ ఈ రకమైన బాండ్లను జారీ చేస్తే... కాలపరిమితి ఉండదు కనుక ఏడాదికోసారి చొప్పున నిరవధికంగా వడ్డీని చెల్లిస్తూ పోతాయి. ఒకవేళ వాటిని బైబ్యాక్ చెయ్యాలని భావిస్తే అప్పుడు ప్రకటన ఇచ్చి... తమ బాండ్ల ప్రిన్సిపల్ మొత్తాన్ని చెల్లించి వెనక్కి తీసుకుంటాయి. అప్పటిదాకా వడ్డీ మాత్రం చెల్లిస్తుంటాయి. ప్రిన్సిపల్ మొత్తాన్ని తిరిగి పొందటానికి కాలపరిమితి ఉండదు కనుక వీటికి వడ్డీ రేటు కూడా ఎక్కువే ఉంటుంది.

గమనించాల్సింది ఏంటంటే...

బాండ్లలో ఇన్వెస్ట్ చేసేవారు గమనించాల్సిన ముఖ్యమైన విషయమేంటంటే... ఆ బాండ్లకు బాగా రేటింగ్ ఉండి, చురుగ్గా ట్రేడయితేనే సెకండరీ బాండ్ మార్కెట్లో వెంటనే విక్రయించగలం. రేటింగ్ తక్కువగా ఉన్న బాండ్లయినా, నిరవధిక బాండ్లయినా విక్రయించటం అంత ఈజీ కాదు. పైపెచ్చు విక్రయించేటపుడు వాటి ధర అప్పటి వడ్డీ రేట్లపై ఆధారపడి ఉంటుంది. మీరు కొన్నపుడు వడ్డీరేట్లు తక్కువ ఉండి ఆ తరవాత పెరిగాయనుకోండి. మీ బాండ్ల ధర కూడా తగ్గుతుంది. అదే రివర్స్‌లో మీరు కొన్నాక వడ్డీ రేట్లు తగ్గితే.. మీ బాండ్లకు ఎక్కువ వడ్డీ వస్తుంది కనక వాటికి గిరాకీ ఉంటుంది. ఈ అంశాలు దృష్టిలో పెట్టుకుంటే బాండ్లలోనూ ఇన్వెస్ట్ చేయొచ్చు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఫార్మా ఎగుమతుల్లో భారత్ జోరు | నిధుల వేటలో అంకురాలు..

పేటీఎంకు ఈడీ నోటీస్

- రూ.611 కోట్లు చెల్లించాలని వన్97 కమ్యూనికేషన్స్‌కు ఆదేశం
- చైర్మన్ విజయ్‌శేఖర్‌కూ నోటీసులు



న్యూఢిల్లీ: ప్రముఖ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్ **పేటీఎం మాతృ సంస్థ** 'వన్ 97 కమ్యూనికేషన్స్'కు (ఓసీఎల్) ఎన్‌ఫోర్స్‌మెంట్ **డైరెక్టరేట్ (ఈడీ) నోటీసు** జారీ చేసింది. **వన్97 కమ్యూనికేషన్స్‌**తోపాటు, సంస్థ **చైర్మన్, ఎండీ విజయ్** శేఖర్ శర్మ, సబ్సిడరీ **కంపెనీలైన లిటిల్ ఇంటర్నెట్**, నియర్‌బై **ఇండియాకు నోటీసులు** జారీ అయ్యాయి. **రూ.611 కోట్ల విలువకు** సంబంధించి విదేశీ **మారక ద్రవ్య చట్టం** (ఫెమా) నిబంధనలను ఉల్లంఘించినట్టు దర్యాప్తులో తేలడంతో న్యాయపరమైన చర్యలకు ముందు ఈడీ స్పెషల్ డైరెక్టర్ ఈ నోటీసు జారీ చేశారు. నియంత్రణ ప్రక్రియలు, చట్టబద్ధమైన మార్గాల్లో ఈ సమస్యను పరిష్కరించుకుంటామని పేటీఎం అధికార ప్రతినిధి ప్రకటించారు. ఓసీఎల్ సింగపూర్‌లో పెట్టుబడులు పెట్టి, విదేశాల్లో సబ్సిడరీ ఏర్పాటు విషయాన్ని ఆర్‌బీఐకి వెల్లడించలేదని దర్యాప్తులో గుర్తించినట్టు ఈడీ ప్రకటించింది. ఆర్‌బీఐ నిర్దేశిత ధరల మార్గదర్శకాలను అనుసరించకుండా, ఓసీఎల్ సబ్సిడరీ అయిన లిటిల్ ఇంటర్నెట్ ప్రైవేటు లిమిటెడ్ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డీఐ) అందుకున్నట్టు తెలిపింది. కాగా, ఈ రెండు కంపెనీలను తాము 2017లో దక్కించుకున్నామని, వీటికి సంబంధించి నిబంధనల ఉల్లంఘన తమ సబ్సిడరీలు కాక ముందు జరిగినవిగా పేటీఎం స్పష్టత ఇచ్చింది.

పేటీఎం షేరు ఎన్‌ఎస్‌ఈలో 4% పడి, ఇంట్రాడే కనిష్టానికి (రూ.684) దిగజారింది. చివరికి 2 శాతం లాభంతో రూ.729 వద్ద ముగిసింది.

1,000 మందికి ఓలా ఎలక్ట్రిక్ ఉద్వాసన!



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహన రంగంలో ఉన్న ఓలా ఎలక్ట్రిక్ సుమారు 1,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నట్టు సమాచారం. నష్టాలను తగ్గించుకునే పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా వివిధ విభాగాల్లో సిబ్బందిని తొలగిస్తోంది. కంపెనీ గత ఏడాది దాదాపు 500 మందిని విధుల నుంచి తప్పించింది. ఓలా ఎలక్ట్రిక్ ఎబిటా మార్జిన్‌లను దాదాపు 10 శాతం పాయింట్లు పెంచడానికి, ఇన్వెంటరీ నిర్వహణ మెరుగుపరచడానికి, డెలివరీలు వేగవంతం చేసేందుకు వ్యూహాత్మక చర్యలు తీసుకుంటూనే ఐదు నెలల్లోపు భారీగా ఉద్యోగాల కోత విధించడం గమనార్హం. డిసెంబర్ త్రైమాసికంలో కంపెనీ నికర నష్టం రూ.564 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో రూ.376 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది.

బీఎస్‌ఈలో షేరు 3 శాతం నష్టపోయి రూ.55 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 5.5 శాతం పడి, ఏడాది కనిష్టాన్ని (రూ.53.7) తాకింది.

తొమ్మిదో రోజూ నిఫ్టీకి నష్టాలే...



ముంబై: దేశీ స్టాక్ మార్కెట్‌కు 'నష్ట'కష్టాలు కొనసాగుతున్నాయి. బ్లూచిప్స్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ కౌంటర్లలో అమ్మకాల ప్రభావంతో మార్కెట్‌ను నష్టాలు వెంటాడాయి. సెన్సెక్స్ 112 పాయింట్లు నష్టపోయి 73,086 వద్ద ముగియగా, నిఫ్టీ 5 పాయింట్లు కోల్పోయి 22,119 వద్ద స్థిరపడింది. నిఫ్టీ వరుసగా తొమ్మిదో రోజూ నష్టపోయింది. కాగా, సెన్సెక్స్ ఇంట్రాడేలో 72,785 పాయింట్ల కనిష్టాన్ని 73,650 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ ఒకానొక దశలో 120 పాయింట్లు పతనమై 22,005 స్థాయికి చేరింది. బీఎస్‌ఈలో ఎనర్జీ ఇండెక్స్ 1.1%, ఫైనాన్షియల్ సర్వీసులు 0.54%, బ్యాంకెక్స్ 0.28 చొప్పున క్షీణించాయి. స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.7 శాతం, 0.25 శాతం చొప్పున నష్టపోయాయి.

రిలయన్స్ దెబ్బ...: ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ పతనం మార్కెట్‌ను దెబ్బకొట్టింది. షేరు ఇంట్రాడేలో 3.6% నష్టపోయి రూ.1,156కి పడిపోయింది. ఇది ఏడాది కనిష్ఠ స్థాయి. చివరికి 2.4% నష్టంతో రూ.1,171 వద్ద ముగిసింది. బజాజ్ ఫిన్‌సర్వ్ 1.8%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.7%, అదానీ పోర్ట్స్ 1.6%, మారుతీ 1.5 శాతం, చొప్పున క్షీణించాయి.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో 33 పోస్టులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్(ఎన్‌ఐఆర్‌డీపీఆర్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 33.
» **పోస్టుల వివరాలు:** ప్రోగ్రామ్ ఆఫీసర్-02, ప్రాజెక్ట్ ఆఫీసర్-25, జూనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్-06.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్(సివిల్, ఐటీ, సీఎస్‌ఈ), పీజీ(ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంబీఏ, హెచ్‌ఆర్), డిగ్రీ(అగ్రికల్చర్ ఇంజనీరింగ్), ఎల్‌ఎల్‌బీ, మాస్టర్ డిగ్రీ (రూరల్ మేనేజ్‌మెంట్, సోషల్ సైన్సెస్, డెవలప్‌మెంట్ రిలేటెడ్ ఫీల్డ్), మాస్టర్స్(ఫైనాన్స్, కామర్స్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 60 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు జూనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు రూ.1,00,000, ప్రోగ్రామ్ ఆఫీసర్‌కు రూ.1,40,000,ప్రోగ్రామ్ ఆఫీసర్‌కు రూ.1,90,000
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 19.03.2025.
» **వెబ్‌సైట్:** http://career.nirdpr.in

సీఐఎస్‌ఎఫ్‌లో 1161 కానిస్టేబుల్/ట్రేడ్స్‌మెన్ పోస్టులు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్‌ఎఫ్).. వివిధ సెక్టార్లలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్/ట్రేడ్స్‌మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1161.
» **పోస్టుల వివరాలు:** కానిస్టేబుల్/కుక్-493, కానిస్టేబుల్/కాబ్లర్-09, కానిస్టేబుల్ /టైలర్-23, కానిస్టేబుల్/బార్బర్-199, కానిస్టేబుల్/వాషర్‌మెన్-262, కానిస్టేబుల్ /స్వీపర్-152, కానిస్టేబుల్/పెయింటర్-02, కానిస్టేబుల్/కార్పెంటర్-09, కానిస్టేబుల్/ఎలక్ట్రీషియన్-04, కానిస్టేబుల్/మెయిల్-04, కానిస్టేబుల్/వెల్డర్-01, కానిస్టేబుల్/చార్జ్ మెకానిక్-01, కానిస్టేబుల్/ఎంపీ అటెండెంట్-02.
» **అర్హత:** మెట్రిక్యులేషన్ లేదా తత్సమాన విద్యార్హతలతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.08.2025 నాటికి 18 నుంచి 23 ఏళ్లు నిండి ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.21,700నుంచి రూ.69,100
» **ఎంపిక విధానం:** ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్,ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, ట్రేడ్ టెస్ట్, రాతపరీక్ష(ఓఎంఆర్/సీబీటీ), మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 05.03.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.04.2025
» **వెబ్‌సైట్:** https://cisfrectt.cisf.gov.in

ఏబీవీ-ఐఐఐటీఎం, గ్వాలియర్‌లో 55 ఫ్యాకల్టీ పోస్టులు

గ్వాలియర్(మధ్యప్రదేశ్)లోని అటల్ బిహారి వాజ్‌పేయి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఏబీవీ-ఐఐఐటీఎం).. రెగ్యులర్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 55.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-29, అసోసియేట్ ప్రొఫెసర్-10,అసిస్టెంట్ ప్రొఫెసర్-16
» **విభాగాలు:** ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ), ఇంజనీరింగ్ సైన్సెస్(ఈఎస్).
» **అర్హత:** పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్టింగ్, టీచింగ్ ప్రజెంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది జాయింట్ రిజిస్ట్రార్, ఏబీవీ-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ గ్వాలియర్, మెరినా లింక్ రోడ్, గ్వాలియర్, మధ్యప్రదేశ్, ఇండియా-474015 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 17.03.2025.
» **వెబ్‌సైట్:** https://iiitm.ac.in

నెస్ట్.. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీకి బెస్ట్!

నేషనల్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్.. సంక్షిప్తంగా నెస్ట్! ఈ ఎంట్రన్స్ స్కోర్‌తో ఇంటర్‌తోనే నేరుగా ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులో అడుగు పెట్టొచ్చు! అది కూడా దేశంలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇన్‌స్టిట్యూట్‌లుగా గుర్తింపు పొందిన.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైసర్), యూనివర్సిటీ ఆఫ్ ముంబై- డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్(సీఈబీఎస్)లలో ప్రవేశం పొందొచ్చు. తాజాగా నెస్ట్-2025 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. నెస్ట్‌తో ప్రయోజనాలు, ప్రవేశాలు కల్పిస్తున్న కోర్సులు-ఇన్‌స్టిట్యూట్స్, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు.

» నెస్ట్ స్కోర్‌తో నైసర్, సీఈబీఎస్‌లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ
» ఇంటర్మీడియెట్ సైన్స్ గ్రూప్ విద్యార్థులు దరఖాస్తుకు అర్హులు
» అయిదేళ్లపాటు స్కాలర్‌షిప్, ఇతర ప్రోత్సాహకాలు



దేశంలో సైన్స్ ఎడ్యుకేషన్, రీసెర్చ్‌కు ఎంతో గుర్తింపు పొందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్-భువనేశ్వర్, అదే విధంగా ముంబై యూనివర్సిటీలో అణుశక్తి విభాగం నెలకొల్పిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ బేసిక్ సైన్సెస్(సీఈబీఎస్)లోని ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశం కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పరీక్ష..నెస్ట్. ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా అభ్యర్థులు ఆయా ఇన్‌స్టిట్యూట్స్‌కు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

మొత్తం సీట్ల సంఖ్య 257

నెస్ట్ స్కోర్ ఆధారంగా ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో ప్రవేశం కల్పించే నైసర్- భువనేశ్వర్, సీఈబీఎస్‌లలో మొత్తం 257 సీట్లు అందుబాటులో ఉన్నాయి. నైసర్ భువనేశ్వర్‌లో 200, సీఈబీఎస్‌లో 57 సీట్లు ఉన్నాయి. నైసర్-భువనేశ్వర్‌లో బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ విభాగాల్లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులు అందిస్తున్నారు. అదేవిధంగా సీఈబీఎస్‌లోనూ ఇవే సబ్జెక్ట్‌లలో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ అందుబాటులో ఉంది.

నెస్ట్ స్కోర్ ఆధారంగా ప్రవేశం ఖరారు చేసుకున్న అభ్యర్థులు.. తమ అకడమిక్ అర్హతలకు అనుగుణంగా ఏదో ఒక సబ్జెక్ట్‌లో పీజీ ఎంచుకోవచ్చు. మేజర్ సబ్జెక్ట్‌తో పాటు బయాలజీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ వంటి సబ్జెక్ట్‌లను మైనర్ సబ్జెక్ట్‌లుగా ఎంచుకునే అవకాశం ఉంటుంది.

అర్హతలు

సైన్స్ గ్రూప్‌లతో 2023, 2024 విద్యా సంవత్సరాల్లో ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ కేటగిరీ అభ్యర్థులు 55 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. 2025లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

180 మార్కులకు పరీక్ష

ప్రతిష్టాత్మకమైన నైసర్, సీఈబీఎస్‌లలో ప్రవేశానికి నిర్వహించే నెస్ట్‌లో నాలుగు విభాగాలు (బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్) ఉంటాయి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో జరిగే ఈ పరీక్షలో ప్రతి విభాగానికి 60 మార్కులు కేటాయించారు. అదే విధంగా ప్రతి విభాగంలో 20 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో ఎంసీక్యూలు, మల్టిపుల్ కరెక్ట్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు ఉంటాయి. వీటిలో ప్రతి సరైన సమాధానానికి మూడు మార్కులు లభిస్తాయి. నెగిటివ్ మార్కుల నిబంధనం ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ఇలా ప్రతి సెక్షన్‌లో 20 ప్రశ్నలతో 60 మార్కులు చొప్పున పరీక్ష ఉంటుంది. నాలుగు సెక్షన్లలో మూడు సెక్షన్లు ఎంచుకునే అవకాశం ఉంది. నాలుగు సెక్షన్లు కూడా రాయొచ్చు. మెరిట్ లిస్ట్ రూపకల్పనలో.. నాలుగు సెక్షన్లలో అత్యధిక మార్కులు పొందిన మూడు సెక్షన్లనే పరిగణనలోకి తీసుకుంటారు. ఆ విధంగా ఒక్కో సెక్షన్ నుంచి 60 మార్కులకు చొప్పున మొత్తం 180 మార్కులకు అభ్యర్థులు సాధించిన స్కోర్ ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు.

కనీస అర్హత మార్కుల నిబంధన

నెస్ట్‌లో ప్రతి సెక్షన్‌లోనూ అభ్యర్థులు పొందాల్సిన కనీస అర్హత మార్కులను నిర్దేశించారు. ఈ పరీక్షలో ఎక్కువ మార్కులు పొందిన మూడు సెక్షన్లనే పరిగణనలోకి తీసుకుని 180 మార్కుల ప్రాతిపదికగా మూల్యాంకన చేస్తారు. సెక్షన్‌వారీగా కనీస అర్హత మార్కుల నిబంధన మాత్రమే కాకుండా.. మినిమమ్ అడ్మిషబుల్ పర్సంటైల్ పేరుతో ఓవరాల్ కటాఫ్‌ను కూడా నిర్దేశిస్తున్నారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు 95 పర్సంటైల్, ఓబీసీ అభ్యర్థులు 90 పర్సంటైల్, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల కేటగిరీ అభ్యర్థులు 75 పర్సంటైల్ సాధించాల్సి ఉంటుంది.

సీటు సాధిస్తే.. స్కాలర్‌షిప్

నెస్ట్ స్కోర్ ఆధారంగా.. నైసర్, సీఈబీఎస్‌లలో ప్రవేశం ఖరారు చేసుకున్న విద్యార్థులకు అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో.. స్కాలర్‌షిప్, ఇంటర్న్‌షిప్ పేరుతో ఆర్థిక ప్రోత్సాహకం కూడా అందిస్తారు. ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్ పేరిట నెలకు రూ.5వేలు చొప్పున ఏడాదికి రూ.60 వేలు స్కాలర్‌షిప్ అందిస్తారు. ఇన్‌స్పైర్ స్కాలర్‌షిప్‌నకు అర్హత పొందలేని వారికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రవేశ పెట్టిన దిశ ప్రోగ్రామ్ ద్వారా నెలకు రూ.5000 స్కాలర్‌షిప్ లభిస్తుంది. అదే విధంగా ప్రతి ఏటా సమ్మర్ ఇంటర్న్‌షిప్ చేసేందుకు రూ.20 వేలు గ్రాంట్ మంజూరు చేస్తారు.

పరిశోధన నైపుణ్యాలకు మార్గం

ఐదేళ్ల వ్యవధిలో పది సెమిస్టర్లుగా ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పది సెమిస్టర్లలోనూ.. ఆరు సెమిస్టర్లలో సదరు క్యాంపస్‌లోని ఫ్యాకల్టీ సభ్యులు చేస్తున్న రీసెర్చ్‌లో తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉంటుంది. దీని ఆధారంగానూ అభ్యర్థులకు మార్కులు, క్రెడిట్స్ కేటాయిస్తారు. ఇలాంటి నిబంధన నేపథ్యంలో విద్యార్థులు పీజీ స్థాయిలోనే రీసెర్చ్‌పై ఆసక్తి, అవగాహన పెంచుకునే వీలుంటుంది.

బార్క్‌లో.. పీహెచ్‌డీ

నెస్ట్ స్కోర్‌తో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీలో సీటు ఖరారు చేసుకున్న వారికి భవిష్యత్తులో ప్రతిష్టాత్మక పరిశోధన కేంద్రం.. భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్(బార్క్) ట్రైనింగ్ స్కూల్‌లో ఎలాంటి పరీక్ష అవసరం లేకుండా నేరుగా పీహెచ్‌డీ ఇంటర్వ్యూకి హాజరయ్యే అవకాశం లభిస్తుంది. ఇందుకోసం అభ్యర్థులు ఎమ్మెస్సీ కోర్సులో నిర్దిష్ట మార్కులతో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఈ మార్కులను ప్రతి ఏటా బార్క్ నిర్దేశిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025, మే 9
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** మే 10 నుంచి 14 వరకు
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** జూన్ 2 నుంచి
- **నెస్ట్-2025 తేదీ:** 2025, జూన్ 22,
- **వెబ్‌సైట్:** www.nestexam.in

బెస్ట్ స్కోర్ ఇలా

- ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నెస్ట్‌లో విజయం సాధించాలంటే.. విద్యార్థులు ప్రధానంగా ఇంటర్మీడియెట్ స్థాయిలో తాము చదివిన అకడమిక్స్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలి.
- బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ విభాగాలకు సంబంధించి అడిగే ప్రశ్నలు.. విద్యార్థుల్లోని విశ్లేషణాత్మక దృక్పథం, సంగ్రహణ సామర్థ్యం, తులనాత్మక విశ్లేషణను గుర్తించేలా ఉంటాయి. కాబట్టి విద్యార్థులు ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి కాన్సెప్ట్‌లపై పట్టు సాధించడంతోపాటు వాటిని వాస్తవ పరిస్థితుల్లో అన్వయించగలిగే నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఇందుకోసం చదువుతున్న అంశాలను ప్రాక్టీస్ చేయడం ఎంతో లాభిస్తుంది.

ఎన్‌సీఈఆర్‌టీ బుక్స్

నెస్ట్‌లో సీబీఎస్‌ఈ సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి అభ్యర్థులు పది, పదకొండు, పన్నెండు తరగతుల సీబీఎస్‌ఈ పుస్తకాలను ఔపోసన పట్టాలి. ముఖ్యంగా కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి. ఇలా అకడమిక్ సబ్జెక్ట్‌ల కాన్సెప్ట్‌లతో పాటు అప్లికేషన్ దృక్పథంతో ప్రిపరేషన్ సాగిస్తే విజయావకాశాలు మెరుగుపరచుకోవచ్చు. జేఈఈ-మెయిన్, జేఈఈ-అడ్వాన్స్‌డ్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు అదే సన్నద్ధతతో నెస్ట్‌కు కూడా హాజరై ప్రతిభ చూపే అవకాశం ఉంది. గత ప్రశ్న పత్రాలను సాధన చేయడం ద్వారా పరీక్షలో అడుగుతున్న ప్రశ్నల తీరుపైనా స్పష్టమైన అవగాహన లభిస్తుంది.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-సోషియాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం- తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-బ్యాంకింగ్ అవేర్‌నెస్



ఒంటి కాలితో విజయం సాధించి

పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు దివ్యాంగ మల్లయోధుడు యు.సాయిలు. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామంలో బేడీల మైసమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం కుస్తీపోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి సైతం మల్లయోధులు తరలి వచ్చారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన దివ్యాంగ మల్ల యోధుడు సాయిలు కూడా ఈ కుస్తీ పోటీల్లో పాల్గొన్నాడు. ఆయన రూ.500 కుస్తీ పోటీల్లో ఓ మల్లయోధునితో కుస్తీ పట్టి విజయం సాధించాడు. దీంతో సాయిలు పోరాటానికి మెచ్చిన ప్రేక్షకులు రూ.3 వేల వరకు విరాళాలు అందజేశారు. వివిధ విభాగాల్లో కుస్తీపోటీల్లో గెలుపొందిన మల్లయోధులకు నిర్వాహకులు నగదును బహుమానంగా అందజేశారు.

నిజాంసాగర్ (జుక్కల్)

పత్తి కట్టెను యంత్రంలో వేస్తున్న దృశ్యం



కట్టె కాసులు తెచ్చి పెట్టె

తెల్లబంగారం సాగులో ఆదిలాబాద్ జిల్లాది ఆసియాలోనే ప్రథమ స్థానమని చెప్పొచ్చు. జిల్లాలో 90 శాతం మంది రైతులు పత్తి పంటనే సాగు చేస్తున్నారు. పత్తితీత అనంతరం మిగిలిన చెట్లను గతంలో ట్రాక్టర్ల సాయంతో పెరికేసి చేలల్లోనే కాల్చేసేవారు. అయితే ఇప్పుడు పరిశ్రమల్లోని బాయిలర్లలో ఉపయోగించే బ్రికెట్లను ఈ పత్తి కట్టెతో తయారు చేస్తుండటంతో పత్తికట్టె కూడా అన్నదాతకు లాభసాటిగా మారింది. రైతులు పత్తి ఏరివేసిన అనంతరం మిగిలిన పత్తి కట్టెకు వ్యాపారులు ఎకరాకు రూ.300 చెల్లించి.. వారే ట్రాక్టర్ల ద్వారా తొలగించి జిల్లా కేంద్రంలోని ఓ పరిశ్రమకు తరలిస్తున్నారు. అక్కడ క్రష్ చేసి బ్రికెట్స్‌ను తయారు చేస్తున్నారు. దీంతో పత్తి కట్టె అన్నదాతకు అదనపు లాభంగా మారింది.

సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

పసిప్రాయంపై అశ్లీల పడగ

దేశవ్యాప్తంగా చిన్నారులపై పెరిగిన ఆన్‌లైన్ వేధింపులు

అసభ్య వీడియోలు, ఫొటోల సర్క్యులేషన్‌లోనూ పెరుగుదల

వెల్లడించిన 'వల్నరబుల్ ఆన్‌లైన్ ఏ స్టడీ ఆన్ సైబర్ క్రైమ్ ఎగెనెస్ట్‌చిల్డ్రన్ ఇన్ ఇండియా' నివేదిక

ఈ తరహా కేసులపై ఫోకస్ పెడుతున్న చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు

సాక్షి, హైదరాబాద్



నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా చిన్నారులపై సైబర్ నేరాలు ఇలా..:

2018	232
2019	305
2020	1,102
2021	1,376
2022	1,823

దేశవ్యాప్తంగా చిన్నారులపై సైబర్ నేరాల్లో పెరుగుదల నమోదవుతోందని 'వల్నరబుల్ ఆన్‌లైన్- ఏ స్టడీ ఆన్ సైబర్ క్రైమ్ ఎగెనెస్ట్‌చిల్డ్రన్ ఇన్ ఇండియా' నివేదిక వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా చిన్నారుల అశ్లీల వీడియోలు, ఫొటోలను పంపిణీ చేస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని నివేదిక వెల్లడించింది. సీఎస్ఈఏఎం (చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లోయిటేటివ్ అండ్ అబ్యూస్ మెటీరియల్) ఇంటర్నెట్‌లో పెరగడం ప్రమాదకరమని నివేదిక స్పష్టం చేసింది. ఇటీవల విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం.. చిన్నారులపై లైంగిక వేధింపులు, అశ్లీల కంటెంట్ సర్క్యులేషన్‌పై 2018లో దేశవ్యాప్తంగా 27,248 కేసులు నమోదు కాగా, 2022లో కేసుల సంఖ్య 65,893కి చేరినట్టు నివేదిక వెల్లడించింది. ఈ తరహా కేసుల కట్టడికి జాతీయ స్థాయిలో ది ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ (ఐసీపీ) చర్యలు ప్రారంభించింది. చిన్నారులు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కకుండా కాపాడేందుకు వారిలో అవగాహన పెంచేలా ఆన్‌లైన్ ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. చిన్నారులపై ఆన్‌లైన్లో లైంగిక వేధింపులు, వారి అశ్లీల వీడియోలు, ఫొటోలవ్యాప్తి కట్టడికి తెలంగాణ పోలీసులు సైతం కఠిన చర్యలు తీసుకుంటున్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ)లో ప్రత్యేకంగా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (సీపీయూ)ను 2024లో నెలకొల్పారు. ఈ యూనిట్ ప్రధానంగా సీఎస్ఈఏఎం (చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లోయిటేటివ్ అండ్ అబ్యూజ్ మెటీరియల్) ఫోకస్ పెడుతోంది. ఆన్‌లైన్‌లో పెట్రోలింగ్, డెకాయి ఆపరేషన్స్ నిర్వహిస్తూ సీపీయూ సిబ్బంది నిఘా పెడుతున్నారు. 2024లోనూ టీజీసీఎస్‌బీ అధికారులు డార్క్‌వెబ్, ఇతర వెబ్‌సైట్లలో వెబ్ పెట్రోలింగ్ ద్వారా 7,247 మంది అనుమానితుల జాడ గుర్తించారు. ఈ సమాచారం ఆధారంగా ఆయా రాష్ట్రాల్లోనూ కేసుల నమోదులో తెలంగాణ పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అదేవిధంగా ఈ ఏడాది రెండు నెలల్లో ఇలాంటి వేధింపులకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 71 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడంతోపాటు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 47 మందిని అరెస్టు చేశారు. పిల్లలను లైంగిక చర్యలకు ప్రలోభ పెట్టడం, వారిపై లైంగిక వేధింపులు, అశ్లీలత, పిల్లల లైంగిక అక్రమ రవాణా, పిల్లలకు ఆయాచిత అశ్లీల పదార్థాల పంపిణీ, మోసపూరిత డిజిటల్ కంటెంట్ వంటి నేరాలపైనా ఈ ప్రత్యేక యూనిట్ల ద్వారా దృష్టి పెడుతున్నారు.



మత్స్యావతారంలో యాదగిరీశుడు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజైన సోమవారం ఉదయం అర్చకులు అలంకార సేవలకు శ్రీకారం చుట్టారు. ఉదయం శ్రీస్వామి వారు మత్స్యావతార అలంకార సేవోత్సవంలో, రాత్రి బంగారు శేష వాహనంపై ఆలయ తిరుమాడ వీధిలో భక్తుల నడుమ ఊరేగారు. కాగా, యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలను టీటీడీ అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయాధికారులు సోమవారం రాత్రి తీసుకువచ్చారు. గర్భాలయంలో స్వయంభువుల చెంత పట్టు వస్త్రాలకు పూజలు చేసిన అనంతరం, ముఖ మండపంలో ఆలయ ఈవో భాస్కర్‌రావు, అర్చకులకు వాటిని అప్పగించారు.


'ఆదర్శ' గురువులకు న్యాయం చేయాలి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆదర్శ పాఠశాలల్లో పని చేస్తున్న అవర్లీ బేస్డ్ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ ఇవ్వాలని అవర్లీ బేస్డ్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని సంఘం ప్రతినిధులు సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. చాలీచాలని వేతనాలతో తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్నామని, తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

బెదిరించబోయి... వాటర్ ట్యాంక్‌పై నుంచి కిందపడి

యువకుడి మృతి

గోదావరిఖని: తనను ఓ వ్యక్తి కొట్టాడనే అవమానంతో ఓవర్‌హెడ్ ట్యాంక్ పైకెక్కి నిరసన చేపట్టాడు ఓ యువకుడు. తనను కొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశాడు. ఈ క్రమంలోనే ట్యాంక్ పైనుంచి కిందపడి మృతి చెందాడు. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని అంబేడ్కర్‌నగర్ చెందిన యతిరాజు చంద్రశేఖర్(35) సోమవారం కూరగాయల మార్కెట్‌లోని విశాల్ వైన్స్ వద్దకు మద్యం కొనేందుకు వెళ్లాడు. తనకు ఉచితంగా మద్యం ఇవ్వాలని కౌంటర్‌పై పనిచేసే రమేశ్‌ను అడిగాడు. ఆయన నిరాకరించడంతో చంద్రశేఖర్ వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలో చిన్నపాటి గొడవ జరిగి రమేశ్ ఆగ్రహంతో చంద్రశేఖర్‌పై చేయిచేసుకున్నాడు. దీంతో మనస్తాపం చెందిన చంద్రశేఖర్.. అక్కడ నుంచి నేరుగా జవహర్‌నగర్‌లోని ఓవర్‌హెడ్ ట్యాంకు వద్దకు వెళ్లాడు. తనను కొట్టిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపాడు.



ఈక్రమంలో అదుపుతప్పి ట్యాంక్‌పై నుంచి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. చంద్రశేఖర్‌ను పోలీసులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు. తన మరిది చావుకు కారణమైన రమేశ్‌పై చర్యలు తీసుకోవాలని మృతుడి వదిన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.



చి'వరి'కి పశువుల మేతగా..

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): రైతుల ఆరుగాలం కష్టం పశువులకు మేతగా మారుతోంది. సాగునీరు అందక ఎండుతున్న పంటలను పశువులకు మేతగా వదిలేస్తున్న రైతులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాకు చెందిన రైతు గుగులోతు మహేశ్‌నాయక్.. అప్పులు చేసి ఆరు ఎకరాల్లో వరిపంట సాగు చేశాడు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నాలుగు బోర్లు ఎత్తిపోయాయి. మల్కపేట రిజర్వాయర్ నుంచి కాలువల వెంట సాగునీటిని విడుదల చేయకపోవడంతో.. సాగు చేసిన పంట కళ్ల ముందే ఎండిపోతోంది. సాగునీటి కోసం అన్ని విధాలుగా ప్రయత్నం చేసినా.. ఫలితం లేకపోవడంతో చి'వరి'కి రైతు మహేశ్‌నాయక్ పంట పొలాన్ని పశువులకు వదిలేశాడు. ఇలాంటి పరిస్థితి జిల్లావ్యాప్తంగా ఉంది.



72198 21111 | BAJAJ SECURE CREDIT

*Terms and conditions apply. *Offer available on Pulsar 125 Carbon Fibre and Pulsar 150 models. *Ex Showroom price for N160 Twin Disc variant. Bajaj Auto reserves the right to withdraw any or all offers without prior notice. Stunts have been performed by experts, under professional supervision, in a controlled and enclosed environment, in isolation from general public or public roads. Do not attempt to replicate these stunts and always follow traffic and safety rules. AMC available on specific models and in specific states. Check with Bajaj dealer for more details. Roadside Assistance is provided by third parties and is subject to their terms and conditions.

Authorized Dealers for Bajaj Auto Ltd.: Bahadurpura SRI VINAYAKA BAJAJ 9393745666 • Begumpet SRI VINAYAKA BAJAJ 9390459666 • Chandanagar VARUN BAJAJ 8297544420 • Dilsukhnagar SRI VINAYAKA BAJAJ 9391770116 • ECIL SELECT AUTOMOBILES 8008104461 • NAMPALLY SRI VINAYAKA BAJAJ 9642488833• Erragadda MGB BAJAJ 8978865666• Habsiguda SELECT BAJAJ 8008104400 • Hydernagar JNTU SELECT AUTMOBILES 9154292284 • Kachiguda SRI VINAYAKA BAJAJ 9030030280 • Suchitra VVC Motorcycle 8143690900, 8143690900 • Kondapur VARUN BAJAJ 8297544408 • Kukatpally Y Jun SELECT AUTMOBILES 9154292288 • LB Nagar SRI VINAYAKA BAJAJ 9948222455 • RC Puram VARUN BAJAJ 8297544405 • RP Road DECCAN BAJAJ 9948884427 • Tirumalgiri SELECT AUTOMOBILES 80081044466 • Tolichowki ABHINANDAN BAJAJ 8008803761 • Uppal SELECT BAJAJ 8008100966. Amberpet SRI VINAYAKA BAJAJ 9133425299, Hayathnagar SRI VINAYAKA BAJAJ 9010115299, Vidyanagar SRI VINAYAKA BAJAJ 9393836388,Malkajgiri SELECT BAJAJ 8008104445, Anandbagh SELECT BAJAJ 9154802444, Jagadgirigutta SELECT BAJAJ 9154292300, Pragathinagar SELECT BAJAJ 9154292288, Miyapur Bachupally SELECT BAJAJ 8341124434 **Authorised Service Centre:** ALWAL 9441799486, AMBERPET 9133425299, ATTAPUR 8008803765, BALAPUR 9949256471, BALANAGAR 9246115566, BN REDDY COLONY 9989652503, BODDUPAL 8008104449, CHANDRAYANGUTTA 9885647692, ,Chegunta 9440104103, Dubbak 9885392866, DMRL'X'ROAD 9849300124, GAJWEL 9848347349, GHATKESAR 7032141444,HAYATH NAGAR 9010115299 IBRAHIMPATNAM 9912299916, IDPL COLONY 9246260803, Isnapur 6303910598, Keesara 9948260156, LUNGER HOUSE 9885562687, MADHAPUR 9581291777, MALAKPET 9000228558, MALKAJGIRI 8008104445, MEDAK 9292602222, MEDCHAL 9440442588, MEERPET 9949523333, METTUGUDA 9000049373, MOOSAPET 9989192111, MUSHEERABAD 9160599998 , NAGARAM 6301212199, Narayankhed 9000110040, NARSAPUR 9440033366, , PARIGI 8297544414,*RAMAYAMPET 9848444434, Rampally 9912228337, SADASIVPET 9701432786, SAINIKPURI 9652040129 , SANGAREDDY 8297544409, SHAMSHABAD 9100793093 , SHANKARPALLY 9949022233, Shapur 9246260802, SIDDIPET 9133309650 , Somajiguda 9848295965, SURARAM 9848295965, TANDUR 8297544419, TEMPLE ALWAL 9000055318, THUMKUNTA 9985731111, VIKARABAD 8297544413, ZAHEERABAD 9390114860, KARMANGHAT 9908886782, Yousufguda 9949949112, Manikonda ABHINANDAN BAJAJ 9100988102, Toopran VVC Motorcycle 9154311773 • Gandimaissamma VVC Motorcycle 9154311772, Nallagandla Varun Motors 9581429111, JOGIPET, SRI SAI SAGHAMESWARA MOTORS 967620406.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఏడేళ్ల నిరీక్షణ ఫలించేనా?

రేపు సింగరేణి భవన్‌లో స్ట్రక్చరల్ సమావేశం

- 15 నెలల తర్వాత తొలిసారి భేటీ
- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న మారుపేర్ల బాధితులు
- ప్రభుత్వం కరుణించినా పట్టించుకోని సింగరేణి

గోదావరిఖని:

రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ సింగరేణి బొగ్గు గనుల్లో అనేక సమస్యలు పేరుకుపోయాయి. వాటి పరిష్కారం కోసం మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన స్ట్రక్చరల్ సమావేశం 15 నెలలు గడిచినా జాడ లేకుండా పోయింది. గతేడాది నవంబర్ 28న డైరెక్టర్ల స్థాయి స్ట్రక్చరల్ సమావేశాన్ని సింగరేణి యాజమాన్యం నిర్వహించింది. విధానాల నిర్ణయాలకు సంబంధించిన అంశాలు కావడంతో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ స్థాయి సమావేశంలోనే తేల్చుకోవాలని డైరెక్టర్లు చేతులెత్తేశారు. అప్పటి నుంచి అనేక కారణాలతో సీఎండీ స్థాయి సమావేశం వాయిదా పడుతూ వస్తోంది. ఎట్టకేలకు ఈనెల 5న స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు.

ఎమ్మెల్సీ నోటిఫికేషన్ పేరిట వాయిదా..

గత ఫిబ్రవరి 5న సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశం నిర్వహిస్తామని యాజమాన్యం గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నేతలకు సమాచారం ఇచ్చింది. అనూహ్యంగా ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో వాయిదా వేసింది. గతంలో కూడా జనవరి 27న నిర్వహిస్తామని చెప్పినా.. వాయిదా పడింది.

ఈసారైనా మోక్షం లభించేనా?

సంస్థ వ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఈసారైనా మోక్షం లభించేనా? అని ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా జీతభత్యాలపై ఆదాయపన్ను మాఫీ, సొంతింటి పథకం, మారుపేర్ల కార్మికులకు ఉద్యోగాలు తదితర సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోవడం లేదు. వాటి పరిష్కారం కోసం యాజమాన్యం గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను నిర్వహించింది. 2023 డిసెంబర్‌లో ఎన్నికలు నిర్వహించగా.. గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీ గెలుపొందాయి. ఎట్టకేలకు 2024 సెప్టెంబర్ 9న ఏఐటీయూసీకి గుర్తింపు పత్రం అందజేశారు. అక్టోబర్‌లో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులకు యాజమాన్యం శిక్షణ తరగతులు నిర్వహించింది. యాజమాన్యం, కార్మిక సంఘాలు ఏ విధంగా ముందుకు సాగాలనే తదితర అంశాలపై శిక్షణ తరగతుల్లో వివరించారు.

- సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు గతేడాది డిసెంబర్ 23న జరిగాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు సీఎండీ స్థాయిలో స్ట్రక్చరల్ సమావేశం జరగలేదు
- ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు ఇప్పటికీ మోక్షం లభించలేదు
- ప్రధానంగా మారుపేర్ల బాధితులు, విజిలెన్స్ కేసులతో చాలామందికి ఉద్యోగాలు రాక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.
- డైరెక్టర్ల స్థాయి స్ట్రక్చరల్ సమావేశం గతేడాది నవంబర్ 28న జరిగింది.
- ప్రధాన సమస్యలన్నీ సీఎండీ స్థాయి స్ట్రక్చరల్ సమావేశంలోనే తేల్చుకోవాలని డైరెక్టర్లు చేతులెత్తేశారు.
- ఇప్పటివరకు మళ్లీ సమావేశం లేదు.
- స్ట్రక్చరల్ సమావేశం కోసం సుమారు 42 వేల మంది కార్మికుల నిరీక్షణ

ఆరేళ్ల తర్వాత తొలి సమావేశం..

సింగరేణిలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) గుర్తింపు యూనియన్‌గా రెండోసారి గెలిచిన తర్వాత ఒకటి రెండు సమావేశాలు జరిగాయి. 2018 నుంచి ఇప్పటి వరకు స్ట్రక్చరల్ సమావేశాలు లేకుండా పోయాయి. ఏఐటీయూసీ గుర్తింపు యూనియన్‌గా గెలిచిన తర్వాత స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించాలని యాజమాన్యంతో పట్టుబట్టింది. దీంతో ఏడాది ఆలస్యంగానైనా సంస్థ డైరెక్టర్ల స్థాయి స్ట్రక్చరల్ సమావేశాన్ని గతేడాది నవంబర్‌లో నిర్వహించింది. కానీ అందులో సమస్యల పరిష్కారానికి మోక్షం లభించలేదు.


సింగరేణి కార్మికులు

ప్రధాన డిమాండ్లు ఇవే..

- కోల్–ఇండియా మాదిరిగా జీతభత్యాలపై ఆదాయ పన్ను మాఫీ చేయాలి
- మారుపేర్ల కార్మికుల పిల్లలకు ఉద్యోగాలివ్వాలి.
- విజిలెన్స్ పేరిట పెండింగ్‌లో ఉన్న కార్మికుల పిల్లలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద ఉద్యోగాలివ్వాలి.
- సంస్థ వ్యాప్తంగా సుమారు 500 మంది మారుపేర్ల కార్మికులున్నారు.
- గైర్హాజరు పేరుతో తొలగించిన కార్మికులను కూడా వన్‌టైం సెటిల్‌మెంట్ కింద విధుల్లోకి తీసుకోవాలి
- కోల్ ఇండియాలో లేని సింగరేణిలో ఉన్న 14 రకాల అలవెన్స్‌లు పెంచాలి
- కార్మికుల పదోన్నతి విధానం అమలు చేయాలి
- ట్రేడ్స్‌మెన్లకు గనిలో పనిచేసే పరిధి నిర్ధారించాలి.
- కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలి
- గనులపై కార్మికుల వస్తువులు భద్రపరచుకోవడానికి లాకర్ సౌకర్యం కల్పించాలి
- వైద్య సౌకర్యం మెరుగుపరచి కార్పొరేట్‌స్థాయి సౌకర్యాలు కల్పించాలి
- కొత్త గనులు ఏర్పాటు చేసి నూతన ఉద్యోగాలు కల్పించాలి
- కొన్ని శతాబ్దాలపాటు సంస్థ భవిష్యత్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి
- సీఎస్ఆర్ నిధులు ప్రభావిత, నిర్వాసిత గ్రామాల్లోనే వినియోగించాలి.

సర్కార్ నిర్ణయాలతో తెలంగాణ రైతుల్లో సంతోషం

రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎక్కడ లేనివిధంగా రాష్ట్రంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రూ. 2లక్షల రుణాలు ఉన్న రైతులంతా ఏకకాలంలో రుణవిముక్తులు అయ్యారని రైతు, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన జాతీయ రైతు సంఘాల నాయకుల బృందం రెండు రోజులుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించింది. అనంతరం సోమవారం రైతు కమిషన్ కార్యాలయంలో కోదండరెడ్డి, ఇతర సభ్యులను కలిసి రాష్ట్రంలో రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయంగా ఉన్నాయని కొనియాడారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ సన్నాలు పండించే రైతులకు బోనస్ కింద క్వింటాలుకు రూ. 500 అందజేస్తున్న విషయాన్ని వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో సన్నాల సాగు పెరిగిందని, రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నారని తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాల అమలు తీరును వివరించారు. జాతీయ రైతు సంఘం నేతలు సైతం రెండు రోజులుగా రాష్ట్రంలో పర్యటించిన విషయాలపై కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎస్ రెడ్డి, భవానీ రెడ్డి, గడుగు గంగాధర్ తో చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణకు వచ్చిన జాతీయ రైతు సంఘాల నాయకులను కమిషన్ సన్మానించింది.

కాంగ్రెసోళ్లు కట్టర్ హిందువులు..

ఫిషరీస్ చైర్మన్ సాయికుమార్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెసోళ్లు కట్టర్ హిందువులని, బీజేపీ నేతలు ఎన్నికల హిందువులని తెలంగాణ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ వ్యాఖ్యానించారు. తమ కుటుంబాలు తమకు హిందూత్వాన్ని నేర్పాయని, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ నేర్పాల్సిన అవసరం లేదని అన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజాసింగ్ ఎంతో మంది హిందువులను ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. ఎన్నికల తర్వాత హిందువులను టిష్యూపేపర్‌లాగా తీసేసే సంస్కృతి బీజేపీది అని విమర్శించారు. తాము ప్రతి రోజూ అమ్మవారికి, శ్రీరాముడికి, శివుడికి పూజ చేసిన తర్వాతే తాము బయటకు వస్తామని చెప్పారు. ఇక, అహంకారానికి ఆధార్, ఐడీ కార్డు కల్వకుంట్ల కుటుంబమేనని అన్నారు. కేటీఆర్ ట్విట్టర్ వదిలి గ్రామాల్లోకి రావాలని హితవు పలికారు. బీఆర్ఎస్ లాంటి వైరస్‌ను రేవంత్‌రెడ్డి కూకటివేళ్లతో పెకిలించి వేశారని మెట్టు సాయికుమార్ వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ నిధులతో సభ పెట్టి రాజకీయ విమర్శలా?

మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వనపర్తిలో ప్రభుత్వ నిధులతో సభ పెట్టి రాజకీయ విమర్శలు చేస్తారా అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. . సీఎం రేవంత్ ఎక్కడికిపోయినా కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను నిందించడం దినచర్యలో భాగమైందని, ఆయన మాటలతో రాష్ట్రం పరువు పోతోందని ధ్వజమెత్తారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన వారు పాలనలోనూ అబద్ధాలు ఆడుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డి వనపర్తికి కొత్తగా ప్రకటించిందేమీలేదని, మెడికల్ ,నర్సింగ్ కళాశాలలు ,ఇతర విద్యాసంస్థలన్నిటికీ కేసీఆర్ హయం లోనే నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. చేసిన పనులకే మళ్ళీ కొబ్బరి కాయలు కొడితే సీఎం ,మంత్రి పదవులకు గౌరవం ఉంటుందా అని నిలదీశారు. పాతవాటికి మళ్లీ శంకుస్థాపనలు చేయడానికేనా రేవంత్ సీఎం అయిందని ప్రశ్నించారు. జూపల్లి పార్టీ మారగానే కేసీఆర్ చెడ్డగా కనిపిస్తున్నాడని, కేసీఆర్ హయాంలో ఏం జరగలేదని జూపల్లి అధ్వానంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అక్రమ మైనింగ్‌పై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఖమ్మం జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగుతోందని వచ్చిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గనులు, భూగర్భ శాస్త్ర శాఖ, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి, అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌లకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఖమ్మం జిల్లాలో అక్రమ మైనింగ్ జరుగుతోందని.. దాన్ని అడ్డుకోవాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని ఎస్.రాము అనే యువకుడు హైకోర్టుకు లేఖ రాశారు. అనుమతి పొందిన ప్రాంతాల్లోనే కాకుండా అనుమతి లేని ప్రాంతాల్లోనూ మైనింగ్ చేస్తున్నారని.. ఫలితంగా పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతోందని పిటిషనర్ పేర్కొన్నారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న వాళ్లతో అధికారులు కుమ్మక్కు కావడంతో ప్రభుత్వానికి భారీ నష్టం వస్తోందన్నారు. ఈ లేఖను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించారు. ఈ పిల్‌పై ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టి ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది.


ఉద్యోగులు శాఖ లక్ష్యాల కోసం పనిచేయాలి



మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ప్రతీ ఉద్యోగి తన శాఖ లక్ష్యాల కోసం పనిచేయాలని పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. తెలంగాణ సచివాలయంలో సోమవారం పరిశ్రమల శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం డైరీని మంత్రి శ్రీధర్‌బాబు ఆవిష్కరించి మాట్లాడారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంతో ఉపయోగపడేలా డైరీని ఆవిష్కరించడం గొప్ప విషయమన్నారు. డైరీని తీసుకొచ్చిన ఉద్యోగులను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ డైరెక్టర్ మల్సూర్, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, పరిశ్రమల శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం నేతలు పాల్గొన్నారు.

అద్భుత రూపాలుగా మా'రాయి'



శిలలను అద్భుత శిల్పాలుగా మారుస్తున్నారు. ఏ విగ్రహం కావాలన్నా తమ నైపుణ్యంతో రాళ్లకు ప్రాణం పోస్తున్నారు. పెద్దపల్లి జిల్లా గర్రెపల్లి రాజీవ్ రహదారిని ఆనుకుని ఏళ్ల తరబడి శిల్పాలు చెక్కుతూ జీవన ప్రయాణం సాగిస్తున్నారు గర్రెపల్లి గ్రామానికి చెందిన కళాకారులు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి




సిరిసిల్ల అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాల యూనిట్లు


సిరిసిల్ల అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాలను కుడుతున్న మహిళలు

మహిళల ఉపాధికి రెడీ.. మేడ్!

సిరిసిల్లలో 'టెక్స్‌పోర్ట్' రెడీమేడ్ యూనిట్

- ఇప్పటికే శిక్షణ ప్రారంభం
- రెండు వేల మందికి ఉపాధి లక్ష్యం

సిరిసిల్ల: ఓ వైపు సిరిసిల్లలోని వస్త్ర పరిశ్రమ ఆటుపోట్లకు గురవుతుండగా.. మరోవైపు ఆధునిక వస్త్రాల తయారీ కేంద్రం ఉపాధిని అందించేందుకు సిద్ధమైంది. ప్రతిష్ఠాత్మక రెడీమేడ్ వస్త్రాల తయారీ సంస్థ తమ యూనిట్‌ను ప్రారంభించేందుకు సిద్ధమైంది. రెడీమేడ్ వస్త్రాల తయారీలో అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన టెక్స్‌పోర్ట్ కంపెనీ తమ యూనిట్‌ను రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రం సమీపంలోని పెద్దూరు అపెరల్ పార్క్‌లో ప్రారంభించేందుకు సిద్ధమైంది. రెండేళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ పూర్తి చేసుకోగా.. అపెరల్ పార్క్‌లో బాహుబలి వర్క్‌షెడ్ నిర్మాణం జరిగింది. ఏడు ఎకరాల్లో టెక్స్‌పోర్ట్ గార్మెంట్ యూనిట్‌ను నిర్మించారు. 1.60 లక్షల చదరపు అడుగుల వైశాల్యంతో బాహుబలి షెడ్ నిర్మాణాన్ని టీఎస్ఐఐసీ పూర్తి చేసింది.

66 ఎకరాల్లో అపెరల్ పార్క్

జిల్లావ్యాప్తంగా బీడీలు చేస్తూ లేదా మిషన్.. జూకీ మిషన్ కుడుతూ మహిళలు అరకొర ఆదాయంతో వెళ్లదీస్తున్నారు. ఇలాంటి పనిచేసే మహిళలకు రెడీమేడ్ వస్త్రాల తయారీ మెరుగైన ఉపాధి కల్పిస్తోంది. పెద్దగా పనులు లేక యువకులు గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు. అటు మహిళలు, ఇటు యువకులకు స్థానికంగా ఉపాధి అవకాశాలను కల్పించేందుకు మరో పెద్ద సంస్థ సిరిసిల్లలో యూనిట్‌ను ప్రారంభించడం విశేషం. సిరిసిల్ల శివారులోని పెద్దూరు వద్ద 66 ఎకరాల్లో అపెరల్ పార్క్‌ను ఏర్పాటు చేయగా.. మరిన్ని సంస్థలు సిరిసిల్లకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. టెక్స్‌పోర్ట్ కంపెనీ పని ప్రారంభిస్తే.. జిల్లాలో మరింత మందికి మెరుగైన ఉపాధి దరి చేరనుంది.

ఉపాధి లక్ష్యంగా..

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని రెండువేల మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో టెక్స్‌పోర్ట్ కంపెనీ పరిశ్రమను స్థాపించింది. ఇప్పటికే అపెరల్ పార్క్‌లో గోకుల్‌దాస్ ఇమేజెస్ గార్మెంట్ సంస్థ తమ యూనిట్‌ను రెండేళ్ల కిందట స్థాపించి 500 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. మరో వెయ్యి మందికి ఉపాధి కల్పించే దిశగా ఆ కంపెనీ యూనిట్‌ను విస్తరిస్తోంది. గోకుల్‌దాస్ సంస్థ లోదుస్తులను తయారీ చేస్తూ విదేశాలకు ఎగుమతి చేస్తోంది. సిరిసిల్ల నుంచి నేరుగా అమెరికాకు వస్త్రాలు వెళ్తున్నాయి. దీనికితోడుగా అపెరల్ పార్క్‌లో టెక్స్‌పోర్ట్ అనే మరో అంతర్జాతీయ సంస్థ తన యూనిట్‌లో 1600 మంది మహిళలు, మరో 400 మంది సిబ్బందికి ఉపాధి అందించనుంది. త్వరలోనే టెక్స్‌పోర్ట్ యూనిట్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈమేరకు గార్మెంట్ రంగంలో అనుభవం ఉన్న మహిళలను ఎంపిక చేస్తున్నారు. ఆధునిక జీన్స్, టీషర్ట్, అండర్‌వేర్స్ వంటి వస్త్రాల కుట్టుపై శిక్షణ ఇచ్చేందుకు ఆసక్తి గల మహిళల ఎంపిక జరుగుతోంది.



రిస్క్ వద్దు బ్రదరూ.. పట్టు తప్పితే ప్రమాదం గురూ

ఒకవైపు ఇంటర్ పరీక్షలు, మరోవైపు కళాశాలలు, కోచింగ్ సెంటర్లకు వచ్చే విద్యార్థులతో విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిటలాడుతోంది. కొన్ని రూట్లలో బస్సులు పరిమితంగా ఉండటంతో త్వరగా ఇంటికి చేరుకోవాలనే ఆతృతలో విద్యార్థులు ఇలా ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



శ్రమజీవికి జల'తారు'పాన్పు

పగలంతా కష్టపడి పనిచేసి..రాత్రి ఇంత తిన్నాక నిద్రపోయేందుకు కాస్త స్థలం కోసం ఎదురుచూసే వలసకూలీకి విజయవాడ బీఆర్టీఎస్ రోడ్డు ఆశ్రయంగా మారుతోంది. వలస కూలీలతో పాటు నిరాశ్రయులు ఇక్కడ పడుకుంటున్నారు. అయితే వీరితో పాటు కొందరు మందు, మత్తు పదార్థాలు సేవించినవారు ఇక్కడే పడుకోవడంతో రాత్రిపూట ఆ దారిలో వెళ్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఆహారం కోసం తప్పదు వేట.. పొదివిపట్టుకో బేటా

ఎండలు మండిపోతున్నాయి. ఆహారం కోసం వన్యప్రాణులు ఆహారం, గుక్కెడు నీళ్ల కోసం జనావాసాల సమీపంలోకి వస్తున్నాయి. కృష్ణా జిల్లా పెదపులిపాక సమీపంలో ఓ వానరం తన బిడ్డతో సహా ఆహార కోసం అన్వేషిస్తున్న దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

విద్యార్థులే... ఉపాధ్యాయులు!

- స్వీట్లు పెట్టి పాఠాలు చెప్పి..
- ప్రభుత్వ పాఠశాలలోనే చేరండి
- పి.దొంతమూరు హైస్కూల్ విద్యార్థుల వినూత్న ప్రచారం
- ఫలిస్తున్న గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కృషి

పిఠాపురం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు ఎంతటి ఉత్తమ ఫలితాలను ఇచ్చాయో పి.దొంతమూరు విద్యార్థులను చేస్తూ అర్థమవుతుంది. నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలను కార్పొరేట్‌కు దీటుగా మార్చడంతో పాటు, ఆంగ్ల మాధ్యమం, విద్యా కానుక, బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలు, ఇంగ్లిష్ మీడియం వంటి వినూత్న కార్యక్రమాలను నాటి సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేసింది. దీనిని అందిపుచ్చుకున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాఠాలు వినే స్థాయి నుంచి.. ఏకంగా ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పే స్థాయికి ఎదిగారు. కాకినాడ జిల్లా, పిఠాపురం మండలం, పి.దొంతమూరులోని ప్రభుత్వ హైస్కూలు విద్యార్థులు దీనికి ఉదాహరణగా నిలుస్తున్నారు. ఈ పాఠశాల విద్యార్థులు కర్నీడి సత్యకృష్ణ, దొడ్డి సిరి, అడపా జీవమణి, ఎలుగుబంటి నందిని, ఎస్.రేవతి తదితరులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరాలంటూ వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. వారే ఉపాధ్యాయులుగా మారి, తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. గడచిన ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలు ఏవిధంగా మారాయో స్వయంగా వివరించారు. కొంతసేపు ఆ పిల్లలకు పాఠాలు చెప్పారు. వారికి స్వీట్లు పంచి పెట్టి, వచ్చే ఏడాది తమ స్కూల్లోనే చేరాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన ఏవిధంగా ఉందో ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడి, ఆ చిన్నారులకు అవగాహన కల్పించారు. ఇలా ప్రతి వారం ఆయా పాఠశాలలకు వెళ్లి, ఈ ప్రచారాన్ని కొనసాగించనున్నారు.

మా అభివృద్ధిని వివరించాం



మేం చిన్నప్పుడు ఈ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకూ చదువుకున్నాం. మా గ్రామంలోని ఉన్నత పాఠశాలలో సౌకర్యాలు లేక వేరే ఊరిలోని ప్రైవేటు పాఠశాలలో చేరాలనుకునే వాళ్లం. కానీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాడు–నేడుతో మా గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రూపురేఖలు ఒక్కసారిగా మారిపోయాయి. సకల సౌకర్యాలూ వచ్చాయి. విద్యా బోధనలోనూ మార్పులు రావడంతో ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడుతున్నాం. అందుకే మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మా ఉన్నతిని వివరించి, వారు ఇదే పాఠశాలలో చేరే విధంగా అవగాహన కల్పించాలని భావించాం.

– ఎలుగుబంటి నందిని, 9వ తరగతి విద్యార్థిని, పి.దొంతమూరు

మంచి అనుభూతి



చిన్నప్పుడు చదువుకున్న స్కూలుకు వెళ్లి మేం పాఠాలు చెప్పడం మంచి అనుభూతిని కలిగించింది. మా గ్రామ ప్రాథమిక పాఠశాలలోని చిన్నారులను మా పాఠశాలకు ఆహ్వానించాలని అనిపించింది. చాక్లెట్లు తీసుకుని వెళ్లి, వారితో కొంతసేపు గడిపాం. పాఠాలు చెప్పి, మా పాఠశాలలో జాయిన్ అవ్వాలనే ఆసక్తిని పెంచాం. మమ్మల్ని చూసి వారు చాలా ఆనందపడ్డారు. తాము అదే స్కూలులో చదువుకుంటామన్నారు. మేం మాట్లాడుతున్న ఇంగ్లిషు విని తాము కూడా అలా నేర్చుకుంటామంటూ ఆసక్తి చూపారు.

– కిల్లాడి సంధ్యారాణి, 9వ తరగతి విద్యార్థిని, పి.దొంతమూరు



ప్రాథమిక పాఠశాలలో పాఠాలు చెబుతున్న 9వ తరగతి విద్యార్థి ఎస్.రేవతి

ఆశ్చర్యం కలిగింది

ఇంకా పదో తరగతిలోకి కూడా రాని విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు చెప్పడం, ఇంగ్లిషులో అనర్గళంగా మాట్లాడటం చూసి ఆశ్చర్యం కలిగింది. ఈ విద్యార్థులు బెండపూడి విద్యార్థులనే మించిపోయారు. చాలా బాగా చదువుతున్నారు. ఇతర పాఠశాలలకు వెళ్లి విద్యా బోధన చేయడం, వారితో ముచ్చటించడం వంటివి చేస్తే, పది మందిలో మర్యాదగా మాట్లాడటం అలవాటవుతుంది. పి.దొంతమూరు హైస్కూలు విద్యార్థులు ఇప్పుడదే చేస్తున్నారు. వారితో మాట్లాడి అభినందించా.

– నాగమణి, రీజనల్ జాయింట్ డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ



విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఆర్‌జేడీ నాగమణి

క్లుప్తంగా...

నేడు లైన్‌మెన్ దివస్ నిర్వహించాలి: సీఎస్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలు 'లైన్‌మెన్ దివస్'ను మంగళవారం ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.విజయానంద్ సోమవారం ఆదేశించారు. లైన్‌మెన్‌లు విధి నిర్వహణలో అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

డీఆర్‌డీఏ పీడీల నియామకం

సాక్షి, అమరావతి: కృష్ణా, కాకినాడ జిల్లాలతో పాటు ఎన్టీఆర్, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల డీఆర్‌డీఏ పీడీలుగా కొత్తవారిని నియమించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి వాకాటి కరుణ ఆదేశాలు జారీ చేశారు.

పవన్ కళ్యాణ్‌తో మాజీ ఎమ్మెల్యే దొరబాబు భేటీ

సాక్షి, అమరావతి: పిఠాపురం మాజీ ఎమ్మెల్యే దొరబాబు సోమవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో భేటీఅయ్యారు. మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో కుటుంబ సభ్యులతో పవన్ కళ్యాణ్‌ను కలిశారు.

పోసానిని ఉరి తీసినా తప్పులేదు

రాజమహేంద్రవరం రూరల్: 'సినీ నటుడు పోసాని కృష్ణమురళి ఓ మూర్ఖ శిఖామణి. ఆయనను ఉరి తీసినా తప్పు లేదు..' అని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆయన సోమవారం రాజమహేంద్రవరంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు.

హైదరాబాద్‌లోని వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తాం

సాక్షి, అమరావతి: హైదరాబాద్ నగరంలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించి, అభివృద్ధి చేయడం ద్వారా ఆదాయం పెంచుతామని ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. హైదరాబాద్‌లోని టీకే గూడా, ఎస్సార్ నగర్, హిమాయత్ నగర్‌లోని కర్నూలు అంజుమన్–ఏ–ఇస్లామియాకు సంబంధించిన వక్ఫ్ ఆస్తులను అజీజ్ సోమవారం పరిశీలించారు.

బాలల కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలచే నడుపుతున్న బాలల సంరక్షణ కేంద్రాలు చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ (నమోదు) చేసుకోవాలని బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు–వీధి బాలల సంక్షేమ శాఖ సంచాలకులు ఎం.వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం మార్చి 10వరకు దరఖాస్తుల సమయం పొడిగించామన్నారు. ఇతర సమాచారం కోసం http:// wdcw. ap. gov. in వెబ్ సైట్ నుంచి పొందవచ్చన్నారు.

వర్సిటీల్లో బోధనా పోస్టులు భర్తీ చేయాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో శాశ్వత ప్రాతిపదికన బోధన పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేస్తూ గవర్నర్, ముఖ్యమంత్రికి ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ బహిరంగ లేఖ రాసింది. బోధన, బోధనేతర మౌలిక వసతులు లేక విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసింది.

నర్సింగ్ కళాశాలల్లో విదేశీ విద్యా కోర్సులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 13 ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో విదేశీ భాష కోర్సులను ప్రవేశపెట్టేందుకు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)కు అనుమతులిస్తూ వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

వెబ్‌ఆప్షన్‌ల నమోదుకు అవకాశం

సాక్షి, అమరావతి: బీపీటీ, బీఎస్సీ (ఎంఎల్‌టీ), బీఎస్సీ పారామెడికల్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలకు రెండో దశ కౌన్సెలింగ్‌కు వెబ్ ఆప్షన్‌ల నమోదు కోసం సోమవారం ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ ఇచ్చింది. సోమవారం సాయంత్రం నుంచి ఆప్షన్‌ల నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా, బుధవారం రాత్రి ఎనిమిది గంటల వరకు కొనసాగుతుంది.

పీవీ సునీల్ కుమార్ సస్పెన్షన్ సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం

సాక్షి, అమరావతి/మదనపల్లె: టీడీపీ కూటమి పరిపాలనలో రాష్ట్రంలో దళిత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్ విజయ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌ను ప్రభుత్వం ఏకపక్షంగా సస్పెండ్ చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. అనుమతిలేకుండా విదేశాలకు వెళ్లారనే అవాస్తవ ఆరోపణలతో సస్పెండ్ చేయడాన్ని ఆయన ఖండించారు. కాగా సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు ధ్వజమెత్తారు.

ఉపాధ్యాయ పదోన్నతులకు రంగం సిద్ధం!

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయుల పదోన్నతుల కల్పనకు రాష్ట్ర విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. జిల్లాలు, క్యాడర్ వారీగా సీనియారిటీ జాబితాలను పాత జిల్లా విద్యాశాఖ అధికారుల అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురించాలని, వీటిపై అభ్యంతరాలు స్వీకరించాలని ఆదేశించింది. ఇందులో భాగంగా జోన్ల వారీగా అభ్యంతరాల స్వీకరణకు గడువిచ్చారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయి కమిటీలో పాత జిల్లా కేంద్రం విద్యాశాఖ అధికారి చైర్మన్‌గా, ఏడీ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. అలాగే కొత్త జిల్లా కేంద్రం ఏడీ, పాత కొత్త జిల్లాల సూపరింటెండెంట్లు సభ్యులుగా ఉంటారు.

నారాయణ.. ఇదేమి 'పరీక్ష'?

- ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో నారాయణ స్కూల్ ఇష్టారాజ్యం

గిద్దలూరు రూరల్: ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణలో నారాయణ స్కూల్ యాజమాన్యం తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. మరో పాఠశాలలో నిర్వహించాల్సిన పరీక్షలను తమ స్కూల్‌లోనే నిర్వహిస్తోంది. ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం ప్రకాశం జిల్లా గిద్దలూరులో నాలుగు సెంటర్లు ఏర్పాటుచేశారు. పట్టణంలోని ఆర్ఆర్ స్కూల్, సూర్య స్కూల్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆయా కేంద్రాల్లో పరీక్షలకు హాజరుకావాలని విద్యార్థులకు హాల్‌టికెట్లలో కూడా ఉంది. అయితే, సోమవారం ఆర్ఆర్ స్కూల్‌లో నిర్వహించాల్సిన పరీక్షలను పట్టణంలోని నరవ రోడ్డులో ఉన్న నారాయణ స్కూల్‌లో నిర్వహించారు. ఈ విషయం ముందుగా తెలియక ఉదయం ఆర్ఆర్ స్కూల్ వద్దకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హడావుడిగా నారాయణ స్కూల్‌కు చేరుకున్నారు. ఆర్ఆర్ స్కూల్ సెంటర్‌లో 148 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, అక్కడికి బదులుగా నారాయణ స్కూల్‌లో నిర్వహించిన పరీక్షలకు 119మంది హాజరయ్యారు. 29మంది గైర్హాజరయ్యారు. ఆర్ఆర్ స్కూల్‌లో వసతులు లేకపోవడం వల్ల నారాయణ స్కూల్‌లో పరీక్షలు నిర్వహించామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, వసతులు లేవనే విషయం విద్యాశాఖ అధికారులకు ముందు తెలియదా...? అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.



అనుమతులు లేకుండా నారాయణ క్యాంపస్‌లో పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చర్చిలపై కూటమి సర్కారు కక్ష

ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఆర్థిక సహకార సంస్థ మాజీ చైర్మన్ జాన్‌వెస్లీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో చర్చి నిర్మాణాల విషయంలో మైనార్టీ, పంచాయతీ రాజ్ శాఖలు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేయడం తగదని ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఆర్థిక సహకార సంస్థ మాజీ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ ధ్వజమెత్తారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మంత్రిగా ఉన్న పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు 26 జిల్లాల పరిధిలోని అన్ని పంచాయతీల్లో క్రైస్తవ చర్చిలకు అనుమతులపై విచారణ జరపాలని ఆదేశాలివ్వడం దారుణమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య లౌకిక రాజ్యంలో అన్ని కులాలను, మతాలను, ప్రాంతాలను ఒకే విధంగా సమానంగా గౌరవించాలని రాజ్యాంగం చెబుతోందని, అందుకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని పేర్కొన్నారు.

సీనియర్ ఇంటర్ తొలి రోజు పరీక్షకు 4.65 లక్షల మంది హాజరు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. రెండో సంవత్సరం విద్యార్థులు మొత్తం 4,76,381 మంది ఉండగా, మొదటి పరీక్షకు 4,65,281 మంది (97.67 శాతం) హాజరైనట్టు ఇంటర్ విద్యా మండలి ప్రకటించింది. ఇందులో జనరల్ విద్యార్థులు 4,29,021 మంది, ఒకేషనల్ విద్యార్థులు 36,260 మంది ఉన్నారని తెలిపింది. తొమ్మిది మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయని వెల్లడించింది. మొత్తం 11,091 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని వివరించింది.

పదో తరగతి హాల్‌టికెట్లు విడుదల

ఆన్‌లైన్, వాట్సాప్‌ల్లో అందుబాటులో ఉంచిన బోర్డు

సాక్షి, అమరావతి: మార్చి–2025 పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి వీటిని పాఠశాల విద్య కమిషనరేట్ వెబ్‌సైట్‌లో ఉంచారు. దీంతోపాటు 95523 00009 వాట్సాప్ నంబర్‌లో 'హాయ్' అని టైప్‌చేసి ఎడ్యుకేషన్ సర్వీసు ఎంచుకుని హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎస్సెస్సీ పరీక్షల విభాగం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. అప్లికేషన్ నంబర్ లేదా చైల్డ్ ఐడీ, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి పొందవచ్చన్నారు. హాల్‌టికెట్లలో విద్యార్థుల వివరాల్లో తప్పులుంటే సదరు పాఠశాల ప్రధానోపాధ్యాయుల నుంచి dir&govexams@yahoo.com లేదా dir&govexams@apschooledu.inకు మెయిల్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

గ్రూప్–2 పోస్టుల ప్రాధాన్యం మార్పునకు అవకాశం

సాక్షి, అమరావతి: గ్రూప్–2 మెయిన్స్ రాసిన అభ్యర్థులు తమ పోస్టుల ప్రాధాన్యం, జోన్, జిల్లా ప్రాధాన్యతలను ఎంపిక చేసుకునేందుకు ఏపీపీఎస్సీ అవకాశం కల్పించింది. అభ్యర్థులు తమ ప్రాధాన్యతలను మంగళవారం నుంచి ఈనెల 10వ తేదీ లోగా https://psc.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేయాలని విజ్ఞప్తి చేసింది. హారిజంటల్ (క్షితిజ సమాంతర) రిజర్వేషన్ అమలులో భాగంగా మహిళలకు కేటాయించిన పోస్టులకు సరిపడినంత మంది మహిళా అభ్యర్థులు లేకపోతే ఆ పోస్టులను పురుష అభ్యర్థులకు కేటాయించనున్నట్లు కమిషన్ పేర్కొంది. ఓసీ ఉమెన్ పోస్టులను జనరల్ కేటగిరీగానూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, మెరిటోరియస్ స్పోర్ట్స్ పర్సన్స్, బెంచ్ మార్క్ వైకల్యం గల మహిళల (పీబీడీ) విభాగాల్లో ఆ వర్గాలకు చెందిన అభ్యర్థులు లేకపోతే ఆ పోస్టులను అదే వర్గానికి చెందిన పురుష అభ్యర్థులతో భర్తీ చేయనున్నట్లు కమిషన్ పేర్కొంది.



శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 68,592 మంది స్వామిని దర్శించుకున్నారు. 24,273 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.63 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 6 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లున్న వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైభవంగా వసంతోత్సవం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం వసంతోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన వధూవరులైన శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ అమ్మవార్ల ఉత్సవమూర్తులను వసంతోత్సవ మండపంలో కొలువుదీర్చి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు.

రత్నగిరిపై కనకవర్షం



అన్నవరం: మాఘ మాసం పుణ్యమా అని రత్నగిరిపై కనకవర్షం కురిసింది. గడచిన 30 రోజులకు గాను అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా రికార్డు స్థాయిలో రూ.1,88,91,940 ఆదాయం సమకూరింది. దేవస్థానంలోని హుండీలను సోమవారం తెరచి, భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు.

మూడో రోజుకు చేరిన పెద్దింట్లమ్మ జాతర



కైకలూరు: ఏలూరు జిల్లా కైకలూరు మండలం కొల్లేటికోటలో కొలువై ఉన్న పెద్దింట్లమ్మ జాతర సోమవారానికి మూడో రోజుకు చేరుకుంది. సమీప భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి ఖడ్గనామార్చన, ధూప సేవ, బాలభోగం, కలశ పూజ, పాత్ర సాధన, పంచ హారతులు నిర్వహించారు.

జలాధివాసం వీడుతున్న సంగమేశ్వరుడు



కొత్తపల్లి: ప్రాచీన సంగమేశ్వర ఆలయం జలాధివాసం వీడుతోంది. శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 885 అడుగుల నుంచి 847 అడుగులకు చేరుకుంది. దీంతో సప్తనదీ సంగమ ప్రాంతంలో కృష్ణాజలాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో సోమవారం సంగమేశ్వరాలయంలోని గోపురాలు పూర్తిగా బయటపడ్డాయి. మరి కొద్ది రోజుల్లో సంగమేశ్వరుడు పూర్తి స్థాయిలో కృష్ణమ్మను వీడి భక్తుల చేత పూజలందుకోనున్నారు.

వయసుతో ముసిరే సమస్యలు

చాలా సమస్యలు స్త్రీ, పురుషులిద్దరిలోనూ కామన్‌గానే ఉన్నా... కొన్ని సమస్యలు మాత్రం మహిళల్లో చాలా ప్రత్యేకం. వాళ్లలో స్రవించే హార్మోన్లూ, సంక్లిష్టమైన సైకిళ్ల వల్ల వాళ్లకు కొన్ని సమస్యలిలా ప్రత్యేకంగా వస్తుంటాయి. ఈ నెల 8న ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలూ, పరిష్కారాలను సూచించే ఈ ప్రత్యేక కథనమిది...

రుతుస్రావం మొదలుకాగానే ఓ బాలిక బాలుర నుంచి వేరుగా కనిపించడం మొదలవుతుంది. రుతుస్రావం నుంచే అమ్మాయిల్లో కొన్ని సమస్యలు కనిపించడం మొదలవుతుంది. చాలామంది అమ్మాయిలు ఇంకా ఈ విషయమై మాట్లాడటానికి ఇబ్బంది పడుతుంటారు. ఇందులో బిడియపడాల్సిందేమీ లేదు. ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు డాక్టర్‌ను సంప్రదించి తగిన సూచనలతో పాటు అవసరమైతే తగిన వైద్య చికిత్స కూడా తీసుకోవాలి.

తొలుత యువతల్లో కనిపించే రుతుసంబంధమైన సమస్యలను తెలుసుకుందాం.

యువతుల్లో రుతు సంబంధిత సమస్యలు

రుతుసంబంధిత సమస్యలను ఇంగ్లిష్‌లో మెన్‌స్ట్రువల్ డిజార్డర్స్‌గా చెబుతారు. వీటిల్లో కొన్ని ప్రధాన సమస్యలిలా ఉంటాయి.

● **ప్రైమరీ అమెనోరియా :** సాధారణంగా అమ్మాయిల్లో 12 నుంచి 16 ఏళ్ల మధ్య రుతుస్రావం మొదలవుతుంది. కానీ కొందరు యువతుల్లో 16 ఏళ్లు దాటినా రుతుక్రమం మొదలు కాదు. ఈ కండిషన్‌ను 'ప్రైమరీ అమెనోరియా' అంటారు. ఇందుకు చాలా కారణాలుంటాయి. వీళ్లు డాక్టర్‌ను సంప్రదించి, తగిన పరీక్షలు చేయించి, కారణాలు తెలుసుకోవాలి. ఆ కారణాన్ని బట్టి చికిత్స అందించాల్సి ఉంటుంది.

● **డిస్‌మెనూరియా:** రుతుసంబంధిత సమస్యల్లో ప్రధానమైనదీ, దాదాపు 80 శాతం మంది అమ్మాయిల్లో కనిపించేది రుతు సమయాల్లో నొప్పి. దీన్నే 'డిస్‌మెనూరియా' అంటారు. వీళ్లు ఒకసారి డాక్టర్‌ను సంప్రదించాక, వారి సలహాతో రుతుసమయంలో నొప్పి వచ్చినప్పుడల్లా వారు సూచించిన మోతాదులో నొప్పి నివారణ మందులు వాడుకోవచ్చు. అయితే వీటిని ఎక్కువగా వాడటం వల్ల మరికొన్ని ఆరోగ్య సమస్యలు రావచ్చు. కాబట్టి డాక్టర్ సూచించిన మోతాదుకు మించకుండా వాడాలి.

● **పరిష్కారం:** రుతు సమయంలో వచ్చే ఈ నొప్పి ఒక వయసుకు వచ్చాక చాలామందిలో దానంతట అదే తగ్గిపోతుంది. ఇలాంటి వారికి డాక్టర్లు కొన్ని న్యూట్రిషనల్ సప్లిమెంట్లు కూడా సూచిస్తారు. సంతానం కలిగిన తర్వాత చాలామందిలో ఈ నొప్పి రావడం ఆగిపోతుంది. కొందరిలో నొప్పి రావడం ఆగకపోవచ్చు. వాళ్లు డాక్టర్‌ను సంప్రదించి, తగిన మందులు వాడాలి.

● **మెనొరేజియా:** కొంతమంది యువతుల్లో రుతు సమయంలో రక్తస్రావం చాలా ఎక్కువగా అవుతుంటుంది. ప్రధానంగా చిన్న వయసు (తరుణ వయస్కులైన అడాలసెంట్) బాలికల్లో అలాగే పాతిక ముప్పై ఏళ్ల వరకు యువతుల్లోనూ ఈ సమస్య కాస్త ఎక్కువే. ఇలా ఎక్కువ మోతాదులో రక్తం పోతుండటం వల్ల రక్తహీనతతో పాటు మరెన్నో ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు.

● **పరీక్షలూ, పరిష్కారం:** ఈ సమస్య ఉన్నవారు డాక్టర్ సలహా మేరకు కొన్ని హార్మోనుల పరీక్షలు చేయించుకొని, అవసరాన్ని బట్టి మందులు వాడాల్సి ఉంటుంది. కొన్ని సార్లు ఈ రక్తస్రావం ఫైబ్రాయిడ్స్ వల్ల కావచ్చు. వైద్యపరీక్షల ఫలితాలను బట్టి చికిత్స ఉంటుంది.

● **ప్రి మెనుస్ట్రువల్ సిండ్రోమ్ :** కొంతమంది మహిళల్లో రుతుస్రావం మొదలు కావడానికి కొద్ది రోజులు ముందర నుంచే కొన్ని శారీరక సమస్యలు కనిపిస్తుంటాయి. ఉదాహరణకు... ఆ సమయంలో వాళ్లకు రొమ్ముల్లో సలపరం, బాధ /నొప్పి, భావోద్వేగాలు వెంటవెంటనే మారిపోవడం (మూడ్స్ స్వింగ్స్) వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి సమస్యను ప్రీ-మెనుస్ట్రువల్ సిండ్రోమ్ అంటారు.

● **పరిష్కారం :** ఈ సమయంలో కలిగే బాధల నివారణ కోసం తగినన్ని నీళ్లు తాగుతుండాలి. అలాగే ద్రవాహారం ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. ఆకుకూరలు, కాయగూరలతో కూడిన పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలి. ఒత్తిడికి లోనుకాకూడదు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల ఎండార్ఫిన్ అనే హార్మోన్‌లు విడుదలై, మంచి ఉపశమనం కలగజేస్తాయి. ఈ సమస్య ఉన్నవారు పొగతాగడం, కెఫిన్ డ్రింక్స్ (కాఫీ, కూల్‌డ్రింక్స్‌లో కోలా డ్రింక్స్ వంటివి), ఆల్కహాల్ వంటి వాటికి దూరంగా ఉండాలి. ఆహారంలో ఉప్పు బాగా తగ్గించాలి. ఉప్పు ఎక్కువగా ఉండే బేకరీ ఐటమ్స్‌కు దూరంగా ఉండాలి. కొవ్వులు, చక్కెరలు ఎక్కువగా ఉండే ఆహారాలను చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలి. అప్పటికీ ప్రయోజనం కనిపించకపోతే డాక్టర్‌ను సంప్రదించి, కొన్ని హార్మోన్ పరీక్షలు చేయించుకుని, ఆ వైద్య పరీక్షల ఫలితాలను బట్టి అవసరమైన చికిత్స తీసుకోవాలి.

* * *

మూత్ర సంబంధ సమస్యలు

మహిళల శరీర నిర్మాణం కారణంగా పురుషులతో పోలిస్తే... మహిళల్లో మూత్ర సంబంధమైన ఇన్ఫెక్షన్లు చాలా ఎక్కువ. మూత్రసంబంధమైన ఇన్ఫెక్షన్స్‌తో తరచూ వస్తుండేవారు నీళ్లూ, ద్రవాహారం ఎక్కువగా తీసుకుంటూ ఉండటం, ప్రతి మూడు గంటలకోసారి మూత్రవిసర్జనకు వెళ్లి, మూత్రాశయాన్ని పూర్తిగా ఖాళీ అయ్యేలా జాగ్రత్త తీసుకోవడం, భార్యాభర్త కలయిక తర్వాత మూత్ర విసర్జనకు వెళ్లడం (ఈ సమయంలో కాస్త వేగంగా మూత్రవిసర్జన చేయాలి), ప్రైవేటు పార్ట్స్ శుభ్రంగా కడుక్కోవడం, ప్రైవేట్ పార్ట్స్ దగ్గర ఎప్పుడూ పొడిగా ఉంచుకోవడం వంటి జాగ్రత్తలతో ఈ సమస్యను నివారించవచ్చు.

● **యూరినరీ ఇన్‌కాంటినెన్స్:** కొందరు మహిళల్లో మూత్రంపై నియంత్రణ అంతగా ఉండదు. ఈ సమస్య ఉన్నవారు దగ్గినా, తుమ్మినా, ఏదైనా వస్తువును అకస్మాత్తుగా ఎత్తినా, కొందరిలో నవ్వినా వారి పొట్టపై కండరాలు మూత్రాశయంపై ఒత్తిడి కలిగించి... మూత్రం చుక్కలు, చుక్కలుగా పడేలా చేస్తాయి. సాధారణంగా ప్రసవం తర్వాత ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. ప్రసవమైన తర్వాత మహిళల పొట్ట కండరాలు బలహీనం కావడంతో మూత్ర విసర్జన స్ఫింక్టర్‌పై వారు నియంత్రణ కోల్పోయేందుకు అవకాశమెక్కువ. దాంతో ఈ సమస్య కనిపిస్తుంది.

● **పరిష్కారాలు:** డాక్టర్‌ను సంప్రదించి, వారు సూచించిన విధంగా కొన్ని ప్రసవానంతర వ్యాయామాలూ, కెగెల్స్ ఎక్సర్‌సైజ్‌ల ద్వారా మూత్రవిసర్జనపై నియంత్రణ సాధించవచ్చు లేదా వారు సూచించిన విధంగా చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది కొందరిలో శస్త్రచికిత్స కూడా అవసరమవుతుంది.

* * *

మహిళల్లో కనిపించే కొన్ని సాధారణ గైనిక్ సమస్యలు

● **పీసీఓఎస్ / పీసీఓడీ :** అండాశయంలో అనేక నీటితిత్తులు పెరిగే ఈ సమస్యను వైద్యపరిభాషలో పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్ లేదా డిజార్డర్ అంటారు. చాలావరకు అవి హానికరం కాకపోవచ్చు. అలాగే గర్భధారణకూ పెద్దగా అంతరాయం కలిగించకపోవచ్చు.

● **పీసీఓఎస్ / పీసీఓడీకి కారణాలు :** మహిళల అండాశయం నుంచి ప్రతి నెలా ఒక ఫాలికిల్ (అండం పెరిగే నీటి తిత్తి) కనిపిస్తుంది. దీని పరిమాణం 18 నుంచి 20 మిల్లీమీటర్లకు చేరాక ఇది పగిలి దాని నుంచి అండం విడుదల అవుతుంది. అయితే కొంతమందిలో ఫాలికిల్స్ 5–10 మిల్లీమీటర్లకు చేరగానే అంతకు మించి అది పెరగకుండా చిన్న చిన్న నీటి బుడగలాగా పెరుగుతాయి. అవి పది, పన్నెండు కంటే ఎక్కువగా ఉన్న కండిషన్‌ను పాలిసిస్టిక్ ఓవరీస్ అంటారు. ఇవి ఏర్పడానికి స్పష్టమైన కారణం తెలియదుగానీ... మారుతున్న జీవనశైలి, ఆహార అలవాట్లు, కొన్ని మానసిక, శారీరక సమస్యలతో పాటు హార్మోన్లలో అసమతౌల్యత, ఇన్సులిన్ రెసిస్టెన్స్ వంటి సమస్యలు ఉన్నప్పుడు ఇవి వస్తుండటం పరిశోధకులు గమనించారు. ఈ సమస్య ఉన్న మహిళల్లో బరువు పెరగడం, అవాంఛిత రోమాలు, పీరియడ్స్ సక్రమంగా లేకపోవడంతో పాటు కొంత మందిలో సంతానలేమి, గర్భధారణ సమస్యలు కనిపించవచ్చు.

● **పరీక్షలు/పరిష్కారాలు :** కొన్ని రక్తపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలతో సమస్యను నిర్ధారణ చేస్తారు. ఈ సమస్య ఉన్న మహిళలందరికీ ఒకే లాంటి చికిత్స ఉండదు. వారిలో కనిపించే లక్షణాలు, రక్తపరీక్షలు తేలిన అంశాలను బట్టి చికిత్స మారుతుంది. బరువు తగ్గించుకోవడం, అవసరాన్ని బట్టి మెట్‌ఫార్మిన్ వంటి మందులు, హార్మోన్లు వాడాల్సి ఉంటుంది. సమస్య తీవ్రత ఎక్కువగా ఉంటే అవసరాన్ని బట్టి ల్యాపరోస్కోపిక్ శస్త్రచికిత్స చేయాల్సి రావచ్చు.



డాక్టర్ చల్మేడ నివేదిత
సీనియర్ ఫిజీషియన్ & డయాబెటాలజిస్ట్

● **ఎండోమెట్రియాసిస్ :** గర్భాశయం లోపలి పొరను ఎండోమెట్రియమ్ అంటారు. రుతుస్రావం తర్వాత ఈస్ట్రోజెన్ హార్మోన్ గర్భాశయం లోపలి గోడలపై ప్రభావం చూపడంతో అక్కడ ఎండోమెట్రియమ్ అనే పొర మొదటి 14 రోజులపాటు వృద్ధి చెంది, 15వ రోజున విడుదల అయ్యే ప్రొజెస్టిరాన్ అనే హార్మోన్ వల్ల ఆ పొర మరింత మందమవుతుంది. అక్కడ సన్నటి రక్తనాళాలు కూడా అభివృద్ధి చెందుతాయి. అప్పుడు ఓవరీస్‌లో విడుదలైన అండం శుక్రకణంతో కలవకపోతే 14 రోజుల తర్వాత ప్రొజెస్టెరాన్ ఉత్పత్తి ఆగిపోతుంది. దాంతో ఎండోమెట్రియమ్‌లో అభివృద్ధి చెందిన రక్తనాళాలు కుంచించుకుపోతాయి. ఫలితంగా ఎండోమెట్రియమ్ పొర... గర్భాశయం గోడ నుంచి ఊడిపోయి సన్నటి ముక్కలుగా రక్తంలో కలిసి బ్లీడింగ్ రూపంలో బయటకు వచ్చేస్తుంది. మహిళల్లో ప్రతినెలా అయ్యే రుతుస్రావం ఇదే.

అయితే కొందరిలో ఎండోమెట్రియమ్ కణాలు గర్భాశయంలోపలి వైపునకు కాకుండా, కొన్ని కారణాల వల్ల కడుపులోకి వివిధ అవయవాలపైన అంటే... అండాశయాలపైనా, ట్యూబ్స్‌పై, గర్భాశయం పై పొరపై, పొత్తికడుపులోని గోడలపై, పేగులపై, మూత్రాశయంపై, ఇంకా చాలా అరుదుగా ఊపిరితిత్తుల్లో, మెదడులోకి పెరుగుతాయి. హార్మోన్ల ప్రభావం వల్ల అవి రుతుచక్రంలో ఎలాంటి మార్పులు చెందుతాయో... బయట పెరిగిన ఆ కణాల్లోనూ అలాంటి మార్పులే జరుగుతూ అవి పెరిగిన చోట కూడా వృద్ధి చెందుతుంటాయి. వాటినే ఎండోమెట్రియల్ ఇంప్లాంట్స్ అంటారు. రుతుస్రావం సమయంలో ఆ అవయవాల్లో కూడా కొద్దిగా బ్లీడింగ్ అవుతుంటుంది. ఈ సమస్యనే ఎండోమెట్రియాసిస్ అంటారు. వివిధ అవయవాలపై ఉన్న ఎండోమెట్రియమ్ ఇంప్లాంట్స్‌లో రక్తస్రావం జరిగాక... అది బయటకు వెళ్లడానికి దారి లేక రక్తం అక్కడిక్కడే ఇంకిపోతుంది. అయితే కొందరిలో రక్తం ఇంకకుండా అది గూడు కట్టడం జరగవచ్చు. కొందరిలో ఒక అవయవానికి, మరో అవయవానికి మధ్య ఈ రక్తపు కణాలు గూడుకట్టడం వల్ల కండ పెరగడమూ జరగవచ్చు. ఇలా జరగడం వల్ల పెరిగిన కండను అడ్‌హెషన్స్ లేదా ఫైబ్రోసిస్ బ్యాండ్స్ అంటారు. అలా పెరిగిన కణజాలం నుంచి విడుదల అయ్యే ప్రోస్టాగ్లాండిన్స్ హార్మోన్స్‌తో పాటు ఇతర రసాయన పదార్థాల వల్ల ఒక్కొక్కరిలో ఒక్కోలాంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో నడుం, పొత్తికడుపులో నొప్పి, సంతానం కలగకపోవడం, పేగులు అతుక్కుపోవడం, మూత్రనాళాలు, పేగుల్లో అడ్డంకులు ఏర్పడటం వంటి సమస్యలు రావచ్చు.

● **పరిష్కారం :** ఈ సమస్యకు ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ వంటి హార్మోన్ మాత్రలతో చికిత్స అందిస్తారు. కొందరిలో శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం రావచ్చు.

* * *

చర్మ సమస్యలు

మహిళల్లో బిగుతైన వస్త్రధారణ కారణంగా వారిలో చర్మానికి సంబంధించిన కొన్ని సమస్యలు కనిపించేందుకు అవకాశాలెక్కువ. అందులో ముఖ్యమైనవి...

● **క్యాండిడియాసిస్ / ఫంగల్ ఇన్ఫెక్షన్స్:** ఇది మహిళల్లో కనిపించే చాలా సాధారణ సమస్య. వాళ్లకు చెమట విపరీతంగా పట్టే ప్రదేశాల్లోనూ, అలాగే చర్మంలోని ముడతలుండే ప్రాంతాల్లో తగినంత గాలి, వెలుతురు సోకే అవకాశాలు తక్కువ. దాంతో అక్కడ ఉక్కపోతలతో చెమట తాలూకు చెమ్మ పెరగడంతో క్యాండిడియాసిస్ వంటి ఫంగల్ ఇన్ఫెక్షన్స్ రావడానికి అవకాశమెక్కువ. ఇక కొందరిలో వాళ్లు గర్భం దాల్చినప్పుడూ ఈ సమస్యలు కనిపించడం మామూలే. అలాగే డయాబెటిస్ ఉన్నవారిలోనూ, రోగనిరోధక శక్తి తగ్గిన వారిలో, యాంటీబయాటిక్స్ ఎక్కువగా వాడే వారిలో ఫంగల్ ఇన్ఫెక్షన్స్ తరచూ కనిపిస్తుంటాయి.

● **పరీక్షలు / పరిష్కారాలు :** సాధారణ ఫిజికల్ ఎగ్జామినేషన్‌తోనే ఈ సమస్యను తెలుసుకోవచ్చు. చర్మంపై వచ్చిన ఫంగస్ తాలూకు రకాన్ని బట్టి కొన్ని చర్మంపై పూసేందుకు కొన్ని పూతమందులూ (టాపికల్ మెడిసిన్స్), నోటి ద్వారా తీసుకోవాల్సిన యాంటీఫంగల్ మందులు వాడాల్సి ఉంటుంది.

● **ఎండోక్రైన్ సమస్యలు :** ఇది హార్మోన్ల స్రావాల్లో వచ్చే తేడాల వల్ల వచ్చే సమస్యలు. ఇందులో ప్రధానంగా రెండు రకాలు కనిపించేందుకు అవకాశాలెక్కువ. మొదటిది థైరాయిడ్ గ్రంథి చాలా తక్కువగా లేదా అస్సలు పనిచేయకపోవడం వల్ల వచ్చే సమస్య అయిన హైపోథైరాయిడిజమ్.

ఈ సమస్య స్త్రీ, పురుషులిద్దరిలోనూ కనిపించినా సాధారణంగా మహిళల్లోనే కాస్త ఎక్కువ. రోగనిరోధక వ్యవస్థలో వచ్చే లోపాల వల్ల హైపోథైరాయిడిజమ్ రావచ్చు. తీవ్రమైన అలసట / మందకొడిగా ఉండటం, డిప్రెషన్, బరువు పెరగడం, చర్మం పొడిగా మారడం, మలబద్ధకం, రుతుక్రమం సక్రమంగా రాకపోవడం వంటి లక్షణాలతో ఇది కనిపిస్తుంది. కొందరిలో ఈ కండిషన్ వల్ల రక్తంలో కొలెస్ట్రాల్ మోతాదులు పెరిగి అవి హృద్రోగాలకు దారితీయవచ్చు. ఒక్కోసారి మైక్సిడిమా కోమా అన్న కండిషన్‌కు దారితీసి ప్రాణాపాయం కూడా సంభవించే అవకాశం ఉంది. గర్భిణుల విషయంలో థైరాక్సిన్ మోతాదులు తగ్గుతున్నాయేమో జాగ్రత్తగా గమనించాల్సి ఉంటుంది. ఆరోగ్యకరమైన బిడ్డ కోసం ఈ పరీక్షలు చాలా అవసరం. గర్భిణుల్లో హైపోథైరాయిడిజం అన్నది బిడ్డ మానసిక వికాసానికి కొద్దిగా అంతరాయం కలిగించవచ్చు. అందుకే గర్భిణుల విషయంలో హైపోథైరాయిడిజమ్ లేకుండా జాగ్రత్త తీసుకోవాలి. లెవో థైరాక్సిన్ సోడియమ్ వంటి మందుల ద్వారా దీనికి చికిత్స చేస్తారు.

● **హైపర్ థైరాయిడిజమ్ :** రక్తంలో థైరాయిడ్ హార్మోన్‌లు (టీ3, టీ4) పెరగడం వల్ల వచ్చే సమస్యను హైపర్ థైరాయిడిజమ్ లేదా థైరోటాక్సికోసిస్ అంటారు. దీని లక్షణాలన్నీ హైపోథైరాయిడిజమ్ లక్షణాలకు పూర్తిగా విరుద్ధంగా ఉంటాయి.

- గుండెదడ
- చేతులు వణకడం
- బరువు తగ్గిపోవడం
- నీరసం
- విరేచనాలు
- రుతుక్రమానికి సంబంధించిన సమస్యలు
- థైరాయిడ్ గ్రంథి వాపు (గాయిటర్) వంటి లక్షణాలు కనిపిస్తాయి.

హైపర్‌థైరాయిడిజమ్‌ను రక్త పరీక్ష ద్వారా గుర్తిస్తారు. ఈ పరీక్షలో రక్తంలో టీ3, టీ4 మోతాదు ఎక్కు కావడం, టీఎస్‌హెచ్ మోతాదు బాగా తగ్గిపోవడం కనిపిస్తుంది. దీనికి చికిత్సగా యాంటీ థైరాయిడ్ మందులు ఉపయోగిస్తారు. ఈ మందులను డాక్టర్ సలహా మేరకు తీసుకోవాలి. కొన్ని నెలల వ్యవధిలోనే ఈ సమస్య పూర్తిగా తగ్గుతుంది. చాలామందిలో ఈ యాంటీ థైరాయిడ్ మందులు ఆపిన తర్వాత మళ్లీ థైరాయిడ్ హార్మోన్ మోతాదులు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే ముందుగా యాంటీ థైరాయిడ్ మందుల ద్వారా హార్మోన్‌ని తగ్గించి, ఆ తర్వాత ఈ సమస్య శాశ్వత పరిష్కారం కోసం రెండు పద్ధతులు అనుసరిస్తారు. మొదటి దానిలో రేడియో ఆక్టివ్ అయోడిన్ మందును ఎక్కువ మోతాదులో ఇవ్వడం ద్వారా థైరాయిడ్ గ్రంథిలో హార్మోన్ తయారు చేసే కణాలను నాశనం చేయడం ద్వారా హార్మోన్ స్రావాన్ని తగ్గిస్తారు. ఇక రెండో పద్ధతిలో ఆపరేషన్ ద్వారా థైరాయిడ్ గ్రంథిని తొలగించడం ద్వారా హార్మోన్ స్రావాన్ని తగ్గిస్తారు. ఈ రెండు పద్ధతుల్లోనూ హార్మోన్ స్రావం బాగా తగ్గిపోయి, చివరకు హార్మోన్ లోపానికి దారితీస్తుంది. అప్పుడు హైపోథైరాయిడిజమ్‌లో మాదిరిగానే జీవితాంతం థైరాక్సిన్ మాత్రలు వాడాల్సి ఉంటుంది.

* * *

మధ్య వయసులో వచ్చేవి

మధ్యవయసు నాటికి మహిళల్లో కనిపించే సమస్యల్లో ముఖ్యమైనవి ఇవి...

● **మెనోపాజ్ సమస్యలు :** రుతుక్రమం రావడంతో సమస్యలు మొదలవుతాయంటే... తమకు 45 ఏళ్లు వచ్చాక అదే రుతుక్రమం ఆగిపోవడం కూడా మహిళల్లో ఒక సమస్యాత్మక అంశంగానే ఉంటుంది. రుతుక్రమం ఆగే సమయంలో ఈస్ట్రోజెన్ హార్మోన్ తగ్గినందున వారికి ఒంట్లోంచి వెచ్చటి ఆవిర్లు రావడం, భావోద్వేగాల్లో వేగంగా మార్పులు (మూడ్స్ స్వింగ్స్), ఆస్టియోపోరోసిస్‌తో ఎముకలు బలహీనం కావడం, ఈస్ట్రోజెన్ వల్ల గుండెకు కలిగే సహజ రక్షణ తొలగిపోవడం వల్ల గుండెజబ్బులకు తేలిగ్గా గురికావడం, యోని పొడిగా మారడం, గర్భసంచి కిందికి జారడం వంటి అనేక సమస్యలు కనిపిస్తాయి.

● **పరిష్కారం :** రుతుక్రమం ఆగిన (మెనోపాజ్) మహిళల్లో సంబంధిత లక్షణాలేవైనా కనిపిస్తే తక్షణం డాక్టర్‌ను సంప్రదించి చికిత్స తీసుకోవాలి. లక్షణాలను బట్టి డాక్టర్లు హెచ్‌ఆర్‌టీ వంటి చికిత్సలను సూచిస్తారు. క్యాల్షియమ్, విటమిన్ 'డి' ఇవ్వడం వల్ల మెనోపాజ్ వచ్చిన మహిళల్లో ఎముకల ఆరోగ్యం పటిష్టంగా ఉండటమే కాకుండా ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలను నివారించవచ్చు. అలాగే ఆహారంలో క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే పాల వంటివి తీసుకోవడంతో పాటు దేహానికి తగినంత వ్యాయామం కూడా అందేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

● **ఆస్టియోపోరోసిస్...** మహిళల్లో ఈ ఎముకలకు గుల్లబారిపోయే ఈ వ్యాధి చాలా ఎక్కువ. పైగా మన దేశ మహిళలు (ముఖ్యంగా చిన్నపిల్లల నుంచి యువతుల వరకు) క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే పాలు క్రమంతప్పకుండా తాగడం చాలా తక్కువ. ఇటీవల చాలామంది సూర్యకాంతికి ఎక్స్‌పోజ్ కాకపోవడంతో ఎముకలకు బలం చేకూర్చే విటమిన్ డి3 పాళ్లూ తగ్గుతాయి. పైగా మహిళలకు వ్యాయామ అలవాట్లూ తక్కువే. వీటిన్నింటి ఫలితంగా మహిళల్లో ఎముక సాంద్రతా, బలం క్రమంగా తగ్గుతూ పోతుంది. ఇక తమ వ్యాధినిరోధక శక్తి తమపైనే ప్రతికూల ప్రభావం చూపే ఎముక సంబంధితమైన రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఎస్ఎల్ఈ వంటి వ్యాధులు మహిళ్లోనే ఎక్కువ. అందుకే మహిళల్లో ఎముకల బలాన్ని పెంచడానికి పొట్టుతో ఉంటే కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్స్ ఇచ్చే ధాన్యాలైన (గోధుమ, జొన్న, మొక్కజొన్న, రాగులు, ఓట్స్)తో చేసిన పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. అలాగే పొట్టు తీసిన కార్బోహైడ్రేట్స్ నివారించాలి. తాజా పండ్లు, క్యాల్షియమ్ ఎక్కువగా ఉండే రాగులు, తాజా ఆకుపచ్చ కూరలు (గ్రీన్ లీఫీ వెజిటబుల్స్) తీసుకోవడం చాలా మంచిది.

ఇటీవలి ఆధునిక మహిళలు ఇంటిపనులతో పాటు బయట ఉద్యోగాలూ చేస్తున్నారు. అందుకే వారిపై పనిఒత్తిడితో పాటు మానసిక ఒత్తిడీ ఎక్కువే. ఫలితంగా ఆరోగ్య సమస్యలూ ఎక్కువే. అందుకే ఆమెకు కుటుంబం నుంచీ, అందునా మరీ ముఖ్యంగా భర్త నుంచి తగిన సహాయ సహకారాలు అవసరమని అందరూ తెలుసుకోవాలి.














బిజినెస్ రీల్

హైడ్రోజన్ వాహనాలపై పైలట్ ప్రాజెక్టులు



న్యూఢిల్లీ: జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్‌లో భాగంగా హైడ్రోజన్ ఇంధనంతో నడిచే వాహనాలను ప్రయోగాత్మకంగా పరీక్షించే క్రమంలో కేంద్ర ప్రభుత్వం అయిదు పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించింది. బస్సులు, ట్రక్కులు సహా మొత్తం 37 వాహనాలను దేశ వ్యాప్తంగా 10 వేర్వేరు మార్గాల్లో పరీక్షించనున్నట్లు కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ తెలిపింది. ఈ ప్రాజెక్టులను టాటా మోటర్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ, అశోక్ లేల్యాండ్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీఎల్ తదితర సంస్థలకు అప్పగించినట్లు పేర్కొంది. వీటిలో 15 హైడ్రోజన్ ఫ్యుయల్ సెల్ ఆధారిత వాహనాలు, 22 హైడ్రోజన్ ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ ఆధారిత వాహనాలు ఉంటాయి. ఎంపికైన ప్రాజెక్టులకు కేంద్రం రూ. 208 కోట్ల ఆర్థిక తోడ్పాటు అందిస్తుంది. స్వచ్ఛ ఇంధనాల విషయంలో స్వీయ సమృద్ధి సాధించే లక్ష్యాల్లో భాగంగా 2029–30 వరకు రూ. 19,744 కోట్ల కేటాయింపులతో 2023 జనవరిన కేంద్రం జాతీయ హరిత హైడ్రోజన్ మిషన్‌ను ఆవిష్కరించింది.

మార్చి 12కల్లా ఆర్‌క్యాప్ బదిలీ

ఎన్‌సీఎల్‌టీ తాజా ఆదేశాలు

న్యూఢిల్లీ: రుణ సంక్షోభంలో చిక్కుకున్న రిలయన్స్ క్యాపిటల్(ఆర్‌క్యాప్) యాజమాన్య బదిలీకి వీలుగా మార్చి12కల్లా అన్ని ప్రక్రియలనూ పూర్తి చేయవలసిందిగా జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) ఆదేశించింది. ఇందుకు సంబంధించి అన్ని ప్రక్రియలనూ గడువులోగా పూర్తి చేయమంటూ సంస్థ రుణదాతలు, పర్యవేక్షణ కమిటీకి ముంబై బెంచ్ తాజాగా సూచించింది. ఆర్‌క్యాప్ రుణ పరిష్కార ప్రక్రియలో భాగంగా ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ లిమిటెడ్(ఐఐహెచ్‌ఎల్)కు యాజమాన్య నిర్వహణను బదిలీ చేయవలసి ఉంది.

నిస్సాన్ మ్యాగ్నైట్ 50 వేల కార్ల ఎగుమతులు

గురుగ్రామ్: మ్యాగ్నైట్ కార్ల ఎగుమతులు 50,000 యూనిట్ల మైలురాయిని చేరినట్లు నిస్సాన్ మోటర్ ఇండియా వెల్లడించింది. అంతర్జాతీయంగా తమ కార్యకలాపాలకు, మేడిన్ ఇండియా వాహనాలకు పెరుగుతున్న ఆదరణకు ఇది నిదర్శనమని సంస్థ ఎండీ సౌరభ్ వత్స తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో దేశ, విదేశాల్లో హోల్‌సేల్‌గా 8,567 విక్రయాలు నమోదైనట్లు వివరించారు. వీటిలో ఎగుమతులు 6,239 యూనిట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. మరోవైపు, మ్యాగ్నైట్ బీఆర్10 తాజాగా ఈ20 ఇంధనానికి అనుకూలతను సాధించినట్లు వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-3-2025

విశాఖ	455–00
చిత్తూరు	463–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	440–00
విజయవాడ	440–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	410–00
వరంగల్	412–00
రిటైల్ ధర	4.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	257.5	4.57
GRASIM	2,380.00	3.18
EICHERMOT	4,914.00	2.94
JSWSTEEL	976.15	2.68
BPCL	242.60	2.23

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ& AUTO	7,710.00	-2.44
COALINDIA	360.60	-2.37
RELIANCE	1,174.00	-2.17
BAJAJFINSV	1,840.00	-1.73
HDFCBANK	1,703.55	-1.67

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,007
ఎన్‌ఎస్‌ఈ	94,975
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,60,472
ఎఫ్‌ఐఐ	- 4,788
డీఐఐ	+ 8,791

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	69.48	$ 69.76
బ్రెంట్	72.65	$ 72.81

ఫార్మా ఎగుమతుల్లో భారత్ జోరు

ప్రపంచ సగటును మించిన వృద్ధి ● ఐపీఏ, మెకిన్సే నివేదికలో వెల్లడి



సాక్షి, బిజినెస్ బ్యూరో: జెనరిక్ ఔషధాల సరఫరాలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న భారత్.. ఎగుమతుల పరంగా కొత్త వృద్ధి శకానికి సిద్ధంగా ఉందని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అలయన్స్ (ఐపీఏ), మెకిన్సే అండ్ కంపెనీ నివేదిక తెలిపింది. ప్రపంచ సగటు 5 శాతం కంటే వేగంగా ఎగుమతుల్లో 9 శాతం వృద్ధి చెందుతూ కొత్తపుంతలు తొక్కుతోందని వివరించింది. ప్రపంచ ఫార్మా ఎగుమతులు 2011లో 424 బిలియన్ డాలర్ల నుంచి 2023 నాటికి 797 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. భారత్ విషయంలో ఇది 10 బిలియన్ డాలర్ల నుంచి 28 బిలియన్ డాలర్లుగా ఉందని నివేదిక వివరించింది. మౌలిక వసతులకు భారీ పెట్టుబడులు, వ్యయ నియంత్రణ చర్యలు, మెరుగైన నిర్వహణ, మొత్తం పరిశ్రమలో సామర్థ్యం పెరుగుదల ఇందుకు దోహదం చేసింది.

విదేశాల్లోనూ పాగా..

భారత్ ఇప్పుడు ప్రపంచ జెనరిక్ ఔషధ డిమాండ్‌లో 20 శాతం సమకూరుస్తోంది. ఇందులో యూఎస్ జెనరిక్ ఔషధ అవసరాలలో 40 శాతం, యూకే మార్కెట్‌లో 25 శాతం వాటా భారత్ కైవసం చేసుకుంది. అంతర్జాతీయంగా ఎగుమతుల విషయంలో పరిమాణం పరంగా మూడవ స్థానం, విలువ పరంగా 11వ స్థానం మనదే. భారత్‌కు వస్త్రాల తర్వాత సుమారు 20 బిలియన్ డాలర్లతో అత్యధిక విదేశీ మారకం సమకూరుస్తున్న విభాగం ఇదే. ప్రపంచ వ్యాక్సిన్ డిమాండ్‌లో 60 శాతం ఇక్కడి నుంచే సరఫరా అవుతున్నాయి. 70 శాతం యాంటీ రెట్రోవైరల్ మందులు భారత్ నుంచి వెళ్తున్నాయి. ప్రపంచ మార్కెట్‌తో పోలిస్తే మందుల ఉత్పత్తి సామర్థ్యం రెండింతలకుపైగా అధికమై ఏటా 8 శాతం వృద్ధి చెందుతోంది. యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియెంట్స్ (ఏపీఐ) తయారీలో భారత్ వాటా 8 శాతం ఉంది. బయోటెక్నాలజీ విభాగంలో 12వ ర్యాంకుతో పోటీపడుతోంది. ఆమోదం పొందిన బయోసిమిలర్ల సంఖ్య 2005లో 15 ఉంటే, 2023 నాటికి 138కి ఎగసింది. ఆమోదం పొందిన ఏఎన్‌డీఏల్లో టాపికల్స్, ఇంజెక్టేబుల్స్, నాసల్, ఆప్తాల్మిక్ వంటి సంక్లిష్ట డోసేజ్‌ల వాటా 2013లో 25 నుంచి 2023లో 30 శాతానికి చేరింది.

యూఎస్‌ను మించిన కేంద్రాలు..

యూఎస్‌ఎఫ్‌డీఏ ఆమోదించిన తయారీ కేంద్రాల సంఖ్య భారత్‌లో 2024 నాటికి 752కి చేరుకుంది. సంఖ్య పరంగా యూఎస్‌ను మించిపోయాయి. డబ్ల్యూహెచ్‌వో జీఎంపీ ధ్రువీకరణ అందుకున్న ప్లాంట్లు 2,050, అలాగే యూరోపియన్ డైరెక్టరేట్ ఫర్ ది క్వాలిటీ ఆఫ్ మెడిసిన్స్ (ఈడీక్యూఎం) ఆమోదం పొందిన ప్లాంట్లు 286 ఉన్నాయి. దశాబ్ద కాలంలో దేశంలో యూఎస్‌ఎఫ్‌డీఏ అధికారిక చర్య సూచించిన (ఓఏఐ) కేసులు 50 శాతం తగ్గాయి. నిబంధనల తాలూకా యూరోపియన్ మెడిసిన్స్ ఏజెన్సీ (ఈఎంఏ) కేసులు 27 శాతం క్షీణించాయి. కార్మిక వ్యయాలు తక్కువగా ఉండడం, సామర్థ్య మెరుగుదల, డిజిటల్ స్వీకరణ కారణంగా భారత కంపెనీలు అమెరికా, యూరోపియన్ తయారీదారుల కంటే 30–35 శాతం తక్కువ ధరకే ఔషధాలను ఉత్పత్తి చేస్తున్నాయి.

ప్రాధాన్య గమ్యస్థానంగా..

తక్కువ వ్యయానికే ఔషధాలు అందుబాటులో ఉండడంతో ప్రాధాన్య ఔట్‌సోర్సింగ్ గమ్యస్థానంగా భారత్ నిలిచింది. ఎంఆర్‌ఎన్‌ఏ, కణ, జన్యు చికిత్సలు, మోనోక్లోనల్ యాంటీబాడీస్‌తో సహా అభివృద్ధి చెందుతున్న చికిత్సలకు ఉపయోగించే ఔషధాలు ఏటా 13–14 శాతం పెరుగుతున్నాయి. సంప్రదాయ ఔషధ వృద్ధి రేటును ఇవి అధిగమించాయి. ఏఐ, జనరేటివ్ ఏఐ ఆధారిత పురోగతి కారణంగా అదనపు ఆదాయాన్ని 60 బిలియన్ డాలర్ల నుండి 110 బిలియన్ డాలర్లకు పెంచగలవని నివేదిక అంచనా వేసింది. మార్జిన్‌లను 4–7 శాతం మెరుగుపరుస్తాయని, ఉత్పాదకతను 50 శాతం పెంచగలవని వెల్లడించింది. ప్రపంచ ఫార్మా సరఫరా వ్యవస్థలో భారత పాత్రను బలోపేతం చేస్తూ తమ సామర్థ్యాలను విస్తరించుకోవడానికి అయిదు అగ్రశ్రేణి భారతీయ కాంట్రాక్ట్ అభివృద్ధి, తయారీ సంస్థలు (సీడీఎంఓలు) 650 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాయి.

వెన్నంటే సవాళ్లు..

ఔషధ రంగంలో భారత్ పురోగతి ఉన్నప్పటికీ.. పరిశ్రమ ఒక కీలక దశకు చేరుకున్నప్పుడు క్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటుందని నివేదిక వివరించింది. డిజిటల్ పరివర్తన, స్మార్ట్ ఆటోమేషన్, కొత్త చికిత్సా విధానాల పెరుగుదల వంటి అంతరాయాలు ఔషధ కార్యకలాపాలను పునర్నిర్మించగలవని తెలిపింది. భౌగోళిక రాజకీయ మార్పులు, కొత్త పోకడలు, పెరుగుతున్న స్థిరత్వ డిమాండ్లు కూడా ముప్పును కలిగించే అవకాశం ఉందని వివరించింది. భారతీయ ఫార్మా కంపెనీలు పరిగణించవలసిన ఎనిమిది కీలక అంశాలలో లోపరహిత కార్యకలాపాలను సాధించడం, ఏఐ, డిజిటల్ సాధనాలను ఉపయోగించడం, ఉత్పత్తి ఖర్చులను తగ్గించడం, స్థిరత్వ ప్రయత్నాలను మెరుగుపరచడం వంటివి ఉన్నాయి. ‘దశాబ్ద కాలంలో నిర్మించిన పునాది కారణంగా భారత ఫార్మాస్యూటికల్ పరిశ్రమ నేడు బలంగా ఉంది. అంతరాయాలు ఎదురుకానున్నందున అధిక పనితీరును నడిపించడానికి, ప్రపంచ నాయకత్వాన్ని నిలబెట్టుకోవడానికి కంపెనీలు తమ నిర్వహణ విధానాలను పునరాలోచించాలి’ అని మెకిన్సే అండ్ కంపెనీ భాగస్వామి విష్ణుకాంత్ పిట్టి తెలిపారు.

వ్యక్తిగత డేటా పబ్లిక్ డొమైన్‌లోకి!

- డేటా లీక్ వెనుక టెలికం ఆపరేటర్లు
- ఈ-కామర్స్ యాప్‌లు, బ్యాంక్‌లు
- లోకల్ సర్కిల్స్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: తమ వ్యక్తిగత డేటా పబ్లిక్ డొమైన్‌లోకి చేరిపోయినట్టు మెజారిటీ నెటిజన్లు భావిస్తున్నారు. పబ్లిక్ డొమైన్‌లో తమ డేటా లీక్ అయినట్టు లోకల్ సర్కిల్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో 87 శాతం మంది చెప్పారు. ఇందులో సగం మంది తమ ఆధార్ లేదా పాన్ వివరాలు లీక్ అయినట్టు భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా 375 జిల్లాల పరిధిలో 36వేల మంది స్పందనలను ఈ సర్వేలో భాగంగా తెలుసుకున్నారు. ప్రధానంగా టెలికం ఆపరేటర్లు, ఈ-కామర్స్ యాప్‌లు, బ్యాంక్‌లు, ఫైనాన్షియల్ సర్వీస్ ప్రొవైడర్లు, ప్రభుత్వ విభాగాలు తమ డేటా లీకేజీకి కారణమని ఎక్కువ మంది నమ్ముతున్నారు. పబ్లిక్ డొమైన్‌లో తమ డేటా లీకేజీకి టెలికం ఆపరేటర్లు కారణమని 65 శాతం మంది భావిస్తుంటే, 63 శాతం మంది ఈ-కామర్స్ యాప్‌లు లేదా సైట్లు, 56 శాతం మంది బ్యాంక్‌లు, ఫైనాన్షియల్ సంస్థలు కారణమై ఉంటాయని చెప్పారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది ఇందుకు కారణమని 50 మంది అనుకుంటున్నారు. 48 శాతం మంది పేమెంట్ యాప్‌ల ద్వారా తమ వ్యక్తిగత వివరాలు లీక్ అయి ఉంటాయని చెప్పగా.. 26 శాతం మంది విద్యా సంస్థలు, 37 శాతం మంది వ్యాపార సంస్థల పాత్ర ఇందులో ఉండొచ్చని భావిస్తున్నారు.



విదేశీ పెట్టుబడులు డౌన్

- క్యూ3లో 5.6 శాతం తగ్గుదల
- 10.9 బిలియన్ డాలర్లుగా నమోదు
- ఏప్రిల్–డిసెంబర్ మధ్య 27% అప్



న్యూఢిల్లీ: ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల ప్రభావంతో భారత్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం (2024–25, క్యూ3)లో ఎఫ్‌డీఐలు 5.6 శాతం తగ్గి 10.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో దేశంలోకి 11.55 బిలియన్ డాలర్ల విలువైన ఎఫ్‌డీఐలు వచ్చాయి. పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగం (డీపీఐఐటీ) విడుదల చేసిన గణాంకాల్లో ఇతర ముఖ్యాంశాలివీ..

- 2024–25 జూలై–సెప్టెంబర్ త్రైమాసికంలో 13.6 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు నమోదయ్యాయి. వార్షికంగా 43 శాతం పెరిగాయి.
- ఏప్రిల్–డిసెంబర్ తొమ్మిది నెలల కాలానికి చూస్తే 27 శాతం ఎగసి, 40.67 డాలర్లను తాకాయి. 2023–24 ఇదే కాలంలో దేశంలోకి వచ్చిన ఎఫ్‌డీఐల విలువ 32 బిలియన్ డాలర్లు.
- ఈక్విటీ పెట్టుబడులు, తిరిగి ఇన్వెస్ట్ చేసిన లాభాలు, ఇతర మూలధన పెట్టుబడులు తొలి తొమ్మిది నెలల్లో 21.3 శాతం వృద్ధితో 62.48 బిలియన్ డాలర్లకు ఎగబాకాయి. అంతక్రితం ఏడాది ఇదే కాలంలో ఇవి 51.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- భారీగా ఎఫ్‌డీఐ ఈక్విటీ పెట్టుబడులు వెచ్చించిన దేశాల్లో సింగపూర్ (12 బిలియన్ డాలర్లు), అమెరికా (3.73 బి.డాలర్లు), నెదర్లాండ్స్ (4 బి.డాలర్లు), యూఏఈ (4.14 బి.డాలర్లు), సైప్రస్ (1.8 బి.డాలర్లు) నిలిచాయి.
- మారిషస్, జపాన్, యూకే, జర్మనీ నుంచి ఎఫ్‌డీఐలు క్షీణించాయి.
- రంగాల వారీగా చూస్తే, సేవల రంగ కంపెనీలకు తొలి 9 నెలల్లో అత్యధికంగా 7.22 బిలియన్ డాలర్లు లభించాయి.
- పునరుత్పాదక రంగం 3.5 బిలియన్ డాలర్ల విదేశీ నిధులను ఆకర్షించింది.
- మహారాష్ట్ర అత్యధికంగా 16.65 బిలియన్ డాలర్లను చేజిక్కించుకోగా, తర్వాత స్థానాల్లో కర్నాటక (4.5 బిలియన్ డాలర్లు), గుజరాత్ (5.56 బిలియన్ డాలర్లు) ఉన్నాయి.

తయారీ రంగం @14 నెలల కనిష్టం

- ఫిబ్రవరిలో పీఎంఐ 56.3కి పరిమితం
- సానుకూలంగానే పరిస్థితులు



న్యూఢిల్లీ: కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి వృద్ధి ఒక మోస్తరుగా ఉండటంతో దేశీయంగా తయారీ రంగ వృద్ధి ఫిబ్రవరిలో 14 నెలల కనిష్టానికి పడిపోయింది. తయారీ రంగ వృద్ధి, క్షీణతను సూచించే హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ సూచీ (పీఎంఐ) 56.3గా నమోదైంది. 2023 డిసెంబర్ తర్వాత ఇది కనిష్ట స్థాయి. జనవరిలో ఇది 57.7గా ఉంది. ఈ సూచీ 50కి ఎగువన ఉంటే వృద్ధిని, దిగువన ఉంటే క్షీణతను సూచిస్తుంది. ఫిబ్రవరిలో తయారీ రంగం నెమ్మదించినప్పటికీ, వృద్ధి ధోరణిలోనే ఉండటం సానుకూలాంశమని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. దేశ, విదేశాల్లో డిమాండ్ బాగుంటుందనే అంచనాలతో కంపెనీలు మరింత మంది వర్కర్లను నియమించుకోవడంపైనా, భారీగా కొనుగోళ్లపైనా దృష్టి పెడుతున్నాయని హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకానమిస్ట్ ప్రాంజల్ భండారీ తెలిపారు. వ్యాపార వర్గాలు చాలా ఆశావహంగా ఉన్నట్లు పేర్కొన్నారు. దీనికి సంబంధించిన సర్వేలో పాల్గొన్న మూడో వంతు సంస్థలు రాబోయే రోజుల్లో ఉత్పత్తి మరింతగా పెంచాల్సి ఉంటుందని భావిస్తున్నట్లు వివరించారు. ఉద్యోగాల కల్పన విషయానికొస్తే .. ప్రతి పది కంపెనీల్లో ఒకటి మరింతగా నియామకాలు చేపట్టనున్నట్లు వెల్లడించగా, ఒక్క శాతం కంపెనీలు మాత్రమే ఉద్యోగాల్లో కోత విధించాయి. ఏడాది కాలంగా చూస్తే ఫిబ్రవరిలో వ్యయాల భారం పెరగడమనేది చాలా తక్కువగానే ఉన్నప్పటికీ, భారీ డిమాండ్ కారణంగా ధరల పెరుగుదల మాత్రం అధిక స్థాయిలోనే నమోదైంది. దాదాపు 400 తయారీ సంస్థల పర్చేజింగ్ మేనేజర్లపై నిర్వహించే సర్వేలో వెల్లడైన అంశాల ఆధారంగా హెచ్‌ఎస్‌బీసీ ఇండియా తయారీ పీఎంఐని ఎస్‌అండ్‌పీ గ్లోబల్ తయారు చేస్తుంది.

స్టీల్‌కు డిమాండ్ పెరుగుతూనే ఉంటుంది

టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్



జమ్‌షెడ్‌పూర్: భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ స్టీల్‌కు డిమాండ్ పెరుగుతూనే ఉంటుందని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. వ్యయ నిర్వహణ, సామర్థ్యాలతో దీన్ని ఎదుర్కోవాలన్నారు. టాటా స్టీల్ వ్యవస్థాపకుడు జేఎన్ టాటా 186వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టెక్నాలజీని అందుపుచ్చుకునే విషయంలో ఉద్యోగులు, కార్మిక సంఘాలతోపాటు ప్రభుత్వం, విధానాల రూపంలో కంపెనీకి సాయం అవసరమన్నారు. ‘‘విస్తరణ విషయంలో సాహసోపేతంగా వ్యవహరించాలి. సామర్థ్యాలు, వ్యయ నియంత్రణలు కొనసాగించాలి. ఉత్పాదకతను పెంచుకోవాలి. అదే సమయంలో పెట్టుబడులు కొనసాగించాలి’’అని టాటా స్టీల్ విషయంలో కర్తవ్యబోధ చేశారు. టారిఫ్‌లపై కొనసాగుతున్న చర్చను ప్రస్తావించగా.. సుంకాల గురించి మాట్లాడుకోవడంలో అర్థం లేదంటూ, ఉత్పాదకతపై దృష్టి పెట్టాలని సూచించారు. టారిఫ్‌లు అన్నవి ప్రభుత్వం విధించే సుంకాలని, విదేశీ వస్తువులు దేశంలోకి దిగుమతి చేసుకునేందుకు కంపెనీలు వీటిని చెల్లిస్తాయన్నారు. సెమీకండక్టర్ చిప్‌ల విషయంలో భారత్ స్వావలంబన సాధించాల్సి ఉందన్న అభిప్రాయాన్ని చంద్రశేఖర్ వ్యక్తం చేశారు. ఎలక్ట్రానిక్స్, హెల్త్‌కేర్, డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలు చిప్‌లపై ఆధారపడి ఉన్నట్టు చెప్పారు. ఇందుకోసమే అసోం, గుజరాత్‌లో టాటాగ్రూప్ సెమీకండక్టర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్టు గుర్తు చేశారు.

జిందాల్ పవర్ చేతికి భద్రేశ్వర్ విద్యుత్

రూ.500 కోట్ల బిడ్‌కు ఆమోదం



న్యూఢిల్లీ: గుజరాత్‌కు చెందిన బొగ్గు విద్యుదుత్పత్తి సంస్థ ‘భద్రేశ్వర్ విద్యుత్’ను నవీన్ జిందాల్ గ్రూప్ కంపెనీ జిందాల్ పవర్ సొంతం చేసుకోనుంది. రూ.500 కోట్లతో జిందాల్ పవర్ దాఖలు చేసిన పరిష్కార ప్రణాళికకు భద్రేశ్వర్ విద్యుత్ రుణదాతల కమిటీ ఆమోదం తెలిపింది. దీంతో ఈ ప్రణాళిక జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఆమోదానికి వెళ్లనుంది. జిందాల్ పవర్ అత్యధిక బిడ్ వేసినట్టు ఈ వ్యవహారం తెలిసిన వర్గాలు వెల్లడించాయి. ప్రతి దశలోనూ ప్రతి ఒక్క బిడ్డర్‌కు ఆఫర్ పెంచే అవకాశం ఇచ్చినట్టు, చివరికి జిందాల్ పవర్ విజేతగా నిలిచినట్టు తెలిపాయి. జిందాల్ పవర్ రూ.500 కోట్లు చెల్లించడంతోపాటు, మరో రూ.25–50 కోట్లను మూలధన వ్యయాల కోసం వెచ్చించనున్నట్టు పేర్కొన్నాయి. కుచ్‌లో150 మెగావాట్ల రెండు ప్లాంట్లను భద్రేశ్వర్ విద్యుత్ నిర్వహిస్తోంది.


బంగారానికి భవిష్యత్‌లో మరింత ఆదరణ



న్యూఢిల్లీ: పెట్టుబడులకు కీలకమైన వైవిధ్య సాధనంగా బంగారం రానున్న రోజుల్లో మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుందని కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంతనాగేశ్వరన్ అన్నారు. బంగారం విలువను కాపాడుకునే సాధనంగానే (స్టోర్ ఆఫ్ వ్యాల్యూ) కాకుండా, ఆభరణంగా, పోర్ట్‌ఫోలియోకి వైవిధ్యంగా నిలుస్తుందన్నారు. అప్పటికి యావ్ ప్రపంచం అంతర్జాతీయంగా ఒకే మానిటరీ వ్యవస్థకు చేరుకుంటుందన్నారు. ఐజీపీసీ–ఐఐఎంఏ బంగారం మార్కెట్ల వార్షిక సదస్సులో భాగంగా నాగేశ్వరన్ మాట్లాడారు. బంగారం ధర గతేడాది 27 శాతం మేర పెరగ్గా, ఈ ఏడాది ఇప్పటికే 12 శాతం ర్యాలీ చేయడం గమనార్హం. ఈ నేపథ్యంలో నాగేశ్వరన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విలువను కాపాడుకునే సాధనంగా బంగారం పాత్రను పలుచన చేయకుండానే, బంగారం నిల్వలను ఉత్పాదకత పెంపునకు వినియోగించడానికి మార్గాలను భారత్ కొనుగొనాల్సి ఉందన్నారు. ఇక్కడే విధానపరమైన సవాళ్లు నెలకొన్నట్టు చెప్పారు. గతంలో మాదిరి బంగారం మానిటైజేషన్ (నగదుగా మార్చుకోవడం) తరహా చర్యలను పరిశీలించాలన్నారు. 2015లో బంగారం మానిటైజేషన్ పథకాన్ని కేంద్రం ప్రకటించడం గమనార్హం. బంగారాన్ని బ్యాంకులో డిపాజిట్ చేయడం ద్వారా దానిపై వడ్డీని పొందే పథకం అది. దిగుమతులను తగ్గించే లక్ష్యంతో కేంద్ర నాడు దీన్ని తీసుకొచ్చింది. ఆ తర్వాత కొన్నాళ్లకే మరుగునపడింది.

రుణ భారం మరింత పెరిగితే కష్టమే..

నేడు ప్రపంచ రుణ భారం జీడీపీతో పోల్చితే ఎన్నో రెట్లకు పెరిగిందని అనంతనాగేశ్వరన్ తెలిపారు. ‘‘ఆ స్థాయి అధిక రుణ భారం తలనొప్పిగా మారుతుంది. భవిష్యత్ ఆదాయం వడ్డీ చెల్లింపులకే వెళుతుంది. అభివృద్ధికి పెద్దగా మిగిలేది ఉండదు. అధిక రుణ భారం నేపథ్యంలో దేశాలు ద్రవ్యోల్బణాన్ని ఉపయోగించుకుని రుణం విలువను తగ్గించుకునే ప్రయత్నం చేయొచ్చు’’అని నాగేశ్వరన్ పేర్కొన్నారు.



నిధుల వేటలో అంకురాలు..

- ఫిబ్రవరిలో రూ. 14,418 కోట్ల సమీకరణ
- సగటున 83.2 మిలియన్ డాలర్ల వేల్యుయేషన్

న్యూఢిల్లీ: దేశీ అంకుర సంస్థలు ఫిబ్రవరిలో సగటున 83.2 మిలియన్ డాలర్ల వేల్యుయేషన్‌తో 1.65 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 14,418 కోట్లు) నిధులను సమీకరించాయి. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–ఫిబ్రవరి మధ్య కాలంలో స్టార్టప్‌లు మొత్తం 2,200 విడతల్లో 25.4 బిలియన్ డాలర్లు సమీకరించినట్లయిందని అధ్యయన సర్వీసుల సంస్థ ట్రాక్షన్ గణాంకాల్లో వెల్లడైంది. దీని ప్రకారం జనవరితో పోలిస్తే ఫిబ్రవరిలో మొత్తం ఫండింగ్ 19.5 శాతం పెరిగింది. వార్షిక ప్రాతిపదికన, గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే మాత్రం 2.06 బిలియన్ డాలర్ల మేర తగ్గింది. మరిన్ని విశేషాలు..

- స్టార్టప్‌ల రాజధాని బెంగళూరులో అంకురాలు సగటున 2 మిలియన్ డాలర్ల చొప్పున 353 మిలియన్ డాలర్లు, ముంబైలో స్టార్టప్‌లు 102 మిలియన్ డాలర్లు సమీకరించాయి.
- ఫిన్‌టెక్ సంస్థ ఆక్సిజో 1 బిలియన్ డాలర్లు, బీ2బీ ప్లాట్‌ఫాం ఉడాన్ 75 మిలియన్ డాలర్లు దక్కించుకున్నాయి. స్పాట్‌డ్రాఫ్ట్, క్యాష్‌ఫ్రీ పేమెంట్స్, జెటా, జీనీమోడ్ మొదలైనవి ఇతరత్రా సంస్థల్లో ఉన్నాయి.
- ఫిబ్రవరిలో కంపెనీల కొనుగోలు లావాదేవీలు కూడా చెప్పుకోతగ్గ స్థాయిలో నమోదయ్యాయి. అడ్డా52 మాతృసంస్థ డెల్టాటెక్ గేమింగ్‌ను హెడ్ డిజిటల్ వర్క్స్ రూ. 491 కోట్లకు దక్కించుకుంది. అలాగే, ఫ్రాడ్ డిటెక్షన్ ప్లాట్‌ఫాం క్లారి5ని పెర్ఫియోస్ అనే సాఫ్ట్‌వేర్ యాజ్ ఎ సర్వీస్ (సాస్) సంస్థ కొనుగోలు చేయగా, మెగాఫైన్ ఫార్మాలో మెజారిటీ వాటాలను మోతీలాల్ ఓస్వాల్ ఆల్టర్నేట్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ రూ. 460 కోట్లకు దక్కించుకుంది.
- 26.5 మిలియన్ డాలర్ల సగటు మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో ఫిబ్రవరిలో 16 ఐపీవోలు లిస్టయ్యాయి. హెక్సావేర్, ఎజాక్స్, కెన్ ఇండియా, డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్, రాయల్ ఆర్క్ మొదలైన లిస్టింగ్స్ వీటిలో ఉన్నాయి.
- ఇన్వెస్టర్ల జాబితాలో షార్క్‌లు రితేష్ అగర్వాల్, అనుపమ్ మిట్టల్, అమన్ గుప్తా, పియుష్ బన్సల్ టాప్‌లో ఉండగా, వెంచర్ క్యాపిటల్ సంస్థల్లో బ్లూమ్ వెంచర్స్, ఎక్సిమియస్ వెంచర్స్, యూనికార్న్ ఇండియా వెంచర్స్, పీక్ ఫిఫ్టీన్, యాక్సెల్, నెక్స్ వెంచర్ పార్ట్‌నర్స్ గణనీయంగా ఇన్వెస్ట్ చేశాయి.
- 2024 మొత్తం మీద దేశీ అంకుర సంస్థలు 30.4 బిలియన్ డాలర్లు సమీకరించాయి. 2023లో నమోదైన 32.5 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది 6.5 శాతం తక్కువ.

నైట్‌రైడర్స్ కొత్త కెప్టెన్‌గా రహానే

వెంకటేశ్ అయ్యర్‌కు వైస్ కెప్టెన్సీ

• కోల్‌కతా ఫ్రాంచైజీ నిర్ణయం


వెంకటేశ్ అయ్యర్
రహానే

న్యూఢిల్లీ: కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) యాజమాన్యం అనూహ్యంగా భారత మాజీ కెప్టెన్, వెటరన్ బ్యాటర్ అజింక్య రహానేకు పగ్గాలు అప్పగించింది. గతేడాది వేలంలో భారీగా రూ.23 కోట్ల 75 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన వెంకటేశ్ అయ్యర్‌కే సారథ్య బాధ్యతలు కట్టబెడతారని అంతా అనుకున్నారు. కానీ కేకేఆర్ ఊహించని విధంగా అనుభవజ్ఞుడైన రహానేపై నమ్మకం పెట్టుకుంది. గత నవంబర్‌లో సౌదీ అరేబియాలోని జిద్దా నగరంలో రెండు రోజులపాటు జరిగిన మెగా వేలంలో తొలిరోజు రహానేను ఎవరూ తీసుకోలేదు. రెండో రోజు చివర్లో కోల్‌కతా జట్టు రహానే కనీస ధర రూ.కోటిన్నరకే అతడిని తీసుకుంది. కోట్లు పోసి కొనుకున్న అయ్యర్‌కు వైస్ కెప్టెన్సీ కట్టబెట్టింది. ఈనెల 22 నుంచి ఐపీఎల్ 18వ సీజన్ జరుగుతుంది. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే తొలి మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టుతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో తలపడుతుంది.

• 36 ఏళ్ల సీనియర్ బ్యాటర్ రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమైనప్పటికీ ఐపీఎల్, రంజీ ట్రోఫీ, జాతీయ స్థాయి టి20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలలో నిలకడగా తన సత్తా చాటుకుంటున్నాడు. ఈ సీజన్‌లో ముంబై తరఫున బరిలోకి దిగిన ఈ స్టార్ బ్యాటర్ 164.56 స్ట్రయిక్ రేట్‌తో 469 పరుగులతో అత్యధిక పరుగులు చేసి ఆటగాడిగా నిలిచాడు.

• నాలుగేళ్లక్రితం క్లిష్టమైన ఆస్ట్రేలియా పర్యటన (2020–21)లో కోహ్లి గైర్హాజరీలోని టీమిండియాను రహానే చుక్కానిలా నడిపించాడు. కోహ్లి సారథ్యంలో ఆడిన తొలి టెస్టులో ఓడితే... తర్వాత రహానే సారథ్యంలోని భారత జట్టు 2–1తో కంగారూ గడ్డపై చారిత్రక విజయం సాధించింది. ఈ సీజన్ దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీలో ముంబైకి సారథిగా వ్యవహరించిన రహానే జట్టును సెమీఫైనల్‌కు చేర్చాడు.

• నిలకడైన బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌ను నడిపించే రహానేలో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే సామర్థ్యం కూడా ఉంది. 2017 ఐపీఎల్ సీజన్‌లో రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్ జట్టుకు రహానే ఒక మ్యాచ్‌లో కెప్టెన్‌గా వ్యవహరించాడు. అనంతరం 2018, 2019 ఐపీఎల్ సీజన్‌లలో 24 మ్యాచ్‌ల్లో రాజస్తాన్ రాయల్స్ జట్టుకు సారథ్యం వహించాడు. జట్టు పగ్గాలపై రహానే మాట్లాడుతూ 'ఐపీఎల్‌లో విజయవంతమైన జట్లలో ఒకటైన కోల్‌కతాకు సారథ్యం వహించడం గౌరవంగా భావిస్తున్నా. ప్రస్తుత జట్టు సమతూకంగా ఉంది. టైటిల్ నిలబెట్టుకునేందుకు సహచరులతో కలిసి శక్తివంచన లేకుండా శ్రమిస్తా' అని అన్నాడు.

• 2010 సీజన్ మినహాయించి రహానే మిగతా 16 ఐపీఎల్ సీజన్‌లలో పాల్గొన్నాడు. ముంబై ఇండియన్స్ (2008, 2009), రాజస్తాన్ రాయల్స్ (2011 నుంచి 2015 వరకు; మళ్లీ 2018, 2019లలో), రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్ (2016, 2017), ఢిల్లీ క్యాపిటల్స్ (2020, 2021), కోల్‌కతా నైట్‌రైడర్స్ (2022లో), చెన్నై సూపర్ కింగ్స్ (2023, 2024లలో) జట్ల తరఫున రహానే బరిలోకి దిగాడు. ఓవరాల్‌గా రహానే 185 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడి 123.42 స్ట్రయిక్‌రేట్‌తో 4642 పరుగులు సాధించాడు. ఇందులో 2 సెంచరీలు, 30 అర్ధ సెంచరీలు ఉన్నాయి. 478 ఫోర్లు, 103 సిక్స్‌లు కొట్టిన రహానే 71 క్యాచ్‌లు పట్టాడు.

• మరోవైపు వెంకటేశ్ అయ్యర్ 2021లో కోల్‌కతా జట్టు తరఫున ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. గత సీజన్ ముగిశాక కోల్‌కతా జట్టు వెంకటేశ్‌ను అట్టిపెట్టికోకుండా విడుదల చేసింది. అయితే మెగా వేలంలో అనూహ్యంగా వెంకటేశ్‌పై రూ. 23 కోట్ల 75 లక్షలు వెచ్చించి మళ్లీ కొనుగోలు చేసింది. ఓవరాల్‌గా ఐపీఎల్‌లో 50 మ్యాచ్‌లు ఆడిన వెంకటేశ్ అయ్యర్ 137.13 స్ట్రయిక్‌రేట్‌తో 1326 పరుగులు చేశాడు. ఇందులో ఒక సెంచరీ, 11 అర్ధ సెంచరీలు ఉన్నాయి.

కొత్తగా ఏంటీ 'త్రీస్టార్' ముచ్చట

'బాలీవుడ్ బాద్‌షా' షారుఖ్ ఖాన్ యాజమాన్యంలోని కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ఫ్రాంచైజీ జట్టు ఐపీఎల్‌లో మూడు టైటిల్స్ సాధించింది. తొలిసారిగా 2012లో విజేతగా ఆవిర్భవించిన కేకేఆర్ రెండేళ్ల (2014) గడిచేసరికి రెండో టైటిల్ నెగ్గింది. గతేడాది (2024) ఫైనల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను ఓడించి మూడోసారి ట్రోఫీ ముచ్చట తీర్చుకుంది. కోల్‌కతా అభిమానులను ఉర్రూతలూగించిన 'కర్బో... లార్బో... జీత్‌బో...' అనే కేకేఆర్ క్యాప్షన్‌ను తాజాగా మూడు విజయాల చిహ్నంగా మూడు స్టార్స్‌తో జత చేసింది. అంటే 2012 కర్బో, 2014 లార్బో, 2024 జీత్‌బోగా మూడు టైటిళ్లకు అన్వయించుకుంది. మూడు నక్షత్రాలతో కూడిన జెర్సీలను ఆవిష్కరించిన కేకేఆర్ యాజమాన్యం కొత్త జెర్సీ వేసుకున్న కొత్త నాయకుడు రహానే ఫొటోలను విడుదల చేసింది. 'మా ఘనమైన వారసత్వం కర్బో (ఆటాడు), లార్బో (పోరాడు), జీత్‌బో (గెలుపొందు)కు తీపి గుర్తులుగా మూడు స్టార్‌లతో మా జెర్సీలు కొత్త శోభను సంతరించుకోనున్నాయి' అని కేకేఆర్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ బిందా డే తెలిపారు.

అరవింద్–ప్రజ్ఞానంద ఐదో రౌండ్ గేమ్ 'డ్రా'



ప్రాగ్: ఇద్దరు భారత యువ గ్రాండ్‌మాస్టర్లు అరవింద్ చిదంబరం, ప్రజ్ఞానంద... ప్రాగ్ మాస్టర్స్ చెస్ ఫెస్టివల్‌లో తమ జోరు కొనసాగిస్తున్నారు. ఐదో రౌండ్‌లో ముఖాముఖిగా తలపడ్డ వీరిద్దరు 59 ఎత్తుల్లో గేమ్‌ను 'డ్రా'గా ముగించారు. 10 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. ఐదు రౌండ్‌లు ముగిశాక తమిళనాడుకు చెందిన అరవింద్, ప్రజ్ఞానంద 3.5 పాయింట్లతో సంయుక్తంగా ఆధిక్యంలో ఉన్నారు. అరవింద్, ప్రజ్ఞానంద రెండు గేముల్లో నెగ్గి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు.

పాక్ ఫుట్‌బాల్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

లాహోర్: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సంఘాల సమాఖ్య (ఫిఫా) నెల రోజుల్లోపే పాకిస్తాన్ ఫుట్‌బాల్ సమాఖ్య (పీఎఫ్ఎఫ్)కు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. పీఎఫ్ఎఫ్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. 'ఫిఫా' నియమావళికి అనుగుణంగా పాక్ సమాఖ్యను సంస్కరించాల్సిందేనని హెచ్చరిస్తూ గత నెల 5న పీఎఫ్ఎఫ్‌పై 'ఫిఫా' వేటు వేసింది. 2019 నుంచి పాక్ సమాఖ్యను 'ఫిఫా' నియమించిన అడ్‌హక్ కమిటీనే పాలిస్తోంది. అయితే ఆ దేశంలోని మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల ఇన్నేళ్లయినా 'ఫిఫా' నియమావళికి అనుగుణమైన సవరణలు మాత్రం చేయలేకపోయింది. దీనివల్లే 'ఫిఫా' నిషేధానికి గురైంది. గతవారం ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్‌కు చెందిన సీనియర్ అధికారి ఒకరు లాహోర్‌కు విచ్చేసి సవరణలు సూచించారు. పీఎఫ్ఎఫ్ కమిటీ ఆ సవరణలను ఆమోదించడంతో సస్పెన్షన్‌ను ఎత్తివేసేందుకు మార్గం సుగమమైంది. తాజా ఊరట వల్ల ఇప్పుడు పాకిస్తాన్ జట్టు ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో పాల్గొనేందుకు అర్హత సంపాదించింది.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో రిత్విక్ చౌదరీ, యూకీ బాంబ్రీ



న్యూఢిల్లీ: అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ ప్లేయర్, భారత డేవిస్‌కప్ జట్టు సభ్యుడు బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో 24 ఏళ్ల రిత్విక్ తొమ్మిది స్థానాలు ఎగబాకి 65వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. సాంటియాగోలో జరిగిన చిలీ ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో కొలంబియాకు చెందిన నికోలస్ బరియెంతోస్‌తో కలిసి ఆడిన రిత్విక్ డబుల్స్ టైటిల్ గెలిచాడు. దాంతో అతని ర్యాంక్ మెరుగైంది. మరోవైపు భారత్‌కే చెందిన యూకీ బాంబ్రీ కూడా తన కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. అలెక్సీ పాపిరిన్ (ఆస్ట్రేలియా)తో కలిసి దుబాయ్ ఓపెన్ ఏటీపీ–500 టోర్నీలో యూకీ డబుల్స్ టైటిల్ గెలిచాడు. ఫలితంగా తాజా ర్యాంకింగ్స్‌లో యూకీ ఐదు స్థానాలు పురోగతి సాధించి 39వ ర్యాంక్‌లో నిలిచాడు. భారత దిగ్గజం రోహన్ బోపన్న ఒక స్థానం మెరుగుపర్చుకొని 21వ ర్యాంక్‌లో ఉన్నాడు. మెక్సికోలో జరిగిన అకాపుల్కో ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో సెమీఫైనల్ చేరుకున్న భారత ప్లేయర్ శ్రీరామ్ బాలాజీ మరోసారి కెరీర్ బెస్ట్ 61వ స్థానానికి చేరుకున్నాడు. భారత ఇతర ప్లేయర్లు అర్జున్ ఖడే 87వ స్థానంలో, జీవన్ నెడుంజెళియన్ 93వ స్థానంలో ఉన్నారు. బెంగళూరు ఓపెన్ ఏటీపీ–125 చాలెంజర్ టోర్నీలో డబుల్స్ టైటిల్ సాధించిన హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్ చంద్రశేఖర్ ఏకంగా 30 స్థానాలు మెరుగుపర్చుకొని 109వ ర్యాంక్‌లో నిలిచాడు. రామ్‌కుమార్ రామనాథన్ 19 స్థానాలు ఎగబాకి 167వ ర్యాంక్‌లో, సాకేత్ మైనేని 24 స్థానాలు పురోగతి సాధించి 220వ ర్యాంక్‌లో నిలిచారు.



'లారియస్' అవార్డు రేసులో రిషబ్ పంత్

• 'కమ్‌బ్యాక్ ఆఫ్ ద ఇయర్' విభాగంలో నామినేట్
• వచ్చే నెల 21న మాడ్రిడ్‌లో అవార్డుల ప్రదానోత్సవం



న్యూఢిల్లీ: భారత వికెట్ కీపర్, డాషింగ్ బ్యాటర్ రిషభ్ పంత్ ప్రతిష్టాత్మక 'లారియస్ వరల్డ్ స్పోర్ట్స్' అవార్డుకు నామినేట్ అయ్యాడు. 'స్పోర్ట్స్ ఆస్కార్'గా ప్రఖ్యాతిగాంచిన ఈ అవార్డులను యేటా విశేష ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు పలు కేటగిరీల వారీగా ఎంపిక చేసి అందజేస్తారు. గతేడాదికి సంబంధించిన అవార్డులకు గాను పంత్ 'లారియస్ వరల్డ్ కమ్‌బ్యాక్ ఆఫ్ ద ఇయర్' అవార్డు రేసులో నిలిచాడు. ఈ 'పునరాగమనం' కేటగిరీలో ముగ్గురు మహిళలు సహా మొత్తం ఆరుగురు పోటీలో ఉన్నారు. స్పెయిన్ మోటార్ సైక్లిస్ట్ మార్క్ మార్క్వెజ్, అమెరికా స్విమ్మర్ సెలెబ్ డ్రెస్సెల్‌తో పాటు మహిళా క్రీడాకారిణులు రెబెకా అండ్రాడె (జిమ్నాస్టిక్స్; బ్రెజిల్), లారా గట్–బెహ్రామి (ఆల్పైన్ స్కీయింగ్; స్విట్జర్లాండ్), అరియర్న్ టిట్‌మస్ (స్విమ్మింగ్; ఆస్ట్రేలియా)లతో అవార్డు కోసం భారత్ స్టార్ క్రికెటర్ పోటీపడుతున్నాడు. 'లారియస్–2025' పురస్కారాల వేడుక స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో ఏప్రిల్ 21న అట్టహాసంగా జరగనుంది.

ఘనమైన పునరాగమనం ఇది...

అప్పటికే ఇంటాబయటా మూడు ఫార్మాట్లలోనూ రాణిస్తుండటంతో టీమిండియా 'ఎ' గ్రేడ్ కాంట్రాక్టు పొందిన రిషభ్ పంత్ 2022 డిసెంబర్ 30వ తేదీన ఘోరమైన రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాల మీదికి తెచ్చుకున్నాడు. ఢిల్లీ నుంచి సొంతూరు రూర్కేకు స్వయంగా కారు డ్రైవింగ్ చేసుకుంటూ వెళ్తున్న అతని కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడిన అతన్ని డెహ్రాడూన్‌లోని హాస్పిటల్‌లో చేర్పించి చికిత్స అందజేశారు. వెన్నెముకతో పాటు కుడి కాలు, తొడ ఎముకలు విరగడంతో శస్త్రచికిత్సలు చేయాల్సిన అవసరం వచ్చింది. దీంతో వెంటనే డెహ్రాడూన్ నుంచి ముంబైకి ఎయిర్‌లిఫ్ట్ (అంబులెన్స్ విమానం) చేశారు. అక్కడ విజయవంతమైన సర్జరీలతో మనిషి అయితే కోలుకున్నాడు. కానీ మునుపటి ఫిట్‌నెస్ సందిగ్ధతల నడుమ ఇక బరిలోకి దిగడం కష్టమే అనుకున్న తరుణంలో పంత్ అకుంఠిత పట్టుదలతో ప్రాణమైన క్రికెట్‌లో పునరాగమనం చేసేందుకు తీవ్రంగా శ్రమించాడు. మొదట అతని వైద్యబృందం తర్వాత జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లోని వైద్య బృందం ఆధ్వర్యంలో కోలుకున్న రిషభ్ పంత్ క్రమంగా క్రికెట్ ఆడే పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. గతేడాది ఐపీఎల్ సహా టెస్టు, వన్డే, టి20 ఫార్మాట్లలో తన పూర్వపు ఫామ్‌ను అందిపుచ్చుకోవడంతో అతని అంకితభావాన్ని గుర్తించిన 'లారియస్ వరల్డ్ స్పోర్ట్స్ అవార్డు'ల కమిటీ అతన్ని నామినేట్ చేసింది. 2022లో భారత్ నుంచి జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా 'లారియస్ బ్రేక్‌త్రూ ఆఫ్ ద ఇయర్' విభాగానికి నామినేట్ అయినా అవార్డు దక్కించుకోలేకపోయాడు.



మెస్సీ సారథ్యంలో...

'ఫిఫా' వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లకు అర్జెంటీనా ప్రాబబుల్స్ ఎంపిక

బ్యూనస్‌ఎయిర్స్: దక్షిణ అమెరికా జోన్ ప్రపంచ కప్ ఫుట్‌బాల్ క్వాలిఫయింగ్ టోర్నమెంట్‌లో 13వ రౌండ్ మ్యాచ్‌ల కోసం 33 మంది ఆటగాళ్లతో అర్జెంటీనా ప్రాథమిక జాబితాను ప్రకటించింది. స్టార్ ప్లేయర్ లయనెల్ మెస్సీ సారథ్యంలో అర్జెంటీనా బరిలోకి దిగుతుంది. ఈనెల 21న మాంటెవీడియోలో ఉరుగ్వే జట్టుతో... ఈనెల 25న బ్యూనస్ ఎయిర్స్‌లో బ్రెజిల్ జట్టుతో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా తలపడుతుంది. 2026 ప్రపంచకప్ టోర్నీకి కెనడా, మెక్సికో, అమెరికా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. 2026 జూన్ 11 నుంచి జూలై 19 వరకు జరిగే ఈ మెగా టోర్నీలో తొలిసారి 48 జట్లు పోటీ పడుతున్నాయి. దక్షిణ అమెరికా జోన్‌లో 10 దేశాలు క్వాలిఫయింగ్‌లో బరిలో ఉన్నాయి. ఇప్పటికే 12 రౌండ్‌లు ముగిశాయి. నిర్ణీత 18 రౌండ్‌ల తర్వాత టాప్–6లో నిలిచిన జట్లు నేరుగా ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తాయి. ప్రస్తుతం అర్జెంటీనా, ఉరుగ్వే, ఈక్వెడార్, కొలంబియా, బ్రెజిల్, పరాగ్వే జట్లు టాప్–6లో ఉన్నాయి. ఏడో స్థానంలో నిలిచిన జట్టు 'ప్లే ఆఫ్' మ్యాచ్ ఆడుతుంది. ఖతర్ ఆతిథ్యమిచ్చిన 2022 ప్రపంచ కప్‌లో మెస్సీ కెప్టెన్సీలో అర్జెంటీనా జట్టు 1986 తర్వాత మళ్లీ జగజ్జేతగా నిలిచింది.

ముంబై దిగ్గజం పద్మాకర్ శివాల్కర్ కన్నుమూత

దేశవాళీ అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకడిగా గుర్తింపు





ముంబై: భారత క్రికెట్‌లో అత్యుత్తమ స్పిన్నర్లలో ఒకడిగా గుర్తింపు తెచ్చుకున్న పద్మాకర్ శివాల్కర్ (84) సోమవారం కన్నుమూశారు. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన రికార్డు ఉన్నా... దురదృష్టవశాత్తూ భారత జట్టు తరఫున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయిన ఆటగాళ్ల జాబితాలో పద్మాకర్ పేరు ముందుంటుంది. పద్మాకర్‌తో పాటు రంజీ ట్రోఫీలో అత్యధిక వికెట్లు పడగొట్టిన రాజీందర్ గోయల్‌కు కూడా ఎప్పుడూ భారత్‌కు ఆడే అవకాశం రాలేదు. దిగ్గజ బౌలర్ బిషన్‌సింగ్ బేడి కెరీర్ ఆ సమయంలో ఉధృతంగా సాగుతుండగా... బేడీని కాదని మరో లెఫ్టార్మ్ స్పిన్నర్‌ను ఎంపిక చేసే అవకాశమే లేకపోయింది.

1961 నుంచి 1987 మధ్య 26 ఏళ్ల పాటు పద్మాకర్ ఫస్ట్ క్లాస్ కెరీర్ సాగింది. 124 మ్యాచ్‌లు ఆడిన ఈ లెఫ్టార్మ్ స్పిన్నర్ కేవలం 19.69 సగటుతో 589 వికెట్లు పడగొట్టారు. 42 సార్లు ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన కనబర్చిన పద్మాకర్‌కు 13 సార్లు మ్యాచ్‌లో 10 వికెట్లు పడగొట్టిన రికార్డు ఉంది. ఇందులో ముంబై తరఫునే రంజీ ట్రోఫీలో 361 వికెట్లు వచ్చాయి. ఇప్పటికీ ఈ ముంబై రికార్డు చెరిగిపోలేదు. 1965–1976 మధ్య 11 సీజన్ల పాటు వరుసగా పద్మాకర్ ముంబై జట్టులో భాగం కాగా... 10 సార్లు టీమ్ టైటిల్ గెలుచుకుంది. 1980–81 సీజన్‌లో మరోసారి టైటిల్ విజయంపై భాగమైన తర్వాత పద్మాకర్ కొంత కాలం ఆటకు దూరమయ్యారు. ఆపై ఏడేళ్ల విరామం తర్వాత 1987–88 సీజన్‌లో పద్మాకర్ 47 ఏళ్ల వయసులో మళ్లీ ముంబై తరఫున బరిలోకి దిగి మరో రెండు మ్యాచ్‌లు ఆడటం విశేషం. చెన్నైలో జరిగిన 1972–73 సీజన్ ఫైనల్ మ్యాచ్‌లలో రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 34 పరుగులకే 13 వికెట్లు పడగొట్టి జట్టును విజేతగా నిలపడం ఆయన కెరీర్‌లో చిరస్మరణీయ ప్రదర్శన. 2017లో బీసీసీఐ పద్మాకర్‌ను సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించింది. పద్మాకర్‌ను జట్టులోకి తీసుకునే విధంగా సెలక్టర్లను ఒప్పించలేకపోవడం తన కెప్టెన్సీ కెరీర్‌లో అమితంగా బాధించిన క్షణం అని సునీల్ గావస్కర్ సంతాపం వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌కు రెండో గెలుపు

పంచ్‌కులా (హరియాణా): జాతీయ సీనియర్ మహిళల చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. 'సి' డివిజన్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ 4–2 గోల్స్ తేడాతో జమ్మూ కశ్మీర్ జట్టుపై గెలుపొందింది. ఆంధ్రప్రదేశ్ తరఫున థలారి రేవతి (3వ, 17వ నిమిషంలో) రెండు గోల్స్ చేయగా... లోమాడ హారతి (36వ నిమిషంలో), మాదుగుల భవాని (45వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. జమ్మూ కశ్మీర్ జట్టు తరఫున రజని (10వ నిమిషంలో), అంజూ కుమారి (57వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. శనివారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో అరుణాచల్ ప్రదేశ్ జట్టుపై ఆంధ్రప్రదేశ్ 9–0 గోల్స్ తేడాతో గెలిచిన సంగతి తెలిసిందే. సోమవారం జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో అస్సాం 2–1 గోల్స్ తేడాతో బిహార్‌పై, పుదుచ్చేరి 6–1 గోల్స్ తేడాతో అరుణాచల్ ప్రదేశ్ జట్టుపై గెలుపొందాయి.

మెయిన్ 'డ్రా'కు విజయం దూరంలో హుమేరా



గుర్‌గ్రామ్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ క్రీడాకారిణి హుమేరా బహార్మస్ మెయిన్ 'డ్రా'కు అడుగు దూరంలో ఉంది. గుర్‌గ్రామ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో హుమేరా మహిళల క్వాలిఫయింగ్ సింగిల్స్‌లో ఫైనల్ రౌండ్‌కు చేరుకుంది. సోమవారం జరిగిన క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో హుమేరా 5–7, 6–3, 11–9తో మరియా కల్యాకినా (రష్యా)పై శ్రమించి గెలిచింది. నేడు జరిగే ఫైనల్ రౌండ్ మ్యాచ్‌లో రెండో సీడ్ అనస్తాసియా గురెవా (రష్యా)పై హుమేరా గెలిస్తే మెయిన్ 'డ్రా'కు అర్హత సాధిస్తుంది. భారత్‌కే చెందిన ప్రత్యూష రాచపూడి, యశస్విని పన్వర్, శ్రుతి అహ్లావత్, పూజా ఇంగాలె, ఆకాంక్ష కూడా క్వాలిఫయింగ్ ఫైనల్ రౌండ్‌కు చేరుకున్నారు.

నన్ను మార్చడం ఈజీ కాదు

తన రాజీనామా డిమాండ్లపై జెలెన్‌స్కీ

- ఎన్నికలొచ్చినా తనదే గెలుపని వ్యాఖ్య
- ఖనిజాల ఒప్పందానికి సిద్ధమని వెల్లడి
- మాకు అమెరికా సాయం కొనసాగాలి
- లేదంటే పుతిన్‌కే లాభమన్న అధ్యక్షుడు

లండన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వాగ్యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్ష పదవికి తాను రాజీనామా చేయాలన్న వైట్‌హౌస్ అధికారులు, రిపబ్లికన్ సెనేటర్ల వ్యాఖ్యలపై జెలెన్‌స్కీ మండిపడ్డారు. అమెరికాతో ఉక్రెయిన్ మళ్లీ చర్చలు జరపాలంటే జెలెన్‌స్కీ వైదొలగాలని, కొత్త అధ్యక్షుడు చర్చలకు రావాలని సెనేటర్ లిండ్సే గ్రాహం, హౌస్ స్పీకర్ మైక్‌జాన్సన్ సూచించారు. వీటిపై జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం లండన్‌లో యూరప్ దేశాల నాయకులతో కీలక శిఖరాగ్ర సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ''ఉక్రెయిన్ నాయకున్ని నిర్ణయించుకునే హక్కు ఉక్రేనియన్లకు మాత్రమే ఉంది. మా దేశంలో నాయకత్వం స్థానం కావాలంటే గ్రాహం కూడా ఉక్రెయిన్ పౌరసత్వం తీసుకోవచ్చు. ఆయనకు నేను పౌరసత్వం ఇవ్వగలను. అప్పుడాయన మా దేశ పౌరుడు అవుతాడు. ఆయన వ్యాఖ్యలకు విలువా ఉంటుంది. అతడు ఉక్రెయిన్ పౌరునిగా చెప్పేది వింటాను''అంటూ సూటి వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్‌కు నాటో సభ్యత్వం ఇవ్వడానికి అంగీకరిస్తే అధ్యక్ష పదవి వీడేందుకు సిద్ధమని పునరుద్ఘాటించారు. అదే సమయంలో తనను మార్చడం అంత సులభం కాదని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. తాను గెలవకుండా ఉండాలంటే ఎన్నికల్లో పాల్గొనకుండా తనను అడ్డుకోవడమే మార్గమని ధీమా వ్యక్తం చేశారు.

ఒప్పందానికి ఉక్రెయిన్ సిద్ధమే

అమెరికాతో ఖనిజాల ఒప్పందం కుదుర్చుకోవడానికి ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. వాళ్లు సరే నంటే ఇప్పటికిప్పుడు ఒప్పందంపై సంతకాలు చేస్తానన్నారు. ''గతంలో జరిగిన వాటిని కొనసాగించాలన్నది మా విధానం. మేం నిర్మాణాత్మకంగా ఉన్నాం. అదే సమయంలో కొన్ని విషయాలను విశ్లేషించాల్సిందే. ఉక్రెయిన్ వైఖరి వినాలి. అది మాకు చాలా ముఖ్యం. అమెరికాతో మా సంబంధాలు కొనసాగుతాయని అనుకుంటున్నా. ఉక్రెయిన్ ప్రపంచంలో అతి పెద్ద దేశం కాకపోవచ్చు. కానీ తన స్వాతంత్ర్యం కోసం అది చేస్తున్న పోరాటాన్ని అంతా చూస్తున్నారు. అమెరికా నుంచి ఏ అనుమానాలకూ తావు లేకుండా సాయం కొనసాగుతుందని ఆశిస్తున్నా. ఎందుకంటే మాకు సాయం నిలిపివేత అంతిమంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు మాత్రమే ఉపయోగపడుతుంది. అమెరికా, ఇతర ప్రపంచ ప్రతినిధులు పుతిన్‌కు అలాంటి సాయం చేయరని అనుకుంటున్నా''అని చెప్పారు.


రంజాన్ వేళ గాజా సిటీలోని తల్ అల్ హవా జిల్లాలోని అల్ దహదున్ ప్రాంతంలో శిథిలాల మధ్యే ఆదివారం ఇఫ్తార్ విందులో పాల్గొన్న పాలస్తీనియన్లు

శిథిలాల మధ్యే ఇఫ్తార్

ఖాన్ యూనిస్: ఏడాదికి పైగా సాగుతున్న యుద్ధం నేపథ్యంలో ఎటు చూసినా శిథిలాల నడుమే గాజావాసులకు రంజాన్ పవిత్ర మాసం మొదలైంది. చాలామంది ఆత్మీయులను కోల్పోయారు. ఇళ్లు లేవు. సరైన తిండి లేదు. బతుకుపై భరోసాయే లేదు. అయినా వారిలో ఆశ మాత్రం ఉంది. సగం కూలిన ఇళ్లలో, తాత్కాలిక గుడారాల్లోనే రంజాన్ ఉపవాసాలు పాటిస్తున్నారు. ఎన్నటికీ తిరిగిరాని తమ ఆత్మీయులను పదేపదే తలచుకుంటూ ఇఫ్తార్ టేబుళ్ల వద్ద కన్నీటి పర్యంతమవుతున్నారు. కూలగా మిగిలిన ఇళ్లకే దీపకాంతుల తోరణాలు కట్టి కోల్పోయిన వెలుగులను తిరిగి తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. గాజాలో చరిత్రాత్మక ప్రార్థనా స్థలం గ్రేట్ ఒమారీ మసీదు శిథిలావస్థకు చేరింది. దాంతో మతపరమైన ప్రార్థనలకు కేంద్ర స్థలమంటూ కూడా లేకుండా పోయింది. చాలాచోట్ల ప్రార్థనా స్థలాలన్నీ విధ్వంసమయ్యాయి. అయినా కూలిన భవనాలు, శిథిలాల మధ్యే పాలస్తీనావాసులు ఎన్నో ఆశలతో జీవితాన్ని సెలబ్రేట్ చేసుకుంటున్నారు. పండుగ అంటే ప్రార్థనలు. రంజాన్ షాపింగ్. బంధువులతో వేడుక. ఈసారి అవన్నీ లేకపోయినా గతేడాదితో పోలిస్తే కాస్త మెరుగ్గా ఉందని గాజావాసులు అంటున్నారు!

గాజావాసుల దైన్యం

''తరువాత ఏం జరుగుతుందోనన్న భయం ఇంకా ఉంది. అయినా గతేడాది కంటే ఈసారి మెరుగే'' అని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో దుకాణాలు, వీధి వ్యాపారులు అడపాదడపా కనిపిస్తున్నా ఎవరిని చూసినా ఆర్థిక ఇబ్బందులే! నుసిరాత్‌లో హైపర్ మాల్ వంటి సూపర్ మార్కెట్లు తిరిగి తెరుచుకున్నాయి. కానీ దీర్ఘకాలంగా జీవనోపాధే కోల్పోయిన వారిలో కనీసం నిత్యావసర వస్తువులు కూడా కొనే సామర్థ్యం కూడా కన్పించడం లేదు!

రంజాన్ ఏకం చేస్తోంది

ధైర్యంగా మళ్లీ పాలస్తీనా గడ్డపై కాలు పెట్టగలిగినందుకే గర్వపడుతున్నామని గాజావాసులు చెబుతున్నారు. ప్రపంచంలోని అందరు పిల్లల్లాగే తమ చిన్నారులూ సగర్వంగా, ఆనందంగా జీవించాలని ఆశిస్తున్నారు. ''ఈ రంజాన్ మాసం మా అందరినీ ఏకం చేసింది. ఇంతటి యుద్ధం మధ్య కూడా మాకు ఆనందాన్ని, ఆశను అందిస్తోంది. దాడుల్లేకుండా సురక్షితంగా జీవించడమే మా ఏకైక ఆకాంక్ష''అని ఖాన్ యూనిస్‌కు చెందిన అబూ ముస్తఫా చెప్పుకొచ్చాడు.

కువైట్ సాయం...

దక్షిణ గాజా నగరం రఫాలో రంజాన్ ఉపవాసాలుంటున్న 5,000 మంది పాలస్తీనియన్లకు కువైట్ ఇఫ్తార్ భోజనాలు అందించింది. సూర్యాస్తమయం ప్రార్థన పిలుపుతో వారంతా మైళ్ల పొడవున శిథిలాల మధ్య ఏర్పాటు చేసిన బల్ల వద్ద గుమిగూడి అన్నం, చికెన్‌తో ఉపవాస దీక్షను విరమిస్తున్నారు. యుద్ధానికి ముందు ఆ వీధి రంజాన్ రోజుల్లో ఎంతగా కళకళలాడుతూ ఉండేదో ఇఫ్తార్ ఏర్పాట్లకు సహకరిస్తున్న మలక్ ఫదా భారంగా గుర్తు చేసుకున్నారు. ''నాటి రోజులే నాకిప్పటికీ స్ఫూర్తి! ఈ వీధికి యుద్ధానికి ముందు మాదిరిగా మళ్లీ జీవం పోయడమే నా లక్ష్యం''అన్నారామె. ఇటు వ్యక్తిగతంగా, అటు సామూహిక నష్టాల నుంచి, యుద్ధం చేసిన గాయాల నుంచి కోలుకునేందుకు పాలస్తీనియన్లు ప్రయత్నిస్తున్నారు. ఏదేమైనా గాజాను వీడేదే లేదని రఫావాసి మహ్మద్ అరాబ్ అబూ ఒడే కుండబద్దలు కొట్టాడు. ఏం జరిగినా తామంతా ఐక్యంగా ఉన్నామని, ఉంటామని, తమ దేశాన్ని విడిచి వెళ్లబోమని స్పష్టం చేశాడు.

ప్రపంచంలోనే అత్యంత చిన్న పార్క్





పక్క ఫొటోలో ఉన్న అమ్మాయి రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై ఒక రాయి మీద కూర్చుందని పొరపాటు పడకండి. ఆమె కూర్చుంది చెక్క బెంచీపై. అది కూడా ఒక పార్క్‌లో ఉన్న బెంచీపై. అక్కడ పార్క్ ఏదీ లేదే? అని ఫొటో మొత్తం వెతక్కండి. ఎందుకంటే ఆమె కూర్చున్నది పార్క్‌లోనే. ఆ కాస్త గడ్డే.. ఆ పార్క్‌కు పచ్చికబయళ్లు. ప్రపంచంలోనే అత్యంత చిన్న పార్క్‌గా మంగళవారం నూతన గిన్నిస్ ప్రపంచ రికార్డ్ సృష్టించిన పార్క్ ఇది. కూర్చున్న మహిళ గిన్నిస్ పుస్తక నిర్వాహకుల తరఫు అధికార ప్రతినిధి. జపాన్ రాజధాని టోక్యోకు 109 కిలోమీటర్ల దూరంలోని నగాయ్‌జుమీ పట్టణ టౌన్‌హాల్ సమీప రోడ్డు పక్కనే ఉందీ పార్క్. పార్క్ మొత్తం విస్తీర్ణం కేవలం 2.6 చదరపు అడుగులు. పార్క్‌లో కూర్చోడానికి ఒక బుల్లి చెక్క బెంచీ, ఆహ్లాదం కోసం సిద్ధంచేసిన ఒక శిలాకృతి, చెక్క ముక్క చుట్టూ విస్తరించిన కాసింత గడ్డి ఈ పార్క్ ప్రత్యేకతలు. గతంలో అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రంలోని పోర్ట్‌ల్యాండ్ సిటీలో చిన్నపాటి మిల్‌ఎండ్స్ పార్క్‌కు 'అతి చిన్న పార్క్'సర్టిఫికేట్ ఉండేది. దీనిని ఇప్పుడు నగాయ్‌జుమీ పార్క్ సొంతం చేసుకుంది. పార్క్ వివరాలను దానిని సృష్టించిన నగాయ్‌జుమీ టౌన్ నిర్మాణ విభాగ సారథి షూజీ కొయామా వెల్లడించారు. ''మేం అమెరికా వెళ్లినప్పుడు మిల్‌ఎండ్స్ పార్క్ గురించి తెల్సింది. అంతకంటే చిన్న పార్క్‌ను నిర్మించాలని ఆనాడే నిర్ణయించుకున్నాం. అమెరికాలో ఆ చిన్న పార్క్‌ను 3.13 అడుగుల విస్తీర్ణంలో 1976 సంవత్సరంలో నిర్మిస్తే మేం 1988లోనే అంతకంటే చిన్నగా కేవలం 2.6 అడుగుల విస్తీర్ణంలో నిర్మించాం. కానీ ఇన్నేళ్లయినా ఏనాడు ప్రపంచ రికార్డ్ కోసం దరఖాస్తు చేసుకోలేదు''అని కొయామా అన్నారు. ఈ పార్క్ జపాన్‌లోని షిజౌకా అనే జిల్లాలో ఉంది. ఇన్నేళ్లయినా అధికారిక గుర్తింపు రాకపోవడంతో షిజౌకా అధికారులు సర్వేయర్‌ను పిలిపించి కొలతలు వేసి గిన్నిస్ ప్రపంచ రికార్డ్ అధికారులకు సమాచారమిచ్చారు. దీంతో ఇటీవల వాళ్లు రావడం, కొలచి ఇదే 'అతి చిన్నపార్క్'అని తేల్చి మంగళవారం అధికారిక గుర్తింపు పత్రం ఇవ్వడం చకచకా జరిగిపోయాయి. ఏ3 సైజ్ పేపర్లు రెండు ఎంత ఉంటాయో అంతే చిన్నగా ఉన్న పార్క్‌ను చూసి గిన్నిస్ అధికారులు సైతం అవాక్కయ్యారట.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఒడిశాలో దారుణం

అనారోగ్యం బారిన పడ్డ నెలవయసు చిన్నారికి 40 చోట్ల వాతలు

- వాతలు పెడితే కోలుకుంటాడన్న మూఢవిశ్వాసంలో కుటుంబసభ్యులు
- ఎట్టకేలకు ఆస్పత్రిలో చేర్పించడంతో తప్పిన ప్రాణాపాయం

భువనేశ్వర్: ప్రపంచం ఇరవై ఒకటో శతాబ్దంలో ఓవైపు కృత్రిమ మేథతో దూసుకుపోతుంటే మరోవైపు కొందరు ఇంకా మూఢాంధకారంలో మగ్గిపోతున్నారు. తమ మూఢ విశ్వాసాలకు కుటుంబసభ్యులనూ బలిచేస్తున్నారు. ఒడిశాలో ఇలాంటి ఘటన తాజాగా వెలుగుచూసింది. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న నెల వయసు పసికందుకు నిర్దాక్షిణ్యంగా వాతలు పెట్టారు. దాదాపు 40 చోట్ల వాతలతో నరకయాతన పడుతున్న చిన్నారిని ఎట్టకేలకు ఆస్పత్రిలో చేర్పించడతో బతికి ప్రాణాలతో బయటపడ్డాడు. నబారంగ్‌పూర్ జిల్లాలోని చందహండీ బ్లాక్ గంభారీగూడ పంచాయతీ పరిధిలోని ఫూన్‌దేల్‌పాడా గ్రామంలో ఈ దారుణోదంతం జరిగింది. ప్రస్తుతం చిన్నారిని ఉమెర్‌కోట్ సబ్-డివిజనల్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నామని నబారంగ్‌పూర్ చీఫ్ డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంతోష్ కుమార్ సోమవారం చెప్పారు.

తలపై, పొట్టపై వాతలు

నెలరోజుల క్రితం జన్మించిన ఈ బాబు గత పదిరోజులుగా తీవ్రజ్వరంతో బాధపడుతున్నాడు. ఒళ్లు వేడెక్కి కాలిపోతుండటంతో గుక్కబెట్టి ఏడుస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో పిల్లాడిని వెంటనే ఆస్పత్రిలో చేర్పించాల్సిన కుటుంబసభ్యులకు మూఢవిశ్వాసాలపై గురి ఎక్కువ. ఈ గ్రామీణ ప్రాంతంలో పిల్లలకు ఆరోగ్యం బాగోలేకపోతే చెడుగాలి సోకిందని, దుష్టశక్తిని పారద్రోలేందుకు ఉపాయంగా ఇనుప కడ్డీతో ఒంటిపై వాతలు పెడతారు. ఇదే అంధవిశ్వాసంతో కుటుంబసభ్యులు ఈ పిల్లాడికి తలపై, పొట్టపై దాదాపు 40 చోట్ల కాల్చిన ఇనుపకడ్డీతో వాతలు పెట్టారు. కాలిన గాయాలతో పిల్లాడి ఆరోగ్య పరిస్థితి మరింత విషమించింది. దీంతో చేసేదేమీలేక చివరకు పిల్లాడిని ఉమెర్‌కోట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం పిల్లాడి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు చెప్పారు. విషయం తెల్సుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చందహండీ బ్లాక్ పరిధిలో ప్రజల్లో మూఢవిశ్వాసాలను పోగొట్టి వారిలో సామాజిక చైతన్యం తీసుకొచ్చేందుకు నడుం బిగించారు. వాతలు పెట్టే పురాతన పద్ధతులను విడనాడాలని అవగాహన కార్యక్రమాలు మొదలెట్టారు.



జపాన్‌లో కార్చిచ్చు కల్లోలం

టోక్యో: గత మూడు దశాబ్దాల్లో కనీవినీ ఎరగనంతటి తీవ్ర కార్చిచ్చు జపాన్‌ను అతలాకుతలం చేస్తోంది. ఉత్తరాది నగరమైన ఒఫునాటో పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో గురువారం చెలరేగిన మంటలు నానాటికీ పెరిగిపోతున్నాయి. వందలాది గృహాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఇప్పటికే 5,200 ఎకరాలకు పైగా ప్రాంతం భస్మీపటలమైందని ఫైర్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ (ఎఫ్‌డీఎంఏ) పేర్కొంది. కనీసం ఇద్దరు మంటల కారణంగా మృత్యువాత పడ్డట్టు తెలిపింది. మరికొద్ది రోజుల పాటు మంటలు విస్తరిస్తాయని హెచ్చరించింది. వాటిని అదుపులోకి తెచ్చేందుకు ఏకంగా 2,000 మందికి పైగా సిబ్బంది అహోరాత్రాలు శ్రమిస్తున్నారు. రాజధాని టోక్యో తదితర ప్రాంతాల నుంచి అదనపు సిబ్బందిని హుటాహుటిన తరలిస్తున్నారు. హెలికాప్టర్లను కూడా రంగంలోకి దించారు. ప్రభావిత ప్రాంతాల నుంచి ఇప్పటికే 4,600 మంది సురక్షిత ప్రాంతాలకు తరలారు. వారిలో 2,000 మందికి పైగా సుదూరాల్లోని బంధుమిత్రుల చెంతకు చేరగా మిగతా వారు ప్రభుత్వ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ప్రాణ, ఆస్తి, పర్యావరణ నష్టాలను వీలైనంతగా తగ్గించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నట్టు ప్రధాని షిగెరు ఇషిబా పార్లమెంటుకు తెలిపారు. ఒఫునాటో ప్రాంతానికి జనవరి నుంచి మార్చి సాధారణంగా అత్యంత డ్రై సీజన్. కానీ ఫిబ్రవరిలో అక్కడి సగటు వర్షపాతం 41 మి.మీ. కాగా గత నెలలో మాత్రం 20 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా కేవలం 2.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. 2024 జపాన్ చరిత్రలోనే అత్యంత వేడిమి ఏడాదిగా నిలిచింది.

ఇజ్రాయెల్‌లోకి చొరబడుతూ కేరళవాసి మృతి

జోర్డాన్: ఇజ్రాయెల్‌లోకి అక్రమంగా చొరబడేందుకు ప్రయత్నించిన ఓ భారతీయుడిని జోర్డాన్ సైనికులు కాల్చి చంపారు. అతన్ని కేరళలోని తుంబాకు చెందిన థామస్ గాబ్రియేల్ పెరీరాగా గుర్తించారు. ఈ ఘటన ఫిబ్రవరి 10న జరిగింది. ''ఓ భారతీయుడు దురదృష్టవశాత్తూ మృతి చెందాడు. అతని కుటుంబసభ్యులతో సంప్రదింపులు జరుపుతున్నాం. మృతదేహాన్ని తరలించేందుకు జోర్డాన్ అధికారులతో కలిసి పని చేస్తున్నాం''అని జోర్డాన్‌లోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ''విజిటర్ వీసాపై జోర్డాన్ చేరిన పెరీరా (47), అతని బంధువు ఎడిసన్ ఛార్లెస్, మరో ఇద్దరు ఇజ్రాయెల్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. వారిపై జోర్డాన్ సైనికులు కాల్పులు జరిపారు. తలలో తూటా తగలడంతో పెరీరా మృతి చెందాడు. రాళ్లమాటున దాచుకున్న మిగతావారు గాయాలపాలయ్యారు. చికిత్స అనంతరం వారిని భారత్‌కు తరలించారు''అని వివరించింది. చనిపోవడానికి రెండు రోజుల ముందే పెరీరా ఫోన్ చేసినట్టు అతని భార్య తెలిపింది. ''కేవలం రెండే నిమిషాలు మాట్లాడాడు. తనకోసం ప్రార్థించమని చెప్పాడు. ఇంటి నుంచి వెళ్లేటప్పుడు కూడా ఎక్కడికి, ఎందుకనేది చెప్పలేదు. జోర్డాన్ చేరాకే ఫోన్ చేసి చెప్పాడు''అని వాపోయింది. పెరీరా గతంలో ఐదేళ్లు కువైట్‌లో పని చేసినట్టు సమాచారం.

లక్షల మంది చిన్నారుల ప్రాణదాత అస్తమయం


మనువడితో జేమ్స్ హారిసన్

అరుదైన యాంటీ-డి యాంటీబాడీని దానం చేసిన జేమ్స్ హారిసన్ ● వందలసార్లు ఈయన ఇచ్చిన రక్తంతో నిలిచిన పాతిక లక్షల ప్రాణాలు

కారణజన్ములు అత్యంత అరుదుగా పుడతారని ప్రపంచవ్యాప్తంగా విశ్వసిస్తారు. ఆ విశ్వాసాన్ని నిజంచేస్తూ లక్షలాది మంది పసిపాపల ప్రాణాలను నిలబెట్టిన జేమ్స్ క్రిస్టఫర్ హారిసన్ తుదిశ్వాస విడిచారు. రక్తంలోని ప్లాస్మాను 1,173 సార్లు దానంచేసి అందులోని అరుదైన యాంటీ-డి యాంటీబాడీతో దాదాపు పాతిక లక్షల మంది చిన్నారులను కాపాడిన ప్రాణదాతగా ఘన కీర్తులందుకున్న హారిసన్(88) గత నెల 17వ తేదీన ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్స్‌లో తుదిశ్వాస విడిచిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నర్సింగ్ హోమ్‌లో నిద్రలోని ఆయన శాశ్వత నిద్రలోకి జారుకున్నారని వైద్యులు తెలిపారు. ఆస్ట్రేలియాకు చెందిన హారిసన్‌ను అందరూ 'మ్యాన్ విత్ ది గోల్డెన్ ఆర్మ్'అని గొప్పగా పిలుస్తారు.

ఏమిటీ ప్రత్యేకత?

మానవ రక్తంలో పాజిటివ్, నెగిటివ్ అని రెండు రకాల వర్గీకరణలు ఉన్నాయి. దీనిని రీసస్(ఆర్‌హెచ్)ఫ్యాక్టర్ అని కూడా అంటారు. ఆర్‌హెచ్ నెగిటివ్ రక్తమున్న మహిళ, ఆర్‌హెచ్ పాజిటివ్ ఉన్న వ్యక్తి కారణంగా గర్భం దాలిస్తే పుట్టబోయే బిడ్డకు ఆర్‌హెచ్ పాజిటివ్ ఉండే ఛాన్సుంది. దీంతో కొన్నిసార్లు ప్రాణాంతకమైన సమస్య తలెత్తుతుంది. తల్లి ఎర్ర రక్తకణాలు పుట్టబోయే బిడ్డ రక్తకణాలపై దాడి చేసి కొత్త వ్యాధిని సృష్టిస్తాయి. దీనినే హీమోలైటిక్ డిసీజ్ ఆఫ్ ది న్యూబార్న్(హెచ్‌డీఎన్)గా పిలుస్తారు. అంటే పుట్టబోయే/పుట్టిన బిడ్డలో ఎర్రరక్తకణాలు అత్యంత వేగంగా క్షీణించిపోతాయి. దీంతో బిడ్డకు రక్తహీనత సమస్య రావడం, గుండె వైఫల్యం చెందడంతోపాటు ప్రాణాలు పోయే అవకాశాలు చాలా అధికం. హెచ్‌డీఎన్ సమస్యతో ఆస్ట్రేలియాలో ప్రతి ఏటా వేలాది మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. అయితే జేమ్స్ హారిసన్‌లోని రక్తంలో అరుదైన యాంటీ-డీ యాంటీబాడీని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈయన రక్తం ప్లాస్మా నుంచి సేకరించిన యాంటీబాడీతో ఔషధాన్ని తయారుచేసి దానిని ఆర్‌హెచ్‌డీ సమస్య ఉన్న గర్భిణులకు ఇచ్చారు. దీంతో పిండస్థ దశలోని చిన్నారుల ప్రాణాలు నిలబడ్డాయి. ఇలా 1967వ సంవత్సరం నుంచి ఎప్పటికప్పుడు హారిసన్ తన ప్లాస్మాను దానం చేస్తూనే ఉన్నారు. ఆస్ట్రేలియాలో 81 ఏళ్లు దాటిన వాళ్లు ప్లాస్మా దానం చేయకూడదనే నిబంధన ఉంది. దాంతో ఆయన తన 82వ ఏట ప్లాస్మా దానాన్ని ఆపేశారు. అప్పటికే ఆయన 1,173 సార్లు ప్లాస్మాను దానంచేశారు. దాని సాయంతో ఒక్క ఆస్ట్రేలియాలోనే దాదాపు 24 లక్షల మంది పసిపాపలను కాపాడటం విశేషం.

ఆరు దశాబ్దాలపాటు దానం

1936 డిసెంబర్ 27న హారిసన్ జన్మించారు. 14వ ఏట అంటే 1951 ఏడాదిలో హారిసన్‌కు ఛాతిలో పెద్ద శస్త్రచికిత్స జరిగింది. అప్పుడు పెద్దమొత్తంలో రక్తం అవసరమైంది. ఇతరుల రక్తదానంతో బతికానన్న కృతజ్ఞతాభావం ఆయనలో ఆనాడే నాటుకుపోయింది. బ్రతికినంతకాలం రక్తదానం చేయాలని నిర్ణయించుకున్నారు. నిబంధనల ప్రకారం 18 ఏళ్లు నిండిన తర్వాతే రక్తదానం ఇవ్వడం మొదలెట్టారు. ఇలా దాదాపు 60 ఏళ్లపాటు ప్లాస్మాను దానంచేశారు. ప్రతి రెండు వారాలకోసారి ప్లాస్మా దానమిచ్చారు. అత్యధిక సార్లు ప్లాస్మా దానం చేసిన వ్యక్తిగా 2005లో ఆయన ప్రపంచ రికార్డ్ సృష్టించారు. 2018 మే11వ తేదీన చివరిసారిగా ప్లాస్మా దానంచేశారు. న్యూ సౌత్ వేల్స్(ఎన్ఎస్‌డబ్ల్యూ) జాతీయ యాంటీ-డీ కార్యక్రమంలో వ్యవస్థాపక సభ్యునిగా హారిసన్ ఉన్నారు. ఇన్నేళ్లలో ఎన్ఎస్‌డబ్ల్యూ తయారుచేసిన యాంటీ-డీ ప్రతి బ్యాచ్‌లో ఒక్క డోస్ అయినా హారిసన్‌ది ఉండటం విశేషం. లక్షల ప్రాణాలు కాపాడి రికార్డ్ సృష్టించారని గతంలో మీడియా ఆయన వద్ద ప్రస్తావించగా నవ్వి ఊరుకున్నారు. ''రికార్డ్ సృష్టించడం అంటూ ఏదైనా జరిగిందంటే అది కేవలం ఆ దాతృత్వ సంస్థ చేసిన విరాళాల వల్లే. ఇందులో నా పాత్ర ఏమీ లేదు''అని నిగర్విలా మాట్లాడారు.

నేనూ బతికా: కూతురు

హారిసన్ మరణంపై ఆయన కూతురు ట్రేసీ మెలోషిప్ మాట్లాడారు. ''మా నాన్న ఇన్నిసార్లు దానం చేసి కూడా ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. ఆయన అందించిన యాంటీ-డీ డోస్‌తో ఎంతో మంది బ్రతికారు. అందులో నేను కూడా ఉన్నా''అని ట్రేసీ అన్నారు. ఈ డోస్ పొందిన వారిలో హారిసన్ మనవళ్లు, మనవరాళ్లు కూడా ఉండటం విశేషం. 14 ఏళ్ల వయసులో ఆపరేషన్ వేళ తీవ్రస్థాయిలో రక్తం ఎక్కించుకోవడం వల్లే హారిసన్ ఈ అరుదైన లక్షణాన్ని సంతరించుకున్నారని కొందరి వాదన.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఆమెకు మరణశిక్ష అమలైంది

ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: అబుదాబిలో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారతీయురాలు షహజాది ఖాన్‌కు ఫిబ్రవరి 15వ తేదీనే అక్కడ మరణశిక్షను అమలు చేశారని కేంద్ర ప్రభుత్వం సోమవారం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. నాలుగు నెలల చిన్నారిని చంపిన కేసులో 33 ఏళ్ల షహజాది ఖాన్‌కు మరణశిక్ష విధించారు. 2013 ఫిబ్రవరి 10న ఆమెను అబుదాబి పోలీసులకు అప్పగించగా.. అదే ఏడాది జూలై 31న మరణశిక్ష పడింది. అప్పటినుంచి ఆమె అల్ వతాబా జైల్లో ఉన్నారు. షహజాది క్షేమ సమాచారాలు తెలియజేయాలని ఆమె తండ్రి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చింది. 'అంతా అయిపోయింది. ఫిబ్రవరి 15వ తేదీనే ఆమెకు మరణదండన అమలు చేశారు. మార్చి 5న అంత్యక్రియలు నిర్వహిస్తారు'అని అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ కోర్టుకు తెలిపారు. దీనిపై జస్టిస్ సచిన్ దత్తా స్పందిస్తూ ఇది అత్యంత దురదృష్టకరమని అభివర్ణించారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

ముగ్గురు మావోయిస్టులు మృతి?

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ధామ్‌తరి జిల్లాలో సోమవారం రాత్రి జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఖల్లారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాదరిగి అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో జిల్లాకు చెందిన డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసులకు తారసపడిన మాయిస్టులు బలగాల పైకి కాల్పులు జరుపుతూ పారిపోతుండగా పోలీసులు వారిని వెంబడించి ఎదురుకాల్పులు జరిపారని సమాచారం. ఈ ఘటనలో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందగా మరి కొందరు గాయాల పాలైనట్లు పోలీసులు తెలిపారు.

అధిష్టానం నిర్ణయమే అంతిమం: సిద్ధరామయ్య

బెంగళూరు: కర్నాటకలో నాయకత్వ మార్పుపై అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. ఈ విషయంలో అంతిమ నిర్ణయం కాంగ్రెస్ అధిష్టానానిదేనని, వారెలా నిర్ణయిస్తే తానలా నడుచుకుంటానని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ త్వరలోనే సీఎంగా బాధ్యతలు చేపడతారని కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్ప మొయిలీ వ్యాఖ్యానించడంతో సిద్ధరామయ్య ఈ విషయంపై స్పందించారు. 'నేను మరోసారి చెబుతున్నాను. సీఎం ఎవరనేది అధిష్టానం నిర్ణయిస్తుంది. మొయిలీ లేదా మరొకరు ఏం మాట్లాడారనేది ఇక్కడ ముఖ్యం కాదు. హైకమాండ్ నిర్ణయమే అంతిమం'అని సిద్ధరామయ్య సోమవారం అన్నారు. సీఎం మారతారని కాంగ్రెస్ నాయకులు బాహటంగా చర్చిస్తున్న విషయాన్ని సిద్ధూ దృష్టికి తేగా.. 'నేను హైకమాండ్ ఆదేశాల మేరకే నడుచుకుంటాను'అని ఆయన బదులిచ్చారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్‌కు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, గైడెన్స్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్ మొదలైన వాటి కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీకు కావాల్సిన సమాచారం తెలుసుకోండి.

సాక్షి ప్లస్
మంగళవారం : 4-3-2025

భారతీయ క్రైస్తవ వివాహ చట్టం ఎప్పుడు చేశారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

సోషియాలజీ



వివాహం

1. వివాహం అంటే..?
ఎ) మానవ సమాజానికి ఆధారం
బి) వధూవరుల బంధువుల మధ్య సంబంధాలను నిర్వచిస్తుంది
సి) విశ్వజనీన సామాజిక సంస్థ
డి) పైవన్నీ

2. ప్రపంచమంతటా ప్రాచుర్యంలో ఉన్న వివాహ రూపం?
ఎ) బహు భార్యత్వం బి) బహు భర్తృత్వం
సి) ఏక వివాహం
డి) సమూహ వివాహం

3. 'దూద్ లౌటానా' పేరుతో పిలిచే మేనరిక వివాహం ఏ తెగలో కనిపిస్తుంది?
ఎ) గోండులు బి) సంతాల్‌లు
సి) సవరలు డి) భిల్లులు

4. వెస్టర్ మార్క్ అభిప్రాయం ప్రకారం బహు భార్యత్వానికి కారణం?
ఎ) బ్రహ్మచర్యాన్ని బలవంతంగా రుద్దడం
బి) సంతానాపేక్ష సి) సామాజిక ప్రతిష్ట
డి) పైవన్నీ

5. తమిళనాడులోని నీలగిరి పర్వతాల్లో ఎక్కువగా నివసించే తోడాలలో ఉండే వివాహ రూపం?
ఎ) సోదర బహుభర్తృత్వం
బి) బహు వివాహం
సి) సోదరేతర బహుభర్తృత్వం
డి) సమూహ వివాహం

6. ఉన్నత కులం అమ్మాయి తక్కువ కులం అబ్బాయిని వివాహం చేసుకునే పద్ధతిని ఏమంటారు? (Civils, Gr-II backlog, 2000)
ఎ) దేవర న్యాయం
బి) అనులోమ వివాహం
సి) ప్రేమ వివాహం
డి) ప్రతిలోమ వివాహం

7. 'మ్యారేజ్ అండ్ ఫ్యామిలీ ఇన్ ఇండియా' గ్రంథ రచయిత ఎవరు? (Civils)
ఎ) ఎం.ఎస్. శ్రీనివాస్
బి) కె.ఎం. కపాడియా
సి) టి.ఎన్. సుదాన్ డి) ఐ. కార్వే

8. హిందువుల్లో ఎక్కువగా ప్రాచుర్యంలో ఉన్న ఆచారం ఏది? (Civils)
ఎ) గోత్రేతర వివాహం బి) సగోత్ర వివాహం
సి) గ్రామానికి బయట వివాహమాడటం
డి) సపిండ వివాహం చేసుకోవడం

9. మహమ్మదీయ పెళ్లి కుమార్తెకు చెల్లించే నగదును ఏమంటారు? (Civils)
ఎ) కట్నం బి) మెహర్
సి) కన్యాశుల్కం డి) నష్టపరిహారం

10. కులం అనేది ఒక ..... సమూహం? (Civils)
ఎ) బహిర్వివాహిత బి) సంవృత
సి) అంతర్వివాహిత డి) అనివార్య

11. స్మృతుల్లో పేర్కొన్న విధంగా హిందువుల్లో ఎన్ని రకాల వివాహాలున్నాయి? (Civils, Gr-II backlog, 2000)
ఎ) 5 బి) 6 సి) 7 డి) 8

12. హిందూ వివాహ చట్టం ఎప్పుడు చేశారు? (Civils, Gr-II backlog, 2000)
ఎ) 1955 బి) 1956 సి) 1954 డి) 1958

13. హైందవ వారసత్వ చట్టం ఎప్పుడు చేశారు? (Civils,GDPD-2013,Gr-II backlog,2000)
ఎ) 1955 బి) 1956 సి) 1957 డి) 1959

14. కింది వాటిలో ఏ తెగ బహు భర్తృత్వ విధానాన్ని పాటిస్తుంది?
ఎ) తోడాలు బి) భిల్లులు
సి) ఖాసీలు డి) గోండులు

15. భారతదేశంలో కులాంతర వివాహానికి శాసన పరమైన సదుపాయాన్ని ఏర్పరచిన తొలి చట్టం ఏది?
ఎ) హిందూ వివాహ చట్టం-1955
బి) ప్రత్యేక వివాహ చట్టం-1872
సి) హిందూ కోడ్ బిల్లు-1956
డి) అభ్యసన ప్రయోజనాల చట్టం-1930

16. సమాజంలో కింది వాటిలో దేని కోసం నిషిద్ధం పాటిస్తారు? (Civils)
ఎ) పెద్దల పట్ల గౌరవం ప్రదర్శించడానికి
బి) మహిళల హోదా పెంచడానికి
సి) కొంతమంది బంధువుల మధ్య లైంగిక సంపర్కాన్ని నివారించడానికి
డి) విరోధుల పట్ల అయిష్టం ప్రదర్శించడానికి

17. నిషేధాలు (Taboos) వేటితో సంబంధం కలిగి ఉంటాయి? (Civils, Gr-II backlog, 2000)
ఎ) ఆచారాలు బి) జానపద రీతులు
సి) రీతులు డి) ఫ్యాషన్లు

18. వివాహం వల్ల కలిగే ప్రయోజనం?
ఎ) అందమైన భార్య/భర్త లభిస్తారు
బి) సమాజంలో చిన్నచూపు చూస్తారు
సి) సంతోషకర వేడుకల్లో పాల్గొంటారు
డి) చట్టపరమైన సామాజిక హక్కులు, బాధ్యతలు లభిస్తాయి

19. ఒక పురుషుడు ఒకే స్త్రీని వివాహం చేసుకోవడాన్ని ఏమంటారు? (CDPO-2013)
ఎ) బహు భర్తృత్వం బి) ఏక వివాహం
సి) బహు భార్యత్వం డి) బహు వివాహం

20. పురుషులతో సమానంగా స్త్రీలకు హక్కులు కల్పించే స్పెషల్ మ్యారేజ్ చట్టాన్ని ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారు? (CDPO-2013)
ఎ) 1950 బి) 1954 సి) 1952 డి) 1951

21. భారతదేశంలో వివాహం అనేది ఒక ...? (CDPO-2013)
ఎ) సంస్కారం బి) ఒప్పందం
సి) నమ్మకం డి) నీతి సూత్రం

22. ఒక పురుషుడు తన భార్యకు సంబంధించిన ఎక్కువ మంది అక్కాచెల్లెళ్లను వివాహమాడే పద్ధతిని ఏమంటారు? (CDPO-2013)
ఎ) దేవర న్యాయం
బి) భార్యాభగినీ న్యాయం
సి) హైపర్ గమీ
డి) భార్యాభగినీ బహుభార్యత్వం

23. నిమ్న కులానికి చెందిన యువతి ఉన్నత కులానికి చెందిన పురుషుడిని వివాహమాడే పద్ధతిని ఏమంటారు? (Gr-II backlog, 2000)
ఎ) బహిర్వివాహం
బి) అనులోమ వివాహం
సి) అంతర్వివాహం
డి) ప్రతిలోమ వివాహం

24. ఒక వ్యక్తి (పురుషుడు) ఒకరి కంటే ఎక్కువ మంది స్త్రీలను వివాహం చేసుకోవడాన్ని ఏమంటారు? (CDPO-2013)
ఎ) బహు భర్తృత్వం బి) హైపర్ గమీ
సి) బహు భార్యత్వం డి) పాలీగమి

25. ఒక స్త్రీ తన భర్త సోదరుడిని వివాహం చేసుకోవడాన్ని ఏమంటారు? (Gr-II, 2000)
ఎ) భార్యాభగినీ న్యాయం
బి) బహు భర్తృత్వం
సి) దేవర న్యాయం డి) ప్రేమ వివాహం

26. వివాహం వల్ల కలిగే బంధుత్వాన్ని ఏమంటారు? (Gr-II, 2000)
ఎ) వైవాహిక బంధుత్వం
బి) ఏకరక్త బంధుత్వం
సి) పునరుత్పత్తి బంధుత్వం
డి) ఏక పత్నీత్వ బంధుత్వం

27. బాల్య వివాహ నిషిద్ధ చట్టం అమోదించిన సంవత్సరం? (Gr-II, 2000)
ఎ) 1947 బి) 1955 సి) 1929 డి) 1956

28. కింది వారిలో వితంతు పునర్వివాహ సంఘ సంస్కర్తగా ఎవరిని పేర్కొంటారు? (Gr-II, 2000)
ఎ) సరోజినీ నాయుడు
బి) రాజా రామ్మోహన్‌రాయ్
సి) దుర్గాబాయ్ దేశ్‌ముఖ్
డి) అనిబిసెంట్

29. వివాహాల్లో ఒక పద్ధతైన 'ముతా' ఎవరిలో కనిపిస్తుంది? (Gr-II backlog, 2000)
ఎ) హిందువులు బి) క్రైస్తవులు
సి) ముస్లింలు డి) బౌద్ధులు

30. పరస్పర ప్రేమ వల్ల జరిగే వివాహాన్ని ఏమంటారు? (Civils, Gr-II backlog, 2000)
ఎ) గాంధర్వ వివాహం
బి) రాక్షస వివాహం
సి) దైవ వివాహం డి) అసుర వివాహం

31. ఒక పురుషుడు ఒకసారి ఒక స్త్రీని వివాహం చేసుకుంటే ఆ వివాహాన్ని ఏమంటారు? (Gr-II backlog, 2000)
ఎ) పాలీగమి బి) మోనోగమి
సి) పాలియాండ్రి డి) పైవన్నీ

32. దేవర న్యాయ వివాహం అంటే? (Gr-II backlog, 2002)
ఎ) మేనబిడ్డల మధ్య జరిగే వివాహం
బి) సోదరి కూతురితో జరిగే వివాహం
సి) సోదరుడి కూతురితో జరిగే వివాహం
డి) భర్త మరణించిన తర్వాత అతడి సోదరుడిని వివాహం చేసుకోవడం

33. బహు భర్తృత్వం అనేది ఏ రకమైన వివాహం? (Gr-II backlog, 2002)
ఎ) ఒక స్త్రీ ఎక్కువ మంది పురుషులను వివాహమాడటం
బి) ఒక స్త్రీ ఒక వ్యక్తినే భర్తగా కలిగి ఉండటం
సి) ఒక స్త్రీ పురుషుడితో తాత్కాలికంగా జీవనాన్ని గడపడం
డి) పైవేవీ కాదు

34. కొత్తగా వివాహమైన దంపతులు పెళ్లి తర్వాత పురుషుడు తన భార్య కుటుంబంతో కలిసి నివసించే పద్ధతిని ఏమంటారు? (Gr-II backlog, 2000)
ఎ) నూతన స్థానిక నివాస పద్ధతి
బి) పత్నీ స్థానిక నివాస పద్ధతి
సి) పతి స్థానిక నివాస పద్ధతి
డి) మాతుల స్థానిక నివాస పద్ధతి

35. భారత్‌లో కులాంతర వివాహాలు జరుపుకోవడానికి సమ్మతిచ్చే నిబంధనలను మొదటిసారిగా ఏ చట్టం ద్వారా రూపొందించారు? (Gr-II backlog, 2000)
ఎ) హిందూ వివాహ చట్టం-1955
బి) విశేష వివాహ చట్టం- 1972
సి) హిందూ కోడ్ బిల్ - 1956
డి) పైవన్నీ

36. ఆదిమ సమాజాల్లో బాగా ప్రాచుర్యంలో ఉన్న వివాహ రూపం ఏది?
ఎ) సేవా వివాహం
బి) గాంధర్వ వివాహం
సి) అసుర వివాహం
డి) పరీక్షావధి వివాహం

37. 'సామాజిక, సాంస్కృతిక గతిశీలత' (Social and Cultural Dynamics) గ్రంథ రచయిత ఎవరు? (Gr-II, backlog, 2000)
ఎ) పి.ఎ. సోరోకిన్ బి) జార్జి సిమ్మెల్
సి) వెలిస్ కోసర్ డి) మెల్విన్ ట్యూమన్

38. కన్యాశుల్కం అంటే ఏమిటి?
ఎ) వధువు బంధువులు వరుడి బంధువులకు వివాహం సందర్భంగా చేసే చెల్లింపులు
బి) వరుడి బంధువులు వధువు బంధువులకు చేసే వివాహ చెల్లింపులు
సి) వధువు బంధువులు పురోహితుడికి చేసే చెల్లింపులు
డి) వధువు బంధువులు తమలో తాము ఇచ్చుకునే బహుమతులు

39. కింది వాటిలో హిందూ వివాహానికి సంబంధించిన ప్రధాన లక్ష్యం ఏది?
ఎ) విధినిర్వహణ ధర్మం
బి) ప్రజోత్పత్తి సి) రతి
డి) పైవన్నీ

40. హిందూ వివాహ సంస్కారాల్లో అతి ముఖ్యమైన అంశం?
ఎ) కన్యాదానం బి) పాణిగ్రహణం
సి) సప్తపది డి) పైవన్నీ

41. కింది వాటిని సరిగా జతపరచండి.
గ్రూప్-ఎ
1. బ్రహ్మ వివాహం
2. రాక్షస వివాహం
3. అసుర వివాహం
4. గాంధర్వ వివాహం
గ్రూప్-బి
i. పెద్దలు నిర్ధారించి, శాస్త్రపరంగా చేసే వివాహం
ii. వధువును వెతికి వెళ్లి పెళ్లి చేసుకోవడం
iii. జీవిత భాగస్వామిని కొనుగోలు చేయడం ద్వారా వివాహం చేసుకోవడం
iv. ఇరువురూ ప్రేమించుకొని పెళ్లి చేసుకోవడం

	1	2	3	4
ఎ)	i	ii	iii	iv
బి)	iv	iii	ii	i
సి)	iii	iv	ii	i
డి)	iv	iii	i	ii

42. శారదా చట్టం (Child Marriage Restraint Act) కింది వాటిలో దేన్ని ఏర్పరచింది? (TSPSC-AEE, 2015)
ఎ) హిందువుల్లో వితంతు పునర్వివాహాన్ని నిషేధిస్తుంది
బి) హిందువులు విడాకులు తీసుకోవడాన్ని నిషేధిస్తుంది
సి) హిందువుల్లో వధూవరుల కనీస వివాహ వయసు నిర్ధారిస్తుంది
డి) స్త్రీలు ఉన్నత విద్య అభ్యసించడాన్ని అంగీకరిస్తుంది

43. భారతదేశంలోని దాదాపు అన్ని ఆదిమతెగలు పాటించే వివాహ విధానం?
ఎ) బహిర్వివాహం బి) బహు భార్యత్వం
సి) స్వైరితం డి) అంతర్వివాహం

44. ముస్లింలలో వివాహం రద్దు చేసుకోవడాన్ని ఏమంటారు?
ఎ) తల్వండి బి) తల్వార్
సి) ఇద్దత్ డి) తలాఖ్

45. భారతీయ క్రైస్తవ వివాహ చట్టం ఎప్పుడు చేశారు?
ఎ) 1872 బి) 1873 సి) 1874 డి) 1875

46. భారత్‌లో పార్శీల వివాహం, విడాకుల చట్టాన్ని ఏ సంవత్సరంలో చేశారు?
ఎ) 1934 బి) 1939 సి) 1933 డి) 1936

47. ఏడు డిగ్రీల (Seven Degree) వివాహ నిబంధన ఏ మతంలో కనిపిస్తుంది?
ఎ) ఇస్లాం బి) సిక్కు మతం
సి) హిందూ మతం డి) క్రైస్తవ మతం

48. వివాహం అనేది ...?
ఎ) ఒక రకమైన పరిచయం
బి) ఒక సమితి సి) ఒక సంఘం
డి) సాంస్కృతిక సంశ్లిష్టత (Cultural complex)

49. మానవ వివాహ చరిత్ర (History of Human Marriage) గ్రంథ రచయిత?
ఎ) వెస్టర్ మార్క్ బి) ఏంగెల్స్
సి) సర్ హెన్రీమెయిన్
డి) టాల్కాట్ పార్సన్స్

సమాధానాలు

1) డి 2) సి 3) ఎ 4) డి 5) ఎ
6) డి 7) బి 8) ఎ 9) బి 10) సి
11) డి 12) ఎ 13) బి 14) ఎ 15) బి
16) సి 17) ఎ 18) డి 19) బి 20) బి
21) ఎ 22) డి 23) బి 24) సి 25) సి
26) ఎ 27) సి 28) బి 29) సి 30) ఎ
31) బి 32) డి 33) ఎ 34) బి 35) ఎ
36) ఎ 37) ఎ 38) బి 39) డి 40) డి
41) ఎ 42) సి 43) డి 44) డి 45) ఎ
46) డి 47) డి 48) డి 49) ఎ

బహువ్రీహి సమాసానికి ఉదాహరణలు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

ఏడో ప్రకరణం - సమాసాలు

డీఎస్సీ స్కూల్ అసిస్టెంట్స్, లాంగ్వేజీ పండిట్స్ అభ్యర్థులకు వ్యాకరణంలో సమాసాలు ముఖ్యమైనవి. గత డీఎస్సీల్లో, టెట్‌లో సమాసాలపై ప్రశ్నలు అడిగారు. భవిష్యత్తులో వచ్చే డీఎస్సీలో కూడా వీటికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. వీటిపై సమగ్రమైన అవగాహన కలిగే విధంగా సమాసం అంటే ఏమిటి? వీటిల్లో రకాలు మొదలైన అంశాలను పరిశీలిద్దాం.

సమాసం అంటే: 'సమర్థంబులగు పదంబు' లేదా 'పదం బగుట' సమాసమని చిన్నయసూరి నిర్వచించాడు. సమ ప్రాధాన్యం ఉన్న రెండు వేర్వేరు పదాలు కలిసి కొత్త అర్థాన్ని సూచిస్తే దాన్ని సమాసం అంటారు. **ఉదా:**'పని, మనిషి'అనే రెండు పదాలు కలిసి 'పనిమనిషి' ప్రత్యేకార్థాన్ని సూచిస్తున్నందున ఇది సమాస పదం. వేర్వేరుగా ఉన్న పదాల అర్థాలకు ఒకే అర్థం ఏర్పడటాన్ని 'సామర్థ్యం' అంటారు. దీన్నే అర్థ సమ్మేళనమని కూడా అంటారు. రెండు పదాల అన్వయాన్ని తెలియజేసేది విగ్రహవాక్యం. పదాల సంబంధం విభక్తి ప్రత్యయాల మీద ఆధారపడి ఉంటుంది. సమాస సంబంధాలను వివరించి చెప్పేవి 'విగ్రహ వాక్యాలు'.

ఉదా: 'రామబాణము' సమాసానికి 'రాముని యొక్క బాణము' విగ్రహవాక్యం.

సమాసాలు - భేదాలు: తెలుగులో శబ్ద స్వరూపాన్ని బట్టి సమాసాలు మూడు విధాలు. అవి.. 1) సాంస్కృతికం 2) ఆచ్ఛికం 3) మిశ్రమం

1. సాంస్కృతికం: ఇది రెండు విధాలు. అవి..
i) సిద్ధ సమాసం ii) సాధ్య సమాసం

i. సిద్ధ సమాసం: కేవలం సంస్కృత శబ్దాలతో ఏర్పడే సమాసం.. సిద్ధ సమాసం.

ఉదా: 'రాజాజ్ఞ' రాజః+ ఆజ్ఞః = రాజాజ్ఞః రెండు సంస్కృత శబ్దాలతో ఏర్పడిన సమాసం 'రాజాజ్ఞ'.

ii. సాధ్య సమాసం: తత్సమ పదాలతో ఏర్పడే సమాసం సాధ్య సమాసం.

ఉదా: రాజు + ఆజ్ఞ = రాజునాజ్ఞ, రాజు (తత్సమపదం) = ఆజ్ఞ (తత్సమం). ఈ పదాలు కలిసి 'రాజునాజ్ఞ' పదం ఏర్పడింది. ఇది సాధ్య సమాసం.

2. ఆచ్ఛిక సమాసం: కేవలం తెలుగు పదాలతో ఏర్పడే సమాసాన్ని ఆచ్ఛిక సమాసం అంటారు. ఆచ్ఛికం అంటే అచ్చ తెలుగు అని అర్థం. **ఉదా:**
- జేని ఆనతి= జేనియానతి. జేని, ఆనతి రెండూ తెలుగు పదాలు కాబట్టి ఇది ఆచ్ఛిక సమాసం.
- సిరి చెలువుడు - సిరి, చెలువుడు రెండూ అచ్చ తెలుగు పదాలు కాబట్టి ఇది ఆచ్ఛిక సమాసం.

3. మిశ్ర సమాసం: తత్సమ శబ్దాలు, ఆచ్ఛిక శబ్దాల కలయికతో ఏర్పడిన సమాసాన్ని 'మిశ్ర సమాసం' అంటారు. **ఉదా:**
- రాజుముదల - సమాసంలో 'రాజు' తత్సమ శబ్దం. 'ముదల' ఆచ్ఛిక పదం. ఈ రెండింటి కలయికతో ఏర్పడిన'రాజుముదల'మిశ్ర సమాసం.
- 'సిరివల్లభుడు' - సమాస పదంలో 'సిరి' ఆచ్ఛిక పదం. 'వల్లభుడు' తత్సమ శబ్దం. ఈ రెండింటి కలయికతో ఏర్పడిన 'సిరివల్లభుడు' మిశ్ర సమాస పదం.
- పద ప్రాధాన్యాన్ని అనుసరించి సమాసాలు ప్రధానంగా నాలుగు రకాలు. అవి..

1. అవ్యయీభావ సమాసం
2. తత్పురుష సమాసం
3. ద్వంద్వ సమాసం
4. బహువ్రీహి సమాసం

1. అవ్యయీభావ సమాసం: అవ్యయం పూర్వ పదంగా గల సమాసం అవ్యయీభావ సమాసం.

అవ్యయాలు: లింగవచన, విభక్తి రహితాలు అవ్యయాలు.స్వర్,అంతర్, పునర్, ప్రాతర్, మిథ్యా, పురా, సర్వదా, ఆద్య, యధా, బహుశః, నిర్ మొదలైనవి అవ్యయాలు. అవ్యయాలు పూర్వపదంగా ఉన్న సమాసాలు అవ్యయీభావ సమాసాలు. **ఉదా:**

సమాస పదం	విగ్రహవాక్యం
యథాశక్తి	శక్తిని అనుసరించి
ప్రతిదినం	దినము, దినము
నిశ్చలం	చలనం లేనిది
నిరుపయోగం	ఉపయోగం లేనిది
ఆపూర్ణత	మిక్కిలి పూర్ణమైంది

2. తత్పురుష సమాసం: ఉత్తర పద ప్రాధాన్యం ఉన్న సమాసం తత్పురుష. ఇది రెండు విధాలు. అవి.. ఎ) వ్యధికరణం బి) సమానాధికరణం

ఎ) వ్యధికరణం: (వి+ అధికరణం)= వ్యధికరణం. అధికరణం అంటే ఆధారం అని అర్థం. 'వి' అనే ఉపసర్గ భిన్న లేదా విరుద్ధ అనే అర్థంలో చేరింది. పూర్వ పదంలో విభక్తికి పరపదంలో ఉన్న విభక్తి భిన్నంగా ఉంటుంది. అందుకే దీనికి 'వ్యధికరణం' అని పేరు. ఇందులో విభక్తి ప్రత్యయాలు ఆధారంగా సమాసాన్ని నిర్ణయించవచ్చు. విభక్తులతోపాటు వ్యతిరేకార్థంలో విగ్రహ వాక్యాన్ని సూచించే నఞ్ తత్పురుషతో కలిపి మొత్తం ఎనిమిది విధాల తత్పురుష సమాసాలు వ్యధికరణంలో ఉంటాయి. పదాల మధ్య అన్వయాన్ని, సంబంధాన్ని తెలియజేసేవి విభక్తులు.

i. ప్రథమా తత్పురుష సమాసం: సమాసంలో పూర్వ పదం ప్రథమా విభక్తిలో (డు, ము, వు, లు) ఉండి, ఉత్తరపద ప్రాధాన్యం కలిగి ఉంటుంది. ఇందులో పూర్వ, ఉత్తర పదాలు రెండూ ప్రథమా విభక్తిలో ఉంటాయి. ప్రథమా తత్పురుష సమాసానికి ఏకదేశ సమాసం అనే పేరుంది. **ఉదా:**

సమాస పదం	విగ్రహవాక్యం
మధ్యాహ్నం	అహ్నము మధ్య భాగం
అర్ధ రాజ్యం	రాజ్యం అర్ధ భాగం
నడిరేయి	రేయి నడిమి భాగం

ii. ద్వితీయా తత్పురుష సమాసం: విగ్రహ వాక్యాల్లో పూర్వ పదం తర్వాత ద్వితీయా విభక్తి ప్రత్యయాలు నిన్, నున్, లన్, కూర్చి, గురించి ప్రత్యయాలు ఉంటాయి. **ఉదా:**
- ప్రాణిబాధకంబు - ప్రాణులను బాధించేది ('ను' - ద్వితీయ)
- బ్రహ్మవిత్తములు - బ్రహ్మను గురించి తెలిసిన వారు (గూర్చి - ద్వితీయ)
- వేదవిదులు - వేదాలను గురించి తెలిసిన వారు (గూర్చి - ద్వితీయ)
- దుఃఖాతీతుడు - దుఃఖాన్ని అతిక్రమించువాడు ('ను' ద్వితీయ)

iii. తృతీయా తత్పురుష సమాసం: సమాసంలో పూర్వ పదానికి తృతీయావిభక్తి ప్రత్యయాలు చేతన్, చేన్, తోడన్, తోన్ వంటివి చేరితే అది తృతీయా తత్పురుష సమాసం. **ఉదా:**
- శోక సంతాపిత - శోకం చేత సంతాపిత (చేత - తృతీయా విభక్తి)
- గుణహీనుడు - గుణం చేత హీనుడు (చేత - తృతీయా విభక్తి)
- ఖడ్గ యుద్ధం = ఖడ్గంతో యుద్ధం (తో - తృతీయా విభక్తి)

iv. చతుర్థీ తత్పురుష సమాసం: సమాసంలో పూర్వ పదానికి చతుర్థీ విభక్తి ప్రత్యయాలైన 'కొరకు, కై' చేరితే అది చతుర్థీ తత్పురుష సమాసం. **ఉదా:**
- యూపదారువు-యూపము కొరకు దారువు (కొరకు)
- సభాభవనం - సభ కొరకు భవనం (కొరకు)

v. పంచమీ తత్పురుష సమాసం: సమాసంలో పూర్వ పదానికి వలనన్, కంటెన్, పట్టి ప్రత్యయాలు చేరితే అది పంచమీ తత్పురుష సమాసం.
ఉదా:
- దహనక్లేశం - దహనం వలన క్లేశం (వలన - పంచమీ)
- అగ్నిభయం - అగ్ని వల్ల భయం (వలన - పంచమీ)
- నిపాత దాహం = నిపాతం వల్ల దాహం (వల్ల - పంచమీ)
- జ్ఞానముక్తుడు - జ్ఞానం వలన ముక్తుడు (వలన - పంచమీ)

vi. షష్ఠీ తత్పురుష సమాసం: సమాసంలో పూర్వ పదానికి షష్ఠీ విభక్తి ప్రత్యయాలు (కిన్, కున్, యొక్క, లోన్, లోపల) చేరితే అది షష్ఠీ తత్పురుష సమాసం. **ఉదా:**
- శుక్రాజ్ఞ - శుక్రుని యొక్క ఆజ్ఞ (యొక్క)
- ధరణీపతి - ధరణికి పతి (కి-షష్ఠీ)
- అశ్వరాజము-అశ్వములలో రాజము('లో')షష్ఠీ)

vii. సప్తమీ తత్పురుష సమాసం: సమాసంలో పూర్వ పదానికి సప్తమీ విభక్తి ప్రత్యయాలు (అందున్, నన్)చేరితే అది సప్తమీ తత్పురుష సమాసం.
ఉదా:
- అరణ్య భూములు - అరణ్య మందలి భూములు (అందలి - సప్తమీ)
- శాస్త్ర కోవిదుడు - శాస్త్రమందు కోవిదుడు (అందు - సప్తమీ)
- పురుషోత్తముడు - పురుషులందు ఉత్తముడు (అందు - సప్తమీ)

viii. నఞ్ తత్పురుష సమాసం: సమాసంలో 'న' అనే అవ్యయం పూర్వపదంగా ఉంటుంది. విగ్రహ వాక్యం వ్యతిరేకార్థంలో ఉంటుంది.
- అసత్యము - సత్యము కానిది
- అధర్మము - ధర్మం కానిది
- అనుచితము - ఉచితము కానిది
- అసాధ్యము - సాధ్యం కానిది

బి) సమానాధికరణం: సమానమైన అధికరణలు కలది సమానాధికరణం. ఇది తత్పురుషలో ఒక భేదం. ఇది రెండు రకాలు. అవి..
1) కర్మధారయం 2) ద్విగువు

1. కర్మధారయ సమాసం: విశేషణ విశేష్యాలతో కూడింది కర్మధారయ సమాసం. ఇందులో విశేష్యం (నామవాచకం), విశేషణం ఉంటాయి. ఉపమాన, ఉపమేయాలు కూడా ఉంటాయి. ఇందులో ఏడు రకాలున్నాయి. అవి..
- విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం
- విశేషణ ఉత్తరపద కర్మధారయం
- విశేషణ ఉభయ పద కర్మధారయం
- ఉపమాన పూర్వ పద కర్మధారయం
- ఉపమాన ఉత్తరపద కర్మధారయం
- సంభావన పూర్వపద కర్మధారయం
- అవధారణ పూర్వపద కర్మధారయం

ఎ. విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం: విశేషణం పూర్వపదంగా, విశేష్యం (నామవాచకం) ఉత్తర పదంగా ఉండే సమాసం విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం. **ఉదా:**
- ఘోరవనము - ఘోరమైన వనము - (విశేషణం - పూర్వపదం)
- సచ్ఛాత్రులు - మంచివారైన ఛాత్రులు - (విశేషణం - పూర్వపదం)
- నల్లకలువ - నల్లదైన కలువ (విశేషణం - పూర్వపదం)

బి. విశేషణ ఉత్తర పద కర్మధారయ సమాసం: విశేషణం ఉత్తరపదంగా, విశేష్యం పూర్వపదంగా ఉన్న సమాసం విశేషణ ఉత్తర పద కర్మధారయం.
ఉదా:
- కపోతవృద్ధము - వృద్ధమైన కపోతము (విశేషణం- ఉత్తరపదం)
- పురుషోత్తముడు - ఉత్తముడైన పురుషుడు (విశేషణం-ఉత్తరపదం)
- పండిత శ్రేష్ఠుడు - శ్రేష్ఠుడైన పండితుడు (విశేషణం - ఉత్తర పదం)

సి. విశేషణ ఉభయ పద కర్మధారయ సమాసం: ఇందులో పూర్వ, పర పదాలు రెండూ విశేషణాలుగా ఉంటాయి. కాబట్టి ఇది విశేషణ ఉభయ పద కర్మధారయ సమాసం. **ఉదా:**
- ధీరోదాత్తుడు - ధీరుడు, ఉదాత్తుడు.
- శీతోష్ణము - శీతలమైనది, ఉష్ణమైనది.
- మృదుమధురం - మృదువైనది, మధురమైనది

(ఉదాహరణల్లో రెండు పదాలూ విశేషణాలే)

డి. ఉపమాన పూర్వపద కర్మధారయ సమాసం: ఉపమానం పూర్వపదంగా, ఉపమేయం ఉత్తర పదంగా ఉండే సమాసం ఉపమాన పూర్వపద కర్మధారయం. **ఉదా:**
- చిగురుకేలు- చిగురు వంటి కేలు (ఉపమానం పూర్వపదం), కేలు (ఉపమేయం). విగ్రహవాక్యాల్లో వంటి, లాంటి, వలె, పోలె వంటి ఉపమావాచకాలు వస్తాయి.
- జుంటిమోవి - జున్ను వంటి మోవి (పెదవి) (జుంటి, జున్ను - ఉపమానం పూర్వపదం)
- 'తేనే మాట' - తేనె వంటి మాట (ఉపమానం - పూర్వపదం)

ఇ. ఉపమాన ఉత్తర పద కర్మధారయ సమాసం: ఉపమానం ఉత్తర పదంగా, ఉపమేయం పూర్వపదంగా ఉండే సమాసం 'ఉపమాన ఉత్తరపద కర్మధారయ సమాసం'. **ఉదా:**
- పురుష సింహము - సింహము వంటి పురుషుడు (ఉపమానం- ఉత్తరపదం)
- తనూలత - లత వంటి తనువు (ఉపమానం -ఉత్తరపదం)

ఈ. సంభావన పూర్వపద కర్మధారయ సమాసం ఈ సమాసంలో మొదటి పదం సంజ్ఞా వాచకంగా, రెండో పదం జాతి నామవాచకంగా ఉంటుంది. సంభావన అంటే సంజ్ఞ లేదా ఊహ అని అర్థం. **ఉదా:**
- గుంటూరు నగరం - గుంటూరు అనే పేరు గల నగరం(పూర్వపదం- సంజ్ఞావాచకం)
- పారిజాత వృక్షం - పారిజాతము అనే పేరు గల వృక్షం-(మొదటి పదం- సంజ్ఞావాచకం)
- మానస సరోవరం - మానసమను పేరు గల సరోవరం (మొదటి పదం- సంజ్ఞావాచకం)

ఎఫ్. అవధారణ పూర్వపద కర్మధారయ సమాసం లేదా రూపక సమాసం: అవధారణ అంటే నిర్ధారించడమని అర్థం. నిర్ధారించే పదం పూర్వపదంగా ఉండి, ఉత్తర పదంగా నామవాచకం ఉంటే దాన్ని అవధారణ పూర్వపద కర్మధారయం అంటారు. సంస్కృతంలో 'ఏవ' అవధారణార్థం. తెలుగులో 'అనెడి' అనేది అవధారణార్థం. విగ్రహ వాక్యంలో అనెడి వస్తుంది. ఉపమేయ, ఉపమానాలకు అభేదం చెప్పడం రూపకం. ఇందులో పూర్వ ఉత్తర పదాలకు అభేదం చెప్పడం ఉన్నందునే ఇది రూపక సమాసంగా రూఢమైంది. **ఉదా:**
- సంసార సాగరం - సంసారమనెడి సాగరం - ('సంసారానికి సాగరానికి అభేదం చెప్పినందున ఇది రూపక సమాసం')
- కోపాగ్ని - కోపమనెడి అగ్ని (కోపానికి, అగ్నికి అభేదం చెప్పినందున ఇది రూపక సమాసం)
- లతాలలనలు - లతలనెడి లలనలు (లతలకు, లలనలకు అభేదం చెప్పినందున ఇది రూపక సమాసం).

2. ద్విగు సమాసం: సమానాధికరణంలో (కర్మధారయం) ఒక భేదం ద్విగువు సంఖ్యా వాచకం పూర్వ పదంగా, నామవాచకం ఉత్తర పదంగా ఉంటే దాన్ని ద్విగు సమాసం అంటారు. **ఉదా:**
- నలుదిక్కులు - నాలుగు సంఖ్య గల దిక్కులు (సంఖ్యా పదం- పూర్వపదం)
- త్రిజగములు - మూడైన జగములు (సంఖ్యా పదం- పూర్వపదం)
- సహస్రాక్షులు - సహస్ర సంఖ్య గల అక్షులు - (సంఖ్యాపదం- పూర్వపదం)

3. ద్వంద్వ సమాసం: ఉభయ పదార్థ ప్రాధాన్యం కలది ద్వంద్వం. పూర్వ, ఉత్తర పదాలకు రెండింటికీ సమ ప్రాధాన్యం ఉంటుంది. **ఉదా:**
- తల్లిదండ్రులు - తల్లియును, తండ్రియును
- లక్ష్మీ సరస్వతులు - లక్ష్మియును, సరస్వతియును
- అన్నదమ్ములు - అన్నయును, తమ్ముడును

పై పదాల్లో పదాలు రెండింటికి సమ ప్రాధాన్యం ఉన్నందున ఇవి ద్వంద్వ సమాసాలు.

బహు పద ద్వంద్వ సమాసం: రెండు కంటే ఎక్కువ పదాలు సమ ప్రాధాన్యం కలవి ఉంటే అది బహుపద ద్వంద్వ సమాసం. **ఉదా:**
సీతారామలక్ష్మణులు - సీతయును, రాముడును, లక్ష్మణుడును.

4. బహువ్రీహి సమాసం: అన్యపదార్థ ప్రాధాన్యం కలది బహువ్రీహి. సమాసంలో ఉన్న రెండు పదాల అర్థం కాకుండా వాటి కలయిక వల్ల వేరొక అర్థం ఉంటే దాన్ని బహువ్రీహి సమాసం అంటారు. విగ్రహ వాక్యంలో 'కలది, కలవాడు' పదాలు వస్తాయి. **ఉదా:**
- కమలనాభుడు - కమలము నాభియందు కలవాడు (విష్ణువు)
- ముక్కంటి-మూడు కన్నులు కలవాడు(శివుడు)
- పూబోడి - 'పూవు వంటి శరీరం కలది' (స్త్రీ)
- మీనాక్షి-మీనముల వంటి అక్షములు గలది (స్త్రీ)

గత డీఎస్సీ, టెట్‌లో అడిగిన ప్రశ్నలు

1. బహువ్రీహి సమాసానికి ఉదాహరణలు? (ఎస్ఏ-2012)
1) మోటబరి, ముచ్చిచ్చు
2) ముప్పాతిక, పాపరేడు
3) చలివెలుగు, అక్కన్య
4) వేవెలుగు, ముక్కంటి

2. నీ చేతి ప్రోవు? (ఎస్ఏ-2012)
1) బహువ్రీహి 2) నఞ్ తత్పురుష
3) అలుక్సమాసం 4) లుక్సమాసం

3. ఉత్తర పద ప్రాధాన్యం గల సమాసం? (ఎల్‌పీ -2012)
1) ద్వంద్వ సమాసం 2) తత్పురుష సమాసం
3) బహువ్రీహి సమాసం
4) కర్మధారయ సమాసం

4. బహువ్రీహి సమాసం ఉదాహరణలు? (టెట్-2012 జనవరి)
1) చక్రపాణి, కుంభకారుడు, నెలతాల్పు
2) నలువ, చక్రపాణి, కమలాక్షుడు
3) అతిరథుడు, చక్రపాణి, పీతాంబరుడు
4) నలువ, సంసార సాగరం, పూబోడి

5. అవ్యయీభావ సమాసానికి ఉదాహరణలు? (టెట్-2012 జూన్)
1) ఛాయావృక్షం, పూబోడి
2) భూతబలి, వ్యాఘ్రభీతుడు
3) ఆబాలము, యథాశక్తి
4) కపోత వృద్ధము, సంసార సాగరం

6. అరుణాస్పద'పురం'-ఏ సమాసం?(టెట్-2014)
1) విశేషణ పూర్వపద కర్మధారయం
2) విశేషణ ఉత్తరపద కర్మధారయం
3) సంభావన ఉత్తర పదకర్మధారయం
4) సంభావన పూర్వపద కర్మధారయం

సమాధానాలు

1) 4; 2) 3; 3) 2; 4) 2;
5) 3; 6) 4.

శాతవాహనుల రాజభాష ఏది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ హిస్టరీ



శాతవాహన యుగం

1. శాతవాహనుల కాలంలో చాలా తక్కువగా వాడుకలో ఉన్న లోహం?
   1) వెండి 2) బంగారం
   3) రాగి 4) కంచు
2. శాతవాహనుల కాలం నాటికి ప్రధానంగా ఏర్పడిన వర్ణాలెన్ని?
   1) 4 2) 5 3) 6 4) 8
3. శాతవాహనుల శాసనాల్లో ఏ వర్ణం వారి ప్రస్తావన ఎక్కువగా కనిపించదు?
   1) క్షత్రియులు 2) వైశ్యులు
   3) శూద్రులు 4) బ్రాహ్మణులు
4. శాతవాహనులు మొదట అవలంబించిన మతం ఏది?
   1) వైదికం 2) జైనం
   3) బౌద్ధం 4) జొరాస్ట్రియన్
5. శాతవాహనుల రాష్ట్రాలను ఏ పేరుతో పిలిచేవారు?
   1) నిగములు 2) ఆహారాలు
   3) స్థలాలు 4) నాడులు
6. శాతవాహనుల కాలం నాటి సామాన్య ప్రజలు అవలంబించిన మతం?
   1) జొరాస్ట్రియన్ 2) వైదికం
   3) బౌద్ధం 4) జైనం
7. 'బుద్ధ పాదారాధన' గురించి ప్రస్తావించిన గ్రంథం ఏది?
   1) ఇండికా 2) గాథా సప్తశతి
   3) లీలావతి కావ్యం 4) బృహత్కథ
8. 'రోమన్ శాసనసభ'లో దక్షిణ భారతదేశ వస్త్రాల గురించి ప్రస్తావించింది ఎవరు?
   1) మెగస్తనీస్ 2) పెరిప్లస్
   3) ప్లీని 4) టాలమీ
9. కిందివారిలో బౌద్ధ భిక్షువులకు భూదానాలు అధికంగా చేసిన పాలకుడు ఎవరు?
   1) హాలుడు 2) మొదటి శాతకర్ణి
   3) రెండో శాతకర్ణి
   4) గౌతమీపుత్ర శాతకర్ణి
10. క్రతు ప్రధానమైన మతం ఏది?
    1) జైనం 2) వైదిక మతం
    3) బౌద్ధం
    4) పౌరాణిక హిందూమతం
11. కిందివాటిలో 'శివస్తోత్రం'తో ప్రారంభమైన గ్రంథం ఏది?
    1) గాథా సప్తశతి 2) బృహత్కథ
    3) లీలావతి కావ్యం 4) కాతంత్ర
12. దక్షిణాపథంలో 'పాశుపత శైవం' ప్రాచుర్యం పొందిన కాలం ఏది?
    1) క్రీ.శ. 4వ శతాబ్దం
    2) క్రీ.శ. 3వ శతాబ్దం
    3) క్రీ.శ. 2వ శతాబ్దం
    4) క్రీ.శ. 1వ శతాబ్దం
13. 'లకులీశ శివాచార్యుడు' వ్యాప్తికి తెచ్చిన మతం ఏది?
    1) వైదికం 2) పాశుపత శైవం
    3) వైష్ణవం 4) జైనం
14. 'లీలావతి కావ్యం'ను ఏ భాషలో రాశారు?
    1) పైశాచీ 2) సంస్కృతం
    3) తెలుగు 4) ప్రాకృతం
15. 'వాసుదేవుడు' ప్రధాన దైవంగా ఉన్న మతం ఏది?
    1) బౌద్ధం 2) జైనం
    3) శైవం 4) వైష్ణవం
16. 'వైష్ణవ మతం' ఎవరి కాలంలో ఉత్తర భారతదేశం నుంచి దక్షిణ భారతదేశానికి వ్యాప్తి చెందింది?
    1) ఇక్ష్వాకులు 2) శాతవాహనులు
    3) విష్ణుకుండినులు 4) చాళుక్యులు
17. సంస్కృతంలో గ్రంథాలు రాయడం ఏ రాజవంశ కాలంలో ప్రారంభమైంది?
    1) శాతవాహనులు 2) ఇక్ష్వాకులు
    3) విష్ణుకుండినులు
    4) బాదామీ చాళుక్యులు
18. సంస్కృతంలో 'కాతంత్ర' అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించింది ఎవరు?
    1) హాలుడు 2) గుణాఢ్యుడు
    3) శర్వవర్మ 4) మెగస్తనీస్
19. శాతవాహనుల రాజభాష ఏది?
    1) తెలుగు 2) ప్రాకృతం
    3) పైశాచీ 4) సంస్కృతం
20. శాతవాహనుల కాలంలో 'ప్రాకృతం' స్థానాన్ని క్రమంగా ఆక్రమించిన భాష ఏది?
    1) తెలుగు 2) పైశాచీ
    3) ఉర్దూ 4) సంస్కృతం
21. పైశాచీ భాష నుంచే తెలుగు ఆవిర్భవించిందని అభిప్రాయపడింది ఎవరు?
    1) సంగనభట్ల నర్సయ్య
    2) డాక్టర్ పరబ్రహ్మశాస్త్రి
    3) తిరుమల రామచంద్ర
    4) డాక్టర్ దినేశ్ చంద్రసర్కార్
22. 'ప్రపంచ కథ'కు మూలం ఏది?
    1) బృహత్కథ 2) గాథా సప్తశతి
    3) లీలావతి కావ్యం 4) ఇండికా
23. గుణాఢ్యుడు 'బృహత్కథ' గ్రంథాన్ని ఏ ప్రాంతంలో ఉండి రాశాడని పరిశోధకుల అభిప్రాయం?
    1) కొలనుపాక 2) ద్రాక్షారామం
    3) కొండాపురం 4) విజయపురి
24. అత్త, పిల్ల లాంటి తెలుగు పదాలు కింది వాటిలో ఏ కావ్యంలో కనిపిస్తాయి?
    1) కాతంత్ర 2) గాథా సప్తశతి
    3) లీలావతి 4) మలయవతి
25. 'కవి వత్సలుడు' అనే బిరుదున్న రాజు?
    1) హాలుడు
    2) గౌతమీపుత్ర శాతకర్ణి
    3) మొదటి శాతకర్ణి 4) యజ్ఞశ్రీ శాతకర్ణి
26. హాలునితో సన్మానం పొందినవారెవరు?
    1) వాత్స్యాయనుడు, నాగార్జునుడు
    2) నాగార్జునుడు, శ్రీపాలితుడు
    3) కుమారీలుడు, శ్రీపాలితుడు
    4) కుమారీలుడు, నాగార్జునుడు
27. హాలుడు సింహళ రాకుమార్తె 'లీలావతి'ని వివాహమాడినట్లు ఏ గ్రంథంలో పేర్కొన్నారు?
    1) గాథా సప్తశతి 2) లీలావతి కావ్యం
    3) బృహత్కథ 4) కాతంత్ర
28. తెలంగాణలో తొలి లిఖిత కవి, ఆయన రాసిన గ్రంథానికి సంబంధించి కింది వాటిలో సరైన జత ఏది?
    1) హాలుడు - గాథా సప్తశతి
    2) గుణాఢ్యుడు - బృహత్కథ
    3) శర్వవర్మ - కాతంత్ర వ్యాకరణం
    4) కుతూహలుడు - లీలావతి కావ్యం
29. 'లీలావతి కావ్యాన్ని' రాసిందెవరు?
    1) హాలుడు 2) నాగార్జునుడు
    3) కుమారీలుడు 4) కుతూహలుడు
30. బహుభాషా కోవిదురాలైన 'మలయవతి' ఎవరి పట్టపురాణి?
    1) యజ్ఞశ్రీ శాతకర్ణి 2) హాలుడు
    3) గౌతమీపుత్ర శాతకర్ణి
    4) రెండో శాతకర్ణి
31. శాతవాహనుల అధికార మతం ఏది?
    1) జైనం 2) బౌద్ధం
    3) శైవం 4) వైదికం
32. తొలిసారిగా ఏ వంశ పాలకులు వారి పేరుకు ముందు తల్లి పేరును చేర్చుకున్నారు?
    1) ఇక్ష్వాకులు 2) ఆర్యులు
    3) మౌర్యులు 4) శాతవాహనులు
33. తన పేరుకు ముందు తల్లి పేరు చేర్చుకొని పాలించిన మొదటి శాతవాహన చక్రవర్తి?
    1) యజ్ఞశ్రీ శాతకర్ణి
    2) గౌతమీపుత్ర శాతకర్ణి
    3) స్కందశ్రీ శాతకర్ణి
    4) విజయశ్రీ శాతకర్ణి
34. మొదటి శాతకర్ణి భార్య పేరేమిటి?
    1) దేవీ నాగానిక 2) గౌతమీ బాలాశ్రీ
    3) మలయవతి 4) రుద్రదమనిక
35. శాతవాహనుల రెండో రాజధాని ఏది?
    1) కొండాపురం 2) అమరావతి
    3) పైఠాన్ 4) కోటిలింగాల

సమాధానాలు

1) 3; 2) 1; 3) 4; 4) 2;
5) 2; 6) 3; 7) 2; 8) 3;
9) 4; 10) 2; 11) 1; 12) 4;
13) 2; 14) 4; 15) 4; 16) 2;
17) 1; 18) 3; 19) 2; 20) 4;
21) 3; 22) 1; 23) 3; 24) 2;
25) 1; 26) 3; 27) 2; 28) 2;
29) 4; 30) 2; 31) 4; 32) 4;
33) 2; 34) 1; 35) 3.

శాతవాహన అనంతర యుగం

1. సోమశేఖర శర్మ శాతవాహనుల తర్వాత ఏ పాలకుల కాలం వరకు 'అజ్ఞాత యుగం'గా పేర్కొన్నాడు?
   1) ఇక్ష్వాకులు 2) బాదామీ చాళుక్యులు
   3) వాకాటకులు 4) విష్ణుకుండినులు
2. హర్షుడికి సమకాలికంగా తెలంగాణ ప్రాంతాన్ని పులకేశి పాలించినట్లు పేర్కొన్నవారెవరు?
   1) మల్లంపల్లి సోమశేఖర శర్మ
   2) వట్టికోట ఆళ్వారుస్వామి
   3) ఆదిరాజు వీరభద్రరావు
   4) సురవరం ప్రతాపరెడ్డి
3. 'శ్రీ పర్వతీయులు' అని ఎవరిని పేర్కొంటారు?
   1) బాదామీ చాళుక్యులు 2) వాకాటకులు
   3) ఇక్ష్వాకులు 4) విష్ణుకుండినులు
4. ఇక్ష్వాకులు మొదట ఎవరికి సామంతులుగా ఉన్నారు?
   1) వాకాటకులు 2) శాతవాహనులు
   3) విష్ణుకుండినులు
   4) బాదామీ చాళుక్యులు
5. స్వతంత్రంగా ఇక్ష్వాక రాజ్యాన్ని స్థాపించిన వారెవరు?
   1) వీరపురుషదత్తుడు
   2) ఎహుబల శాంతమూలుడు
   3) రుద్ర పురుషదత్తుడు
   4) వాసిష్ఠీపుత్ర శ్రీశాంతమూలుడు
6. పురాణాల ప్రకారం ఇక్ష్వాక రాజులు ఎంత మంది?
   1) 6 2) 7 3) 8 4) 4
7. ఇక్ష్వాక రాజుల పాలనా క్రమం?
   1) రుద్రపురుషదత్తుడు, శ్రీశాంతమూలుడు, వాసిష్ఠీపుత్ర శ్రీశాంతమూలుడు, వీరపురుషదత్తుడు
   2) వీరపురుషదత్తుడు, ఎహుబల శాంతమూలుడు, శ్రీశాంతమూలుడు, రుద్రపురుషదత్తుడు
   3) వాసిష్ఠీపుత్ర శ్రీశాంతమూలుడు, వీరపురుషదత్తుడు, ఎహుబల శాంతమూలుడు, రుద్రపురుషదత్తుడు
   4) ఎహుబల శాంతమూలుడు, రుద్రపురుషదత్తుడు, వీరపురుషదత్తుడు, శ్రీశాంతమూలుడు
8. ఇక్ష్వాకుల రాజధాని ఏది?
   1) విజయపురి 2) నేలకొండపల్లి
   3) ధాన్యకటకం 4) కోటిలింగాల
9. బి.ఎస్.శాస్త్రి ప్రకారం 'దక్షిణాపథపతి' అనే బిరుదున్న రాజు ఎవరు?
   1) రుద్రపురుషదత్తుడు
   2) శ్రీశాంతమూలుడు
   3) ఎహుబల శాంతమూలుడు
   4) వీరపురుషదత్తుడు
10. ఉజ్జయినీ పాలకుడైన శకరాజు కుమార్తెను వివాహమాడిన రాజు?
    1) వీరపురుషదత్తుడు
    2) రుద్రపురుషదత్తుడు
    3) ఎహుబల శాంతమూలుడు
    4) శ్రీశాంతమూలుడు
11. ఏ రాజవంశ పాలనలో 'ఎలిసిరి' అనే ఉద్యోగి ఉండేవాడు?
    1) ఇక్ష్వాకులు 2) వాకాటకులు
    3) విష్ణుకుండినులు
    4) బాదామీ చాళుక్యులు
12. 'హలసహస్ర' బిరుదాంకితుడెవరు?
    1) రుద్రపురుషదత్తుడు
    2) వీరపురుషదత్తుడు
    3) శ్రీశాంతమూలుడు
    4) ఎహుబల శాంతమూలుడు
13. ఇక్ష్వాకుల రాజ చిహ్నం ఏది?
    1) మయూరం 2) గుర్రం
    3) వృషభం 4) సింహం
14. వాసిష్ఠీపుత్ర శ్రీశాంతమూలుడు అవలంబించిన మతం ఏది?
    1) జైనం 2) వైదికం
    3) శైవం 4) బౌద్ధం
15. ఎవరి పాలనా కాలాన్ని 'బౌద్ధమతానికి స్వర్ణ యుగం'గా పేర్కొంటారు?
    1) ఎహుబల శాంతమూలుడు
    2) శ్రీశాంతమూలుడు
    3) వీరపురుషదత్తుడు
    4) రుద్రపురుషదత్తుడు
16. ఇక్ష్వాకులు పోషించిన భాష ఏది?
    1) తెలుగు 2) సంస్కృతం
    3) పైశాచీ 4) ప్రాకృతం
17. ఇంద్రపాలనగర శాసనాన్ని ఎవరు వేయించారు?
    1) విక్రమేంద్రభట్టారక వర్మ
    2) విక్రమేంద్రవర్మ
    3) మూడో మాధవవర్మ
    4) రెండో మాధవవర్మ
18. మేనత్త కూతురును వివాహం చేసుకోవడం ప్రధానంగా ఏ రాజవంశంలో కనిపిస్తుంది?
    1) ఇక్ష్వాకులు 2) బాదామీ చాళుక్యులు
    3) విష్ణుకుండినులు 4) శాతవాహనులు

సమాధానాలు

1) 2; 2) 4; 3) 3; 4) 2;
5) 4; 6) 2; 7) 3; 8) 1;
9) 3; 10) 2; 11) 1; 12) 3;
13) 4; 14) 2; 15) 3; 16) 4;
17) 1; 18) 1.

The purpose of SARFAESI Act 2002 is:



BANK EXAMS

BANKING AWARENESS

MODEL QUESTIONS

1. Which Bank has opened its first branch in South Korea (Seoul) on 13th Jan, 2016 ?
   a) ICICI
   b) Punjab National Bank
   c) Corporation Bank
   d) State Bank of India
   e) Indian Overseas Bank
2. The purpose of SARFAESI Act 2002 is:
   a) Recovery of dues in Education Loans only
   b) Recovery term loans sanctioned for construction of infrastructure projects
   c) Court permission is must before recovery of overdues in NPAs
   d) Recovery of dues classified as non-performing assets without intervention of court
   e) None of the above
3. A banknote, of which a portion is missing or which is composed of more than two pieces is called ?
   a) Soiled Note
   b) Cut Note c) Duplicate Note
   d) Bad Note
   e) Mutilated banknote
4. Consumption loan under priority sector can be granted to..
   a) Rural artisans
   b) Small/Marginal farmers
   c) Landless labourers
   d) All e) None
5. Which of the following is a borrowing facility/loan advance __?
   a) Term finance
   b) Performance guarantee
   c) Bill received under letter of credit d) All the above
   e) None of the above
6. Collateral securities can be ___?
   a) Tangible
   b) Intangible in the shape of personal guarantee of a third party
   c) Security given to get credit facilities/loan
   d) All of the above
   e) None of the above
7. A charge where there is neither the transfer of ownership nor the possession is called ______?
   a) Hypothecation
   b) Lien c) Pledge
   d) Mortgage
   e) None of the above
8. As per the directives of Reserve bank of India, 'Notice deposit' shall mean:
   a) The deposit withdrawable at the will of the depositor
   b) The deposit repayable only after the bank gives notice to the depositor
   c) Term deposit for specific period but with drawable on giving at least one complete banking day's notice
   d) None of the above
   e) All of the above
9. Regional Rural Banks have been permitted to pay ½% additional interest on ____?
   a) All deposits accounts except current deposits
   b) All deposits accounts including current deposits
   c) Saving account and time deposits of less than three years
   d) All deposit accounts except Recurring Deposit Scheme
   e) None of the above
10. Name the 9 digit numeric code that uniquely identifies a bank branch participating in electronic clearing scheme?
    a) MICR b) ECS c) NEFT
    d) IFSC e) INFINET
11. What is the full form of the CORE word in Core Banking Solutions?
    a) Core Online Real-time Exchange
    b) Centralized Online Real-time Exchange
    c) Central Online Real-time Exchange
    d) Centralized Online Retail Exchange
    e) None of the above
12. Which Bank scores a first, mortgage portfolio crossing Rs 1 lakh crore ?
    a) State Bank of India
    b) HDFC
    c) CORPORATION BANK
    d) ICICI e) Punjab National Bank
13. A part of the issued capital of the Regional Rural Banks is subscribed as under___?
    a) Fifty per cent by Central Government
    b) Fifty per cent by State Government
    c) Thirty per cent by sponsoring bank
    d) All the above
    e) None of the above
14. Which amongst the following is not term deposits issued by commercial banks?
    a) Current account
    b) Fixed deposit
    c) Recurring deposit
    d) Reinvestment deposit
    e) All the above
15. What is the main purpose of Open market o perations?
    a) A fiscal device which assists Government borrowing
    b) A monetary measure to regulate quantity of money in circulation and the cash reserves of the commercial banks
    c) A measure to counteract extreme trends in business
    d) A measure to influence the balance of payments position
    e) None of the above
16. What is the full form of MSME?
    a) Mini, Small and Medium Enterprises
    b) Micro, Small and Medium Enterprises
    c) Mini scale Marketing Enterprises
    d) Medium Scale Marketing Enterprises
    e) None of the above
17. A customer is required to maintain adequate balances in his/her accounts in order to use his ____ card in the merchant establishments?
    a) Smart Card b) Credit Card
    c) Add-on Credit card
    d) Debit Card
    e) None of the above
18. Which of the following are the latest guidelines issued by the RBI in respect of opening new branches in villages?
    a) To open more brick and mortar branches in villages where there are no banking facilities and population is more than 5,000.
    b) Banks to submit a roadmap on how many branches they will be opening by 31 March 2017.
    c) The roadmap by end of January 2016.
    d) BCBF Model to be discontinued e) Only a, b, c
19. Name the financial instrument which is/are issued for short term (up to one year) borrowing by RBI on behalf of the Government of India? a) Treasury Bills
    b) Commercial Paper
    c) Certificate of Deposit
    d) Non-convertible Debenture
    e) Only b & c
20. KYC (Know Your Customer) norms were implemented in the Indian banking system in 2002 as per the directive of ?
    a) SEBI b) RBI c) IBA
    d) IRDA e) None of these
21. Often, we read in the newspapers that several Indian companies are taking the FCCB route to raise capital. What does the term FCCB stand for?
    a) Foreign Currency Convertible Bond
    b) Foreign Convertible Credit Bond
    c) Financial Consortium and Credit Bureau
    d) Future Credit and Currency Bureau
    e) None of these
22. Account Holder of Which of the following accounts with a bank will be issued with ATM cards?
    a) Saving bank account
    b) Current accounts
    c) Term deposits
    d) Loan or cash credit accounts
    e) Either a or b
23. A commercial paper is
    a) A paper issued by Reserve Bank of India an trade and commerce
    b) An unsecured money market instrument issued in the form of promissory note
    c) A document issued by IDBI for seeking refinance facility from Reserve Bank India
    d) All of the above
    e) None of the above
24. Which of the following would fall under the category of retail banking?
    a) Home Loans b) Credit Cards
    c) Personal Loans
    d) Car Loans e) All of these
25. Who decides how much quantity of the coins to be minted?
    a) Reserve Bank of India
    b) Central Government
    c) Finance Ministry
    d) Both RBI and Central Government decide
    e) None of the above
26. What are the components of Foreign Exchange Reserves?
    a) Foreign currency assets
    b) Gold
    c) Special Drawing Rights
    d) Reserve Position in the IMF
    e) All the above
27. The chairman of Regional Rural Bank is appointed by _____?
    a) State Government
    b) Reserve Bank of India
    c) Central Government
    d) Sponsoring bank in consultation with NABARD
    e) None of the above
28. To control inflationary situation in the economy, RBI can increase one or more of these monetary tool?
    a) CRR-SLR-Bank Rate
    b) SLR-CRR-Base Rate
    c) CRR-SLR-Repo Rate
    d) CRR-SLR-Reverse Repo Rate
    e) CRR-SLR-BPLR
29. Who can open various types of non-resident accounts?
    a) Persons of Indian Nationality or person of Indian origin residing outside India
    b) Persons of foreign nationality or origin residing outside India
    c) Firms, companies and other organization resident outside India
    d) a, b and c e) None
30. ATMs which are set up, owned and operated by non-banks are called as?
    a) White Label ATMs
    b) Green Label ATMs
    c) Brown Label ATMs
    d) Red Label ATMs
    e) None of the above
31. What is the name of the asset which has remained NPA for a period exceeding 12 months?
    a) Sub-standard
    b) Doubtful asset
    c) Loss asset d) Critical Asset
    e) None of the above

KEY

1) d; 2) d; 3) e; 4) d;
5) a; 6) d; 7) a; 8) c;
9) c; 10) a; 11) b; 12) d;
13) a; 14) a; 15) b; 16) b;
17) d; 18) e; 19) a; 20) b;
21) a; 22) e; 23) b; 24) e;
25) b; 26) e; 27) d; 28) a;
29) d; 30) a; 31) b.